RNI No.APTEL/15835/2019

ప్రజా

మణిపూస
తెలుగు
మాసపత్రిక

సంపుటి - 1 సంచిక - 10 | నవంబర్ - 2020 | పేజీలు : 80 | వెల : 25/-

ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్
కనపర్తి రాజారావు

కొడుకుల శ్రీనివాస్, యాక్టివ్ జర్నలిస్ట్

అసోసియేట్ ఎడిటర్
శ్రీ కె.వెంకట అప్పారావు (Ph.D)

సీనియర్ సబ్ ఎడిటర్ & టెక్నికల్ అడ్వయిజర్
శ్రీ డా॥ ఎం.జయకుమార్,MBA.,Ph.D,.

ఎడిటర్ : **శ్రీ బి.రాజేష్,** B.Sc,.

సీనియర్ జనర్నలిస్ట్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్
ఎన్.భావన్నారాయణ (భాను)

ఫొటోగ్రాఫర్ :
బి.వీరయ్య

డిజైన్ & డి.టి.పి
ఆర్.తేజేష్, Cell : 9866789072

Printed & Published by Shri Kanaparthi Rajarao and Printed at Amma Offset Printers, D.No.30-8-35, Bhanu Street, Visakhapatnam-530020, A.P. and Published at Praja Manipusa (Telugu), Sai Towers II, Plot No.317, House No.10-12-6/59, Rednam Gardens, Visakhapatnam - 530002. Cell : 9492423833
Email : prajamanipoosa2020@gmail.com, prajamedia2020@gmail.com

విషయ సూచిక

ప్రాణాలని ప్రజలకోసం పణంగా పెట్టేవాడే పోలీసు	06 లో
నేతి బీరకాయ లాంటి అంబేద్కరిస్టులు,బుద్ధిస్టులు, క్రైస్తవులు	08 లో
దళితసాహిత్యం సాంస్కృతిక రంగాలు : తాత్విక సంఘర్షణ-మార్గాన్వేషణ	09 లో
'శోభా' యమానం...	13 లో
బీహార్ పోరు...	15 లో
రాజకీయ వాతావరణ శాస్త్రవేత్త రాంవిలాస్ పాశ్వాన్	17 లో
ఆరోజులే వేరు...	20 లో
అంతరిక్షం నుంచి అధ్యక్షుడికి ఓటు	22 లో
టీఆర్పీ రేటింగ్ స్కామ్!	23 లో
మానవత్వానికి 'చితిమంటలు' ...	24 లో
అందరూ నిర్దోషులే...	25 లో
వ్యవసాయ చట్టాలను రైతులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..?	27 లో
ముఖాముఖీ....	29 లో
అందని లోకాలకు చందమామ శంకర్	31 లో
ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నిలిపావేత	32 లో
పాకిస్థాన్ ప్రభుత్వం కరెన్సీ నోట్లను గుట్టలు గుట్టలుగా ఎందుకు ముద్రిస్తోంది?	33 లో
"చెత్త నుంచి నల్ల బంగారం" - వర్మికల్చర్ మరియు వర్మికంపోస్టింగ్	35 లో
ఎక్కడో పుట్టి, ఎక్కడో...	36 లో
తమిళనాడు రాజకీయం....	38 లో
ఆడ "మనీష" క్షమించు ...	41 లో
కనువిప్పు	44 లో
"మహా" భారత్..	49 లో
23 కూరల నాగన్న హోటల్	50 లో
గగనంలో తొలి "ఉష"స్సు	51 లో
ఆడదంటే అలుసా?	52 లో
మనకు నోబెల్ సాహిత్య పురస్కారం రాదా?	55 లో
ఆయన పాటలు రసగుళికలు...	57 లో
ప్రపంచంలోనే అతి పెద్ద సొరంగ మార్గం	67 లో
హై "ధర " బాద్ నరకం..	68 లో
రోడ్ టెర్రర్	62 లో
దేవీపురం - ఓ అద్భుతమైన అభినవ మణిద్వీపం	72 లో

గౌరవ సలహా మండలి

ఆచార్య శ్రీ కె.యస్.చలం
మాజీ వి.సి. ద్రావిడ యూనివర్శిటీ, యు.పి.ఎస్.సి.,
పూర్వ సభ్యులు, న్యూఢిల్లీ

ఆచార్య బాబివర్ధన్
జర్నలిజం శాఖ అధిపతి,
డీన్, మీడియా రిలేషన్స్, ఆంధ్రాయూనివర్శిటీ

ఆచార్య కె.పి.సుబ్బారావు
Emeritus Fellow (UGC),
Dept of Education, Andhra University

ఆచార్య ఎన్.ఎ.డి.పాల్
అకాడమిక్ స్టాఫ్ కాలేజీ,
ఆంధ్రా యూనివర్శిటీ

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
తెలుగుశాఖ, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్

ఆచార్య జర్రా అప్పారావు
తెలుగు శాఖాధిపతి, ఆంధ్రా యూనివర్శిటీ

డా॥ జి.వి.రత్నాకర్
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ,
హైదరాబాద్

డి.ఎం.ఆర్ శేఖర్
మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఓ.ఎన్.జి.సి

డా॥ ఎస్.సంజయ్ కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇన్ మేనేజ్‌మెంట్
గురు గోబింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్శిటీ, న్యూ ఢిల్లీ.

వీరపనేని వెంకట పూర్ణచంద్రరావు Hyderabad
B.Tech (NIT, Warangal)
M.Tech (IIT, Roorkee, U.P.)

డా॥ డి.జ్యోతిర్మయి
అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్,
ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ, రాజమండ్రి

కెబి.రమేష్
డైరెక్టర్ (ప్రజామణి పూస)

నల్లపు సుధా రామకృష్ణ
విజ్ఞాన్ ఫౌండేషన్, స్వచ్ఛంద సంస్థ, ఖమ్మం

సురేష్ నక్కా B.Tech, MBA., (Ph.D)

Registration No.1140/2019

ప్రజా మీడియా నెట్‌వర్క్
PRAJA MEDIA NETWORK

ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

కనపర్తి రాజారావు
చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్

సాయి టవర్స్-1, ఫ్లాట్ నెం.302, రెడ్నం గార్డెన్స్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 94924 23833.
హెచ్.నెం. 9-1-38, వైఎంసిఏ కాంప్లెక్స్, సర్దార్‌పటేల్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ,
ఫోన్ : 9885715927, 9912202720

ఎడిటోరియల్

కార్పొరేట్లకు దారాధత్తం

కరోనా విపత్తు నేపథ్యంలో అనేక రంగాల్లో పునర్వివేచన, పునర్నిర్మాణాలకు సంబంధించిన ఆలోచనలు సాగుతున్నాయి. విధి విధానాలకు సంబంధించిన పునర్విశ్లేషణలు మొదలయి చాలా కాలమైంది. వ్యాక్సిన్ ఎప్పుడు వస్తుందో తెలియదు, వచ్చినప్పటికీ మార్చి 22కు ముందు నాటి జీవితం, ఆలోచనా సరళి యథాతథంగా నెలకొనే అవకాశం లేదు. జీవన విధానాలే కాదు, సకల రంగాలు సరికొత్త రీతిలో రూపొందాల్సిన అవసరం ఉంది. ఇందుకు తగినట్టుగా వ్యవస్థలు, విధానాలు వినూత్నరీతిని సంతరించుకోవాలి. దీనికి అధికారంలో ఉన్నవారు సిద్ధపడాలి. జనావళిని సంసిద్ధం చేయాలి. ఇందుకు భిన్నంగా కార్పొరేట్లకు లాభం చేకూర్చే విధానాలకు ప్రభుత్వాలు మొగ్గు చూపడం గమనార్హం. ప్రజల ఓట్లతో ఎన్నికయిన ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా కార్పొరేట్ల సేవలో తరించడం విషాద వాస్తవం.

మంద బలంతో ఆమోదం

తాజాగా వ్యవసాయరంగంలో సంస్కరణల పేరిట రైతుల పొట్టకొట్టే విధానాలకు తెరదీసింది బీజేపీ ప్రభుత్వం. మంద బలంతో వ్యవసాయ బిల్లుల్ని లోక్‌సభలో ఆమోదింపజేసుకుంది. ఎన్‌డీఏ పక్షమైన అకాలీదళ్ కు చెందిన కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ రాజీనామా చివరి నిమిషంలోని పరిణామం. జూన్ నెలలో వ్యవసాయ రంగ సంస్కరణలు చేపట్టినప్పుడే అన్నిపక్షాల నుంచి వ్యతిరేకత రావాలి. కానీ కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి అనేక రాజకీయపక్షాలు. వ్యవసాయ రంగ సంస్కరణలు దేశంలోని రైతుల పాలిట శరాఘాతమనే సంగతిని వామపక్షాలు మాత్రమే నొక్కిచెప్పాయి. వీటిని వ్యతిరేకిస్తూ ఉద్యమబాటని పట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేశాయి. కానీ ఓటర్లుగా తప్ప ప్రజల ఉనికిని గుర్తించ నిరాకరించే రాజకీయ పార్టీల వైఖరి ప్రశ్నార్థకంగా నిలిచింది.

ఏదీ ప్రతిఘటన?

ఇప్పుడు జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే వ్యవసాయ బిల్లుల ఆమోదానికి బీజేపీ ప్రభుత్వం సన్నాహాలు చేసుకున్న విషయం తెలియందేమీ కాదు. ప్రభుత్వం వ్యవసాయరంగ సంస్కరణలకు సంబంధించిన ఆర్డినెన్స్ ప్రకటించిన నాటి నుంచే నిరసనలకు సిద్ధపడాలి. ఈ బిల్లుల్ని నిరసిస్తూ పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లలో రైతులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఎన్‌డీఏలో కొనసాగితే తమకు పుట్టగతులు ఉండవని గ్రహించినందునే అకాలీదళ్ బిల్లుల పట్ల ఇప్పుడు తన వ్యతిరేకతని వ్యక్తం చేసింది. 2023లో జరిగే అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలవాలంటే రైతుల మద్దతు అవసరం. అందుకే బిల్లు ఆమోదానంతరం బిల్లుకు వ్యతిరేకంగా అకాలీదళ్ మాట్లాడుతున్నది. ఈ వివేచన ముందే ఎందుకు లేదన్నది అసలు ప్రశ్న. ఓట్ల లెక్కల్ని పరిగణనలోకి తీసుకున్నాకనే పంజాబ్‌లోని రైతుల విలాపం వారికి వినిపించింది.

నిజాయితీ ప్రశ్నార్థకం

మౌలికంగా ఆర్థిక సంస్కరణలకు సానుకూలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కనబరిచే వ్యతిరేకతలోనూ నిజాయితీ అంతంతమాత్రం. అందుకే ఆర్డినెన్స్ వచ్చాక కూడా బిల్లుకు వ్యతిరేకంగా బలమైన గళం వినిపించడానికి ఆ పార్టీ సిద్ధం కాలేదు. బీజేపీయేతర పక్షాలలో ఎవరి లెక్కలు వారికి ఉన్నాయి, ఎవరి ప్రయోజనాలు వారివి. నిన్నమొన్నటి దాకా కౌలు రైతులని రైతులుగా గుర్తించడానికి నిరాకరించిన టీఆర్ఎస్ అధినేత, చివరి నిమిషంలో వ్యవసాయ బిల్లును తేనెపూసిన కత్తిగా అభివర్ణించారు. నిజమే, వ్యవసాయ బిల్లులు రైతుల్ని వంచించడమే, ఎక్కడయినా, ఎంతకయినా పంటని అమ్ముకోవచ్చనే పేరిట కార్పొరేట్లకు లాభం చేకూర్చే పన్నాగాలే. కాంట్రాక్ట్ వ్యవసాయం పేరిట దేశంలోని సన్నకారు రైతులని భూముల నుంచి వెళ్ళగొట్టే కుతంత్రమే. తాజాగా తీసుకువచ్చిన మూడు వ్యవసాయ బిల్లులు ఈ దేశంలో వ్యవసాయమే వృత్తిగా జీవించే డెబ్బయిశాతం మంది మనుగడని ప్రమాదంలో పడేసాయి. నేలని నమ్ముకున్న రైతుల బతుక్కి పెనుముప్పుగా పరిణమించిన బిల్లులు ఇవి. మొన్నటి దాకా స్వావలంబన, గ్రామాల స్వయంప్రతిపత్తి గురించి మాట్లాడిన ప్రధాని నరేంద్రమోడీ ఆ గ్రామాల ఉనికిని, వ్యవసాయం జీవనాధారంగా బతికే ప్రజల మనుగడని కార్పొరేట్ల దయాదాక్షిణ్యాలకు అప్పగిస్తున్నారు. వ్యవసాయాన్ని అంటిపెట్టు కొని ఉన్న గ్రామీణ జీవన సంస్కృతి అంతా వ్యాపారమయం కాబోతున్నది. గ్రామాల్లోకి కార్పొరేట్ కంపెనీలవారు, మార్కెట్ల ఏజెంట్లు, కాంట్రాక్ట్ వ్యవసాయం కోసం వచ్చేవారితో రైతు జీవితం పరాధీనం కాబోతున్నది. కంపెనీలు చెప్పిన పంటలే పండించాలనడం రైతు ఆత్మగౌరవాన్ని దిగజార్చే కుట్ర. ఇప్పటికే అనేక రూపా ల్లో రైతు జీవితాన్ని ఛిద్రం చేశారు. ఇప్పుడిక కాంట్రాక్ట్ పేరుతో రైతుల భూమిని హస్తగతం చేసుకోబోయే మహాకుట్రకు రంగం సిద్ధమైంది. తన నేల తనది కాదు, తన పంట తనది కాదు, తన రెక్కల కష్టం ఎవరికో లాభాలు తెచ్చిపెట్టే సరుకుగా మారడం, తన భూమిలోనే తను కూలీగా మారడం రైతు జీవన విధ్వంసానికి పరాకాష్ట. ఈ సరికొత్త వ్యవసాయ బిల్లులు మొత్తం భారత ప్రజల ప్రయోజనాలకు శరాఘాతం. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల మధ్యతరగతి శ్రేణుల, ఆలోచనాపరుల నిష్క్రియాపరత్వం, పట్టనితనం ఆ పార్టీకి లాభించింది. కానీ సామాన్య ప్రజల ఆగ్రహం నివురు గప్పిన నిప్పు లాంటిది. ప్రజాదరణతో నియంతలుగా పరిణమించిన వారు అదే ప్రజల చేతిలో పరాభవానికి లోనవుతారు. అందుకు రంగం సిద్ధం చేయడంలో ఏయే శక్తుల పాత్ర ఎలాంటిదన్నదే ఇవాళ కీలకం.

చీఫ్ ఎడిటర్

భగవంతుని సృష్టిలో వెల కట్టలేనిది ప్రాణం.
ప్రాణాలని ప్రజల కోసం పణంగా పెట్టే పోలీసు

- ఎస్.సిహెచ్. వెంకటేష్, ఎం.ఎ., ఎంఫిల్ - బెంగళూరు

ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసు మేల్కొని, శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం కాపలా కాస్తుంటారు. ఎండ, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకునే పండగ - పబ్బాల్ని కూడా త్యజించి, ప్రజల కోసం జీవించి, మరణించే పోలీసులకి, అందునా ప్రాణాలని పణంగా పెట్టి ప్రజల కోసం పోలీసు చేసిన త్యాగానికి సానుభూతి, గౌరవం చూపించడం మనందరి బాధ్యత. పోలీసులుగా బాధ్యత నిర్వర్తించడానికి ముందుకు రాబోతున్న వారికి విధి నిర్వహణలో నూతనోత్తేజాన్ని, స్ఫూర్తిని నింపడమే పోలీసు అమర వీరుల సంస్మరణ దినం జరుపుకోవడంలోని ప్రధాన ఉద్దేశం.

అక్టోబర్ 21, అంటే పోలీసు అమరవీరుల దినం. 1959 చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థంగా తిప్పిగొట్టిన రోజు ఇది. ఈ సమరంలో ఎంతోమంది సైనికులు అమరులయ్యారు. ఆ రోజును పురస్కరించుకుంటూ, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ యోధుల త్యాగాలను స్మరించుకుందాం. దేశ సరిహద్దుల్లో సైనికులు అమరులైన రోజు ఇది. 1959 అక్టోబర్ 21న లద్ధాఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పదిమంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారు. వారి స్మృతి చిహ్నంగా జరుపుకుంటున్న ఈ అమరవీరుల సంస్మరణకు నేటితో సరిగ్గా 62 ఏళ్లు.

పోలీసు విధి నిర్వహణ చాలా శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు మాత్రమే పరిమితమయింది కాదు. ఇరవై నాలుగు గంటల ఉద్యోగం ఒక్క పోలీసు ఉద్యోగమే. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. ప్రతి ఒక్కరు ఏ ఆపదకైనా ఆశ్రయించేది పోలీసులనే. ప్రభుత్వం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసే. అన్ని పరిస్థితుల్లో అన్ని వేళల్లో పోలీసులే ముందుంటారు. సంపన్నుడు మొదలు సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతి అవసరానికీ సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను

కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులు. శాంతిభద్రతలను అదుపులో పెట్టడం, నేరగాళ్ళను నియంత్రించడం పోలీసు కర్తవ్యం. అంతర్గత భద్రతను కాపాడే పనిలో పోలీసులు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారు.

నిద్రాహారాలు మాని డ్యూటీలు చేసే పోలీసులంటే అటు అధికారులకు, ఇటు సమాజానికి చిన్నచూపే. సమయపాలన లేని విధులు, పైఅధికారులతో తిట్లు, జనంతో ఛీత్కారాలు... ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. అన్ని సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్నా ఎవరూ గుర్తించడం లేదని చాలామంది పోలీసులు వాపోతున్నారు. పోలీసులకు విశ్రాంతి కావాలనే విషయాన్ని పాలకులు, అధికారులు విస్మరిస్తున్నారు. పోలీసులకు షిప్టు డ్యూటీలు అమలు చేయలంటూ ఉమ్మడి ప్రభుత్వం 2007లో జీవో జారీ చేసింది. తొమ్మిదేళ్ళు గడిచినా ఆ ఊసే లేదు.

ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పోల్చితే పోలీసుల విధులు విభిన్నం. వీరికి పని గంటలతో సంబంధం ఉండదు. నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రతిక్షణం ఆలోచించాల్సిందే. దీంతో వారు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడి కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. పోలీసులు అందరినీ పరిగణనలోకి తీసుకొంటే 80 శాతం మంది తలనొప్పి, బీపీ, మధుమేహం, మెడ, వెన్నునొప్పి ఇలా ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. హోంగార్డు, కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ల పరిస్థితి మరీ దారుణం. డ్యూటీకి వచ్చింది మొదలు తిరిగి ఇంటికి వెళ్లేంత వరకు విరామం లేకుండా పనిచేయాల్సిందే. బందోబస్తు డ్యూటీల్లో పాల్గొనేవారి పరిస్థితి సరేసరి.

సిబ్బంది కొరత కారణంగా సెలవులు మంజూరుకాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రోజూ 40 మంది సిబ్బంది అనారోగ్యంతోనే విధులకు హాజరవుతున్నట్లు సమాచారం. ట్రాఫిక్ డ్యూటీలు నిర్వహించే సిబ్బంది కాలుష్యం వల్ల ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ సిబ్బంది అనారోగ్యకర వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నందున ప్రభుత్వం వారికి అదనపు వేతనం చెల్లిస్తున్నా సరైన ఆరోగ్య పరీక్షలు లేనికారణంగా ఇబ్బందులు తప్పడం లేదు. ఇన్ని సమస్యల మధ్య సమాజానికి ఇంత సేవ చేస్తున్న పోలీసులను గౌరవించడం మనందరి బాధ్యత. ఈ సంవత్సరం “కరోనా “ కట్టడిలో పోలీసూల సేవలు అమూల్యం. వారికెంత చేసినా తక్కువే . వారి సంక్షేమం కోసం డీజీపీ తీపి కబురే అందించారు.ఏపీ పోలీసులకు డీజీపీ గౌతమ్ సవాంగ్ శుభవార్త చెప్పారు. పోలీసులకు అందించే బీమాను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. పోలీసుల సహజ మరణానికి ఇచ్చే బీమా మొత్తం రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఎస్బీఐతో పోలీసుల కోసం జీవన్ జ్యోతీ బీమా, సురక్ష బీమా ఎంవోయూపై డీజీపీ సవాంగ్ సంతకం చేశారు. ప్రతీ పోలీసు స్టేషన్‌లో పాలసీలు ఇవ్వనున్నారు. లాంఛనంగా డీజీపీ గౌతమ్ సవాంగ్ లా అండ్ ఆర్డర్ ఏడీజీ శివశంకర్, కానిస్టేబుళ్ళు డి.రజని, దుర్గా ప్రసాద్‌కి పాలసీలను అందించారు. 10 రోజుల పాటూ పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాలు జరుపుకున్నారు.

డీజీపీ సవాంగ్

దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీస్ సిబ్బందికి వీక్లీ ఆఫ్ ఏపీలో అమలు జరుగుతోంది అన్నారు డీజీపీ సవాంగ్. మహిళల రక్షణ కొరకు దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని.. ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులో ఉండే విధంగా 87 రకాల సేవలతో పోలీస్ సేవా యాప్ అందుబాటులో ఉంచామన్నారు. రికార్డు స్థాయిలో దేవాలయాల సంబందించిన 306 కేసులను ఏపీ పోలీసు శాఖ ఛేదించిందని.. రాష్ట్ర వ్యాప్తంగా 57,270 ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు జియో ట్యాగింగ్‌తో మ్యాపింగ్ చేశామన్నారు. అలాగే కేసులకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.

పోలీసుల కోసం ప్రత్యేక పాలసీలు ఇస్తున్నామని.. రూ.40లక్షల వరకూ యాక్సిడెంటల్ పాలసీ, రూ.3లక్షల వరకూ సహజ మరణం పాలసీలు ఉన్నాయని.. పోలీసుల అద్భుతమైన సేవలకు సెల్యూట్ చేస్తున్నామన్నారు ఎస్బీఐ ఏజీఎం. ఏడాదికి రూ.12 కడితే రెండు లక్షల బీమా.. సుకన్య సమృద్ధి యోజన కూడా అందరూ వినియోగించుకోవాలని కోరారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల రక్షణకు ప్రథమ ప్రాధాన్యమిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నేరం చేసిన ఎవరినైనా చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని వ్యాఖ్యానించారు. సంఘ విద్రోహులు, తీవ్రవాదాన్ని ఉపేక్షించొద్దని చెప్పారు. ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ.. ‘దేశమంతా పోలీస్ అమరవీరులను స్మరించుకునే రోజు. కోవిడ్ సమయంలో పోలీసులు అమూల్యమైన సేవలు అందించారు. రాష్ట్ర హోంమంత్రిగా మహిళను నియమించాం. రాష్ట్ర వ్యాప్తంగా 18 దిశా పోలీస్‌స్టేషన్లను తీసుకొచ్చాం. దిశా బిల్లును కేంద్రాని కూడా పంపించాం. మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. పోలీసు ఉద్యోగాల భర్తీకి డిసెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి, జనవరిలో పోస్టుల భర్తీకి షెడ్యూల్ జారీ చేస్తాం. నాలుగు దశల్లో 6500 పోస్టుల భర్తీ చేస్తాం. పోలీస్ శాఖకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లిస్తాం’అని సీఎం జగన్ పేర్కొన్నారు.

రాష్ట్ర డీజీపీ గౌతమ్ సవాంగ్ మాట్లాడుతూ.. ‘అనేక మంది పోలీసులు వీరమరణం పొందారు. పోలీసులందరికీ వారు ఆదర్శంగా నిలిచారు. కరోనా సమయంలో కుటుంబాలకు దూరంగా ఉండి పోలీసులు విధులు నిర్వహించారు. కరోనాతో మృతిచెందిన పోలీసులకు సీఎం రూ.50లక్షలు ప్రకటించారు. పోలీసులకు వీక్లీ ఆఫ్, హోంగార్డుల జీతాల పెంపులాంటి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నాం. దిశా లాంటి చట్టాలు తెచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచాం. టెక్నాలజీ ఉపయోగించడంలో ఏపీకి 27 జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయి. సవాళ్లు ఎదుర్కోవడానికి పోలీసులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు’ అని డీజీపీ అన్నారు.

వీక్లీ ఆఫ్ ప్రకటించిన ఏకైక రాష్ట్రం

అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని హోంమంత్రి మేకతోటి సుచరిత అన్నారు. పోలీసులకు వీక్లీ ఆఫ్ ప్రకటించిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని చెప్పారు. మహిళా సిబ్బందిని ప్రోత్సహించి మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చామని ఆమె గుర్తు చేశారు. సైబర్ నేరగాళ్ల నుంచి తప్పించుకోవడానికి బాలికలకు అవగాహన కల్పించామని తెలిపారు. పోలీస్ సేవా యాప్ కూడా తీసుకొచ్చామని హోంమంత్రి పేర్కొన్నారు.

నేతి బీరకాయ లాంటి అంబేద్కరిస్టులు,బుద్ధిస్టులు, క్రైస్తవులు

కోటేశ్వరరావు కనపర్తి, ఐపిఎస్.

నేతి బీరకాయ బీరకాయ జాతిలో ఒక రకం. బీరకాయతో పోలిస్తే నేతి బీరకాయ పొట్టిగా ఉంటుంది. అంతే తేడా. దానిలో నెయ్యి ఉండదు. అదే విధంగా అంబేద్కరిస్టులు, బుద్ధిస్టులు, క్రైస్తవులు నేతి బీరకాయ లాంటి వారే. అంబేద్కరిజం అంటే సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమ సమాజాన్ని నిర్మించడం. వేల సంవత్సరాల నుండి విలసిల్లుతున్న కులం నిర్మూలన జరిగినప్పుడే సమ సమాజానికి పునాది ఏర్పడుతుంది. హిందూమతం ప్రాతిపదికగా ఎక్కువ తక్కువ భావనలు ప్రజల మనసుల్లో నాటుకుపోయిన కులాన్ని తీసి వేసినప్పుడే ప్రజల మధ్య సోదర భావం ఏర్పడి సంతోషంగా జీవిస్తారు. అలాంటి సమాజం కోసం పూలే అంబేద్కర్ వాదులు ప్రయత్నిస్తున్నారా?. రాజ్యాధికార సాధన తర్వాత కులాన్ని నిర్మూలిద్దాం అనడం ఉట్టికి ఎగరలేని అంబేద్కరిస్టులు ఆకాశానికి నిచ్చెన వేసే ప్రయత్నం చేసినట్లు అవుతుంది. మనలో ఎవరు కూడా అంబేద్కర్, కాన్షీరామ్ అంతటి మేధావులు,త్యాగధనులు, నాయకత్వ లక్షణాలు ఉన్న వారు లేరు. కావున పూలే-అంబేద్కర్ వాదులు ముందు తమలోని కులాన్ని నిర్మూలించుకొని, తద్వారా పీడిత కులాలలో ఐక్యత కొంత వరకు తెచ్చి, రాజ్యాధికార సాధనకు మార్గం ఏర్పరచాలి. మనువాద శక్తులు నీ అంతిమ లక్ష్యమైన రాజ్యాధికార సాధనకు అనేక అడ్డంకులు సృష్టిస్తారు. కులం వద్దు, అసమానతలు వద్దు,ఉచ్చ నీచాలు ఉండరాదు, మానవులు అందరూ సమానమే, నేనెంతో నీవు అంతేనన్న ధోరణితో నీవు నీ పొరుగు వారితో కలిసి పోవాలని బుద్ధుడు చెప్పాడు. అంతేగాక స్వార్థాన్ని విడనాడి మని, శత్రువును కూడా ప్రేమతో జయించమని, చెడు ఆలోచనలకు తావు ఇవ్వద్దని, సన్మార్గాన్ని అనుసరించమని, నిరాడంబరంగా పవిత్రంగా జీవితాన్ని గడపమని బుద్ధిజం చెప్తుంది. ప్రేమ, సమానత్వం, కరుణ, దయ, త్యాగంలను క్రైస్తవ మతం బోధిస్తుంది, అంతేగాక తగు మాత్రపు నిరాడంబర జీవితాన్ని గడుపుతూ, అసూయ-ద్వేషాలను కలిగి ఉండవద్దని కూడా క్రైస్తవమతం చెప్తుంది. స్వాతంత్ర్యానంతరం 73 సంవత్సరాలుగా 85 శాతం గా ఉన్న బహుజనులు విద్యాపరంగా కొంతవరకు చైతన్యం చెందారు. కానీ వారు విద్యను బ్రతుకు తెరువు కోసం ఉపయోగించుకుంటున్నారు. రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందిన వారు,క్రైస్తవ, బౌద్ధ మతస్తులు స్వార్థంతో, సంకుచిత మనస్తత్వం తోటి మానవులను సోదర సమానంగా కూడా పరిగణించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారు. సమాజంలో కులం అత్యంత ప్రమాదకరమైనది. కులం కారణంగా ప్రేమ, కరుణ,త్యాగం, సహాయం ఆయా కులాల వారికే పరిమితమవుతున్నాయి. నీతో ఒకే స్కూలు-హాస్టల్ లో చదువుకున్నా, ఒకే ఆఫీసులో పనిచేస్తున్నా, ఒకే ప్రార్థనా మందిరానికి వెళ్తున్నా, ఒకే వీధిలో నివసిస్తున్నా కులం అడ్డుగా నిలుస్తుంది. ఆ కుటుంబాల మధ్య ప్రేమానురాగాలు, సత్సంబంధాలు ఉండవు.

హిందూ మతం నుండి సంక్రమించిన కులాన్ని అంబేద్కరిస్టులు, బుద్ధిస్టులు, క్రైస్తవులు తు.చ తప్పకుండా పాటిస్తున్నారు. వివాహ విషయాల్లో వ్యక్తుల గుణగణాలు, చదువు, ఉద్యోగం బట్టి కాకుండా, కులం బట్టి సంబంధాలు ఏర్పరచు కుంటున్నారు. వివాహం అయిన తర్వాత వధూవరుల పేర్లు బట్టి వివాహ తేదీ పూజారిచే నిర్ణయింపబడుతుంది. అంబేద్కరిస్టులు కూడా బ్రాహ్మణ పూజారిచే ఆర్భాటంగా వివాహాన్ని జరుపుతారు. బుద్ధిస్టులు అనుకునేవారు వివాహాన్ని మాంక్తోగానీ, బుద్ధుని బొమ్మ పెట్టి మిగిలిన కార్యక్రమాలన్నీ హిందూ సంప్రదాయాల ప్రకారమే జరుపుతారు.సంధ్యా వందనాలు, పూజలు,వ్రతాలు,బారసాల సీమంతాలు, నామకరణ మహోత్సవం, నూతన వస్త్రాలంకరణ, జన్మదిన - వివాహ వేడుకలు, వివాహ దినోత్సవాలు షష్టిపూర్తి, పిండ ప్రదానాలు హిందూ సంప్రదాయం నుండి వచ్చినవే అనుసరిస్తుంటారు. అంతేగాక గృహ నిర్మాణంలో వాస్తు అనుసరించడం, భూమి పూజ, పూజా గదుల నిర్మాణం, గృహప్రవేశ మహోత్సవం హిందూ సంప్రదాయం ప్రకారమే జరుపుతారు. నికార్సైన పూలే- అంబేద్కర్ వాదులు,బుద్ధిష్టులు, క్రైస్తవులు వందకి ఒక శాతం కంటే తక్కువ సంఖ్యలో ఉంటారు. విలువలు, నీతి, నిజాయితీ గల వారితో సంబంధం లేకుండా కులాల వారీగా గ్రూపులు కట్టడం, మీటింగ్లు పెట్టడం, వన భోజనాలు, తీర్థయాత్రలు, విహార యాత్రలు నిర్వహిస్తుంటారు. అదే మనుషులు స్వలాభం కోసం, స్వార్థంతో మనువాద పార్టీలలో చేరి వారికి భజనపరులుగా మారడం, సొంత కుల నాయకుల పైన అవాస్తవాలతో నిందారోపణలు చేయడం, ఎన్నికలలో దోపిడీ పార్టీల తరపున ప్రచారం చేయడం చూస్తూనే ఉన్నాం. సమాజ అభివృద్ధికి ఉపయోగపడే రాజ్యాధికారం కోసం వీరు ప్రయత్నం చేయరు.

కులతత్వాన్ని వదులుకోలేని వారు, కులాన్ని నిర్మూలించలేని వారు, విలాసవంతమైన జీవితాన్ని సమాజం కోసం కొంత త్యాగం చేయలేనివారు, తోటి పేద క్రింది కులాల వారిని సోదరునిగా అంగీకరించలేని వారు, తనకున్న దానిలో కొంత సమాజ శ్రేయస్సు కోసం ఖర్చు పెట్టలేని వారు, సమాజ కార్యక్రమాల కోసం కొంత సమయాన్ని కేటాయించాలని వారు, నిజాయితీగా జీవించలేని వారు, నీ వలె నీ పొరుగు వానిని ప్రేమించలేని వారు, సత్యాన్ని సత్యంగా నూ, అసత్యాన్ని అసత్యం గానూ చెప్పలేని పూలే, అంబేద్కర్ వారసులు, బుద్ధిస్టులు, క్రైస్తవులు, అభ్యుదయ వాదులు సామాజిక మార్పుకు ఏ విధంగా తోడ్పడతారు?. కులాన్ని, స్వార్థాన్ని, అహాన్ని, అసూయను విడనాడి, వాటిని నిర్మూలించిన వారే నిజమైన పూలే- అంబేద్కర్ వారసులు, నిజమైన క్రైస్తవులు, నిజమైన బుద్ధిస్టులు, అభ్యుదయ వాదులు కాగలరు. హేతుబద్ధం కానీ, దుబారా ఖర్చుతో కూడిన ఆచారాలు కూడా వదిలేద్దాం. ఆ దిశలో బ్రతుకుదాం. సమాజంలో మార్పు తెచ్చి అసమానతలు లేని సమసమాజాన్ని నిర్మిద్దాం. జైభీం.

దళిత సాహిత్యం సాంస్కృతిక రంగాలు :

తాత్త్విక సంఘర్షణ-మార్గాన్వేషణ

దళిత-ఆదివాసీ అధ్యయన, అనువాద కేంద్రం వారు నిర్వహిస్తున్న "దళిత చైతన్యం-సాహిత్య,సాంస్కృతిక రంగాలు: భవిష్యత్తు సవాళ్ళు" అనే అంశంపై రెండురోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయసదస్సులో నేనీ పత్రాన్ని సమర్పించడానికి అవకాశం కల్పించిన ఈ కేంద్రం అధ్యక్షులు ఆచార్య ఆర్.ఎస్.సర్రాజుగార్కి, నిర్వాహకుల్లో భాగస్వాములు, యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య వి.కృష్ణగార్కి, సభాధ్యక్షులు జూపాక సుభద్రగార్కి, సభలో పాల్గొన్న పెద్దలందరికీ నమస్కారాలు తెలియజేస్తున్నాను. సభలో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు. ఈ యూనివర్సిటీ తెలుగుశాఖలో 2005 నుండీ ఎం.ఏ.స్థాయిలో దళితసాహిత్యాన్ని ఒక కోర్సుగా బోధిస్తున్నాం. దీనిలో మొదటి యూనిట్ అంతా దళిత సాహిత్య తాత్త్వితకు సంబంధించిన చర్చే ఉంటుంది. ఎందుకంటే ఒక సాహిత్యోద్యమానికి అత్యంత ముఖ్యమైంది తాత్త్వికత.

ఆచార్య **దార్ల వెంకటేశ్వరరావు,**
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనిర్సిటి,
హైదరాబాద్,
ఫోను: 9182685231

తత్త్వం అంటే ఏమిటి?

'తత్' అంటే 'అది' అనీ, 'త్వమ్' అంటే 'నీవు' అని ఆ శబ్దాలకున్న అర్థం.అది లేదా ఆ ప్రకృతి స్వభావాన్ని నువ్వెలా అర్థం చేసుకుంటున్నావన్నదే 'తత్త్వం'ప్రకృతి సృష్టినీ, దానిలోని పశు పక్ష్యాదుల జీవన గమనాన్ని లోతుగా ఆలోచించే జిజ్ఞాసే తత్త్వం. ప్రకృతి సృష్టి, స్థితి, లయల గురించి చేసే ఆలోచనలు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. ఆకాశం, గాలి, భూమి, నీరు, నిప్పులనే పంచభూతాల గమనాన్ని ఒక వర్గం మానవాతీతమైన శక్తితో, అంటే దైవబలంతో విశ్వసిస్తుంటారు. దీన్నే భావవాదంగా చెప్తారు. దీనిలో మానవాతీతశక్తులకు ప్రాధాన్యాన్నిచ్చే వాళ్ళు జీవుల కర్మలకు పునర్జన్మ సిద్ధాంతాలను ప్రతిపాదిస్తారు. మనిషి, ప్రకృతిలోని ప్రతిజీవీ తమ కర్మానుసారంగానే జన్మించడం, మరణించడం జరుగుతుందని వివరిస్తారు.

రెండో వర్గం ప్రకృతిలో జరిగే ఈ పరిణామాలన్నింటికీ కార్యకారణాలకు భౌతిక పరిస్థితులే కారణమని నమ్ముతుంటారు. దీన్ని శాస్త్రీయమైన అవగాహనగాను, భౌతికవాదంగాను పిలుస్తుంటారు. పునర్జన్మ ఉండదనీ, జీవుల పుట్టుకకు తమ పూర్వజన్మలు కారణం కాదనీ, తమ పుట్టి, పెరిగిన సామాజిక అస్తిత్వమే తమ సుఖదు:ఖాలకు కారణమని భౌతికవాదులు భావిస్తారు.

దళిత తత్త్వం-దళిత సాహిత్య తత్త్వం

తత్త్వం అంటే 'దాని యొక్క అర్థం' అనుకున్నాం కదా. దళిత తత్త్వం అంటే దళితుల జీవనవిధానం, దానికి కారణమైన భావనలు, వాటి స్వరూప, స్వభావాల్ని వివరించే సైద్ధాంతిక భావన అనీ ఇక్కడ ఈ తత్త్వాని అవగాహన చేసుకోవాలి. దళిత తత్త్వం, దళిత సాహిత్య తత్త్వం అంటే దళిత ఉద్యమ సైద్ధాంతిక స్వరూప, స్వభావాల్ని వివరించేదాన్ని 'దళిత తత్త్వం' అంటాం. అలాగే, 'దళిత సాహిత్య తత్త్వం' అన్నప్పుడు దళిత సాహిత్యం అనుసరించాల్సిన, అనుసరిస్తున్న సిద్ధాంతలను వివరించుకోవడమే దళిత సాహిత్య తత్త్వం తెలుసుకోవడం అవుతుంది.

సామాజిక స్వరూప స్వభావాల సంఘర్షణల నుండి ఉద్యమాలు పుట్టుకొస్తాయి. భారతీయ సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ సామాజిక ఉద్యమాలకు, ముఖ్యంగా దళిత ఉద్యమానికి కారణమైంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో కొన్ని కులాలు మరికొన్ని కులాలపై ఆధిక్యతను ప్రదర్శించడంతో దళిత ఉద్యమం అనివార్యమైంది. ఈ ఉద్యమం ఒక్కసారిగా వచ్చింది కాదు. దీనికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది.

దళిత ఉద్యమ ప్రారంభం గురించి

భిన్నాభిప్రాయాలున్నాయి. బుద్ధుని కాలం నుండే దళితసాహిత్యం ఆవిర్భవించిందనే వాళ్ళు (కలేకూరి ప్రసాద్, 2000:3) ఉన్నారు. డా॥బి.ఆర్.అంబేద్కర్ చేసిన రాజీలేని పోరాటాల ఫలితంగా1960ల తర్వాత ఆధునిక దళిత సాహిత్యోద్యమం ప్రభవించిందని మరికొంతమంది (బి.యం.లీలాకుమారి, కలేకూరి ప్రసాద్ పుస్తకం 'దళితసాహిత్యం' వెనుకమాట) అంటున్నారు. అయితే, అది 1985లో కారంచేడు దళిత మృతవీరుల రక్తజ్వాలల నుండి ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ నడిపిన పోరాట స్ఫూర్తితో తెలుగులో దళిత సాహిత్యోద్యమం బలంగా విస్తరించిందని (బి.యం.లీలాకుమారి, 2000:21) అన్నవాళ్ళున్నారు. కారంచేడు, చుండూరు ప్రాంతాల్లో దళితయువకులపై జరిగిన దాడులకు తెలుగు దళితులు స్పందించి, అందించిన సాహిత్యం తెలుగు దళిత సాహిత్యోద్యమాన్ని సజీవం చేశాయి. కానీ, ఇలాంటి పరిణామం మరాఠీలో ఒక దశాబ్దం ముందుగానే వచ్చిందని కత్తిపద్మారావు (దళితవాదవివాదాలు, ముందుమాట, 2000:8) వ్యాఖ్యానించారు. జి.లక్ష్మీనరసయ్య (దళిత సాహిత్యం-తాత్త్విక దృక్పథం, 1999:13) మాత్రం 1985 తర్వాత రాసిన దళితకవులకు మరాఠీ, కన్నడ, తమిళ దళితసాహిత్యం పరిచయం కావడంతో తెలుగు దళితకవుల పని మరింత సులభమైందంటూనే, వీరందరికంటే తెలుగు దళిత కవులు నాలుగడుగులు ముందే ఉన్నారన్నారు.

ఈ ఆలోచనలను బట్టి చూస్తే 1970 ల తర్వాత వచ్చిన మరాఠీ దళిత్ పాంథర్స్ ఉద్యమ ప్రభావం ఉన్నా, అంబేద్కర్ భావజాల ప్రభావమే తెలుగు దళితసాహిత్యంపై గాఢంగా కనిపిస్తోందని స్పష్టమవుతుంది.

ఈకాలంలో అంటే 1960కి ముందున్న తెలుగు దళిత సాహిత్యంపై

ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చార్వాక, లోకాయత తాత్త్విక ప్రభావం పనిచేసింది. దీనితోపాటు భక్తకవులైన రామానుజుడు, స్వామిరామానంద, శ్రీచైతన్య, నానక్, కబీర్, మీరాబాయి, సంత్ రవిదాస్ మొదలైన వారి తాత్త్వికత కనిపిస్తుంది. దీన్ని తెలుగులో బసవేశ్వరుడు, వేమన, అన్నమయ్య, పోతులూరి వీరబ్రహ్మం మొదలైన వారి రచనల్లో వ్యక్తమైయ్యేలా చేయగలిగారు. ఈ సాహిత్యాన్ని దళితసాహిత్యం అనలేకపోయినా, ఈ సాహిత్యాన్ని దళిత సాహిత్యం పూర్తిగా నిరాకరించేస్థితిలో లేదు. ఈ ప్రభావమే తర్వాత భారతజాతీయోద్యమకాలంలో సంస్కరణోద్యమంగా గాంధీ ప్రచారం చేశాడు. దీనిలో దళితులే కాకుండా, దళితేతరులు కూడా విస్తృతంగా పాల్గొన్నారు.

వేంకటపార్వతీశకవుల'మాతృమందిరం' (1919), ఉన్నవ లక్ష్మీనారాయణ 'మాలపల్లి'(1922), ఎన్.జి.రంగా "హరిజననాయకుడు" (1936) రచనల్లోను, శ్రీపాద సుబ్రహ్మణ్యం, కరుణకుమార కథల్లోను సంస్కరణోద్యమ ప్రభావమే కనిపిస్తుంది. వీటితో పాటు ఈ కాలంలో విస్తృతంగా వచ్చిన గేయాలు, మాలవాండ్రపాట (1909)తో సహా, మంగిపూడి వేంకటశర్మ గారి'నిరుద్ధభారతం' (1915) వంటి వాటిలో సంస్కరణోద్యమమే ప్రతిఫలిస్తుంది.

గురజాడ నాటికి మానవతావాదంతో పాటు, హేతువాద దృష్టికనిపిస్తుంది. అందుకనే "యెల్లలోకములొక్కయిల్లై / వర్ణభేదములెల్ల కల్లై" పోతాయనగలిగాడు. అంతేకాదు, "వర్ణధర్మం అధర్మధర్మంబే"ననీ, "మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటెనిలిచివెలుగును" అన్నాడు.

తెలుగులో పెరియార్ రామస్వామి తాత్త్విక ప్రభావం త్రిపురనేని రామస్వామి చౌదరి రచనల్లో కనిపిస్తుంది. సూతపురాణం (1920) ఈ దృష్టితో రాసిందే. భారతదేశంలో కులాన్ని నిర్మూలించకుండా, దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష గురించి మాట్లాడ్డంలోని హేతుబద్ధతను ఈ కావ్యంలో ఇలా ప్రశ్నిస్తాడు కవి.

"దక్షిణాఫ్రికా యందు నిర్దయులెల్ల
వారు భారతీయుల బెట్టు పాటు గాంచి
గొల్లుమని యేడ్చునెంతో గగ్గోలు పడుచు
పనవుచుందును నీ నాటి బ్రాహ్మణుండు

" కాని తాను మాత్రమొ యంటరాని వాండ్రు
ముట్టరాదుళ్ళను బ్రవేశ పెట్టరాదు
పొమ్మనుచునుండు మాలల బోధపడదు
తండ్రీ! నేటి బ్రాహ్మణుల చిత్త ప్రవృత్తి"

(సూతపురాణం, ప్రథమాశ్వాసం, పు:2)

ధర్మవ్యాధుని కథ మహాభారతంలో కనిపిస్తుంది. ధర్మవ్యాధుడు పూర్వజన్మలో బ్రాహ్మణులు కావడమే అతనికి అంత జ్ఞానికాగలిగాడని పూర్వజన్మసిద్ధాంతాన్ని కారణంగా భారతంలో కల్పించినదాన్ని ఈ సూతపురాణంలో హేతుబద్ధంగా ప్రశ్నిస్తాడు.

కుసుమ ధర్మన్న రచనల్లో గాంధీ, పెరియార్ రామస్వామి, అంబేద్కర్ తాత్త్విక భావజాలం సమ్మేళనం కనిపిస్తుంది. అవి ఒక పరిణామంగా కూడా కొనసాగాయి. హరిజన శతకం (1933)లో గాంధీ సంస్కరణ, పెరియార్ రామస్వామి తాత్త్వికత కనినిపిస్తుంది.

"ఆలకింపుమయ్య హరిజనుండ" అనడంలో "హరిజన" పదాన్ని వ్యాప్తిలోకి తెచ్చిన గాంధీ సంస్కరణ ప్రభావం, "ఆలకింపుమయ్య ఆదిహిందూ, ఆలకింపుమయ్య ఆదిమాంధ్ర" వంటి వర్ణనల వల్ల పెరియార్ రామస్వామి నాయకర్ ఆత్మగౌరవ ఉద్యమ తాత్త్వికత వెల్లడవుతుంది.

మాకొద్దీనల్లదొరతనం (1921) లో అంబేద్కర్ తాత్త్వికభావజాలం కనిపిస్తుంది. "స్వారాజ్యమనుచు సర్కారుతో పోరాడి/ స్వాతంత్ర్యము అడుగుతారు/ మమ్ము స్వాతంత్ర్యము తాకనీరు/కూడి నూతిలో నీళ్ళు తోడుకోనీరు"వంటి పాదాలు అంబేద్కర్ తాత్త్విక భావజాలాన్ని తెలియజేస్తాయి. అయితే, గాంధీ ప్రభావం దీనిలో కనిపించకపోయినా, దీని తర్వాత రాసిన హరిజనశతకంలో గాంధీ ప్రభావం ఉండటానికి ఈయనపై తీవ్రంగా ఉన్న కాంగ్రెస్ ప్రభావమే కారణం కావచ్చు.

గుఱ్ఱం జాషువ (1895-1971) రచనల్లో గాంధీ+పెరియార్ రామస్వామి+అంబేద్కర్ తాత్త్విక భావజాల ప్రభావం కనిపిస్తున్నా, అత్యధికంగా అంబేద్కర్ తాత్త్విక ప్రభావమే కనిపిస్తుంది.

గబ్బిలంలో దేవాలయ ప్రవేశం కోసం దళితుల ఆవేదన అంతా సంస్కరణోద్యమ ప్రభావమే.అయితే దీని సందర్భాను సారంగా హేతువాదాన్ని మిళితం చేశాడు కవి.

"ముసలివాడైన బ్రహ్మకు బుట్టినారు
నలువులు కుమారులనుట విన్నాము గాని
పసరముకన్న హీనుడభాగ్యుడైన
యైదవ కులస్థుదెవరమ్మా! సవిత్రి" (ఖండకావ్యం, సంపుటి 2, పుట: 35)

దీనిలో హేతువాద తాత్త్వికభావజాలమే కనిపిస్తుంది.

గబ్బిలం రెండవభాగం వచ్చేసరికి అంబేద్కర్ తాత్త్వికభావజాలాన్ని పరిపూర్ణంగా అందుకున్నట్లనిపిస్తుంది.

"కలడంబేద్కరు నా సహోదరుడు మాకై యష్టకష్టాలకుం
బలియై సీమకు వోయి క్రమ్మరిన విద్వాంసుడు వైస్రాయి మే
ల్కొలువందగల దొడ్డవాడతడు నీకున్ స్వాగతంబిచ్చి పూ
వుల పూజల్ వొనరించెనే యతని మెప్పుల్ నీ జయారంభముల్"

బోయి భీమన్నలో కూడా గాంధీ, అంబేద్కర్ తాత్త్విక భావజాల సమ్మేళనమే కనిపిస్తుంది. కూలిరాజు(1946)లో గాంధీ ప్రభావం, తర్వాత కాలంలో అంబేద్కర్ ప్రభావం కనిపిస్తుంది.

ఆధునిక తెలుగు దళిత కవుల్లో మార్క్సిస్టు తాత్త్విక భావజాలం కనిపిస్తుంది. తెలుగు దేశంలో మార్క్సిస్టు ఉద్యమాల ప్రభావం దీనికి దోహదం చేసింది. అయితే ఈ అభ్యుదయ, విప్లవ సాహిత్య ఉద్యమాలను ముందుకి తీసుకొచ్చిన వాళ్ళు దళితేతరులు కావడం వల్ల కుల ప్రభావాన్ని ఈ ఉద్యమాలకు తాకకుండా చాలా కాలం ప్రయత్నించారు.

కంచికచర్ల కోటేశు సజీవదహనం (1969)తో మొదలై, కారంచేడు (1985), చుండూరు (1991) సంఘటనల్లో దళితుల హత్యాకాండ నాటితో దళిత తాత్త్వికత మరింత స్పష్టంగా బయటకొచ్చింది. అంబేద్కర్ ఆలోచనావిధానమే దళిత ఉద్యమానికీ, సాహిత్యోద్యమానికీ ప్రాణభూతమైందని తెలుసుకున్నారు. ఈ ఆలోచనలతోనే సమకాలీన దళిత ఉద్యమం కొనసాగుతోంది. జి.లక్ష్మీనరసయ్య దళిత తాత్త్విక దృక్పథాన్ని అంబేద్కర్ ఆలోచనావిధానాన్ని ఆచరించడమేనన్నారు. ఆ తాత్త్విక భావజాలానికి అనుగుణంగానే సామాజిక, రాజకీయ, సాంస్కృతిక ప్రత్యామ్నాయాలను స్వీకరించాలన్నారు.

"దళిత సాహిత్యానికి ఒక తాత్త్విక దృక్పథం ఉంది. అదే అంబేద్కరిజం. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానం తాత్త్విక నేపథ్యంగా ముందుకు వచ్చిన విప్లవోద్యమ దృక్పథం విప్లవసాహిత్యానికి బాసటగా

నిలిచినట్లు, చార్వాక లోకాయత వాదాల నుంచి బుద్ధిజం మీదుగా బసవేశ్వరుని మీదుగా, భక్తికవుల ప్రవచనాల సారాన్ని నింపుకుంటూ ఫూలే, సాహుమహరాజ్, పెరియార్, నారాయణగురు, బాబాసాహెబ్ అంబేడ్కర్ విశ్లేషించి చూపిన భారత వాస్తవికత ప్రాతిపదిగ్గా ముందుకు వచ్చిన బహుజనోద్యమమం ఏదైదే ఉందో అదే దళిత సాహిత్య తాత్త్విక నేపథ్యం." అని జి.లక్ష్మీనరసయ్య 'దళితసాహిత్యం-తాత్త్వికదృక్పథం' గ్రంథం (1999:2)లో వివరించారు. వర్తమాన తెలుగు దళితకవులు, రచయితలు ఈ తాత్త్వికదృక్పథాన్నెంతవరకు అనుసరించారోవిశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

అంబేడ్కర్ పుట్టిన ప్రాంతం మహారాష్ట్ర తెలంగాణాకు అత్యంత దగ్గరగా ఉంది. అయినా ఇక్కడి సామాజిక పరిస్థితుల వలఈ ప్రాంతంలో నిజామ్ నవాబుల ప్రభావంవల్ల అంబేడ్కరిజమ్ కంటే ఇక్కడి దళితుల్లో మార్క్సిస్టు తాత్త్విక భావజాలమే ముందుగా కనిపిస్తోంది. పాటను ఆయుధంగా చేసుకున్న వందలాది దళిత కవులు తొలినాళ్ళలో మార్క్సిస్టు తాత్త్విక భావజాలాన్నే ప్రచారం చేశారు. అలా వచ్చిన వాడే ప్రజావాగ్గేయ కారుడు గద్దర్. సమకాలీన సామాజిక సమస్యల పరిష్కారంలో భాగంగా మార్క్సిస్టు తాత్త్విక భావజాలాన్ని స్వీకరించకతప్పలేదు.

తెలంగాణాలో చదువుకున్న రెండవ తరం అంబేడ్కరిజాన్ని అందుకుంది. జూపాక సుభద్ర, గోగుశ్యామల, పసునూరి రవీందర్ లాంటి వారి రచనల్లో ఈ తాత్త్విక ప్రభావం కనిపిస్తుంది.

కోస్తాంధ్రలో తెలంగాణా ప్రాంతానికంటే ముందుగానే దళితులు విద్యాసౌకర్యాలు పొందగలిగారు. అందువల్ల క్రైస్తవాన్ని వీడని అంబేడ్కరిజంతో తమ రచనల్ని కొనసాగించారు. గుఱ్ఱం జాషువా దగ్గర నుండి ఎండ్లూరి సుధాకర్, సతీష్ చందర్, మద్దూరి నగేష్ బాబు, తుళ్ళిమళ్ళి విల్సన్ సుధాకర్, ఎజ్రాశాస్త్రి మొదలైనవాళ్ళంతా క్రైస్తవ ప్రభావాన్ని వీడని అంబేడ్కర్ తాత్త్విక భావజాలంతో తమ కవిత్వాన్ని రాశారు. చుండూరు సంఘటనకు స్పందించిన సతీష్ చందర్ ఇలా కవిత్వమయ్యాడు.

"పంటపొలాల్లో శిశువుకు శిలువ మరణం
పట్టపగలు చీకటి కమ్మింది
ఆకాశం అయిదు ముక్కలుగా చీలింది
సూర్యుడు నాలుగు ముక్కలుగా అతుక్కొని ముఖం కప్పుకున్నాడు
శిలువ మీద శిశువు పలికిన చివరి మాట
'తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు
నేను తిరిగిలేచువరకునూ వీరిని సజీవంగా వుంచుము"

దీనిలో క్రైస్తవ ప్రతీకలే ఎక్కువగా కనిపిస్తాయి.

ఎండ్లూరి సుధాకర్ 'నల్లతల్లి' కవితలో సందర్భోచితంగా క్రైస్తవ ప్రతీకలను తీసుకుంటూనే హిందూ మతోన్మాదాన్ని ఎండగట్టిన సందర్భం కనిపిస్తుంది.

" నిన్ను అకారణంగానూ అన్యాయంగానూ
కొప్పుపట్టిలాగి కొడుతున్నప్పుడు
నీ మీద ఆకూ వక్కా నమిలి ఉమ్మితున్నప్పుడు
ఆడ దుశ్శాసినులు నీకోకలు చింపుతున్నప్పుడు
ఒక కొడవలిలాగో ఒక కాళికలాగో మారకుండా
ఆడ క్రీస్తులా
అలా బేలగా వుండిపొయ్యేదానివి
నా బాల్యానికి భాషలేదు గానీ
నీ బాధ నీలాంటివాళ్ళ బాధ
మరో మహాభారతమై వుండేది!"

దళితతాత్త్వికతతో భౌతిక దృక్పథం ఉండాలి. దైవాన్ని, మానవాతీత శక్తుల్నీ కీర్తించకూడదు.దళితుల దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలన్నింటికీ అంబేడ్కరిజమేవిధంగా పరిష్కారాల్ని సూచిస్తుందో వర్ణించగలగాలి. నిరుత్సాహాన్ని బదులు చైతన్యాన్ని నింపాలి. తమ సంస్కృతిలో ఆచారవ్యవహారాలు, తిండి, మాట్లాడే భాష పట్లా, తాము చదివే చదువుల పట్లా జాగురూకతను ప్రదర్శించగలగాలి. సమకాలీన సమస్యలను ఎదుర్కొనే ప్రతిఘటన చైతన్యాన్ని ఉద్దీపింపజేయాలి.

అలాంటి ఒక కవితను 'నెమలికన్నులు' అనే నా కవితాసంపుటి నుండి తీసి మీముందుంచే ప్రయత్నం చేస్తాను.

అన్నీ మామూలైపోయాయి
కొత్త బట్టలేసుకున్నప్పుడల్లా
వింత వింతగా చూసేవాళ్ళెదుట
ఏదో తప్పుచేసినట్లింకా కుంగిపోలేను
రంగునీ, రూపాన్నీ, భాషనీ...
అన్నింటినీ అనుమానించినా
ఆత్మన్యూనత కింకా అర్థం కల్పించలేను
ఇతివృత్తాల మూస ధోరణిలో
నా తల్లిని పని మనిషనీ
నా తండ్రిని తోటమాలనీ
ఏవేవో చిత్రించే
ఊహల్నిక ఊహలుగానే మిగుల్చుకోవడం మంచిది
ఆ దేవుడే దిగొచ్చినా
మొదటి ప్రాధాన్యత నా తల్లి దండ్రులకే!
నేనిప్పుడు దళిత సౌందర్య తాత్త్వికుణ్ణి!!
ఆధిపత్యపోరులో
భావజాలంతో పాటు
నా భాషా
జీవం కోల్పోతున్నప్పుడల్లా
కంపల్సరీ క్లాసికల్ సబ్జెక్టులా చేసైనా సరే
సోషియో లింగ్విస్టిక్స్ క్లాస్ చెప్పాలనిపిస్తుంది
ఓ మహా దేశభక్తుడా!
మళ్ళీ మళ్ళీ స్వాతంత్ర్యపోరాటంలో
నా మనవలెక్కడ
మళ్ళీ మళ్ళీ బలికావాల్సి వస్తుందనో
మా దేశాన్ని తాకట్టు పెట్టొద్దంటూ
గగ్గోలు పెడుతూ
ప్రాణాలైనా గడ్డిపరకల్లా విసిరేస్తున్నాం
నీ వక్రీకరణ చరిత్రలో
నా పేరు కోసమెప్పుడూ
తాపత్రాయపడుతూ
పింఛను కోసం వెంపర్లాడను
లాఠీలు, తూటాలకు
నా ప్రాణాలొడ్డయినా
నేను నాదేశాన్ని కాపాడుకుంటాను
నీదంతా వక్రీకరణ చరిత్ర
స్వాతంత్ర్య సమరయోధుడిగా నమోదవ్వాల్సింది పోయి
నేరస్తుడిగానో
కరడు గట్టిన ఉగ్రవాదిగానో

నాకెన్నెన్ని జాబితాలు సిద్ధమౌతాయో
అందుకే నీదంతా వక్రీకరణ చరిత్ర
నాకళ్ళ ముందు నిన్ననే జరిగిన
మద్యపాన నిషేధోద్యమంలో
నా తల్లి పేరేది?
భర్తే పోటీ చేసినా
ఓటేయడానికే ఇల్లు కదలని అమ్మలక్కలు
నేడు ఉద్యమనేతలుగా సన్మానాలందు కోవడమేంటి?
కార్గిల్ 'ఆపరేషన్ విజయ్'లో
ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నా
ఆచార్య పద్మపాణి కెగిరిన కీర్తిపతాక
మరికొందరి కెందుకు ఎగరలేదు?
జరపరేషాను గుందిరా బయ్ నీ చెరిత్రంతా...

✡ ✡ ✡

"శివ శివా సంస్కృతి భ్రష్టుపట్టి పోతోంది
ఇంగ్లీషు న్యూ ఇయర్
వాలెంటైన్స్ డే...
పేర్లతో తెస్తున్న ప్రపంచానురాగం
మన సనాతన సంస్కృతిని
భ్రష్టుపట్టించేస్తున్నాయ్
కోల్‌కత్తా కాళిక నాలికల్ని చాచి
ముంబయ్ వీధుల్లో ఊరేగించుకుంటూ
ఒరిస్సా, గుజరాతుల్లో
రాక్షస రతుల్తో
సజీవదహనాల్తో
సిస్టర్స్ శీలంపై మరకలతో
భీతావహుల్ని చేస్తూ
చార్మినార్ చౌరస్తాలో
ఊచకోతలు కోస్తూనైనా
నరనరాల్లో యాంటీవైరస్ నెక్కించాలి"
నన్ను నిరంతరం ద్వేషించినా
నన్ను నిరంతరం వేధించినా
నాకు నిన్ను ప్రేమించడమే తెలుసు
ఇప్పటికైనా
నువ్వెప్పటికైనా
అమ్మ తినిపించే గోరుముద్దల రుచిని చూడు
పసిపాపల పాల బుగ్గల్ని నిమిరి చూడు
కష్టపడి పనిచేసి
మిట్టమధ్యాహ్నం చెట్టు నీడకెళ్ళి చూడు
నీకూ ప్రేమించడమే తెలుస్తుంది
ప్రేమించడంలోనే
అమరత్వముందనీ అనుభవమౌతుంది!
దీన్నిండా అంబేద్కర్ తాత్త్విక భావజాలం ఉంది.

బౌద్ధిజమే తాత్త్విక భావజాలంగా నమ్మి రచనలు చేసినవాళ్ళలో సవేర, ఇంగిలాల రామ చంద్రరావు లాంటి కొద్దిమంది తప్ప మిగతా వాళ్ళంతా తమ సమకాలీన సామాజిక పరిస్థితుల ప్రభావంతోనే రచనలు చేశారు.

అంబేద్కరిజమంటే ఆయన ఆలోచనలను రాయడమే కాదు, ఆచరణలో కూడా చూపించగలగాలి. కానీ, సమకాలీన సమాజ పరిస్థితుల ప్రభావం వల్ల దళితులు అంబేద్కరిజమ్‌లో మార్క్సిజాన్నీ, క్రైస్తవ భావజాలాన్నీ మిళితం చేసి కవిత్వం రాశారు. బుద్ధిజాన్ని ప్రత్యామ్నాయ మార్గంగా అంబేద్కర్ అనుసరిస్తే, కోస్తాలో అత్యధికులైన దళితులు హిందూమతానికి ప్రత్యామ్నాయంగా క్రైస్తవాన్ని భావించారు. ఆలోచనలో అంబేద్కరిజం, ఆచరణలో క్రైస్తవం కనిపించడం కోస్తా ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది.

ఈ పరిస్థితుల్ని గమనిస్తే ఆచరణలో అంబేద్కరిజం ప్రశ్నార్థకమైందని కూడా అనిపిస్తుంది. దళితుల్లో కూడా మతం ప్రవేశించింది.అందుకే భార్యా భర్తల్లో ఒకరు అంబేద్కరిస్టు అయితే, మరొకరు ఏదొక మతానికి చెందినవాళ్ళై ఉంటున్నారు. దళిత సమాజం ఇంకా బుద్ధిజాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదనిపిస్తుంది. దీన్ని అర్థం చేసుకోకుండా అంతా అంబేద్కరిజమే ఆచరణలో ఉందని చెప్పడం ఒక కాల్పనికమే అవుతుంది. నిజంగా ఉంటే, అది రాజకీయశక్తిగా కూడా మారేది. అంబేద్కరిజమే ఊపిరిగా ముందుకొచ్చిన బహుజనసమాజ్ పార్టీ అధికారంలోకి కూడా వచ్చేది. సాంస్కృతిక చైతన్యం బలంగా, విశ్వసనీయంగా, ఆచరణాత్మకంగా ఉన్నప్పుడు అది అందరినీ ఆకర్శిస్తుంది.

మార్క్సిజం భారతదేశంలో దళితేతరుల చేతుల్లోకి వచ్చి, వక్రీకరణకు గురైనట్లే, అంబేద్కరిజం కూడా భారతదేశంలో కొంతమంది దళితమేధావుల చేతుల్లో వక్రీకరణకు గురవుతోంది. ఐక్యత, సంఘర్షణ, సమానావకాశాలు అంటూనే ఆచరణలో వాటిని అడ్డుకునే శక్తుల్ని గుర్తించాలి. భారతీయ సమాజంలో శూద్ర, అతిశూద్రగా బహుజనుల్ని, దళితుల్ని హిందూమతం విభజించింది. అంబేద్కర్ తాత్త్విక భావజాలంతో వీరిని ఏకం చేసే ప్రయత్నం చేయాలి. అలాగే, దళితుల్లో కూడా కొంతమంది సాంఘిక, ఆర్థిక ప్రయోజనాల్ని పొందడంలో ముందున్న వాస్తవాన్ని అంగీకరించాలి. అప్పుడే అంబేద్కర్ ఆశించిన బుద్ధిజం ఆచరణలో కనిపిస్తుంది. కులం, మతం వల్ల పీడింపబడుతున్న వాళ్ళంతా అంబేద్కరిజానికి ఆకర్శితులవుతారు. కానీ, దళితులంటే ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీలు, స్త్రీలు అని చెప్పినంత సులువుగా వీళ్ళందరినీ దళితుల అవకాశాల్ని సమనంగా అందుకోవడంలో అంబేద్కరిస్టులు పాటుపడుతున్నారా? ఒక వేళ అలా పాటు పడకపోతే భారతదేశంలో అంబేద్కర్ తాత్త్విక భావజాలమే దళితసాహిత్యానికి ప్రధానమెలా అవుతుంది?

సమకాలీన దళిత ఉద్యమం, దళిత సాహిత్యోద్యమాల్లో 'బహుజన తాత్త్వికత' పట్ల ఇంకా స్పష్టతరావడం లేదు. భవిష్యత్తులో దీని పట్ల స్పష్టత రావాల్సి ఉంది. దీనితో పాటు రాహుల్ మరణానంతరం జరిగిన సామాజికఉద్యమంలో మార్క్సిస్టుల పాత్రను కూడా విస్మరించలేం. ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న ప్రపంచీకరణ ప్రభావాన్ని కేవలం అంబేద్కర్ ఆత్మగౌరవ పోరాటాలు, ఆ తాత్త్విక భావజాలం మాత్రమే ముందుకు తీసుకెళ్ళగలుగుతుందో లేదో చర్చించుకోవాల్సిన అవసరం ఉంది. వర్గానికి ప్రాధాన్యాన్నిచ్చినా, మతోన్మాదశక్తుల కంటే ప్రమాదకరం కాని మార్క్సిస్టుభావజాలాన్ని కూడా భవిష్యత్తులో కూడా దళిత ఉద్యమం, దళిత సాహిత్యోద్యమం మిత్రవైరుధ్యంతోనైనా స్వీకరించాల్సివస్తుందనిపిస్తుంది. మార్క్సిస్టులుగా భారతదేశంలో ఉన్నవాళ్ళు కులాన్ని దరికి చేరనీయకపోవచ్చు; కానీ, మార్క్సిస్టు భావజాలం కులపీడనను వ్యతిరేకించదని గ్రహించాల్సిన అవసరం ఉందనుకుంటున్నాను.

(దళిత-ఆదివాసీ అధ్యయన, అనువాద కేంద్రం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వారు "దళిత చైతన్యం-సాహిత్య, సాంస్కృతిక రంగాలు: భవిష్యత్తు సవాళ్ళు" అనే అంశంపై రెండురోజుల పాటు 2016 మార్చి 19-20 తేదీల్లో నిర్వహించిన జాతీయసదస్సులో సమర్పించిన పరిశోధన పత్రం)

'శోభా' యమహాసం...

పి.సుమతి, లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశాఖపట్నం

విశాఖలో పద నర్తన....

నాట్య కళా రూపాలలో ఆంధ్రులకు చెందిన విశిష్ట కళ 'కూచిపూడి'. ఈ రంగానికి జీవితాన్ని అంకితం చేసి, ఆ కళకు విశేష ఖ్యాతి తెచ్చిపెట్టిన విలక్షణ విదుషీమణి శోభానాయుడు. కూచిపూడికి పర్యాయపదంగా నిలిచిన ఈ కళాకారిణి కన్నుమూశారు. కూచిపూడి కళారంగానికి ఇది పూడ్చలేని లోటు. ఉద్దండులైన నాట్యాచార్యులు కూచిపూడి నాట్యానికి వన్నెచిన్నెలు అద్దారు. ఆ కోవలో వికసించిన ఈ కొమ్మ కొత్త శోభలు అందించారు. సుప్రసిద్ధులైన వెంపటి చిన సత్యం శిష్యులలో ఒక తరాన్ని శోభానాయుడు శాసించారు. ఈమె ఎందరో శిష్యులను తయారుచేసి కొత్త తరాలకు ఈ కళా వారసత్వాన్ని అందించారు. కూచిపూడి నాట్య రూపకాలను ఒకప్పుడు మగవారు మాత్రమే పోషించేవారు. ఆ తెరలను దించి ఆడవారికి కూడా ఈ కళను అందించిన ఘన నాట్యాచారులలో వెంపటివారు సిద్ధహస్తులు, ప్రసిద్ధులు. సిద్ధేంద్ర యోగి పుణ్య ప్రసాదంగా భావించే ఈ కళామతల్లికి నర్తన ద్వారా అర్చనచేసిన వారిలో ప్రతిభాశోభామూర్తి శోభానాయుడు. ఈ రంగంలోకి రావడానికి తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపకపోయినా, వారిని ఒప్పించి, ఈ విద్యలోకి వచ్చి రాణించిన ప్రజ్ఞాసుశోభితురాలు శోభానాయుడు. విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో ఈమె జన్మించారు. మొదటిగా రాజమహేంద్రవరంలో పి ఎల్ రెడ్డి దగ్గర నాట్య విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. తర్వాత వెంపటి చినసత్యం వద్ద సంపూర్ణంగా శిక్షణ పొందారు. ఇంత గొప్ప గురువు దొరకడంతో ఈమె విద్య మరింతగా వికసించింది. దాదాపు 12సంవత్సరాల పాటు కఠోరమైన సాధన చేశారు. నాట్య రంగంలో ప్రవేశించినప్పుడు సహనాన్ని సాధన చెయ్యమని గురువు చెబుతారు. ఇదే విద్యార్థికి అందించే తొలిపాఠం. సహన సాధనతో సాధించిన ఈ విద్య శోభానాయుడుకు గురువు వెంపటి చినసత్యం నుండి ప్రశంసలు, ఆశీస్సులు చిరకాలంలోనే సంపాదించి పెట్టాయి. చిన్న

వయస్సులోనే ప్రధాన భూమికలు పోషించే సౌభాగ్యం ఈమెకు దక్కింది. గురువు వెంపటివారితో కలిసి దేశవిదేశాల్లో వందలాది ప్రదర్శనలు ఇచ్చే అదృష్టం కూడా ఈమెను వరించింది. సహజ ప్రతిభ, గురు శుశ్రూష, కఠోరమైన సాధన, అంకితభావం, భక్తి మొదలైన సుగుణాల వల్ల చిన్న వయస్సులోనే ఈమెకు పెద్ద పేరు వచ్చింది. బృందంలోనూ, బృందంతోనూ, సోలో గానూ వేల ప్రదర్శనలు ఇచ్చారు. శాస్త్రాన్ని నూటికి నూరు శాతం పాటిస్తూ, అపురూపమైన హావభావాలతో, లాస్య విన్యాసం చేస్తూ ఆమె ఇచ్చిన ప్రదర్శనలు కోట్లాదిమందిని విశేషంగా ఆకర్షించాయి. సత్యభామ, పద్మావతి, చండాలిక పాత్రలలో ఆమె పోషించిన తీరు ముగ్ధమనోహరంగా, హృదయోల్లాసంగా, రసరంజితంగా ఉండేవి. తను ఎంతో ఇష్టపడి కష్టపడి నేర్చుకున్న ఈ విద్యను వందలాదిమందికి అందించడంలోనూ సిద్ధహస్తులుగా నిలిచారు. కూచిపూడి ఆర్ట్ అకాడమీ ప్రిన్సిపాల్‌గా అందించిన సేవలు మరువలేనివి. ఈమె నృత్య దర్శకత్వంలో ఎన్నో రూపకాలు రూపు దాల్చుకున్నాయి. ఎన్నో సోలో ప్రదర్శనలు, బాలెట్స్ ఎన్నో వేదికలపై అందించారు. భారతదేశం తరపున ప్రపంచంలోని అనేక దేశాలలో నిర్వహించిన సాంస్కృతిక వేదికలపై తెలుగువారికి చెందిన కూచిపూడిని ప్రదర్శించి, ఈ కళారూపానికి అఖండఖ్యాతిని తెచ్చిపెట్టారు. వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి, వేదాంతం రాఘవయ్య, వేదాంతం పెద్దసత్యం, వేదాంతం చినసత్యం వంటి మహనీయులు విప్లవాత్మకంగా, స్త్రీలు కూడా కూచిపూడి రూపకాలు అందించడానికి తెరదీస్తే, ఆ తెరకు వెండివెలుగులు అద్దిన కళాకారిణులలో నాలుగు దశాబ్దాలుగా అగ్రశ్రేణిలో వెలుగొందిన కళాకారిణి శోభానాయుడు. ఆమె కీర్తికిరీటంలో ఎన్నో బిరుదులు, పురస్కారాలు, సత్కారాలు చేరాయి. ఎప్పుడో 20ఏళ్ళ క్రితమే 2001లో పద్మశ్రీ పురస్కారం పొందారు. సంగీత నాటక అకాడమీ పురస్కారం కూడా ఆమెను వరించింది. నృత్య చూడామణి, నృత్య కళా శిరోమణి వంటి బిరుదులు ఎన్నో అందాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'హంస' పురస్కారంతో ఈమెను ఘనంగా గౌరవించింది. నృత్యంలో, నృత్తంలో (పలుకులో) విశేష ప్రతిభతో విరాజిల్లి, మన కూచిపూడి కళను శోభాయమానంగా భారతీయనాట్య కళల సరసన సింహాసనాధిపతిని చేసిన ప్రముఖులలో శోభానాయుడు స్థానం చిరస్మరణీయం. కూచిపూడికి కొంగ్రొత్త శోభలద్దిన శోభానాయుడు ఆరు పదుల ప్రాయంలోనే నటరాజ సన్నిధికి చేరారు. ఆమె తీర్చిదిద్దిన శిష్యులు ఎందరో ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. ఆమె నెలకొల్పిన సంప్రదాయాన్ని, వారసత్వాన్ని నిలబెట్టి, రేపటి తరాలకు అందించడమే వారు ఇవ్వాల్సిన నిజమైన నివాళి. తెలువారి తలపులలో శోభానాయుడు పదకదలికలు ఎప్పటికీ నర్తన చేస్తూనే ఉంటాయి, అందెల రవళులు అనంతంగా వినిపిస్తూనే ఉంటాయి.



బీహార్ పోరు...

బీహారీల చిత్రమైన తీర్పు ఈ సారి ఎలా ఉంటుందో..!

జె.రత్నకుమార్,ఎం.ఎ.,బిఎల్

దేశంలో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత, కొంత విరామంతో రాజకీయ పార్టీలను కొత్త పరీక్షలకు గురి చేసే ఎన్నికలు బిహార్ అసెంబ్లీ ఎన్నికలు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు జరిగిన వెంటనే రాజస్తాన్, మహారాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతాయి. జనాలు లోక్‌సభ ఎన్నికల మూడ్ నుంచి పూర్తిగా బయటకు రాకమునుపే ఆ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. అవి పూర్తైన దాదాపు ఏడాదికి బీహార్ అసెంబ్లీ జనరల్ ఎలక్షన్స్ షెడ్యూల్ ఉంటుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి బీహార్ ఎన్నికలు తొలి ఛాలెంజ్ లాంటివి!

గతంలో ఈ చాలెంజ్‌ను తీసుకుని ఓడిన వాళ్లలో రాహుల్ గాంధీ, నరేంద్రమోడీ లాంటి వారున్నారు. 2009 లోక్‌సభ ఎన్నికల తర్వాత జరిగిన బీహార్ అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలను ప్రిస్టేజ్ ఇష్యూగా తీసుకున్నాడు రాహుల్ గాంధీ.

అప్పట్లో రాహుల్ ప్రధాని కావాలనే డిమాండ్ కాంగ్రెస్ నుంచి మొదలైంది. ఆ పరిస్థితుల్లో బీహార్ లో పార్టీని గెలిపించి సత్తా చాటాలని రాహుల్ ఉబలాటపడ్డాడు. అయితే ఆయన ఆ విషయంలో ఫెయిల్ అయ్యాడు. రాహుల్ కు రాజకీయంగా తగిలిన తొలి ఎదురుదెబ్బ అది!

ఆ తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో సంచలన విజయం సాధించిన మోడీకి బీహారీలు షాక్ ఇచ్చారు. 2015లో జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చిత్తయ్యింది. ఆ ఎన్నికల్లో ఆర్జేడీ, జేడీయూలు కలిసి పోటీ చేశాయి.

బీహార్‌లో పార్టీని గెలిపించడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేశారు మోడీ. బీహార్ బాగు కోసం ఆర్థిక ప్యాకేజీ అంటూ.. ఎన్నికల ప్రచార సభలో ఆయన వేలం పాట పాడారు. బీహార్ కు ఎన్ని వేల కోట్లు కావాలంటూ.. మోడీ వేలం పాట పాడి లక్షల కోట్ల ప్యాకేజీ అనౌన్స్ చేశారు. ఆ ప్రచారం పూర్తిగా ప్రహసనం అయ్యింది. బీహార్ ఎన్నికల్లో బీజేపీ చిత్తయ్యింది. అంతకు ముందు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పట్టంగట్టిన బీహారీలు అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీని చిత్తు చేశారు. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో అయితే.. బీహార్ లో బీజేపీ కూటమి స్వీప్ చేసింది. బీజేపీ, జేడీయూ, ఎల్జేపీలు సంచలన విజయాలను సాధించాయి. ఆర్జేడీ, కాంగ్రెస్ కూటమి చిత్తయ్యింది. కాంగ్రెస్ ఒక్కటంటే ఒక్క సీట్లో గెలిస్తే, ఆర్జేడీ లోక్‌సభలో ప్రాతినిధ్యాన్నే కోల్పోయింది!

అలాగని ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో అలాంటి ఫలితాలే వస్తాయని చెప్పడానికి లేదు. లోక్‌సభలో బీహార్ నుంచి ఆరు ఎంపీ సీట్లను కలిగిన ఎల్జేపీకి బీహార్ అసెంబ్లీలో ఉన్న సీటు ఒక్కటంటే ఒక్కటి! గత రెండు పర్యాయాలుగా.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు పరస్పర విరుద్ధమైన ఫలితాలను ఇస్తున్నారు బీహారీలు.

ఈ సారి బీజేపీ, జేడీయూలు కూటమిగా వెళు తున్నాయి. ఎల్జేపీ సోలోగా పోటీ చేస్తూ ఉన్నా.. అదంతా బీజేపీ వ్యూహం ప్రకారమే అనే అభిప్రాయాలున్నాయి. దళితుల ఓట్లను చీల్చడానికి ఎల్జేపీ సోలోగా పోటీ చేస్తోందని విశ్లేషకులు అంటున్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్ లు కమ్యూనిస్టు పార్టీలతో కలిసి తమ లక్ ను పరీక్షించుకుంటున్నాయి.

ఏకంగా 30 లక్షల మందికిపైగా వలస కూలీలను కలిగిన రాష్ట్రం బీహార్. కరోనా పరిస్థితుల్లో బాగా ఇబ్బంది పడిన వర్గం అది. ఇలాంటి నేపథ్యంలో కరోనా విషయంలో కేంద్ర ప్రభుత్వ పనితీరుకు కూడా బీహార్ ఎన్నికలు ఒక పరీక్ష లాంటివి కాబోతున్నాయి.

నితీశ్ నాలుగోసారి?

ఎన్డీయేకి కరోనా పరీక్ష

సానుభూతి పవనాలు చిరాగ్ పాస్వన్‌కు కలిసొచ్చేనా?

యువతరం తేజస్వి యాదవ్ (లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు) వైపు ఉంటుందా?

ఇన్నాళ్లూ ముఖాముఖి పోరు అనుకున్నారు.. హఠాత్తుగా ముక్కోణపు పోటీకి తెరలేచింది.. దళిత నేత రామ్‌విలాస్ పాశ్వాన్ మరణం.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల లెక్కల్ని మారుస్తోంది.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇమేజ్‌ని నమ్ముకొని ఎన్డీయే.. యువ శక్తిపై విశ్వాసం ఉంచి ఆర్‌జేడీ, కాంగ్రెస్ కూటమి.. సానుభూతి పవనాలను నమ్ముకొని చిరాగ్ పాశ్వాన్ ఎల్‌జేపీ.. బీహార్ ఎన్నికల బరిని వేడెక్కిస్తున్నారు.

కరోనా నేపథ్యంలో దేశంలో జరుగుతున్న తొలి ఎన్నికలివి.. నితీశ్ కుమార్ వరసగా నాలుగోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఎన్నికలివి. లాలూ ప్రసాద్ యాదవ్ ప్రచారం చేయకుండా జరిగే మొట్టమొదటి ఎన్నికలు కూడా ఇవే. కేంద్రంలో అధికార బీజేపీ వరసగా ఒక్కో రాష్ట్రాన్ని కోల్పోతున్న తరుణంలో జరుగుతున్న ఈ ఎన్నికలు రాజకీయంగా కాక పుట్టిస్తున్నాయి. హ్యాట్రిక్ సీఎం నితీశ్ కుమార్‌కి ఈ ఎన్నికలు అగ్నిపరీక్షలాంటివి. అధికార వ్యతిరేకతకు ఎదురొడ్డి నాలుగోసారి సత్తా చాటడం అంత సులభం కాదు. పోలింగ్‌కు కొద్ది రోజుల ముందే రాష్ట్రంలో దళిత దిగ్గజ నేత, లోక్‌జనశక్తి పార్టీ వ్యవస్థాపకుడు రాంవిలాస్ పాశ్వాన్ మృతి చెందడంతో రాజకీయం రంగులు మార్చుకుంటోంది.

పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ ఒంటరిగా పోటీ చేయడానికి సిద్ధమని ప్రకటించడంతో పాటు జేడీ(యూ) అభ్యర్థులపై ఎల్‌జేపీని బరిలోకి దింపనున్నారు. బీజేపీతో స్నేహాన్ని కొనసాగిస్తూనే నితీశ్ కుమార్‌ని ఢీ కొడుతున్నారు. అయిదు జిల్లాల్లో పాశ్వాన్ ప్రభావం నితీశ్ జేడీ(యూ)ని దెబ్బ కొడుతుందనే అంచనాలున్నాయి. మరోవైపు ఆర్‌జేడీ, కాంగ్రెస్ మహా బంధన్ కూటమి సీఎం అభ్యర్థి, లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడు తేజస్వి యాదవ్ యువకుడు. తండ్రి ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నప్పటికీ యువతరం ఓట్లను కొల్లగొట్టేలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. వలసలు, వరదలు, నిరుద్యోగం వంటి అంశాలను లేవనెత్తుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు.

మోదీకే ప్రతిష్టాత్మకం

ఈసారి బీహార్ ఎన్నికల్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నితీశ్ కుమార్ అధికార వ్యతిరేకతకు తన చరిష్మాతో చెక్ పెట్టడానికి వ్యూహరచన చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఏ రాష్ట్రానికీ ఇవ్వనన్ని ప్రాజెక్టులు బీహార్ బాట పట్టించారు. దర్భాంగాలో ఎయిమ్స్ ఏర్పాటు, రూ.541 కోట్లతో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మూడు పెట్రోలియం ప్రాజెక్టులు, దేశంలో తొలి కిసాన్ రైలు వంటివెన్నో ఉదారంగా రాష్ట్రానికి ఇచ్చేశారు. నితీశ్ సీఎం అభ్యర్థిగా ముందు ఉన్నప్పటికీ ఎన్డీయేకి తిరిగి అధికారంలోకి వచ్చే బాధ్యతని మోదీ తన భుజస్కంధాల మీద వేసుకున్నారు. "బీహార్ ఎన్నికలు ప్రధాని మోదీకే ఎక్కువ ముఖ్యమైనవి. ఒక రకంగా చెప్పాలంటే లాక్‌డౌన్‌కి రిఫరెండంలాంటివి. అందుకే ఎలాగైనా ఈ ఎన్నికల్లో నెగ్గాలని మోదీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు"అని బీహార్ ఎన్నికల విశ్లేషకుడు సౌరర్ అహ్మద్ వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో ప్రభావం చూపించే అంశాలు

బీహార్‌లో పారిశ్రామికీకరణ జరగకపోవడంతో నిరుద్యోగ సమస్య ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది. కోవిడ్ సంక్షోభం నేపథ్యంలో రాష్ట్రంలో నిరుద్యోగం 10.2 శాతానికి చేరుకుంది. ఇప్పటికే ఆర్‌జేడీ, కాంగ్రెస్ మహాబంధన్ తాము అధికారంలోకి వస్తే 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. కోవిడ్ సంక్షోభం ఈ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనాని ఎంత సమర్థంగా ఎదుర్కొన్నాయో ఈ ఎన్నికల ఫలితాలు తేలుస్తాయని ఎన్నికల విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది దేశవ్యాప్త లాక్‌డౌన్ తర్వాత ఎక్కడా ఉపాధి అవకాశాల్లేక 30 లక్షల మంది వలస కార్మికులు తిరిగి సొంత రాష్ట్రానికి చేరుకున్నారు. ప్రస్తుతం అందరికీ పని కల్పించే పరిస్థితులు లేవు. ఈ సారి కాంగ్రెస్, ఆర్‌జేడీ కూటమి వలసల అంశానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంలో కొత్తగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు ఎన్నికల అంశంగా మారాయి. అయితే పంజాబ్, హరియాణాల మాదిరిగా రైతు సంఘాలు ఎక్కువగా రాష్ట్రంలో లేవు. ఈ చట్టాలు రైతులకు బేరమాడే శక్తిని పెంచుతాయన్న ఎన్డీయే వాదనని అన్నదాతలు ఎంతవరకు విశ్వసిస్తారో చూడాలి. బీహార్ ఓటర్లలో 16శాతం మంది ఉన్న దళితులు ఈసారి ప్రధానపాత్ర పోషిస్తారు. దళిత నాయకుడు రామ్‌విలాస్ పాశ్వాన్ మరణంతో సానుభూతి పవనాలు ఆయన కుమారుడు చిరాగ్ పాశ్వాన్‌కు ఎంతవరకు కలిసొస్తాయా అన్న చర్చ జరుగుతోంది.



మేలిముత్యం

రాజకీయాల్లో పాల్గొనకపోవడం వల్ల పడే శిక్ష ఏమిటంటే.. నీకంటే తక్కువ వాళ్లు నిన్ను పాలిస్తారు.

– ప్లేటో

రాజకీయ వాతావరణ శాస్త్రవేత్త రాంవిలాస్ పాశ్వాన్

కె.రాజా

దళిత అగ్రనేత రాం విలాస్ పాశ్వాన్ 1969 తొలిసారిగా అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మొదట ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా (డిఎస్పీ) ఒదులుకుని, 1977 ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడారు. తరువాత జనతా పర్టీలో చేరారు. సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభకు పోటీ చేసి 4,24,000 మెజార్టీతో గెలిచి ప్రపంచలోచే అత్యదిక ఓట్లతో నెగ్గిన వ్యక్తిగా గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డును సంపాదించారు. బీహార్‌లో హాజీపూర్ నియోజకవర్గం నుండి పది మార్లు పోటీ చేసి ఎనిమిది మార్లు విజయం సాదించారు. మొదటి 1989లో విశ్వనాధ్ ప్రతాప్ సింగ్ ప్రభుత్వంలో (నేషన్ ఫ్రెంట్) గవర్నమెంట్‌లో కేంద్ర కార్మిక, సాంఘీక సంక్షేమ మంత్రివర్యులుగా పనిచేశారు. 1996లో రైల్వే మంత్రిగా, 1999లో కేంద్ర టెలీ కమ్యూనికేషన్ మంత్రిగా, 2000సంవత్సరంలో లోక్ జనశక్తి పార్టీని స్థాపించారు. 2001 బొగ్గు శాఖ మంత్రిగా, 2014లో యుపిఎ గవర్నమెంట్‌లో కేంద్ర ఎరువులు, రశాయనాలు, ఉక్కు శాఖ మంత్రిగా పనిచేశారు.ఆరుగురు ప్రధానమంత్రులు దగ్గర పనిచేయడం జరిగింది. ఒక పీవీ నర్సింహరావు, రెండవ సారి యుపీఏ గవర్నమెంట్‌లో మన్మోహన్‌సింగ్ నేత్రుత్వంలో తప్ప మిగతా ప్రధానమంత్రులవద్ద పనిచేయశారు. పాస్వన్ చనిపోయేముందు. ఎన్‌డీఏ గవర్నమెంట్‌లో కేంద్ర ఆహార, వినియోగ వ్యవహారల మంత్రిగా పనిచేశారు. 1985లో కారంచేడు సంఘటన (ఎస్సీల మీద దాడి) తరువాత 1995 చుండూరు ఎస్సీల మీద దాడి సంఘటనలో ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఆధ్వర్యంలో కలిసి పనిచేయడం జరిగింది. 1989 ఎస్సీ, ఎస్టీ హత్యాచార నిరోదక చట్టం అమల్లోకి తీసుకురావడంలో రాం విలాస్ పాస్వన్ కృషి మరువలేనిది. 1991 విశ్వనాధ్ ప్రతాప్ సింగ్ ప్రధానిగా ఉన్న కాలంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబెద్కర్‌కు భారత రత్న అవార్డు రావటానికి ప్రయత్నం చేసారు. ఆయన మరణం నిరుపేదలు మరియు దళిత జాతికి తీరని లోటు.

దళిత దిగ్గజం, లోక్ జన్ శక్తి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, కేంద్రమంత్రి రామ్ విలాస్ పాశ్వాన్ ఢిల్లీలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అక్టోబర్ 8న మృతి చెందారు.రామ్ విలాస్ పాశ్వాన్ 1946 సంవత్సరం జులై 5వ తేదీన బీహార్ లోని ఖగారియా జిల్లా షహర్బానీ ప్రాంతంలో జన్మించారు. దళిత కుటుంబంలో జన్మించిన పాశ్వాన్ న్యాయవిద్యను అభ్యసించారు. చిన్నప్పటి నుంచి పాశ్వాన్ కు రాజకీయాలంటే అమితమైన ఆసక్తి. 22 సంవత్సరాల వయస్సులోనే డీఎస్పీగా పాశ్వాన్ కు ఉద్యోగం వచ్చింది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకోవడానికి ఎవరూ ఇష్టపడరు.

స్నేహితులు, కుటుంబ సభ్యులు డీఎస్పీ ఉద్యోగంలో చేరాలని సూచించినా పాశ్వాన్ మాత్రం సోషలిస్ట్ భావాలతో రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. సంయుక్త సోషలిస్ట్ పార్టీలో చేరి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన పాశ్వాన్ ఆ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం

సాధించారు. ఆ తర్వాత ఎమర్జెన్సీ సమయంలో జైలు జీవితం గడిపి అనంతరం జనతా పార్టీలో చేరారు. జనతా టికెట్ తో 1977లో బీహార్ లోని హజ్‌పూర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

ఆ తరువాత కూడా అదే నియోజకవర్గం నుంచి లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేసిన పాశ్వాన్ ఎనిమిదిసార్లు గెలిచారు. పాశ్వాన్ పేరుపై ప్రపంచ రికార్డు కూడా ఉంది. 1977లో 4.24 లక్షల మెజార్టీతో గెలిచి పాశ్వాన్ ప్రపంచ రికార్డును సృష్టించారు.ప్రపంచ దేశాల్లో ఏ నాయకుడు పాశ్వాన్ స్థాయిలో మెజారిటీని పొందలేదు. దేశవ్యాప్తంగా ఉన్న దళితుల ఆకాంక్షలకు చిహ్నంగా వారి అభ్యున్నతే లక్ష్యంగా పాశ్వాన్ కృషి చేశారు. 1989లో విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ మంత్రివర్గంలో కార్మిక శాఖా మంత్రిగా, 1996లో దేవెగౌడ మంత్రి వర్గంలో రైల్వే మంత్రిగా పాశ్వాన్ పనిచేశారు.

2000 సంవత్సరంలో పాశ్వాన్ కొందరు నాయకుల మద్దతుతో లోక్‌జనశక్తి పార్టీ(ఎల్జేపీ)ని స్థాపించారు. 2004లో యూపీఏ కూటమిగా చేరి పాశ్వాన్ ఎరువులు, రసాయన శాఖ, ఉక్కు మంత్రిగా పని చేశారు. ఫిబ్రవరి 2005 బీహార్ రాష్ట్ర ఎన్నికలలో పాశ్వాన్ పార్టీ లోక్ జనశక్తి పార్టీ భారత జాతీయ కాంగ్రెస్ పార్టీతో కలసి ఎన్నికల్లో పోటీ చేసింది. ఫలితం ఏమిటంటే ఏ ప్రత్యేక పార్టీ లేదా కూటమికి స్వయంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల సీట్లు లభించలేదు. ఏదేమైనా పాశ్వాన్ చాలా అవినీతిపరుడని ఆరోపించిన లాలూ ప్రసాద్ యాదవ్ లేదా వామపక్షాలు నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్‌కు మద్దతు ఇవ్వడానికి నిరాకరించాయి. తద్వారా ప్రతిష్టంభన ఏర్పడింది. పాశ్వాన్ పార్టీలోని 12 మంది సభ్యులను మద్దతు కోసం ఒప్పించడంతో నితీష్ కుమార్ విజయవంతం కావడంతో ఈ ప్రతిష్టంభన తొలగింది. బీహార్ గవర్నర్ బుటాసింగ్ లోక్ జనశక్తి పార్టీ ఫిరాయింపుదారుల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడకుండా ఉండటానికి రాష్ట్ర శాసనసభను రద్దు చేసి కొత్తగా ఎన్నికలకు పిలుపునిచ్చాడు. బీహార్ ను రాష్ట్రపతి పాలనలో ఉంచారు. నవంబర్ 2005 బీహార్ రాష్ట్ర ఎన్నికలలో పాశ్వాన్ యొక్క మూడవ కూటమి పూర్తిగా నాశనమైంది లాలూ ప్రసాద్ యాదవ్-కాంగ్రెస్ కూటమి మైనారిటీకి వెళ్ళింది. ఎన్.డి.ఏ. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కేంద్రంలో ఎక్కువ ప్రభుత్వాల్లో మంత్రిగా ఉన్న పాశ్వాన్ చాలా ప్రభుత్వాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన్ను రాజకీయ వాతావరణ శాస్త్రవేత్తగా కూడా చెబుతారు.

రామ్ విలాస్ పాశ్వాన్ అనే పేరు దేశ ప్రజలకు మొదట 1977 ఎన్నికల్లో వినిపించింది. బీహార్‌లో ఒక నేత అత్యధిక ఓట్ల తేడాతో గెలిచి గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కారని అప్పుడు వార్త వచ్చింది.

ఆ ఎన్నికల్లో రాంవిలాస్ పాశ్వాన్ జనతా పార్టీ అభ్యర్థిగా హాజీపూర్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిపై దాదాపు నాలుగు లక్షల 25 వేల ఓట్ల తేడాతో ఓడించారు. మొదటిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు.

దానికి ఎనిమిదేళ్ల ముందు పాశ్వాన్ ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. కానీ 1977లో విజయంతో పాశ్వాన్ జాతీయ నేత అయ్యారు. తర్వాత నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. పాశ్వాన్ 9 సార్లు ఎంపీగా ఉన్నారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో 1984, 2009లో మాత్రమే ఆయన ఓటమి చవిచూశారు.

1989 తర్వాత పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ రెండోసారి యూపీఏ సర్కారు ఏర్పాటు చేసినప్పుడు మినహా ఆయన ప్రతి ప్రధానమంత్రి మంత్రివర్గంలో మంత్రి పదవి పొందారు.

థర్డ్ ఫ్రంట్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన పాశ్వాన్, కాంగ్రెస్ నేతృత్వంలో యూపీఏ సర్కారులో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కూడా మంత్రి పదవుల్లో ఉన్నారు.

విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ నుంచి నరేంద్ర మోదీ వరకూ ఆరుగురు ప్రధానమంత్రుల దగ్గర మంత్రిగా పనిచేసిన ఏకైక రాజకీయ నేత పాశ్వాన్ ఒక్కరే.

ఆయన ప్రతిసారీ మంత్రిగా తన స్థానాన్ని పదిలం చేసుకోవడంపై ఒకప్పటి ఆయన సహచరుడు, తర్వాత రాజకీయ ప్రత్యర్థిగా మారిన లాలూ ప్రసాద్ యాదవ్ పాశ్వాన్‌పై చురకలు వేశారు. ఆయన్ను వ్యంగ్యంగా రాజకీయ 'వాతావరణ శాస్త్రవేత్త'గా వర్ణించారు.

ఒక్కసారి తప్పిన అంచనా

ఆయన, తన మొత్తం రాజకీయ జీవితంలో ఒక్కసారి మాత్రం రాజకీయ పవనాలను సరిగా అంచనా వేయలేకపోయారని భావిస్తారు.

2009లో ఆయన కాంగ్రెస్‌కు దూరమై లాలూ చేయందుకున్నారు. తను రికార్డు మెజారిటీతో గెలిచిన హాజీపూర్ స్థానంలోనే ఓటమి పాలయ్యారు. కానీ ఆయన ఆ పొరపాటును త్వరగానే సరిదిద్దుకోగలిగారు. బీహార్ రాష్ట్ర ఎన్నికలు కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపవని, ఈ ప్రభుత్వం అతనితో పాటు లాలూ ప్రసాద్ యాదవ్ మంత్రులుగా కొనసాగుతుందని పాశ్వాన్ ప్రకటించాడు. లోక్‌సభ ఎన్నికల్లో హజీపూర్ నుంచి 10సార్లు పోటీ చేసి ఎనిమిది సార్లు గెలిచిన పాశ్వాన్ 2010లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2019లో వివిధ కారణాల వల్ల లోక్‌సభకు పోటీ చేసే అవకాశం లేకపోవడంతో ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు.

పాశ్వాన్ అటు యూపీఏ ప్రభుత్వంలోనూ, ఇటు ఎన్డీఏ ప్రభుత్వంలోనూ కీలక నేతగా వ్యవహరించారు. రాజకీయ విశ్లేషకులు ఆయన దళిత సంఘాలకు పెద్ద దిక్కుగా వ్యవహరించారని చెబుతూ ఉంటారు. పాశ్వాన్ బీఎస్పీ లేదా అంబేద్కర్‌లా దళితుల కోసం ఎలాంటి ఉద్యమాలూ చేయలేదు. కానీ, ఆయన దళితులకు రాజ్యాంగం, చట్టంలో కల్పించిన హక్కులకు ఎప్పుడు భంగం కలిగినా, దానిపై ఓపెన్‌గా మాట్లాడేవారు.

పాశ్వాన్‌ను చాలా సమర్థుడైన దళిత నేతగా కూడా బావించేవారు. బీఎస్పీ వేగంగా ఎదిగింది. అలా దళితుల జీవితాలను కూడా ప్రభావితం చేసింది. కానీ, అది అవినీతిలో కూరుకుపోయింది. జాతి అసమానతలను పెంచింది. పాశ్వాన్ రాజకీయాల్లో అలా ఎప్పుడూ జరగలేదు. మరికొన్ని రోజుల్లో బీహార్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాశ్వాన్ మృతి ఎల్జేపీ పార్టీకి తీరని దెబ్బ అనే చెప్పాలి.

ఖగాడియా జిల్లా షహర్బానీలో సియాదేవి, జమున్ పాశ్వాన్ దంపతులకు జన్మించిన పాశ్వాన్ రాజకీయాల్లో తిరుగులేని ప్రయాణాన్ని కొనసాగించారు. పాశ్వాన్ మొదట రాజ కుమార్ దేవిని వివాహం చేసుకుని ఇద్దరు కుమార్తెలు జన్మించిన తరువాత ఆమెకు విడాకులిచ్చారు. అనంతరం పాశ్వాన్ రీనాశర్మను వివాహమాడగా వీరికి కొడుకు, కూతురు ఉన్నారు. సూటు బూటు దళిత నేత రామ్ విలాస్ పాశ్వాన్ కుటుంబంతో పాటూ ఆయన స్టైల్ గురించి కూడా చర్చల్లో నిలుస్తుంటుంది.

తను నాయకుడుగా ఉన్న సమాజంలో ఆయన తనకంటూ ఒక జీవన శైలిని ఏర్పరుచుకున్నారు. ముఖ్యంగా ఆయన దుస్తుల శైలి.

చాలామంది రామ్ విలాస్ పాశ్వాన్‌ను తన 'ఫైవ్ స్టార్ దళిత నేత' ఇమేజ్ గురించి అడిగినపుడు ఆయన చిరాకు పడేవారు.

"దళితులు అంటే జీవితాంతం భిక్షమెత్తుకోవాలి అనేది మీ మానసికత. మేం ఆ పరిస్థితిని అధిగమిస్తున్నప్పుడు మీకు అంత కష్టం ఎందుకు" అని పాశ్వాన్ సమాధానం ఇచ్చేవారు.

రామ్ విలాస్ పాశ్వాన్ ఎవరు, ఆయన్ను ఎందుకు గుర్తుంచుకోవాలి అనే దాని గురించి ఒక విషయం. "రామ్ విలాస్ పాశ్వాన్ ఆదర్శ రాజకీయాలు చేయలేదు. కానీ, ఒక దళిత కుటుంబంలో పుట్టి, ఎవరి సాయం, ఏ కుటుంబ నేపథ్యం లేకుండానే అంత ఎత్తుకు ఎదిగారు అంటే, ఆయన ఏం చేయగలిగేవాడో, ఆయన సత్తా ఏంటో అది నిరూపిస్తుంది. రామ్ విలాస్ పాశ్వాన్: కొందరికి 'రాజకీయ వాతావరణ శాస్త్రవేత్త'.. మరికొందరికి 'సూటు బూటు దళిత నేత' ..అమరుడైన దళిత నేతకు అందరి నివాళి.

OoooO

మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా......

మోడు నుండే

పి.లక్ష్మణ్ రావ్ , అసిస్టెంట్ రిజిస్ట్రార్ ,సహకార శాఖ , విజయనగరం, 9441215989

మానసిక వత్తిడిని
వత్తిని చేసి
ఆత్మవిశ్వాసాన్ని చమురుగా పోసి
మనోధైర్యంతో
ఆశల దీపాల్ని వెలిగించాలి

రెప్పపాటులో
దుఃఖాన్ని మిగిల్చే కాలం
భవిష్యత్తులో సుఖమై వెలుగుతుంది!
నిన్న దుఃఖంతో కమ్మేసిన అమావాస్య
రేపటి పౌర్ణమై
వెన్నెల సంతోషం నింపుతుంది!

కాలం గుప్పిట్లో
మూసివున్న మొగ్గలమైన మనం
రేపటి సూర్యోదయంలో
పువ్వులమై వికసిస్తాం!

కాలం నిరంకుశమై
గాయం చేసినా
అనతి కాలంలోనే
నైపుణ్య వైద్యుడై
మరలా నయం చేస్తుంది

జలఖడ్గమై
తుఫాను ఝుళిపించే కాలం
ఆకుపచ్చని సంతకమై
ఆశలు రేకెత్తించడం రివాజే
శిశిరమై ఆకులు రాల్చే కాలం
వసంత రాగమై
పూలజల్లు కురిపించడం
మనకు తెలియంది కాదు
కష్టాల సుడిగుండం మాటున
సుఖాల జేగంటలెన్నిసార్లు
మ్రోగలేదు!
ఉలి దెబ్బలతోనే
శిల శిల్పమౌతుంది
కష్టాలు విజయానికి పరీక్ష
నష్టాలు గుండెనిబ్బరానికి చికిత్స

మట్టిని చీల్చుకుని
విత్తనం మొలకెత్తినట్లు
మోడు నుండే
ఊపిరి పోసుకొని
చిగురింత మొదలైనట్లు
వత్తిడిని జయించి
శిఖరమంత ఎత్తు ఎదగాలి

సూర్యునికి
శూన్యాకాశమే కదా ఆసరా!

ఆరోజులే వేరు...

గౌతం

నా చిన్నతనం అంటే షుమారు 50 సంవత్సరాలు వెనక్కి వెలితే.

ఆ రోజుల్లో గ్యాస్ లేదు.

వంటంతా కుంపటి, పొట్టు పొయ్యి , కట్టెల మీదే చేసేవారు.

వేడి నీళ్ళకు గీజర్ లు ఉండేవి కావు.

దొడ్లో వెనుక వైపు ఇటుకలు పేర్చి దాని మీద దేగిశా పెట్టి, కొబ్బరి డొప్పలు, కొబ్బరి మట్టలు వేసి పొయ్యి రాజేసి స్నానానికి నీళ్ళు కాచుకునేవారు, కావలసిన వారు. చాలా గ్రామాలకు కరెంటు సదుపాయం ఉండేది కాదు. సాయంత్రం నాలుగు అయ్యేసరికి లాంతరు , చిమ్నీలకు ముందు రోజు పట్టిన మసి ముగ్గుతో శుభ్రంగా తుడిచి, వత్తులు సరి చేసి, వాటి నిండా కిరోసిన్ పోసి చీకటి పడక ముందే వెలిగించటానికి సిద్ధం చేసుకునేవారు .

మాకు ఊహ తెలిసే నాటికి కరెంటు ఉన్నా రాత్రి పూట ప్రైవేటుకు వెళ్ళే సమయంలో లాంతరులు పట్టుకు వెళ్ళి అక్కడ వెలిగించి ఆ వెలుగులోనే చదువుకునే వాళ్ళం.

వేసవి కాలం పరీక్షల సమయంలో మేడ మీదకు వెళ్ళి చదువుకోవాలనుకునే సమయంలో మేడ మీద కరెంటు ఉండేది కాదు.

లాంతరు వెలిగించి మేడ మీదకు పట్టుకు వెళ్ళి ఆ దీపపు వెలుగులోనే చదువుకునే వాళ్ళం. ఈరోజుల్లో ఏసీలు గది గదికి ఫ్యానులు, కరెంటు పోతే Invertorలు .

ఈ సదుపాయాలు ఆ రోజుల్లో ఏవి?

శివరాత్రికి ముందే డాబా మీదకు వెళ్ళి పడుకునే వాళ్ళం.

దాదాపుగా దసరా వరకు మేడ మీదే పడకలు. ఇప్పటిలా ఒకరి మీద ఒకరు పడి పోతున్నట్లు ఇరుకుగా అంటుకునేవిధంగా ఇళ్ళు కట్టే వారు కాదు. అపార్ట్మెంట్ కల్చర్ ఆ రోజుల్లో లేదు. దాదాపుగా అన్నీ తాటాకు ఇళ్ళు, పెంకుటిళ్ళు, మండువా లోగిలి ఇళ్ళు.

అక్కడక్కడ కలిగిన వాళ్ళకు మాత్రమే ఉండే డాబాలు, రెండతస్థుల మేడలు.

ఇక మేడ మీదకు వెళ్ళి చాప దిండు వేసుకుని పడుకుంటే ప్రాణం ఎటు పోయేదో!

ప్రతి ఇళ్ళల్లోనూ చుట్టూరా కొబ్బరి చెట్లు , అరటి చెట్లు ,రకరకాల పూలు మరియు పళ్ళ చెట్లు ఉండేవి.

వాడుకున్న నీళ్ళన్నీ మొక్కలలోకి గాడి తీసి వదిలేవారు.

మొక్కలు ఆ వాడిన నీరు పీల్చుకుని, మరి ప్రత్యేకంగా నీరు పోయవలసిన అవసరం లేకుండా ఏపుగా ఎదిగేవి.

మురుగు లేదు కాబట్టి దోమలు తక్కువ.

ఇంక ఆ చెట్ల నుండి వీచే కమ్మని గాలికి నిద్రపోతున్న ప్రాణం ఎటు పోయేదో, ఉదయాన సూర్య భగవానుడు తన వేడి వాడి కిరణాలతో చుర్రు చుర్రు మని పించే దాకా మెలుకువ వచ్చేది కాదు.

ఈ రోజుల్లో దోమలకు, వాటి వల్ల వచ్చే రోగాలకు భయపడి , కిటికీలన్నీ తలుపులతో సహా మూసుకుని, జెట్‌లు, ఆలౌట్లు వెలిగించి, ఫ్యాన్ మరియు ఏసీ కూడా వేసుకుని ఆ పొగ మరియు ఈ ఏసీతో ఉక్కిరిబిక్కిరై ముక్కులు మూసుకు పోయి, ఉదయాన్నే నిద్ర లేవగానే ఈ కాలుష్యాల గాలులు పీల్చడం వలన, తల అంతా పట్టుకు పోయి ఉదయాన్నే ఏవరు దొరుకుతాడా ఎవడి మీద విరుచుకుపోదామా ? అనే రీతిన చికాకుగా తయారవుతున్నాము.

ఇంక భోజనాల విషయం...

కలిగిన వాళ్ళిళ్ళల్లో మాత్రమే ఉదయం కాఫీలు , టిఫిన్లు . అదికూడా పెద్దవారికి మాత్రమే!

మిగిలిన వాళ్ళందరికీ రాత్రి మిగిలిన చద్దన్నాలు , తర్వాణి అన్నాలే.

అమ్మమ్మ కాని, బామ్మ కాని వేసవి సెలవులకు వచ్చిన పిల్లలందరినీ తమ చుట్టూ కూర్చో పెట్టుకుని , మధ్యలో పెద్ద కంచం పెట్టుకుని ఆ చద్దన్నంలో కొత్తగా పెట్టిన కొత్తావకాయ బాగా నెయ్యి వేసి కలిపి ముద్దలు పెట్టేవారు. తర్వాత రాత్రి మిగిలిన చారు కాని పులుసు కానీ రాగిచిప్పలోనుండి తీసి చద్దన్నంలో కలిపి అందరికీ ముద్దలు పెట్టేవారు.అప్పుడు చాలామంది ఇళ్ళల్లో ఒకటో రెండో ఆవులో, గేదెలో ఉండేవి.

ఒక్కొక్కటి కనీసం శేరున్నర, రెండు శేర్లు పాలు ఇచ్చేది . వాడకానికి సరిపడా ఉంచుకోగా మిగిలిన పాలను పాడిలేని వారికి ఏదో ధర కట్టి పోసేవారు.

వంటంతా అయిపోయిన తర్వాత, బొగ్గుల మంట బాగా తగ్గాక, మట్టి కుండలో పాలు పోసి సన్నని మంటన ఎర్రగా దళసరిగా తొరక (మీగడి) కట్టేలా పాలు కాచి, పళ్ళెంలో నీళ్ళు పోసి బాగా కాచిన పాలకుండ అందులో పెట్టి, పాలు తోడు వేయటానికి అనువుగా ఉన్న వేడిలో పెరుగు బిళ్ళ వేసి తోడు పెట్టేవారు.

ప్రొద్దుటకల్లా ఆ పెరుగు గట్టిగా జున్ను ముక్కలా తోడుకునేది .

ఉదయాన్నే ఒక పొడవాటి కర్రకు పెరుగు చిలికే కవ్వం కట్టి కొద్ది నీళ్ళు పోసి కవ్వంతో వెన్న చిలికే వారు.

దాదాపుగా సవాశేరు అంటే 350 గ్రాముల వెన్న వచ్చేది.

ఆ వెన్న గట్టిగా గుండ్రంగా పెద్ద ముద్దలా చేసి, ఆ మజ్జిగ కుండలోనే వేసే వారు.

మధ్యాహ్నము దాకా ఆ వెన్న మజ్జిగలోనే తేలుతుండేది.

అలా కుండలో చేసిన మజ్జిగతో కాని , లేదా మీగడ పెరుగు వేసి కాని, చద్దన్నంలో ముద్దలు కలిపి , ఆవకాయ కలిపిన ముక్కలు కంచం అంచులతో తుంపి చిన్న చిన్న ముక్కలుగా చేసి మీగడ పెరుగు అన్నం ముద్దలో పైన నంచు కోవడానికి పెట్టి , అందరికీ పెట్టే వారు .

ఆహా !! ఏమి రుచి!!! వర్ణించ నా తరమౌనా ?

అంతరిక్షం నుంచి అధ్యక్షుడికి ఓటు

శ్రీ

ఓటు వేయడం అంటే మనకేం కావాలో అడగడం మాత్రమే కాదు.. ఏం వద్దో కూడా చెప్పడం. అసలు ఓటే వేయకపోతే? ఏమైనా చేసుకొమ్మని హక్కులన్నీ రాసివ్వడం! ఓటు హక్కుని కూడా!! మహిళలైతే అస్సలు.. మిస్సవద్దని అంటారు కేట్ రూబిన్స్.

తనైతే అంతరిక్షం నుంచే ఓటు వేయబోతున్నారు. మహిళలే మార్పు కోసం ముందుంటారు. మహిళలే మార్పు కోసం ముందుగా ఉద్యమిస్తారు. ఎందుకంటే మహిళలకే తమ స్థితిగతుల్ని మార్చుకోవలసిన అవసరాన్ని సమాజం ఎప్పుడూ కలిగిస్తూ ఉంటుంది. 'సమాజం అని ఎక్కడో దూరాన్నుంచి చెప్పడం ఎందుకుగానీ, పురుషులు మారనందువల్లనే సమాజాన్ని మార్చే ప్రయత్నాలు చెప్పొచ్చు. ట్రంప్ ఉన్నారు. ఆయన్ని మార్చేయాలి. మనిషిని మార్చడం కాదు. అధ్యక్ష పదవి నుంచి మార్చేయాలి. మహిళలందరూ కలిస్తే ఆయన్ని మార్చడం సాధ్యం కావచ్చు. ఒకవేళ ఆయనకు వ్యతిరేకంగా అందరూ కలిసి రాకపోతే! రాకపోయినా అదేమీ మార్పు కోసం ఏ ప్రయత్నమూ జరగకుండా పోయినట్లు కాదు. ఎవరి వంతు ప్రయత్నాలతో వారే కదా ఇంతవరకు మహిళలు ఒకటవుతూ మార్పు సాధించుకుంటూ వచ్చారు. అమెరికన్ ఆస్ట్రోనాట్ కేట్ రూబిన్స్ తను ట్రంప్‌కి వ్యతిరేకమో అనుకూలమో చెప్పడం లేదు.

అయితే తప్పక ఆమె తన ఓటును నవంబరు 3న జరిగే అధ్యక్ష ఎన్నికలో ప్రజాస్వామ్యంలో భాగస్వాములం అవడానికి ఓటు వేయడం అత్యవసరం అని ముఖ్యంగా మహిళలు తమ ఓటును మిస్ చేసుకోకూడదని కేట్ చెబుతున్నారు. ఓటర్ జాబితాలో పేరుండీ ఓటు వేయడాన్ని మహిళలు తరచు మిస్ చేసుకోడానికి కారణం రాజకీయాల్లో వాళ్లకు ఆసక్తి లేకపోవడం అనుకోకండి. 'మిస్‌చేసుకోవడం అంటే ఇక్కడి అర్థం.. భర్త చెప్పిన్లో, ఇంకొకరు చెప్పినట్లో ఫలానా అభ్యర్థికి ఓటేయడం. కేట్ రూబిన్స్‌కి ట్రంప్‌కి ఓటెయ్యాలని లేదనుకోండి. ఆమె భర్త మైఖేల్ మేగ్నాని ఆమెను ట్రంప్‌కే ఓటెయ్యమని చెప్పాడనుకోండి.

అతడు చెప్పినట్లు కేట్ ట్రంప్‌కే ఓటేశారనుకోండి. అప్పుడు ఆమె తన ఓటును మిస్ అయినట్లు. ఓటు వేయకుండా ఉండకూడదు.

నచ్చిన వ్యక్తికి వేయకుండానూ ఉండకూడదు అని కేట్ తరచు మహిళల్ని ప్రోత్సాహపరుస్తుంటారు. ఈ సారి కూడా ఎన్నికల సమయానికి ఆమె భూమి మీద ఉండబోవడం లేదు.

అక్టోబరు మధ్యలో అంతరిక్షంలోకి వెళ్తున్నారు. మళ్లీ తిరిగిరావడం వచ్చే ఏడాది ఏప్రిల్‌లోనే. అధ్యక్ష ఎన్నికలకు అంతరిక్షం నుంచే ఎలక్ట్రానిక్ బ్యాలెట్ ద్వారా ఆమె ఓటేస్తారు. ఆమె ఒక్క ఓటు కౌంట్ కాకపోతే అధ్యక్ష అభ్యర్థులకు వచ్చేది, పోయేది లేకపోవచ్చు. అయితే ఆమె ఒక్క ఓటు అధ్యక్షుడు ట్రంప్, జో బైడెనా అనే హోరాహోరీ పోటీలో ఒక సంఖ్యలో భాగంగానైతే ఉంటుంది. ఆ భాగాన్నే.. ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కావడం అంటారు కేట్ రూబిన్స్. గత అమెరికా అధ్యక్ష ఎన్నికలకు అంతరిక్షం నుంచే ఓటు వేశారు. ఆ ఏడాది నవంబరు 8న అధ్యక్ష ఎన్నికలు జరిగే నాటికి వారం ముందే కేట్ భూమి మీదకు

తిరిగి వచ్చేసినప్పటికీ 'ఎర్లీ ఓటింగ్ సదుపాయంతో ముందే స్పేస్ నుంచి ఓటేశారు. ప్రస్తుతం ఆ ఆస్ట్రోనాట్ తన రెండో అంతరిక్షయానానికి సన్నద్ధం అయేందుకు మాస్కోలోని స్టార్ సిటీలో అక్కడ మరో ఇద్దరు పురుష కాస్మోనాట్స్‌తో కలిసి శిక్షణ పొందుతున్నారు.

ఆస్ట్రోనాట్‌అన్నా, కాస్మోనాట్ అన్నా 'వ్యోమగామి అనే అర్థం. సూయెజ్ ఎం.ఎస్.-17 అనే వ్యోమనౌకలో రష్యాలోని బైకనూర్ కాస్మోడ్రోమ్ నుంచి ఈ ముగ్గురూ అంతరిక్ష కేంద్రంలోకి బయల్దేరుతారు. ముగ్గురిలో ఒకరు కమాండర్. ఇద్దరు ఫ్లయిట్ ఇంజనీర్‌లు.

కేట్ ఇంజనీర్ నెం.2 అంతరిక్ష కేంద్రంలోని (ఐ.ఎస్.ఎస్) 'కోల్డ్ ఆటమ్ ల్యాబ్‌లో వ్యోమగాముల హృదయనాళాలపై అంతరిక్ష వాతావరణ పీడన ప్రభావాల మీద కేట్ ఆరు నెలల పాటు పరిశోధనలు జరుపుతారు. ఆమె అక్కడ ఉన్నప్పుడే.. ఐఎస్ఎస్ విరామం లేకుండా మనుషులతో సందడిగా ఉండి ఇరవై ఏళ్లు పూర్తయిన సందర్భం వస్తుంది. ఆమె అక్కడ ఉన్నప్పుడే ప్రైవేటు అంతరిక్ష సంస్థ 'స్పేస్ ఎక్స్ రెండో విడత వ్యోమగాములకు స్వాగతం పలుకుతారు. ఆమె అక్కడ ఉన్నప్పుడే భూమి మీద అమెరికా కొత్త అధ్యక్షుడి ప్రమాణ స్వీకారాన్ని పై నుంచి వీక్షిస్తారు. ఆమె ఓటు వేసిన అభ్యర్థి ఎన్నికయ్యారా, ఓటు వేయని అభ్యర్థి ఎన్నికయ్యారా అన్నది ఆమెకు తెలుస్తుంది. ఆమెకు మాత్రమే తెలుస్తుంది.

స్పేస్‌లో 60వ మహిళ :

కేట్ పూర్తి పేరు కేత్లీన్ హ్యాలసీ కేట్ రూబిన్స్. నాసా వ్యోమగామి. కేట్ పుట్టింది కాలిఫోర్నియాలో. ఉంటున్నది టెక్సాస్‌లో. ఏడో తరగతి చదువుతున్నప్పుడే స్పేస్ క్యాంప్‌కు వెళ్లడానికి అవసరమైన డబ్బుల కోసం ఇంటి చుట్టుపక్కల పనీపాటాచేసి, ఆ మేరకు సంపాదించు కున్నారు. స్పేస్ క్యాంప్ అంటే ఏంలేదు.అలబామాలో నాసావాళ్ల అంతరిక్ష మ్యూజియం ఉంటుంది. అందులోని వింతలు-విశేషాలు చూసేందుకు వెళ్లే పిల్లల ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్. కేట్ (41)తన ముప్పయవయేట నాసాలో ప్రవేశించారు. 2016లో స్పేస్‌లోకి అరవయ్యవ మహిళగా (ప్రపంచం మొత్తం మీద) అడుగు పెట్టారు. కేట్ తర్వాత మరో ఐదుగురు మహిళలు ఐఎస్ఎస్‌ను చేరుకున్నారు.

టీఆర్‌పీ రేటింగ్

స్కామ్!

జి.చిన్నబ్బాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి, UTF విశాఖపట్నం జిల్లా.

టీఆర్‌పీ రేటింగ్ ల కోసం అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నాయనే ఆరోపణల నేపథ్యంలో టీవీ చానళ్ల వారపు రేటింగ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు 'బార్క్' (బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్) ప్రకటించింది. రేటింగుల కోసం రిపబ్లిక్ టీవీ అక్రమాలకు పాల్పడుతోందని పోలీసులు కేసు నమోదు చేసిన విషయం అందరికీ తెలిసిందే. రిపబ్లిక్ టీవీతో పాటు ఫక్త్ మరాఠీ, బాక్స్ సినిమా చానళ్లు కూడా ఈ ఆరోపణలను ఎదుర్కొంటుండగా, టీవీ చానళ్లపై ప్రజల నమ్మకాన్నే ప్రశ్నార్థకం చేస్తున్న ఈ ఉదంతం ఇప్పుడు 'బార్క్' నిర్ణయంతో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా (పోర్త్ ఎస్టేట్) ప్రసిద్ధిగాంచిన మీడియా ఆ విలువ కోల్పోతే, ఆ బాధ్యత విస్మరిస్తే అది ప్రజాస్వామ్యానికే ప్రమాదం. నిజాయితీ, నిబద్ధతలే ప్రామాణికంగా ప్రజలకు నిజాలు వెల్లడించాల్సిన మీడియా అబద్ధాల మీదుగా ప్రజల్లో ప్రాచుర్యం పొందాలనుకోవడం దాని విశ్వసనీయతకే సవాలు. ప్రత్యేకించి నిజాయితీకి, నిర్భీతికి తానే ప్రతినిధినని నిత్యం జబ్బలు చరుచుకునే "రిపబ్లిక్" టీవీ నిజాయితీ ఏపాటిదో ఈ సందర్భం తేటతెల్లం చేస్తున్నది. అసలు రిపబ్లిక్ టీవీ ప్రస్థానమే అనైతికత పునాదుల మీదుగా ప్రారంభమైందన్న వాస్తవం తెలిసినవారికి.. ఇప్పుడది టీఆర్‌పీ రేటింగుల కోసం మోసాలకు దిగజారిందన్న వార్త పెద్ద ఆశ్చర్యమేమీ కలిగించదు. దీని నిర్వాహకుడైన అర్నబ్ గోస్వామి "టైమ్స్ నౌ"లో పనిచేస్తూనే వారు ప్రసారానికి సిద్ధం చేసుకున్న ప్రత్యేక స్టోరీలన్నింటినీ దొంగిలించి రిపబ్లిక్ టీవీ ప్రారంభోత్సవ బ్రేకింగ్ స్టోరీలుగా వాడుకున్నారని టైమ్స్ నౌ యాజమాన్యం అప్పట్లోనే ఆయనపై క్రిమినల్ కేసులు పెట్టింది. ఈ విషయం ఎరిగిన వారికి ఈ తాజా ఉదాంతం కొత్తగా కలిగించే ప్రభావమేమీ ఉండదు. కానీ ఇన్నాళ్లుగా ఆయన అరుపులు, కేకలు, వీరావేశానికి కారణం ఆయన నిజాయితీ నిబద్ధతలేనని అనుకున్నవారికే ఇప్పుడదంతా భ్రమ అని తేలిపోయింది

ప్రజాస్వామ్య పద్ధతుల్లో జరగాల్సిన ఎలాంటి చర్చనైనా తన అరుపులు కేకలతో ఏకపక్షంగా ముగించే వివాదాస్పద జర్నలిస్టుగా అర్నబ్ గోస్వామిది ఓ ప్రత్యేకమైన గుర్తింపు. పచ్చి మితవాదాన్ని, కార్పొరేట్ అనుకూల వాదాన్ని ప్రజలకు అనుకూలమైనవిగా ప్రచారం చేసే బలవంతపు ప్రయత్నాలకు ఆయనొక నమూనా! కాబట్టే ఆయన టీవీ చానళ్ల ప్రసారాలు కూడా అట్లానే ఉంటాయి. సంఘపరివార్ హిందుత్వ భావజాలాన్ని జనాలపై రుద్దడం, ద్వేషపూరిత కథనాలను ప్రసారం చేయడం, ప్రశ్నించే వ్యక్తులనూ, శక్తులనూ సంఘ విద్రోహులుగా చిత్రించడమే లక్ష్యంగా ఆయన 'రిపబ్లిక్' టీవీ నడుస్తున్నదన్న సంగతి జగద్విదితం! ఈ లక్ష్యసాధనలో అది ఏ అడ్డదారినెంచుకోవడానికైనా వెనుకాడదనడానికి ఈ టీఆర్‌పీ స్కాం ఓ చక్కటి ఉదాహరణ. విచిత్రమేమిటంటే ఎంతసేపటికీ గుడ్డిగా ప్రభుత్వాన్ని సమర్థించడం తప్ప, ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు ఆ చానల్‌లో కనీస ప్రాతినిధ్యం కనిపించదు. ఉదాహరణకు పెద్దనోట్ల రద్దు, ఆర్టికల్ 370 రద్దు, పౌరసత్వ సవరణ చట్టం మొదలైనవి ఆ చానళ్ దృష్టిలో నరేంద్రమోడీ మాత్రమే చేయగలిగిన సాహసాలు. అంతేకానీ, పెద్దనోట్ల రద్దు కారణంగా అవస్థలు పడ్డ జనసామాన్యం, ఆర్టికల్ 370 రద్దు కారణంగా బహిరంగ చెరసాలగా మారిన కాశ్మీరం, పౌరసత్వ నిరసనల్లో ప్రాణాలు కోల్పోయిన అభాగ్యులు ఏమాత్రం ప్రాధాన్యతలేని విషయాలు. అంతెందుకు అత్యంత హేయమైన "హత్రస్" ఘటనను, ఆ ఘటనపట్ల ప్రభుత్వ వైఖరినీ ప్రపంచ వ్యాపిత ప్రసారమాధ్యమాలన్నీ ముక్తకంఠంతో ఖండించినా.. నిందితులను, వారికనుకూలమైన ప్రభుత్వ యంత్రాంగ చర్యలను నిర్లజ్జగా సమర్థించే కథనాలను కుమ్మరించడం రిపబ్లిక్ టీవీకి, అర్నబ్ గోస్వామికి మాత్రమే చెల్లింది! ఢిల్లీ అల్లర్లకు బలైన అభాగ్యులుగానీ, ఆకస్మిక లాక్‌డౌన్ కారణంగా నేలకు నెత్తురద్దుతూ సాగిన వలసకార్మికుల ఆకలియాత్రలుగానీ వారి దృష్టిలో అసలు వార్తలే కాదు! నిజాలను కప్పిపెట్టి అబద్ధాలనే ప్రజాభిప్రాయాలుగా మలచాలనుకునే వారికి విలువలతో పనేముంటుంది? దేశ ఆర్థిక వ్యవస్థను కొల్లగొడుతున్న కార్పొరేట్లను, వాటి ప్రతినిధిగా ప్రభుత్వాన్ని నడుపుతున్న అధికార బీజేపీని అడ్డగోలుగానైనా సరే సమర్థించాలనుకునే వారికి.. ప్రజలను ఏమార్చాలనే ఆలోచనలే తప్ప, ప్రజల ఆకాంక్షల గురించి ఆలోచించాల్సిన అవసరమేముంటుంది? తమ అభిప్రాయాలనే ప్రజల అభిప్రాయాలుగా మలుచుకోవాలన్న పథకాలే తప్ప ప్రజాభిప్రాయానికి అవకాశమే ఇవ్వని వారికి ప్రమాణాల పట్ల పట్టింపు ఎందుకుంటుంది? అందుకే ఈ అడ్డదారులు..! మీడియాలో కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం పెరిగేకొద్దీ లాభార్జనే ధ్యేయంగా మారుతుందనడానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడుతుందనడానికి కూడా ఈ సందర్భం ఓ ఉదాహరణ. ప్రజలకు నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిజాలను తెలియజేసే మౌలిక బాధ్యతను విస్మరించి, ఇలా మోసాలకు పాల్పడి రేటింగులు సాధించడం అలాంటి మీడియా సంస్థలకు లాభసాటిగానే ఉండొచ్చు. కానీ ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదం.

మానవత్వానికి 'చితిమంటలు'....

టి.వరప్రసాద్

సభ్య సమాజం తలదించుకునేలా నిర్భయ గ్యాంగ్ రేప్ తరహాలో హాథ్రస్‌లో చోటుచేసుకున్న దారుణ సంఘటనపై దేశ వ్యాప్తంగా నిరసనాగ్రహాలు వ్యక్తమవుతున్నాయి. పెత్తందారుల కుటుంబాలకు చెందిన నలుగురు నరరూప రాక్షసులు చెరచి, నాలుకను కత్తిరించి, తీవ్రంగా హింసించిన ఆ దళిత యువతి ఆస్పత్రిలో కన్నుమూసింది. లైంగికదాడి జరిగిన అయిదు రోజులకు తీరికగా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన యూపీ పోలీసులు, ఆమెకు కుటుంబ సభ్యులు గౌరవ ప్రదంగా అంతిమ సంస్కారం నిర్వహించే అవకాశాన్ని కూడా నిరాకరించారు. అంత్యక్రియల్లోనూ అన్యాయమే జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువులను కూడా అనుమతించకుండా, ఇంట్లో బంధించి పోలీసులే అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో అంత్యక్రియలు నిర్వహించారు. యువతి మృతదేహాన్ని ఢిల్లీ నుంచి అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. పోలీసులు కుటుంబ సభ్యులతో వాదించడం, అంబులెన్స్ నుంచి యువతి బంధువుల్ని గెంటివేయడం, యువతి తల్లి నిస్సహాయంగా రోదించడం, మృతదేహాన్ని నేరుగా అంత్యక్రియలకు తరలించాలని పోలీసులు చెబుతుండటం.. ఇవన్నీ వీడియోల్లో స్పష్టంగా నమోదయ్యాయి. ఢిల్లీలో ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల అనుమతి లేకుండానే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారని ఆమె సోదరుడు చెప్పారు. ఢిల్లీలో ఆసుపత్రి బయట 'రేపిస్టులను ఉరితీయాలి' అని జరుగుతున్న ఆందోళనల్లో పాల్గొన్న బాధితురాలి తండ్రిని, సోదరుడిని ఉత్తరప్రదేశ్ పోలీసుల నేమ్‌ప్లేట్లు ఉన్న నల్లటి స్కార్పియోలో తీసుకొచ్చారు. అర్ధరాత్రి హాథ్రస్ చేరుకున్నాక, వెంటనే అంత్యక్రియలు జరగాలని పోలీసులు తేల్చిచెప్పారు. 'మా ఇంటికి మృతదేహాన్ని తీసుకెళ్తాం. ఉదయాన్నే మా మత ఆచారాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తామని చెప్పాం. మమ్మల్ని చెదరగొట్టి, మృతదేహాన్ని పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. మా అమ్మాయిని కడసారి చూసుకునే అవకాశాన్ని కూడా ఇవ్వలేదు అని యువతి తండ్రి మీడియాకు తెలిపారు.

సీఎం యోగికి పిల్లలు ఉండివుంటే మా బాధ తెలిసేది..

పోలీసులు, ప్రభుత్వమూ తమ అభ్యర్థనను పట్టించుకోకుండా తమ కన్నబిడ్డను చివరిచూపు సైతం చూడనీయకుండా, తమను ఇంట్లో బంధించి అంత్యక్రియలు నిర్వహించారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'నా కూతురు "ఠాకూర్ల" గ్రామంలో జన్మించడం దురదృష్టం. మమ్మల్ని ఇంట్లో బంధించి పోలీసులు నా బిడ్డ అంత్యక్రియలు నిర్వహించారు. చివరి సారిగా ఒక్కసారి తన బిడ్డను చూస్తాం అన్న పట్టించుకోలేదంటూ' బాధితురాలి తల్లి కన్నీళ్లు పెట్టుకుంది. ముఖ్యంత్రి యోగికి పిల్లలు వుండి ఉంటే తమ బాధ తెలిసేదని కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబసభ్యులను ఇంట్లో తాళం వేసి, యువతి మృతదేహాన్ని పోలీసులు బలవంతంగా దహనం చేశారని స్థానికులు సైతం ఆరోపించారు. పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిని కొట్టారని ఆరోపించారు. ఈ ఘటన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీఎం యోగికి మోడీ ఫోన్.. దర్యాప్తునకు ప్రత్యేక కమిటీ !

యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ప్రధాని మోడీ బుధవారం ఫోన్ చేశారు. హాథ్రస్ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని సీఎంను ఆదేశించారు. 'హాథ్రస్ ఘటన విషయంలో ప్రధాని ఫోన్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని సూచించారు. బాధ్యులైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టం. ఈ విషయంపై ముగ్గురు సభ్యులతో ఓ ప్యానెల్ ఏర్పాటు చేశాం. ఏడు రోజుల్లో ఈ ప్యానెల్ రిపోర్టు సమర్పిస్తుంది." అని సీఎం యోగి పేర్కొన్నారు.

అందరూ నిర్దోషులే...

వై.విద్యాసాగర్

బాబ్రీ కేసు కూల్చివేత ఘటన కేసులో బీజేపీ సీనియర్ నేతలందరికీ క్లీన్ చిట్ లభించింది. ప్రామాణికమైన సాక్ష్యాలు లేవని లక్నోలోని సీబీఐ ప్రత్యేక కోర్టు .. కేసును కొట్టి వేసింది. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న 32 మంది నిర్దోషులుగా తేలారు. బాబ్రీ మసీదు కూల్చివేత కుట్ర కాదని.. తీర్పు సందర్భంగా సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కూల్చివేత ప్రణాళికాబద్ధంగా జరగలేన్నారు. సీబీఐ సమర్పించిన ఆడియో, వీడియో టేపులు ప్రామాణికం కాదన్నారు. 1992 డిసెంబర్ 6న అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేత జరిగింది. 28 ఏళ్ల తర్వాత కేసు తీర్పు వెలువడింది. మసీదు కూల్చివేత కేసులో ప్రధాన నిందితులుగా బీజేపీ సీనియర్ నేతలు అద్వానీ, మురళీ మనోహర్‌జోషి, కల్యాణ్ సింగ్, ఉమాభారతితో పాటు వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నేతలున్నారు. మసీదు కూల్చివేతకు నేర పూరిత కుట్ర పన్నారని అద్వానీతో పాటు పలువురిపై సీబీఐ అభియోగాలు నమోదుచేసింది. 2001లోనే అద్వానీతో సహా ఇతరులపై కుట్రపూరిత ఆరోపణలను సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ తీర్పును అలహాబాద్ కోర్టు సమర్థించింది. అలహాబాద్ కోర్టు తీర్పును సుప్రీంకోర్టు ఓవర్‌రూల్ చేసింది. అద్వానీతో పాటు ఇతరులపై నమోదైన నేరపూరిత కుట్ర అభియోగాలను రీస్టోర్ చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆ మేరకు విచారణ జరిపిన సీబీఐ ప్రత్యేక కోర్టు.. అదే తీర్పును వెలువరించింది. మసీదు కూల్చివేత కుట్ర ప్రకారం జరగలేదని.. నిందితులు కోర్టులో వాదిస్తూ వస్తున్నారు. పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీనియర్ నేతలు అయోధ్య వెళ్లిన సందర్భంగా ఆ ప్రాంతాన్ని సందర్శించామని అప్పుడు కొందరు ఆవేశంతో మసీదును కూల్చివేశారని వారు వాదించారు. నాయకులెవ్వరూ కరసేవకులను రెచ్చగొట్టలేదన్నారు. ఈ వాదన ప్రకారమే.. సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత కోర్టు కేసుల్లో ఇటీవలే అక్కడ



రామాలయం నిర్మించాలని తీర్పు చెప్పారు. ఆ ప్రకారం రామాలయ నిర్మాణం కూడా ప్రారంభమయింది. ఇప్పుడు బాబ్రీ కేసులో బీజేపీ నేతలు కూడా.. క్లీన్ చిట్ తీసుకుని బయటకు వచ్చారు. ఊహించిన తీర్పు..... బాబ్రీ మసీదు కేసులో తీర్పు అనూహ్యమేమి కాదు. ఇంతకన్నా భిన్నంగా వస్తే అదీ వింత. 1992 డిసెంబర్ 6న వేలాదిమంది కరసేవకులు బాబ్రీ మసీదును పట్టపగలు అందరూ చూస్తుండగా కూల్చివేశారు. ఏదో జరగబోతుందనే ప్రమాదం గురించి అప్పటికే దేశం యావత్ పసిగట్టింది. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం జరిగేదేదో జరగనీ అన్నట్టుగా వ్యవహరించింది. ఆనాడు ఉత్తరప్రదేశ్‌లో కల్యాణ్‌సింగ్ ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నది. అందుకే ఆ రోజున కరసేవకులకు అంత ధైర్యం వచ్చింది... లాఠీచార్జి చేయకుండా, కాల్పులు జరపకుండా కరసేవకులను ఆపగలిగితే ఆపండని ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్ జిల్లా అధికారులతో అన్నారు. ఆ సంఘటనకు ప్రత్యక్షసాక్షులుగా ఉన్న జర్నలిస్టుల కథనం ప్రకారం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలది కేవలం ప్రేక్షకపాత్ర. అక్కడ రామాలయం నిర్మించి తీరాల్సిందేనన్న ఎల్.కె.అద్వానీ, మురళీ మనోహర్ జోషి, ఉమాభారతి, నరేంద్రమోదీల ప్రసంగాలు అబద్ధం కావు. ఎవరూ ఎవరిని రెచ్చగొట్టకుండానే వందలాది మంది క్షణికావేశంలో మసీదు కూల్చివేశారన్న మాట ఎంత అసత్యమో తెలియంది కాదు. కానీ న్యాయస్థానాలకు మాత్రం అది సత్యంగానే గోచరించింది. సదరు న్యాయస్థానానికి ఆనాడు అక్కడ ఉన్న బీజేపీ అధినాయకులంతా నిర్దోషులుగా కనిపించారు. సుదీర్ఘ కాలం పాటు జరిగిన బాబ్రీ మసీదు విధ్వంసం కేసు విచారణ తీర్పును వెలువరించింది లక్నోలోని ప్రత్యేక న్యాయస్థానం. ప్రధానంగా కరసేవకులను రెచ్చగొట్టి బాబ్రీ మసీదు విధ్వంసానికి కారణమయ్యారనే అభియోగాలను ఎదుర్కొంటున్న 48 మంది బీజేపీ నేతలు, ఇతరులందరినీ నిర్దోషులుగా పేర్కొంటూ తీర్పును ఇచ్చింది ప్రత్యేక న్యాయస్థానం. వీరిలో 16 మంది ఇప్పటికే మరణించారు. ఇప్పుడు నిర్దోషులుగా బయటకు వచ్చిన వారిలో మాజీ ఉప ప్రధాని, బీజేపీ నేత ఎల్‌కే అద్వానీ, కేంద్ర మాజీ మంత్రి ఉమాభారతి, బీజేపీ ఎంపీ సాక్షి మహారాజ్ తదితరులు ఉన్నారు.

వీరిలో కొందరు తీర్పు నేపథ్యంలో కోర్టుకు హాజరయ్యారు. మరి కొందరు అనారోగ్య కారణాలు, కరోనా భయాల నేపథ్యంలో కోర్టుకు హాజరు కాలేదు. మొత్తానికి అంతా నిర్దోషులుగా బయటకు రావడంతో వారి హాజరు పెద్ద ప్రాముఖ్యతను సంతరించుకోలేదు.

ఈ కేసులో దశాబ్దాల విచారణను చేపట్టింది న్యాయస్థానం. నిందితులకు వ్యతిరేకంగా బోలెడన్ని సాక్షాలుగా కోర్టు ముందు సీబీఐ పలు అంశాలను ప్రస్తావించింది. అయితే అవేవీ నిలవలేదు. న్యాయం గెలుస్తుందన్న మాట నిజమే కాని గెలిచిందంతా న్యాయం కాదు అన్నాడు మహాకవి శ్రీశ్రీ. బాబ్రీ మసీదు కూల్చివేతపై తీర్పు వెలువడిన అనంతరం రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 'ఎట్టకేలకు న్యాయం గెలిచింది' అనడంతో శ్రీశ్రీ మాట స్ఫురించింది. 28ఏండ్ల విచారణ అనంతరం బాబ్రీ మసీదు కేసులో నిందితులు నిర్దోషులని సీబీఐ కోర్టు తీర్పు చెప్పడం గమనిస్తే "చట్టానికి కళ్ళు లేవు... న్యాయానికి ఇల్లు లేదు" అనే సినీ గేయమూ గుర్తుకొస్తుంది. బాబ్రీ మసీదు ఎవరూ కుట్రలు పన్నకుండానే, ఎవరూ రెచ్చగొట్టకుండానే తనంతట తాను కూలిపోయిందా? బాబ్రీ మసీదు కూల్చివేతలో న్యాయస్థానానికి నేరస్థులు కనిపించలేదనే అసదుద్దీన్ ఒవైసీ (హైదరాబాద్ ఎం.పి.) ఆవేదన సహేతుకమే కానీ చైనాలో మసీదులు కూల్చేసి పబ్లిక్ టాయిలెట్‌గా మార్చేశారు అదీ ఘోరం అంటే. అయోధ్యలో రామమందిర నిర్మాణానికీ పునాది పడినప్పుడే ఈ కేసు కొట్టేస్తారని అందరూ ఊహించినదే.

కువైట్ రాజు కన్నుమూత..

ఎన్.కరుణాకర్

మాలియా : కువైట్ రాజు షేక్ సబా అల్ అహ్మద్ అల్ సబా(91) కన్నుమూశారు. రాజు ఇకలేరన్న విషయాన్ని అమీర్ దివాన్ డిప్యూటీ మినిస్టర్ షేక్ అలీ అల్ జర్రా అల్ సబా వెల్లడించారు. వైద్య పరీక్షల నిమిత్తం జులై 18న అమీర్ ఆస్పత్రిలో చేరారని తెలిపారు. అనంతరం ఆయనకు శస్త్రచికిత్స విజయవంతంగా జరిగిందన్నారు. జులై 23న అమెరికా వెళ్లి వైద్య చికిత్స తీసుకున్నారని తెలిపారు. అయితే, ఆయనకు శస్త్ర చికిత్స ఎందుకు జరిగింది? అమెరికాలో వైద్య పరీక్షలకు సంబంధించిన వివరాలను మాత్రం కార్యాలయం వెల్లడించలేదు. అయితే, షేక్ సబా అల్ అహ్మద్ ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి క్రౌన్ ప్రిన్స్ షేక్ నవాఫ్ అహ్మద్ అల్ సబా తాత్కాలికంగా బాధ్యతలు చేపట్టినట్టు సమాచారం. షేక్ సబా అల్ అహ్మద్ అల్ సబా జనవరి 29, 2006లో అమిర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన సోదరుడు, కువైట్‌కు రాజుగా ఉన్న షేక్ జబర్ అల్ అహ్మద్ అల్ సబా ఈయన్ను 2003లో ప్రధానమంత్రిగా నియమించారు. దీంతో అల్ సబా రాజవంశం నుంచి షేక్ సబా అల్ అహ్మద్ 15వ పరిపాలకుడిగా ఉన్నారు. 1963 – 2003 వరకు విదేశీ వ్యవహారాల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఆయనకు 40ఏండ్ల అనుభవం ఉంది. ఈ సమయంలోనే కువైట్ విదేశాంగ విధానం రూపకల్పనలో కీలక భూమిక పోషించారు. అరబ్ ప్రపంచంలో ప్రముఖ దౌత్యవేత్తగా, గొప్ప మానవతావాదిగా మన్ననలు పొందారు.

వ్యవసాయ చట్టాలను రైతులు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..?

విజ్జూ కృష్ణన్

ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దేశ వ్యాప్తంగా ప్రధానంగా పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో పోరాటాలు ఉద్ధృతం అవుతున్నాయి. రైతాంగ వ్యతిరేక చట్టాలకు నిరసనగా (అకాలీదళ్ పార్టీ) కేంద్ర మంత్రి హరి సిమ్రత్ కౌర్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రధాని మోడీ చెప్పినట్టు ఈ చట్టాలు రైతులకు అనుకూలమైనవే అయితే, ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం సంఘటిత పోరాటాలు ఎందుకు చేస్తున్నట్టు? మనం ఆ చట్టాల్లోని ప్రతి విషయాన్ని పరిశీలించి, వాటి ప్రభావాలను అర్థం చేసుకుని ఈ ప్రశ్నకు సమాధానం కనుగొనాల్సి ఉంది.

ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయోత్పత్తులు, వాణిజ్యం, వ్యాపార సవరణ చట్టం-2020, నిత్యావసర వస్తువుల సవరణ చట్టం-2020, ఒప్పంద సాగు కాంట్రాక్టు ఫార్మింగ్ చట్టం-2020లు ఫెడరల్ సూత్రాలను వ్యతిరేకించడమే కాక, రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కూడా ఉల్లంఘిస్తున్నాయి. భారత రాజ్యాంగంలో, వ్యవసాయం రాష్ట్రాల అధికార పరిధిలో ఉంటుంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను నిర్లక్ష్యం చేస్తుంది. అన్ని హక్కులను తన గుప్పిట్లో ఉంచుకుని అన్ని నియమాలను అతిక్రమించి కార్పొరేట్ కంపెనీలకు పూర్తి స్వేచ్ఛనిచ్చే ప్రయత్నం చేస్తున్నది. ఈ చట్టం వ్యవసాయ వ్యాపారస్తుల, పెద్ద చిల్లర వ్యాపారుల, ఎగుమతిదారుల దయాదాక్షిణ్యాలపై వ్యవసాయదారులు ఆధారపడేట్టు చేస్తుంది. అన్ని రకాల నిబంధనలను, నియంత్రణలను ఈ చట్టం తొలగిస్తుంది. వ్యవసాయం రాష్ట్రానికి సంబంధించిన అంశమే గాక, వ్యాపార, వాణిజ్యాలు రాష్ట్ర పరిధిలో రాష్ట్రాల ప్రత్యేక హక్కులుగా ఉన్నాయి. భవిష్యత్‌లో ఈ అంశాల నిర్వహణలో రాష్ట్రాలకు ఎలాంటి అదుపు ఉండదు. రైతులకు ఉన్న పరిమితమైన రక్షణలు కూడా తొలగించబడతాయి. అసమాన అవకాశాలతో వ్యవసాయ వ్యాపారులు, పెద్ద వ్యాపారులు ఆదేశాలు జారీ చేసే క్రమం రోజువారీ వ్యవహారంగా మారుతుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మార్పులు రైతుల హక్కులను నిర్వీర్యం చేసి రైతులను నిస్సహాయులను చేసి కంపెనీ రాజ్‌కు ద్వారాలు తెరుస్తున్నాయి.

బీజేపీ ప్రభుత్వ వాదన ఏమంటే, వ్యవసాయోత్పత్తుల వాణిజ్య, వ్యాపార చట్టం-2020 వలన ఇ-కామర్స్‌తో పాటు రాష్ట్రాల మధ్య, అదేవిధంగా అంతర్‌రాష్ట్ర వాణిజ్య, వ్యాపారులు రాష్ట్ర వ్యవసాయోత్పత్తుల వ్యాపార చట్టాలకు అనుగుణంగా ఎలాంటి అవరోధాలులేని వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవచ్చుననీ, మొదటిసారిగా రైతులు వారి ఉత్పత్తులను వారికి ఇష్టమైన చోట అమ్ముకునే స్వేచ్ఛ వచ్చిందని ప్రభుత్వం చెబుతున్నది. ఇది వాస్తవ దూరమైనది. అసలు వాస్తవమేమంటే ఇంత కాలం రైతుల వద్ద అమ్మగలిగిన మిగులు వ్యవసాయోత్పత్తులను మార్కెట్ కమిటీల (ఆంధ్రప్రదేశ్ మార్కెట్ కమిటీ) వెలుపలనే అమ్ముతూ ఉన్నారు. జూలై 2012, జూన్ 2013 మధ్య కాలంలో అమ్మబడిన 31 రకాల పంటల్లో స్థానికంగా ఉన్న ప్రయివేటు వ్యాపారులే 29 పంటలను పెద్ద మొత్తంలో కొనుగోలు చేశారు. ఆంధ్రప్రదేశ్ మార్కెట్ కమిటీ స్వాధీనంలో అన్ని మార్కెట్ యార్డులు ఖరీఫ్ సీజన్లో అరహర్, రబీ సీజన్లో కంది పంటలను కొనుగోలు చేసే పెద్ద వ్యాపార సంస్థలు ఉన్నాయి. సోయాబీన్స్ తప్ప ఏపీయంసీలో అమ్ముకునే వాటా 25 శాతం కంటే అధిగమించదు. కేరళ విషయానికి వస్తే ఆ రాష్ట్రంలో ఏపీయంసీ మార్కెట్‌లు లేవు. కానీ ప్రభుత్వం రైతులకు అనుకూలంగా జోక్యం చేసుకుంటున్నది. కేరళ రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వం వరి సేకరణ ధరను రూ.2750గా నిర్ణయించింది. అంటే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధర కంటే రూ.900 అదనంగా ఇస్తుంది. దీనిని బట్టి రైతుల జీవితాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందో ఎవరైనా ఊహించుకోగలరు. బీహార్ రాష్ట్రం ఏపీయంసీలో నుంచి వైదొలగడం వల్ల రైతులకు అతి తక్కువ ధరలే లభిస్తున్నాయి. వాస్తవానికి నియంత్రిత మార్కెట్‌లు మాత్రమే భారతదేశ వ్యాప్తంగా మార్కెటింగ్ చేయలేవు.

"దాచుకునేందుకు, బ్లాక్ మార్కెట్ చేయడానికి హద్దులులేని స్వేచ్ఛను ఈ చట్టాలు కల్పిస్తాయి". ప్రభుత్వం నిత్యావసర వస్తువుల చట్ట సవరణ పప్పు ధాన్యాలు, నూనె గింజలు, వంట నూనెలు, ఉల్లి, ఆలు గడ్డలను నిత్యావసర వస్తువుల జాబితా నుంచి తొలగించింది. దీని వలన ఆహార భద్రతకు ముప్పు వాటిల్లడమే కాకుండా కార్పొరేట్ వ్యాపారులు, వ్యవసాయ వ్యాపారులు రైతుల నుంచి పెద్ద మొత్తంలో ఉత్పత్తులను కొని, అత్యవసర సమయాల్లో వాటిని దాచిపెట్టగలిగే

అవకాశాన్ని కల్పించింది. పెట్టుబడులను ఆకర్షించేందుకే నిత్యావసర వస్తువుల చట్ట సవరణ చేశామని చెబుతున్నప్పటికీ, కోల్డ్ చైన్ (కోల్డ్ స్టోరేజ్, శీతల గిడ్డంగులు) వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల కల్పన, ప్రోసెసింగ్ పరిశ్రమలో 100శాతం ఎఫ్‌డీఐని ప్రవేశపెట్టడంతో వ్యవసాయ వ్యాపారులు, కార్పొరేట్ సంస్థలు వ్యాపార రంగాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుంటాయని అర్థం అవుతున్నది. బీజేపీ ప్రభుత్వం కోవిడ్-19 నేపథ్యంలో ప్రయివేటు రంగానికి అనుకూలంగా చట్టాలను చేస్తున్నది. వ్యవసాయ రంగంలో ఎఫ్‌డీఐని ప్రవేశపెట్టి, రైతులు తమ పంట ధాన్యాలను నిల్వ ఉంచుకునేందుకు కావాల్సిన శాస్త్రీయమైన సౌకర్యాలను కల్పించవలసిన బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలుగుతున్నది. వ్యవసాయ మౌలిక సదుపాయాల కోసం ప్రకటించిన లక్ష కోట్ల నిధిని కూడా కార్పొరేట్ వ్యవసాయ వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలి వేసింది.

కార్పొరేట్ వ్యవసాయానికి ప్రోత్సాహం

ఈ బిల్లును పరిశీలిస్తే, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను ఇచ్చినట్లు కన్పిస్తుంది. రైతుల సాధికారత, రక్షణ, ధరలకు హామీ వ్యవసాయ సేవల బిల్లు చాలా ఆకర్షణీయంగా రూపొందించబడింది. కానీ లోతుగా అధ్యయనం చేస్తే ఈ బిల్లు డొల్లతనం బహిర్గతమవుతుంది. చట్టంలో ధరలకు హామీ సూచించబడినప్పటికీ, ఎక్కడ కూడా వ్యాపారులు, టోకు వ్యాపారులు రైతులకు ఇచ్చే ధరలు కనీస మద్దతు ధరకు (MSP) తక్కువ ఉండబోవనే హామీ లేదు. ఉత్పత్తికయ్యే పెట్టుబడికి 50శాతం అదనంగా కలిపి ధర ఇస్తానని 2014లో మోడీ హామీ ఇచ్చినట్టుగా ధరలు నిర్ణయించబడలేదు. వాస్తవానికి మనం ఇంతకు ముందు రెండు బిల్లులపై చర్చించినట్టుగా కేంద్ర ప్రభుత్వం మార్కెట్లపై నియంత్రణలను ఎత్తేసింది. గిట్టుబాటు ధర, సేకరణ లాంటి వాగ్దానాలను అమలు చేయలేదు.

కార్పొరేట్ వ్యవసాయ వ్యాపారవేత్తలైన అదానీ, విల్మార్, పెప్సికో, వాల్మార్ట్, రిలయన్స్ ఫ్రెష్, ఐటీసీ మొదలైన వారితో పేద రైతులు, కౌలు రైతులు సమాన స్థాయిలో పోటీ పడగలరని ఎవరైనా ఊహించగలరా? వీరు రైతాంగాన్ని నాశనం చేసి మొసలి కన్నీరు మాత్రమే కార్చగలరు. మార్కెట్లో ఉన్న అస్థిరతా సమస్యలు రైతుల నుంచి జవాబుదారునికి బదిలీ చేయబడుతాయనేది అర్థరహితం. రైతులను బలోపేతం చేయడానికి బదులుగా వారిని వ్యవసాయం నుంచి దూరం చేస్తుంది. పెద్ద భూస్వాములు, వ్యవసాయ వ్యాపారులు రైతుల శ్రమపై లాభాలు పొందడానికి ఉపకరిస్తుంది. కోర్టుల అధికారాలను ప్రక్కన పెట్టి, సబ్ డివిజన్ మెజిస్ట్రేట్‌కు వివాదాలను బదిలీ చేశారు. దీని పర్యవసానంగా పేద రైతులకు కార్పొరేట్ కంపెనీలకు మధ్య వివాదాలు తలెత్తినప్పుడు పేద రైతులను ఉద్యోగుల దయాదాక్షిణ్యాలకు వదిలి వేయడం జరుగుతుంది. దోపిడీదారులైన వ్యవసాయ వ్యాపారులు, రైతును వ్యవసాయ రంగం నుంచి తరిమేసి వ్యవసాయ రంగాన్ని స్వాధీనం చేసుకుంటారు. కాంట్రాక్ట్ వ్యవసాయం రావాలనే మోజు వాస్తవ వ్యవసాయ దారులను శాశ్వత బానిసలను చేస్తుంది. వ్యవసాయ వ్యాపారుల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తులు చేయాల్సి ఉంటుంది. వ్యవసాయదారుల సంక్షేమమే ప్రభుత్వ ఉద్దేశ్యమైతే రక్షణ, పంటల బీమా గానీ, ధరల విషయంలో స్పష్టమైన కేటాయింపులు గానీ బిల్లులో ఎందుకు లేవు?

కార్మికుల సహకారంతో రైతాంగ ఐక్య ఉద్యమాలు

ఎలాంటి ప్రణాళికలేని లాక్‌డౌన్ వల్ల రైతాంగం, శ్రమజీవులు తమ ఆదాయాలను పెద్ద మొత్తంలో కోల్పోయారు. ఆర్థిక సహకారంలో, రుణ మాఫీ, ఆహార ధాన్యాల సరఫరా, ఉద్యోగాల కల్పన, ఆరోగ్య సదుపాయాలు కల్పించి బాధితులకు ఉపశమనం కల్పించడానికి బదులుగా, బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అంతులేని లాభాలను, రాయితీలను కట్టబెడుతున్నది. కార్పొరేట్ దోపిడీని ప్రోత్సహించే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఆధారపడే బదులు, ప్రభుత్వం సహకార వ్యవసాయాన్ని రైతులు, వ్యవసాయ కార్మికులతో సహకార సంఘాలను నెలకొల్పి అభివృద్ధి చేయాలి. అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు C 2+50 శాతం ఇస్తూ సేకరణకు హామీ ఇవ్వాలి. వ్యవసాయ కార్మికులకు రోజుకు 600 రూపాయలు కనీస వేతనం అందించి, ట్యాక్స్ చెల్లించని పేదలకు నెలకు రూ.7500లు ఆర్థిక సహకారం అందించాలి. ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ.300 నిరుద్యోగ భృతి అందించాలి. ప్రధాన మంత్రి కిసాన్ యోజన ద్వారా అందించే సహకారం సంవత్సరానికి రూ.18000కు పెంచాలి. ఈ రాయితీలను కౌలు రైతులకు కూడా అందేట్లు చూడాలి. భూమి లేని వారికి, కౌలు రైతులకు, సన్న, చిన్నకారు రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలి. ఆహార భద్రతకు హామీ ఇవ్వాలి.

పై మూడు చట్టాలు, విద్యుత్ సవరణ చట్టం-2020 ప్రతులను, నిరసనలో భాగంగా 3000 కేంద్రాల్లో ఆర్డినెన్సును ప్రకటించిన మూడు వారాల్లో దహనం చేశారు. కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కార్మికుల ఉమ్మడి పోరాటాలు కొనసాగుతున్నాయి. ఇంకా విస్తృతంగా పోరాటాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఆగస్ట్ 9, 2020 క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం రోజున, సెప్టెంబర్ 5, 2020 నాడు భారీ స్థాయిలో ఐక్య ఉద్యమాలు నిర్వహింపబడ్డాయి. దేశ వ్యాప్తంగా 20లక్షల మంది ఈ నిరసన ప్రదర్శనలలో పాల్గొన్నారు. అఖిల భారత కిసాన్ సంఘర్ష్ సమన్వయ కమిటీ 250 సంఘాలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నది. కేంద్ర కార్మిక సంఘాలు, భూమి అధికారి ఆందోళన్ సంఘీభావాన్ని తెల్పడమే కాకుండా ఈ పోరాటాల్లో ముందంజలో నిలిచాయి. ఆల్ ఇండియా కిసాన్ సంఘర్ష్ కో-ఆర్డినేషన్ కమిటీ ప్రతిఘటనా దినోత్సవం సెప్టెంబర్ 25న దేశ వ్యాప్త నిరసన దినంగా పాటించింది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు బంద్ పాటించాయి. భారతదేశ వ్యాప్తంగా రైతులు భారీ నిరసనలు, ప్రదర్శనలు చేపట్టారు. శ్రామికవర్గం, కేంద్ర కార్మిక సంఘాలు తమ మద్దతును ప్రకటించాయి. ఈ మూడు చట్టాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్లమెంట్ సభ్యులు చట్టబద్ధమైన స్పష్టత కోసం పార్లమెంట్‌లో తీర్మానాన్ని ప్రవేశపెట్టి, తమ నిరసనను తెలియజేశారు. రైతుల, శ్రమజీవుల వాస్తవ సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా బీజేపీ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్ళించేందుకు ప్రయత్నిస్తుంది. ఈ నిరసనలు మరింత ఉధృతమై రైతు వ్యతిరేక చట్టాలను ఏ విధంగానైనా ప్రతిఘటిస్తాయి.

ముఖాముఖి...

కె.వెంకట్, పి.హెచ్‌డి

అమెరికా అధ్యక్ష అభ్యర్థుల తొలి ముఖాముఖి చర్చ అత్యంత ఆసక్తికరంగా కొనసాగింది. ఈ ముఖాముఖి చర్చలో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ పాల్గొన్నారు. ఇరువురు అధ్యక్ష అభ్యర్థుల మధ్య సంధానకర్తగా క్రిస్ వాలెస్ వ్యవహరించారు. అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపిక విషయమై వచ్చిన ఆరోపణలు, విమర్శలపై మొదటి ప్రశ్నతో ఈ ముఖాముఖి చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా జో బైడెన్ మాట్లాడుతూ... అమెరికాలో ఎన్నికలు ఇప్పటికే ప్రారంభమైనట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఇప్పటికే వేల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. అనంతరం ట్రంప్ తీసుకొచ్చిన ఆరోగ్య బీమాపై ఇరువురి మధ్య చర్చ జరిగింది.

ఈ సందర్భంగా ఒబామా కేర్ పాలసీని అధ్యక్షుడు ట్రంప్ నీరుగార్చారని జో బైడెన్ విమర్శించారు. ట్రంప్ విధానం వల్లే వేలాది మంది అమెరికన్లు ప్రాణాలు కోల్పోయారని మండిపడ్డారు. మహమ్మారి కరోనాను ఎదుర్కోవడంలో ట్రంప్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఒబామా కేర్ పాలసీ రద్దుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. జో బైడెన్ వ్యాఖ్యలను ట్రంప్ ఖండించారు. ఆరోగ్య బీమాను రద్దు చేయాలేదని ప్రజలకు ఆరోగ్యసేవలను తక్కువ ధరలో అందించే ప్రయత్నం చేశామని అన్నారు. తాము ప్రజలకు కరోనా విషయంలో మెరుగైన వైద్యం అందించామని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఒబామా కేర్ పాలసీ నిర్వహణ అంతా సులువు కాదని, పెద్ద ఖర్చుతో కూడుకున్నదిగా ట్రంప్ చెప్పుకొచ్చారు. అలాగే తాను మాస్క్ ధరించట్లేదనే ఆరోపణలను ట్రంప్ తప్పు పట్టారు. మాస్క్ ఎప్పుడూ తన వెంటే ఉంటుందని చెప్పారు. తన వెంట తెచ్చుకున్న మాస్క్‌ను ఆయన సంధానకర్తకు చూపించారు. అవసరం ఉంటేనే మాస్క్ ధరిస్తానని అన్నారు. జో బైడెన్ తరహాలో తాను ప్రజలకు 200 మీటర్ల దూరంలో ఉండనని చురకలు అంటించారు. దీనిపై స్పందించిన జో బైడెన్... ట్రంప్‌కు ఆరోగ్య రంగంపై అసలు అవగాహన లేదని, ఎలాంటి ప్రణాళిక కూడా లేదన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో నామమాత్రంగా నిధులను వ్యయం చేశారని అన్నారు. ఆర్థిక పరిస్థితులను చక్కబెట్టడానికి ట్రంప్ ప్రభుత్వం వద్ద సరైన ప్రణాళికలు లేవని ఆరోపించారు. అనంతం మాట్లాడిన ట్రంప్... డెమొక్రాటిక్ పార్టీ 47 ఏళ్ల పాలనలో అగ్రరాజ్యానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. భారత్ సహా ఇతర దేశాల్లో కొవిడ్-19 వల్ల ఎంతమంది మృతిచెందారో జో బైడెన్‌కు తెలియదా అని ప్రశ్నించారు. ఇక సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపిక విషయమై మాట్లాడిన ట్రంప్ గత ఎన్నికల్లో గెలిచాం కనుకే సుప్రీంకోర్టు నియామకాల్లో తమ ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉందని అన్నారు. ట్రంప్ హయాంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని జో బైడెన్ చెప్పారు. దీనిపై ట్రంప్ మట్లాడుతూ.. అమెరికా ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తోందని స్పష్టం చేశారు. తాము అన్ని పారదర్శక విధానాలే అవలంబిస్తున్నామని చెప్పారు. ఇలా ఇరువురు అధ్యక్ష అభ్యర్థుల మధ్య తొలి ముఖాముఖి చర్చ వాడివేడిగా కొనసాగింది. 'సూపర్ బౌల్ ఆఫ్ అమెరికన్ డెమొక్రసీ' అని పిలిచే ఈ కీలక చర్చకు ఒహియోలోని క్లీవ్‌లాండ్ విశ్వవిద్యాలయం వేదిక అయింది.



అదీ పెద్దన్నల సంగతి...

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా అధ్యక్ష అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, జో బైడెన్‌ల మధ్య అక్టోబరు 15నజరగాల్సిన రెండో డిబేట్ రద్దు చేస్తున్నట్లు 'కమిషన్ ఆన్ ప్రెసిడెన్షియల్ డిబేట్స్(సీపీడీ) అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే ఈ ఇద్దరు అభ్యర్థులు తొలి డిబేట్‌లో పాల్గొన్న విషయం తెలిసిందే. ట్రంప్, జో బైడెన్‌ల మధ్య తొలి డిబేట్ సెప్టెంబరు 29న జరిగింది. రెండో డిబేట్ రద్దు కావడంతో ఇక నేరుగా ఇరువురు అక్టోబర్ 22న జరగాల్సిన మూడో డిబేట్‌లో పాల్గొననున్నారు. ట్రంప్ కరోనా బారిన పడిన నేపథ్యంలో రెండో డిబేట్ పై ఇటీవల సందిగ్ధత నెలకొన్న విషయం తెలిసిందే.

ఆ డిబేట్‌ను వర్చువల్ పద్ధతిలో జరపాలన్న కమిషన్ ఆన్ ప్రెసిడెన్షియల్ డిబేట్స్ నిర్ణయాన్ని ట్రంప్ ఒప్పుకోలేదు. తాను నేరుగా పాల్గొంటానని అన్నారు. జో బైడెన్ మాత్రం వర్చువల్ డిబేట్‌కు అంగీకరించారు. అయితే, డిబేట్ లో పాల్గొనే వారి ఆరోగ్యంతో పాటు భద్రతను దృష్టిలో పెట్టుకుని తాము చర్చలను వర్చువల్ పద్ధతిలో నిర్వహించాలనుకున్నామని సీపీడీ తెలిపింది. ఆ డిబేట్ వర్చువల్‌గానే జరుగుతుందని స్పష్టం చేసినప్పటికీ, చివరకు తమ నిర్ణయాన్ని మార్చుకుంది. డిబేట్ ను పూర్తిగా రద్దు చేసినట్లు ప్రకటించింది. ఇంతకీ ఏం జరిగిందంటే...ట్రంప్‌కు కరోనా పాజిటివ్. ఆయన భార్య మెలానియాకూ పాజిటివ్ అని తేలింది. ట్రంప్ కరోనాను చాలా నిర్లక్ష్యంగా, తేలిగ్గా తీసుకున్నారు. మాస్క్ పెట్టుకునేవారు కాదు. భౌతిక దూరం పాటించడమూ ఆయనకు ఇష్టం ఉండదు. నాకేం కాదు అన్న ధీమాతో వ్యవహరించారు. తాను గొప్ప నాయకుడిని, ధైర్యవంతుడిని కాబట్టి కరోనా నన్ను ఏమీ చేయలేదని ఆయన నమ్మకం! ఇప్పటికే అమెరికాలో 2,10,000 మంది కరోనా వలన చనిపోయారు. కరోనాకు గొప్ప నాయకుడా, ఆయనకు ధైర్యం ఉన్నదా లేదా అనే దానితో సంబంధం లేదు.

వచ్చే నెల 3న ఎన్నికలు ఉండటంతో ఆయన వేల మంది ప్రజలు, మద్దతుదారులు హాజరైన ప్రచార సభలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా హాజరయ్యారు. రిపబ్లికన్ సమావేశాలు ఇండోర్ స్టేడియాల్లోనే జరిగేవి. వేల మంది గుమిగూడటం, ఎవరూ మాస్క్‌లు

పెట్టుకోకుండా, భౌతిక దూరం పాటించకుండా ఉండటం జరిగింది. ఒక నాయకుడిగా ఆయన తమ పార్టీవారికి, మద్దతుదారులకు మహమ్మారి సమయంలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి కచ్చితంగా చెప్పి ఆచరించేలా చేయాల్సింది చేయకుండా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు.

అమెరికాలో జనవరి 21న మొదటి కేసు నమోదు అయింది. ట్రంప్‌కు వైద్య నిపుణులు దాని ప్రమాదాన్ని తెలియచేసినా నిర్లక్ష్యంగా ఉండిపోయారు. మాస్కులు ధరించాల్సిన అవసరం లేదని, లాక్‌డౌన్ విధించాల్సిన పనిలేదని బహిరంగంగా ప్రకటించారు. కరోనా ఫ్లూ జ్వరంతో సమానమనీ అందుకు జాతీయ ఎమర్జెన్సీ అవసరం లేదనీ భావించారు. డిసిన్ఫెక్షన్ ఇంజెక్షన్ తీసుకుంటే చాలా తొందరగా కోలుకుంటారని సుద్దులు చెప్పారు. అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు లాక్‌డౌన్ విధిస్తే వారిని లాక్‌డౌన్ ఎప్పుడు ఎత్తివేస్తారని పదే పదే వేధించారు. క్లోరోక్విన్ అనేది మలేరియా మందు. దాన్ని భారతదేశం నుంచి పెద్ద ఎత్తున తెప్పించుకుని ప్రజలను వాడమన్నారు. దానివల్ల ఫలితం ఉండదని వైద్య నిపుణులు చెప్పినా పట్టించుకోలేదు.

వెంటిలేటర్స్ తగినన్ని లేకపోయినా వాటిని తయారు చేయించడం, లేదా ఇతర దేశాల నుంచి దిగుమతి చేయించడంలో కూడా శ్రద్ధ పెట్టలేదు. ఆయనకు ప్రజల ప్రాణాలను కాపాడాలనే స్పృహ ఉన్నట్టు ఏకోశానా కనపడలేదు. కంపెనీలు ఎప్పుడు తెరుద్దామా, ఎప్పుడు ఉత్పత్తి ప్రారంభిద్దామా అనే ధ్యాసే తప్ప, కార్మికులు వారి కుటుంబాల క్షేమం గురించి ట్రంప్ పట్టించుకోలేదు. కంపెనీలు తెరవకపోతే పెట్టుబడిదారులకు లాభాలు రావని, మార్కెట్ శక్తులకు నష్టం జరుగుతుందని, అందుకని కార్మికులకు నష్టం జరిగినా లాభాలే ముఖ్యమనేది, మార్కెట్ శక్తులు లాభాలతో సంతోషంగా ఉండటమనేది ట్రంప్ సిద్ధాంతం. దానికి అనుగుణంగానే ఆయన అడుగులు వేస్తున్నారు. ట్రంప్ తనకు నచ్చినట్టు ప్రవర్తించడానికి ఏమాత్రం వీలులేదు. నేనూ నా ఇష్టం అనటానికి ఆస్కారమే లేదు. ఆయన ఒక దేశానికి అధ్యక్షుడు. ఆయనకు నిర్ణయాత్మక పాత్ర ఉంటుంది. ఆయన పాలన బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, నిజాయితీతో ప్రజల ధృక్కోణం నుంచి సాగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. మరీ మహమ్మారి సమయంలో ప్రజల ప్రాణాలు పిట్టల్లా రాలిపోతుంటే... ప్రజల ప్రాణాలను కాపాడటానికి ఆయన ముందుండి మార్గదర్శకత్వం వహించాలి. సైన్స్ ఆధారంగా వైద్య నిపుణులు ఇస్తున్న సలహాలను అమలు జరపడానికి తన యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలి. కానీ ట్రంప్ తన బాధ్యతలు నిర్వహించడంలో విఫలమైనారు. స్వయంకృతాపరాధంతో ఆయనకే కరోనా పాజిటీవ్ అని తేలింది. ఆయన నిర్లక్ష్యంగా ఉండటం కారణంగా ఆయన భార్య మెలానియాకూ కరోనా వచ్చింది. శ్వేతసౌధంలో ముగ్గురు విలేకర్లకు, ఇద్దరు సెనేటర్లకు, ఆయన ప్రచార మేనేజర్‌కూ పాజిటీవ్ వచ్చింది. అటు పిమ్మట ఆయన వాల్టర్ రాడ్ జాతీయ సైనిక వైద్య కేంద్రంలో చేరారు. అక్కడ కూడా ఆయన హడావిడి చేశారు. హాస్పిటల్‌లో బెడ్ మీద ఉండాల్సిన ఆయన కారులో షికారుకు వెళ్ళి ప్రజలకు అభివాదం చేశారు. తన కారులో విలేకర్లను, సెక్యూరిటీ సిబ్బందిని వెంటపెట్టుకుని వెళ్ళారు. వారికీ కరోనా సోకింది. మూడు రాత్రులు హాస్పిటల్‌లో గడిపి శ్వేత సౌధంకు తిరిగి వచ్చారు. వైద్యుల సలహాలను, అవసరమైన క్వారెంటైన్ కాలపరిమితిని కూడా పాటించలేదు. దానితో ఇప్పుడు శ్వేతసౌధం కరోనా హాట్‌స్పాట్‌గా మారిపోయింది. ప్రతి ఒక్కరూ సెక్యూరిటీ, సిబ్బంది, విలేకర్లు అందరూ హడలిపోతున్నారు.

ట్రంప్ వ్యవహారశైలి చూస్తే నాకు భయంలేదు, నేను కరోనాతో పోరాడుతున్నాను, జయిస్తాను అని మొండి వ్యవహారంలా ఉన్నది. కరోనాకు భయపడి దేశాన్ని మూసివేసుకుంటామా అని ఆయన చెపుతున్నారు. చైనా లాంటి దేశాలు సకాలంలో స్పందించి, పూర్తి లాక్‌డౌన్ కఠినంగా పాటించినందుకు కరోనా పుట్టిన చోటనే దానిని అరికట్ట కలిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ చైనా కృషిని మెచ్చుకున్నది. తన కండ్ల ముందే చైనా అరికట్ట కలిగినప్పుడు అమెరికాకు ప్రజల ప్రాణాలను కాపాడాలనే చిత్తశుద్ధి ఉంటే చైనా మార్గాన్ని గుణపాఠంగా తీసుకుని ఆచరించి ఉండేది. కానీ అలా జరగలేదు. ట్రంప్ కరోనాను 'చైనా వైరస్' అని చైనాను తిడుతుంటే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ త్వరగా కోలుకోవాలని సందేశం పంపారు. ఇద్దరిలో ఎంత తేడాయో..! అదీ పెద్దన్న సంగతి.



విద్యలేనందున - జ్ఞానం లేకుండా పోయింది.

జ్ఞానంలేనందున - నైతికత లేకుండా పోయింది.

నైతికత లేనందున - ఐకమత్యం లేకుండా పోయింది.

ఐకమత్యం లేనందున - శక్తి లేకుండా పోయింది.

శక్తి లేనందున - శూద్రులు (అతిశూద్రులు) అణచివేయబడ్డారు.

ఇన్ని అనార్ధలు కేవలం అవిద్యవల్లే జరిగిపోయాయి.

మహామనిషి జోతిబా ఫూలే

అందని లోకాలకు చందమామ శంకర్

ఎస్. ఎమ్మార్శ్రీ

చందమామ పత్రిక ఎప్పుడు వస్తుందా, అని పిల్లలు,పెద్దలు ఎదురుచూస్తూ ఉండేవారు.అందులో కథలు, బొమ్మలు రెండూ ప్రధానమైన ఆకర్షణలు.ఆ బొమ్మలు అందించిన వారిలో ఇద్దరు ప్రముఖులు, ప్రధానులు. ఒకరు వడ్డాది పాపయ్య. రెండవవారు శంకర్. నిన్నటి తరం వరకూ తెలుగువారికి తన బొమ్మలతో సందడి చేసిన చందమామ శంకర్ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. చందమామ కథలు చదవని తెలుగువారు నిన్న మొన్నటి వరకూ లేరన్నది అతిశయోక్తి కాదు.బేతాళుడు ఆవహించిన శవాన్ని భుజాన వేసుకొని, ఒక చేత్తో కత్తి దూసి చురుకైన కళ్ళతో చుట్టూ చూస్తూ ముందుకు అడుగులు వేసే విక్రమార్కుడి బొమ్మను చూడగానే పిల్లలు అక్కడే ఆగిపోతారు. పెద్దలు సైతం అదే చూస్తూ ఉంటారు. పిల్లలకు చూపిస్తూ ఉంటారు. ఈ దృశ్యాలు, ఈ అనుభవాలు, ఈ అనుభూతులు తెలుగువారిని దశాబ్దాల పాటు కట్టిపడేశాయి. ఈ బొమ్మలు వేసి విక్రమార్కుడిని మన కళ్ళకు కట్టిన శంకర్ తమిళనాడుకు చెందినవాడు. యువ దీపావళి సంచికలలోని కొన్ని కథలకు కూడా ఈయన బొమ్మలు అందించారు. ఇన్ని కోట్ల మందికి ఇన్నేళ్లపాటు కనువిందు చేసిన శంకర్ 96ఏళ్ళు జీవించి ఇప్పుడే కన్నుమూశారు. చందమామ పత్రిక సంస్కృతం మొదలు ఎన్నో భారతీయ భాషల్లో సందడి చేసింది. చందమామకు బొమ్మలు అందించిన వారిలో వడ్డాది పాపయ్య (వ.పా), చిత్రా,శంకర్ పాత్రలు మరువలేనివి.చందమామ నా చేత కూడా చదివిస్తున్నారు, హాయిగా ఉంది. పత్రిక రావడం ఆలస్యమైతే కొట్టువాడితో దెబ్బలాడతా... అంటూ కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకూడా అనేవారు. ఈ కథలకు ప్రాణప్రతిష్ఠ చేసిన శంకర్ ప్రతిష్ఠ చాలా గొప్పది. శంకర్ పూర్తిపేరు కరతోలువు చంద్రశేఖరన్ శివశంకరన్. 19 జులై, 1924లో తమిళనాడులోని ఈరోడ్ కు దగ్గరగా ఉండే ఒక గ్రామంలో జన్మించారు.వీరి పూర్వీకులది తమిళనాడులోని కరతోలువు గ్రామం. వీరి నివాసం 1934లో చెన్నైకు మారింది. చందమామను తమిళంలో అంబులిమామ అంటారు. చందమామ పత్రిక ప్రారంభం నుండి ఉన్నవారిలో వీరే చివరివారు. నేడు వీరు కూడా వీడు (ఇల్లు) ఖాళీ చేసి వెళ్లిపోయారు. చిన్నప్పటి నుండీ బొమ్మలు గీయడం అంటే ఈయనకు చాలా ఇష్టం. 12వ తరగతి పూర్తయిన తర్వాత చెన్నైలోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చిత్రకళలో డిగ్రీ పూర్తి చేశారు. బ్రష్ తో బొమ్మలు వేయడంలో సిద్ధహస్తుడు. ఎటువంటి మెటీరియల్ తో నైనా అద్భుతంగా బొమ్మలను తీర్చిదిద్దే నైపుణ్యం శంకర్ ను చిత్రకారుల్లో విభిన్నంగా నిలిపింది. డిగ్రీ అందిన వెంటనే, ఆ కాలంలో తమిళనాడులో సుప్రసిద్ధమైన కలైమగళ్ పత్రికలో చేరారు. 1946లో ఇక్కడ ప్రారంభమైన ఉద్యోగపర్వం చందమామలో చేరడంతో శిఖరానికి చేరింది. లైన్ డ్రాయింగ్ లో ఎందరో వీరి నుండి స్ఫూర్తి పొందారు. దశాబ్దాలపాటు కొన్ని వేల బొమ్మలు వేశారు. 96ఏళ్ళు నిండు జీవితం గడిపిన పూర్ణకళాకారుడు చందమామ శంకర్. విక్రమార్కుడు, బేతాళుడు రేఖాచిత్రాల ద్వారా కోట్లాదిమంది పాఠకుల మదిలో నిలిచి'పోయిన' శంకర్ కు భాష్పాంజలి సమర్పిద్దాం.

ఆడదే ఆధారం....

భారత నౌకాదళంలో సోమవారం అపూర్వఘట్టం ఆవిష్కృతమైంది. రక్షణరంగంలో లింగ సమానత్వానికి పునర్నిర్వచనం చెబుతూ.. నౌకాదళంలోకి ఇద్దరు మహిళా అధికారులు అడుగుపెట్టనున్నారు. యుద్ధనౌకల్లో పనిచేసేందుకు గానూ కుముదిని త్యాగి, రీతిసింగ్ నియమితులయ్యారు. వీరిరువురు కొచ్చిన్‌లోని సదరన్-నావల్ కమాండ్‌లో సబ్ లెఫ్టినెంట్ హోదాలో పనిచేస్తున్నారు. నేవీలో ఎంతోమంది మహిళా అధికారులున్నా.. యుద్ధనౌకల్లో వీరిని నియమించడం ఇదే ప్రథమం. ఎక్కువ కాలం పనిచేయాల్సి రావడం, సిబ్బంది క్వార్టర్లలో టాయిలెట్స్, బాత్రూంల కొరత, ప్రైవసీ ఇబ్బందుల నేపథ్యంలో ఇంతకాలం నేవీలో మహిళా అధికారులను నియమించలేదు. కాగా.. త్యాగి, రీతిసింగ్‌లు నేవీలో నిర్వహించే వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. నౌకాదళం అమ్ములపొదిలో ఉన్న అత్యాధునిక ఎంహెచ్-60 ఆర్‌లలో వీరు విధులు నిర్వర్తించనున్నట్టు సమాచారం.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నిలిపివేత

బుకర్

భారత్‌లో తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్టు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటించింది. భారత ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని తెలిపింది. ఈ నెల పదో తేదీ నుంచి తమ బ్యాంకు ఖాతాలన్నింటినీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్తంభింపజేసిందని చెప్పింది. నిరాధారమైన, ఉద్దేశపూరిత ఆరోపణలపై భారత ప్రభుత్వం మానవహక్కుల సంస్థలపై దాడి చేయడం ప్రారంభించిందని ఆమ్నెస్టీ పేర్కొంది. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. దీంతో తమ సిబ్బందిని తొలగించాల్సి వచ్చిందనీ, తమ సంస్థ ప్రచారాలనూ, పరిశోధనా కార్యక్రమాలన్నిటినీ నిలిపేయాల్సి వచ్చిందనీ ఆమ్నెస్టీ తెలిపింది. 'భారత్‌లో మేం ఓ అసాధారణ పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం నుంచి ఒక క్రమపద్ధతిలో బెదిరింపులు, దాడులు, వేధింపులను ఆమ్నెస్టీ ఎదుర్కొంటున్నది' అని ఆ సంస్థ సీనియర్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, అడ్వకసీ అండ్ పాలసీ రజత్ ఖోస్లా అన్నారు. 'మానవ హక్కులను పరిరక్షించేందుకు మేం చేస్తున్న కృషిలో భాగంగా ఢిల్లీ అల్లర్ల విషయంలో, జమ్మూకాశ్మీర్‌లో జరుగుతున్న విషయాలపై లేవనెత్తిన ప్రశ్నలకు జవాబులు చెప్పడానికి ఇష్టపడని కేంద్ర ప్రభుత్వం ఇలాంటి బెదిరింపులకూ, దాడులకూ పాల్పడుతున్నది' అని ఆయన ఆరోపించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన అల్లర్ల ఘటనలో పోలీసులు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్టు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇటీవల విడుదల చేసిన ఓ నివేదికలో పేర్కొన్నది. కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దుచేసి ఏడాది గడిచిన సందర్భంగా నిర్బంధంలో ఉన్న రాజకీయ నాయకులు, కార్యకర్తలు, విలేకరులను విడుదల చెయ్యాలనీ, అక్కడ హై స్పీడ్ ఇంటర్నెట్ సర్వీసులను పునరుద్ధరించాలని కూడా ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. దేశంలో అసమ్మతిని కాలరాస్తున్నారని ఆరోపించింది. దీంతో అప్రజాస్వామికంగా తమ ఖాతాలను సీజ్ చేసిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ అవినాష్ కుమార్ తెలిపారు. కాగా, గత రెండు సంవత్సరాలుగా ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కార్యకలాపాలు రద్దు చేయడం ప్రమాదవశాత్తు జరిగింది కాదని, ఉద్దేశపూర్వకంగానే దాడి చేసేందుకు ఈవిధంగా చేసిందని ఆమ్నెస్టీ పేర్కొంది.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సంస్థ గత కొన్నేండ్లుగా ప్రభుత్వ సంస్థల సోదాలను ఎదుర్కొంటున్నదనీ, ఈ నెలలో బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయటం పరాకాష్టగా అని తెలిపింది. విదేశీ నిధులకు సంబంధించిన నిబంధనలను అతిక్రమించిందనే ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌పై ప్రభుత్వం ఆరోపణలు చేస్తున్నది. కాగా, 'అది పచ్చి అబద్దం. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా.. దేశీయ, అంతర్జాతీయ చట్టపరమైన నిబంధలన్నిటినీ కచ్చితంగా అనుసరిస్తున్నది' అని ఖోస్లా తెలిపారు.

వేధింపులు ఇలా...

2016లో ఓ కార్యక్రమంలో భారత వ్యతిరేక నినాదాలు చేశారన్న ఆరోపణలపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పై దేశద్రోహం కేసు నమోదు చేశారు. మూడేండ్ల తరువాత కోర్టు ఆ అభియోగాలను తొలగించాలని ఆదేశించింది. 2018లో బెంగళూరులో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కార్యాలయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. అప్పుడు ఆర్థిక నేరాల పేరుతో ఆమ్నెస్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. అయితే కోర్టు జోక్యంతో మళ్లీ వాటిని పునరుద్ధరించారు. 2019 చివర్లో మరోసారి ఆమ్నెస్టీ కార్యాలయాలపై సీబీఐ దాడులు చేసి సోదాలు నిర్వహించింది. ఇటీవల ఆమ్నెస్టీకి సంబంధించిన అన్ని అకౌంట్లను ప్రభుత్వం సీజ్ చేసింది.

పాకిస్థాన్ ప్రభుత్వం కరెన్సీ నోట్లను గుట్టలు గుట్టలుగా ఎందుకు ముద్రిస్తోంది?

పి.సుకుమార్

గత కొన్నేళ్లుగా పాకిస్థాన్‌లో కరెన్సీ నోట్ల సంఖ్య పెరుగుతోంది. 2020 జూన్ 30తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో గత ఎనిమిదేళ్లలో ఎన్నడూ లేనంతగా కొత్త నోట్లను తీసుకొచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే 1.1 ట్రిలియన్ల కొత్త నోట్లు పెరిగాయి.

పాకిస్థాన్ ఆర్థిక గమనాన్ని పరిశీలించిన నిపుణులు ఈ నోట్ల వృద్ధి అసాధారణమని, ఆర్థిక వ్యవస్థ మీద ప్రతికూల ప్రభావం చూపుతుందని అంటున్నారు.

ఇక్కడ కొత్త నోట్లు పెరుగుతున్నాయంటే పాత నోట్ల స్థానంలో కొత్త నోట్లు ముద్రించారని అర్థం కాదు. పాతవి ఉండగానే కొత్తగా కరెన్సీని ప్రింట్ చేస్తున్నారు.

డిమాండ్‌ను సమతుల్యం చేయడానికి సాధారణంగా కొత్త నోట్లను ముద్రిస్తారని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇది కొంత వరకు నోట్ల సంఖ్యను పెంచవచ్చని, అయితే అది అసాధారణ రీతిలో పెరుగుతోందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

పాకిస్థాన్ కరెన్సీ ప్రింట్ కోసం వాడే పేపర్‌ను 'సెక్యూరిటీ పేపర్స్ లిమిటెడ్' అనే సంస్థ తయారు చేస్తుంది. ఈ సంస్థ ఈ ఏడాది మంచి ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన ఈ కంపెనీ తాజా ఆర్థిక ఫలితాలలో 60% పైగా వృద్ధిని నమోదు చేసింది.

నోట్ల సంఖ్య పెరుగుతున్న కాలాన్ని కూడా గమనించాల్సిన అవసరం ఉంది. ఇ-కామర్స్, డిజిటల్ కరెన్సీ, ఆన్‌లైన్ బ్యాంకింగ్, వీటికి తోడు కరోనా వైరస్ విజృంభిస్తున్న సమయంలో నోట్ల సంఖ్య అనూహ్యంగా పెరగడం మొదలైంది.

గత ఎనిమిది ఆర్థిక సంవత్సరాలలో చెలామణిలో ఉన్న కరెన్సీకి సంబంధించిన వివరాలు పాకిస్థాన్ సెంట్రల్ బ్యాంకు వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

దాని ప్రకారం 2012 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 1.73 ట్రిలియన్ల కరెన్సీ చెలామణిలో ఉండగా, మరుసటి సంవత్సరం అది 1.93 ట్రిలియన్లకు పెరిగింది. 2014లో 2.17 ట్రిలియన్లు ఉండగా,ఈ ఆర్థిక సంవత్సరానికి 6.14 ట్రిలియన్లకు చేరుకున్నట్లు తేలింది.

గత ఆర్థిక సంవత్సరంలో అసాధారణ రీతిలో నోట్లను ప్రింట్ చేశారని ఎ.కె.డి సెక్యూరిటీస్ రీసెర్చ్ సెంటర్ అధినేత ఫరీద్ ఆలం అన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం రెండు రెట్లు అధికంగా నోట్లను ముద్రించిందని ఆయన చెప్పారు. నోట్ల చెలామణి పెరగడంవల్లనేనా?

ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్)తో ఒప్పందం ప్రకారం పాకిస్థాన్ సెంట్రల్ బ్యాంక్ నుంచి ప్రభుత్వం అప్పు తీసుకోవడం మానేసిన తర్వాత ఈ నోట్ల ముద్రణలో పెరుగుదల కనిపిస్తోంది. బడ్జెట్ లోటును తీర్చడానికి బహిరంగ మార్కెట్ నుంచి వాణిజ్య బ్యాంకుల ద్వారా ప్రభుత్వం డబ్బును సేకరిస్తోంది.

ప్రభుత్వాలకు రుణాలు ఇచ్చే ముందు స్టేట్ బ్యాంక్ కొత్త కరెన్సీని ముద్రించడం సర్వసాధారణం. కానీ ఇప్పుడు ఐఎంఎఫ్ నిబంధనల కారణంగా స్టేట్ బ్యాంక్ నుండి పాకిస్థాన్ ప్రభుత్వం డబ్బు తీసుకునే మార్గం మూసుకుపోయింది. అంటే బ్యాంకుకు నోట్లు ముద్రించే అవసరం లేదు.

"చెలామణిలో వృద్ధి ఎక్కువగా ఉండటం వల్లే కొత్తగా నోట్లను ముద్రిస్తున్నారు" అన్నారు ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ కైజర్ బెంగాలీ. స్టేట్ బ్యాంక్ దగ్గర అప్పు తీసుకోకుండానే దగ్గర కరెన్సీ పెరుగుతోందంటే దీనర్థం ఏంటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ఇదే విషయం అడిగితే సరైన సమాధానం రాలేదని కైజర్ బెంగాలీ అన్నారు. పాకిస్థాన్‌లో ఏదీ పారదర్శకంగా జరగడం లేదని ఆయన ఆరోపించారు.

గత ఐదారు సంవత్సరాలుగా కరెన్సీ నోట్లలో వృద్ధి కొనసాగుతోందని ఆరిఫ్ హబీబ్ సెక్యూరిటీస్ సంస్థకు చెందిన ఆర్థిక నిపుణురాలు సనా తౌఫిక్ అన్నారు. ఐదేళ్ల క్రితం ప్రభుత్వం బ్యాంకుల ద్వారా లావాదేవీలపై పన్ను పెంచిన తరుణంలో ఈ అసాధారణ వృద్ధి ధోరణి మొదలైందని ఆమె అన్నారు. ప్రజలు కూడా బ్యాంకుల్లో డబ్బు కాకుండా బంగారాన్ని దాచుకోడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారామె.

ఐఎంఎఫ్‌తో చేసుకున్న ఒప్పందం కారణంగా చేతిలో డబ్బులేని ప్రభుత్వం, ఆదాయం పెంచుకునేందుకు అనేక చర్యలు చేపట్టింది. పన్నులు పెంచడం అందులో ఒకటి. దీంతో ప్రజలు బ్యాంకుల నుంచి పెద్ద ఎత్తున డబ్బును డ్రా చేసుకోవడం ప్రారంభించారు. ఆ కారణంగా నోట్లకు డిమాండ్ పెరిగింది. దానితోపాటే ముద్రణ కూడా పెరిగింది. వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడం కూడా కరెన్సీ ముద్రణకు కొంతవరకు కారణమని ఫరీద్ ఆలం అన్నారు.

బడ్జెట్ లోటు నుంచి బైటపడటానికి స్టేట్ బ్యాంక్ నుంచి అప్పులు చేయవద్దని ఐఎంఎఫ్ షరతు పెట్టింది. కరోనా వైరస్ మహమ్మారి సమయంలో ప్రభుత్వం ప్రకటించిన రిలీఫ్ ప్యాకేజీ కోసం, ఇతర ఖర్చుల కోసం ఇలా పెద్ద సంఖ్యలో ప్రభుత్వం కరెన్సీని ముద్రించిందని భావిస్తున్నారు. నోట్ల ముద్రణ ద్రవ్యోల్బణాన్ని పెంచుతుందా?

పెద్ద సంఖ్యలో నోట్లను ముద్రిస్తే ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. "ఎక్కువ నోట్లను ముద్రించడం అంటే ప్రజల దగ్గరకు డబ్బును ఎక్కువగా చేర్చడం. దానివల్ల వారిలో కొనుగోలు శక్తి పెరుగుతుంది. వాళ్లు డబ్బు ఎంత ఎక్కువ ఖర్చు చేస్తే, అంతగా వస్తువుల ధరలతోపాటు, ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుంది" అన్నారు ఆర్థిక నిపుణురాలు సనా తౌఫిక్. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి వడ్డీ రేట్లు పెంచుతున్నారని ఆమె అన్నారు. సరఫరా సమస్యల కారణంగా గత రెండేళ్లుగా ద్రవ్యోల్బణం పెరిగిందని డాక్టర్ ఖైసర్ బెంగాలీ అన్నారు. ఏదేమైనా కరెన్సీ భారీ పెరుగుదలతో డిమాండ్ పెరిగి ద్రవ్యోల్బణం కూడా పెరిగే ప్రమాదం ఉందని ఆయన అన్నారు.

నోట్ల సంఖ్యనుపెంచితే వచ్చే నష్టాలేంటి?

నోట్ల సంఖ్య పెరిగితే బ్లాక్ మార్కెట్ పెరుగుతుందని సనా తౌఫిక్ అన్నారు. "పెద్ద సంఖ్యలో నోట్లను ముద్రిస్తున్నారంటే ప్రజలు తమ డబ్బును బ్యాంకులో జమ చేయకుండా నగదు రూపంలో ఆదా చేస్తున్నారని అర్థం. దీనిని నాన్-అఫీషియల్ లేదా బ్లాక్ ఎకానమీ అంటారు" అని ఆమె వివరించారు.

కరెన్సీ నోట్లు ఎక్కువ కావడం వల్ల స్మగ్లింగ్, మనీలాండరింగ్ కూడా పెరుగుతాయని ఆమె చెప్పారు. "ప్రజలు బ్యాంకుల్లో కాకుండా డబ్బును తమ వద్ద ఉంచుకుంటారు. అదే డబ్బు అక్రమంగా మారుతుంది" అన్నారామె. అధిక కరెన్సీ నోట్ల ముద్రణ నగదు నిల్వకు కారణమవుతుందని, డబ్బంతా కొందరి దగ్గరే పేరుకు పోతుందని ఆమె హెచ్చరించారు.

కేరళ గోల్డ్ స్కామ్.. దావూద్ ఇబ్రహీంకు లింకు..

సంచలనం సృష్టించిన కేరళ గోల్డ్ స్కామ్ కేసులో కొత్త కోణం వెలుగుచూసింది. ఆ స్మగ్లింగ్ కేసులో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. కేసును విచారిస్తున్న నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అధికారులు కోర్టుకు ఈ విషయాన్ని వెల్లడించారు. బంగారం స్మగ్లింగ్‌తో వచ్చిన డబ్బును జాతి వ్యతిరేక ఉగ్రవాద కార్యకలాపాలకు వాడినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు భావిస్తున్నారు. దౌత్యపరమైన మార్గంలో విదేశాల నుంచి బంగారం స్మగ్లింగ్ చేస్తున్న కేసులో నిందితులుకు బెయిల్ ఇవ్వరాదు అని కోర్టును ఎన్ఐఏ కోరింది. దౌత్యపరమైన సంబంధాల గురించి మరింత లోతుగా దర్యాప్తు చేపట్టాల్సి ఉందని ప్రత్యేక కోర్టుతో ఎన్ఐఏ చెప్పింది. గోల్డ్ స్మగ్లింగ్ కేసులో ఓ నిందితుడైన రామీస్‌కు టాంజానియాలో డైమండ్ వ్యాపారం ఉన్నది. అతను యూఏఈకి బంగారం అమ్మినట్లు తేలింది. అయితే ఆఫ్రికాలో దావూద్ ఇబ్రహీం గ్యాంగ్ జరుపుతున్న నేరాలకు సంబంధించిన అంశాలను ఎన్ఐఏ కోర్టుకు సమర్పించింది. యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ సాంక్షన్స్ కమిటీ, యూఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రెజరీ ఇచ్చిన నివేదికలను ఎన్ఐఏ తన వాదనలో వినిపించింది.

ఇదీ కేసు..

తిరువనంతపురంలోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కాన్సులేట్‌కు చెందిన పార్శిల్‌లో రూ.15 కోట్ల విలువైన 30 కిలోల బంగారాన్ని జులై 4న విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. కాన్సులేట్‌కు సంబంధించిన పార్శిల్‌లో భారీగా బంగారం పట్టుబడటంతో ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించారు. ఈ వ్యవహారంలో యూఏఈ కాన్సులేట్ ఉద్యోగితో పాటు కేరళ ప్రభుత్వ ఐటీ శాఖలో పనిచేస్తున్న స్వప్న సురేష్‌ను అధికారులు ఇప్పటికే అరెస్టు చేశారు. సీఎం విజయన్‌కు కార్యదర్శిగా చేస్తున్న ఎం.శివశంకర్ హస్తం కూడా ఉన్నట్లు గుర్తించారు. అయితే ఆయన్ను పదవి నుంచి సీఎం తొలగించారు.

"చెత్త నుంచి నల్ల బంగారం" - వర్మికల్చర్ మరియు వర్మికంపోస్టింగ్

Dr. V.Anu Prasanna,
M.Sc., Ph.D
Assistant Professor, Head of the Department,
Department of Zoology,
Yogi Vemana University,
YSR Kadapa, A.P

భారతదేశంలో ఆహార కొరత సమస్యను పరిష్కరించడంలో హరిత విప్లవం ఒక గొప్ప ఆవిష్కరణ, కానీ అందులో అధిక దిగుబడి రకాల విత్తనాలను ఉపయోగించి వ్యవసాయ ఉత్పత్తిని పెంచారు. అయితే ఈ అధిక దిగుబడి రకాల విత్తనాలుకు రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం అవసరం. అందువలన, రైతులు సేంద్రీయ ఎరువులు మరియు ఎరువులకు బదులుగా రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు మరియు పురుగుమందుల వాడకాన్ని మొదలుపెట్టారు, దీని ఫలితంగా భారతదేశంలో తీవ్రమైన భూమి మరియు పర్యావరణ క్షీణతకు దారితీసింది. అలాగే రైతులుకి వ్యవసాయంలో ఎక్కువ పెట్టుబడి పెట్టిన తక్కువ రాబడే వస్తుంది. అందువల్ల, పొలాలను తిరిగి సేంద్రీయంగా మార్చాల్సిన అవసరం ఏర్పడింది. సేంద్రియ వ్యవసాయంను ప్రోత్సహించడంలో వర్మికల్చర్ మరియు వర్మికంపోస్టింగ్ ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. వర్మికల్చర్ యొక్క ఆచారం కనీసం ఒక శతాబ్దం నాటిది, అయితే ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విభిన్న పర్యావరణ లక్ష్యాలతో ఇది మళ్ళీ వ్యర్థ పదార్థాల నిర్వహణ, మట్టి నిర్విషీకరణ, పునరుత్పాదక మరియు స్థిరమైన వ్యవసాయం పెంచడానికి పునరుద్దరించబడింది. వర్మికల్చర్ (Vermiculture) అనేది వానపాముల పెంపకం అలాగే వర్మికంపోస్టింగ్ (Vermicomposting) అనేది ఒక ప్రక్రియ, దీని ద్వారా సేంద్రియ పదార్థాలను (సాధారణంగా వ్యర్థాలు) ఎరువుగా మార్చడం కొరకు వానపాములు ఉపయోగించబడతాయి, దీనిని వర్మికంపోస్ట్ (Vermicompost) అని అంటారు. అంటే వానపాములు జీవద్రవ్యరాశిని తిని మరియు దానిని జీర్ణమైన రూపంలో 'వార్మ్ క్యాస్టింగ్స్' (worm castings)గా విసర్జిస్తుంది. ఈ రెండు ప్రక్రియలు ఒకేవిధంగా ఉంటాయి అయితే విభిన్నంగా ఉంటాయి. చిన్న మరియు పెద్ద తరహా రైతులకు కంపోస్టింగ్ ఉత్పత్తి చేయడం కొరకు ఇది అత్యంత సరళమైన మరియు చౌకైన విధానాల్లో ఒకటి. వర్మికల్చర్ యొక్క లక్ష్యం, స్థిరమైన పంటను పొందడం కోసం వానపాములు సంఖ్యను పెంచడమే. మట్టి ఆరోగ్యాన్ని కంపోస్ట్లు కాపాడుతుంది కాబట్టి, వర్మికంపోస్టింగ్‌ని "చెత్త నుంచి నల్ల బంగారం" అని పిలవబడతుంది ఎందుకు అంటే నేల ఉత్పాదకత సాగు ఖర్చును తగ్గిస్తుంది. అధిక స్థాయిలో పోషక పదార్థాలు ఉండటం వల్ల వర్మీకంపోస్టుకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. వర్మీకంపోస్టులో చాలా మంచి పోషక పదార్థాలు ఉంటాయి– కర్బన 9.15 నుండి 17.98%, మొత్తం నత్రజని 1.5 నుండి 2.10%, మొత్తం భాస్వరం 1.0 నుంచి 1.50%, మొత్తం పొటాషియం 0.60%, కాల్షియం మరియు మెగ్నీసియం 22.00–70.00, ఇనుము 1800 ppm, జింక్ 50 ppm. "రైతు స్నేహితుడు" అని పిలువబడే వానపాములు మట్టిలో ఏరేటర్లుగా (aerators), గ్రైండర్లు (grinders), క్రషర్లు (crushers), కెమికల్ డీగ్రేడర్ (chemical degradors) మరియు జీవ ఉద్దీపనాలు (biological stimulators)లుగా పనిచేస్తాయి ఎందుకంటే ఇవి రకరకాల ఎంజైములు (enzymes)– ప్రొటిసెస్ (proteases), లైపేజ్లు (lipases), అమైలేసిస్ (amylases), సెల్యులేసెస్ (cellulases) మరియు చిటినేస్ (chitinases) లను స్రవిస్తాయి, ఇవి పండ్ల, తోటలు, డైరీలు మరియు పొలాల నుంచి ఉత్పన్నమైన సేంద్రియ వ్యర్థాలను జీవరసాయన పద్దతిలో సేంద్రీయ ఎరువులుగా మారచేస్తాయి. వానపాములు కోలోమిక్ ద్రవాల (coelomic fluids)లో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్న కారణంగా రోగకారక జీవులను చంపడం వల్ల వర్మికంపోస్ట్ దుర్వాసన లేకుండా ఉంటుంది. భారతదేశంలో ఎక్కువగా ఉపయోగించే వానపాము జాతులు Indian blue (Perionyx excavatus), African night crawler (Eudrilus euginae) మరియు Tiger worm (Eisenia foetida). ఇతర రెండు జాతులతో పోలిస్తే Eudrilus euginaeలో అధిక పోషణ, ఎదుగుదల మరియు జీవ అధోకరణం (biodegradation) సామర్థ్యం కలిగి ఉన్నట్లు కనుగొనబడింది. వానపాములు వ్యర్థ పదార్థాల యొక్క సహజ జీవ అధోకరణం మరియు విఘటనం త్వరగా చేసే కారణంగా వర్మికొంపోస్ట్ తక్కువ సమయం (5 నుంచి 6 వారాల్లో)లోనే తయారు అవుతుంది. వర్మికంపోస్టింగ్‌లో గట్టితొక్క ఉండే పండ్లు, గుడ్డు పెంకులు మరియు ఎముకలు కూడా క్షీణించవచ్చు, అయితే వీటికి ఎక్కువ సమయం పడతుంది. దేశంలో వర్మీకంపోస్టింగ్‌కు మంచి ఆదరణ ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో తమ స్వంత అవసరాలను తీర్చడం కోసం తక్కువ మంది రైతులు దీనిని ఆచారిస్తున్నారు. దేశంలో వర్మీకంపోస్ట్ యొక్క వాణిజ్య ఉత్పత్తి ఇంకా పెద్ద ఎత్తున రావాల్సి ఉంది మరియు యువ రైతులకు లాభదాయకమైన వ్యాపారంగా నిరూపించవచ్చు. వర్మికొంపోస్టింగ్‌ని ఒక వ్యాపారంగా మొదలుపెట్టే ముందు కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొంది ఆచరణలో పెట్టవచ్చు. అంతే కాకుండా చాలా తక్కువ పెట్టుబడులు (సుమరు 2 లక్షలు)లో ఎక్కువ లాభాలు పొందవచ్చు.

ఎక్కడో పుట్టి, ఎక్కడో...

ఎస్.సంపత్ కుమార్ శ్రీవత్స, డోర్.నెం. 9-1-211/15, పవన్ రెసిడెన్సీ అపార్ట్స్, భగత్‌నగర్, కరీంనగర్ - 505 001, సెల్ : 9346435123

అజిత్, రంజితలది అపురూపమైన జంట అని చెప్పవచ్చు. మూడేళ్ళ క్రితమే మాస్టర్స్ పూర్తి చేసుకున్న అజిత్ టెక్‌మహేంద్రాలో ఇంజనీర్‌గా చేరాడు. అతనిది చాలా సున్నితమైన మనస్తత్వం. రంజిత ఒక సంప్రదాయక కుటుంబం నుండి వచ్చిన అమ్మాయి. తెల్లవారేలోగానే లేవటం చక్కగా స్నానం చేసి దేవునికి దీపం వెలిగించుకోవటం. వెంటనే బ్రేక్‌ఫాస్ట్ సిద్ధం చేసి పెట్టటం ఆమెకు ఇష్టమైన నిత్యకృత్యాలు. చెప్పలేనేదు కదూ! రంజిత మైక్రోసాఫ్ట్‌లో చేస్తుంది.

వస్తున్నారా! వేడి వేడి ఉప్మా రెడీ అని పిలుస్తుంది. "ఇదుగో వచ్చేనానోయ్! ఉప్మాలోని జీడిపప్పుల్ని తలుచుకుంటేనే నోరూరిపోతుంది నాకు" అంటూ టక్ సరిచేసుకుంటూ వచ్చేస్తాడు అజిత్ – ఇద్దరూ కల్సి నవ్వుకుంటూ టిఫిన్ తినేసి ఆఫీస్‌కు రెడీ అవుతారు. కమ్మని కాఫీ రెడిగానే ఉంటుంది. అది కాస్త తాగేసే లోపలే రంజిత వెళ్ళి కారుబయటికి తీస్తుంది. అజిత్ ఇంటి తలుపులు బంధించి తాళం బిగించి పరుగెత్తుకుని వస్తాడు. "నేనే డ్రైవ్ చెయ్యనా" అంటుంది గోముగా. ఓహో! అందుకేనా రాణీగారు డ్రైవింగ్ సీట్లో చేరారు? అని నవ్వుతూ ఒక ఎర్రగులాబీని ఆమె జడలో తురుముతాడు. సాయంత్రం వచ్చేప్పుడు అజిత్ వెళ్ళి రంజితను పికప్ చేసుకుని ఇంటికి వచ్చేస్తాడు.. అలా అన్యోన్యంగా ఉంటూ ఒక సంవత్సరం గడిచేసరికి వారి జీవితంలోకి ఒక బుచ్చిబాబు ప్రవేశించాడు. వారిద్దరి సంతోషానికి హద్దులు లేవు. మూడు నెలలు సెలవు పెట్టేసింది. బాబు బారసాల బ్రహ్మాండంగా జరిగింది. బాబుకు ధీరజ్ అని నామకరణం చేశారు. రజితకు బాబే జీవితంగా మారిపోయిడు. అజిత్ ఆఫీస్ నుండి రాగానే స్నానాలగదిలోకి దూరి ఫ్రెష్‌గా వచ్చేసి ధీరజ్‌తో ఆడుకుంటాడు. బాబు జాగ్రత్త చిన్నోడుకదా! కాస్త సున్నితంగా ఎత్తుకోండి "అనగానే" తెల్సులేవోయ్! నాకు ఎలా ఎత్తుకోవాలో ఎలా ఆడించాలో వాడే నేర్పిస్తున్నాడు తెలుసా! అజిత్‌లో ఆనందం వెల్లివిరుస్తుంది. బాబుకు మూడు నెలలు దాటాక మల్లమ్మ అనే మహిళను పనిమనిషిగా కుదుర్చుకున్నారు. ఇద్దరూ ఇంట్లో ఉండగానే మల్లమ్మ వచ్చి పనులన్నీ చేసిపెడుతుంది. బాబుకు స్నానం చేయించి పౌడర్ వేసి డ్రెస్ వేసేస్తుంది. వారం రోజుల వరకూ చూసి నమ్మకం కుదిరాక రజిత తిరిగి ఉద్యోగంలో చేరింది. హైద్రాబాద్ మహానగరంలో ఉండాలంటే ఇద్దరూ సంపాదించాలి తప్పదు మరి.

మల్లమ్మకు బాబుకు సమయానికి పాలుపట్టటం బజ్జోపెట్టటం తరువాత బట్టల్ని శుభ్రంగా పిండివేయటం వంటి పనులు చేస్తున్నందుకు నెలకు పదివేలు జీతంగా ముట్టజెప్పుతున్నారు. అజిత్, రజితలు ఆఫీస్ నుండి తిరిగి వచ్చేసరికి బాబును చక్కగా ముస్తాబు చేసి ఆడిస్తూంటుంది. వాళ్లకు బాబును అప్పగించి టీ చేసిపెట్టి తన ఇంటికి వెళ్లిపోతుంది మల్లమ్మ.

ఎటువంటి ఇబ్బంది లేకుండా కాలం గడిచిపోతుంది. రెండు నెలలుగా మల్లమ్మ వాళ్ళ పనిమనిషిలా కాకుండా ఇంటిమనిషిలా మారిపోయింది. అజిత్ బాబును ఆడిస్తున్నాడు. రజిత వచ్చి బాబును తీసుకుంటూ "మల్లమ్మ వంటి మనిషి దొరకటం మన అదృష్టం కదా! అన్నది. "ఔనోయ్. ఇల్లంతా భలే నీట్‌గా సర్దేస్తుంది". ధీరజ్ బాబును కూడా కంటికి రెప్పలా చేసుకుంటున్నది. అని కితాబిచ్చాడు.

ఆ రోజు జనవరి 22 బుధవారం ఎప్పటిలాగే బాబుతో సరదాగా ఆడుకొని ఆఫీస్‌కు వెళ్లటానికి సిద్ధమైనారిద్దరూ. అజిత్ కారు డ్రైవింగ్ సీట్లో చేరిపోయాడు రజిత చిన్నోడికి ముద్దులు పెట్టేసి "బంగారు కొండా! బెంగపెట్టుకోకురా నాన్నా! తొందరగానే వస్తాం కదా!" అంటూ పనిమనిషి కేసి చూసింది. "అమ్మా ! ఇలా ఇవ్వండి. చిన్న దొరను బాగా చూసుకుంటాను కదా! నాకు మచ్చిక అయినాడు కూడా తల్లి వద్ద నుండి మల్లమ్మ తీసుకుంటూ అన్నది. బాబు ఏడ్వటం మొదలు పెట్టాడు. "దా.. దా.. దా.. బుచ్చి దొరా! నీకు నేనున్నానుగా అంటూ బాబును ఎత్తుకున్నది. రజితకు మనసంతా బాధగా అన్పించింది. చిన్నోడిని వదిలి ఉండాలంటే మనసొప్పటం లేదు. కానీ.. ఉద్యోగం? ఎలాగో సరిపుచ్చుకున్నది పాపం.

ఆఫీస్‌లోకి దూరి సిస్టమ్ ముందు కూర్చున్నాడు అరగంట తర్వాత బాస్ నుండి పిలుపు వచ్చింది. "గుడ్ మార్నింగ్ సర్! వాట్ కెన్ ఐ డూ? మర్యాదగా అన్నాడు అజిత్" మార్నింగ్ అజిత్! ఈ రోజు నువ్వు చెయ్యాల్సిన పనేమి లేదు. ప్రాకెక్ట్ వర్క్ పూర్తి చేశావు కదా! ఇంటికెళ్ళి హాయిగా రిలాక్స్‌కా మీ చిన్నబాబుకు సర్‌ప్రైజ్ ఇవ్వు" అన్నాడు బాస్.

ఎగిరి గంతేసినంత పనిచేసి కారు తీసుకొని రయ్యిన డ్రైవ్ చేస్తూ ఇంటికి చేరుకున్నాడు వెళ్తూ వెళ్తూ రజితకు కాల్ చేశాడు. చాలా ఆనందగా ఉంది. కారును గేట్ బయటే పార్క్‌చేసి. బాబూ! నేనొచ్చేశా నాన్నా! అంటూ ఇంట్లోకి దూరిపోయాడు. ఎవ్వరూ కనబడలేదు.. మల్లమ్మా! మల్లమ్మా అని గట్టిగా పిలిచేసరికి వంటగదివైపునుండి పనిమినషి వచ్చేసింది. ఆమె ముఖంలో ఏదో కంగారు కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. "బాబేడీ? నిద్రపోయాడా? ఆడుకుంటున్నాడా?" ఊపిరి సల్పకుండా ప్రశ్నల వర్షం కురిపించాడు. మల్లమ్మ బిక్కు బిక్కుమంటూ "బాబును ఊయల్లో పడుకోబెట్టి వంటగదిలో కెళ్ళానయ్యా! వచ్చి చేసేసరికి బాబు కనల్పించటం లేదు". మెల్లగా చెప్పింది. అజిత్ పరుగెత్తుకెళ్ళి ఇంటి తలుపులన్నీ పెట్టేశాడు. ఒక్కసారి పిచ్చివాడిలా మారిపోయాడు. బాబూ! బంగారం! కన్నా! ధీరజ్! అని అరుస్తూ ఇల్లంతా వెతికాడు... బాబు జాడ లేదు. మొబైల్ తీసుకొని పోలీసుకు ఇన్‌ఫాం చేశాడు. అలాగే రజితకు కూడా చెప్తూతూండగా గొంతు జీరబోయింది. కోపం, బాధా తన్నుకు వచ్చాయి. "బాబెక్కడ చెప్పవే రాక్షసీ! ఏం చేశావ్ మా బాబును?"

గద్దించాడు. మల్లమ్మ చేతులు పట్టుకొని గజ గజ వణుకుతూ "నాకే పాపమూ తెలియదయ్యా! అని జవాబిచ్చింది. పోలీసు వ్యాన్ వచ్చి ఆగింది ఇద్దరు కాన్‌స్టేబుల్స్‌తో సహా ఇన్‌స్పెక్టర్ లోపలికి వచ్చారు. వస్తూనే మల్లమ్మను రెక్కలు విరిచి పట్టుకున్నారు. ఏడుస్తూ కూలబడిపోయిన అజిత్‌ను ఓదార్చి వివరాలు తెల్సుకున్నాడు ఇన్‌స్పెక్టర్. ఇంతలో రజిత పరుగెత్తుకుంటూ ఓపలికి వచ్చి "మల్లమ్మా ! మా బాబును మాకివ్వు... అంటూ రోదిస్తూ కూలబడిపోయింది. ఇన్‌స్పెక్టర్ కొట్టిన చెంపదెబ్బకు మల్లమ్మ బెదిరిపోయింది. కాన్‌స్టేబుల్స్ తలా రెండు తగిలించేసరికి "అయ్యా! చెప్పుత దొరా! చెప్పుతా! నిజం చెప్పుతా. బాబు క్షేమంగానే ఉన్నాడయ్యా ! అంటూ జరిగిందంతా చెప్పింది. ఆమె చెప్పింది విని అందరికీ తల తిరిగి పోయింది.

నిజానికి మల్లమ్మ తనకు పరిచితురాలైన ఒక బిచ్చగత్తెతో ఒప్పందం కుదుర్చుకున్నది. అది సరిగ్గా ఉదయం 10 గంటలకు వచ్చి బాబును తీసుకెళ్లుతుంది. పాత గుడ్డలో మూటకట్టుకొని వెళ్ళిపోతుంది. రోడ్డు కూడలి వద్ద అందరి వద్ద కెళ్ళి "పొద్దట్నుండీ ఏడుస్తున్నాడు బాబూ! తినటానికి తిండి లేదు నాయినా!" అంటూ గట్టిగా గిచ్చుతుంది బాబు ఏడుపు లంకించుకుంటాడు. కొద్దిసేపు అట్లా బిచ్చం ఎత్తుకుని దారి పక్కనే ఉన్న దేవాలయం ముందు గుడ్డ పరచి బాబును దాన్లో పడుకోబెట్టి వచ్చిపోయే భక్తుల వద్ద జాలిగా బిచ్చం అడుక్కుంటుంది. ఎప్పుడైనా పాపమనిపిస్తే బాబునోట్లో పాలపీకపెడ్తుంది. సాయంకాలం ఐదుగంటలయ్యేలోపు బాబును మల్లమ్మకు అప్పగిస్తుంది. బాబును వాడుకున్నందుకు కృతజ్ఞతగా యాభైరూపాయలు కూడా చెల్లిస్తుంది.

తిరిగి రాగానే బాబుకు స్నానం పోసి, కొత్తడ్రెస్ వేసి పాలుపట్టి ఫ్రెష్‌గా తయారు చేస్తుంది మల్లమ్మ భార్యాభర్తలు ఆఫీస్‌నుండి వచ్చేలోగా ఈ తతంగమంతా పూర్తి చేసి. ఏమిఎరగనట్లు ఎ.సి. గదిలో పడుకోబెట్టుతుంది. పొద్దంతా ధూళి కొట్టుకుని, ఎండలో పడుకొని కందిపోయిన బాబు అదంతా మరిచి చల్లగా నిద్దురపోతాడు. మల్లమ్మ చాలా జాగ్రత్త మనిషిసుమా! ఇదంతా విని తట్టుకోలేక పోయిన అజిత్ రంజితలు పనిమనిషిని జుట్టుపట్టుకొని లాగుతూ పిచ్చిగా కొడ్తున్నారు. ఇంతలో కాన్‌స్టేబుల్స్ వెళ్ళి ఆ బిచ్చగత్తెను పట్టుకొని ధీరజ్ బాబును ఇంటికి తీసుకొచ్చారు. ఎక్కడ పుట్టి బాబు... ఎక్కడో....? చక్కని బాబు ఒళ్ళంతా దుమ్ముకొట్టుకొని పోయి చింకిగుడ్డలో చుట్టిఉన్నాడు.. ఏడవలేక మూల్గుతున్నాడు. రజితకు దు:ఖం ఆగలేదు. వేగంగా వెళ్ళి కాన్‌స్టేబుల్స్ దగ్గర నుంచి బాబును లాగేసుకున్నది. వాడికి చుట్టిన పాతగుడ్డలను తీసేశాడు. అజిత్. అమ్మ స్పర్శతో బాబు పులకించి పోయాడు. వాడి పాదాలను ఆర్తిగా ముద్దు పెట్టుతున్నాడు అజిత్. బాబును తల్లి హత్తుకోగానే ఆమె స్తనాలనుండి పాలు ధారగా రావటంతో ఆబగా తాగేస్తున్నాడు. రంజిత అలాగే వాడిని దగ్గరగా పొదివిపట్టుకొని తమకంతో కళ్ళు మూసుకున్నది. వాతావరణమంతా కొక్కసారి స్థబ్ధంగా మారిపోయింది.

రచయిత హామీ...

ఆర్యా! ఈ కథ నా స్వంతం ఏ భాషనుండి కాపీ కొట్టిందికాదు. నేను విన్న ఒక సంఘటన ఆధారంగా స్వయంగా నేను వ్రాసిందేనని హామీ ఇస్తున్నాను. ఇందులోని పేర్లు స్థలం మార్చి వ్రాసినవే. ఎవరినీ ఉద్దేశించి వ్రాసింది కాదు.

యజమాని చల్లే మేతకి అలవాటు పడ్డ పావురాలు ఎగరడం మర్చిపోయాయి.

ప్రభుత్వాలు వెదజల్లే రాయితీలకు అలవాటు పడ్డ ప్రజలు ఎదగడం మర్చిపోయారు

స్వతంత్ర భారతావనిలో
నీ స్థానమెక్కడ సోదరా !

ఏడు దశాబ్దాలు దాటినా
ఎక్కడిగొంగలి అక్కడేకదా మి త్రమా !

తెల్లదొరలనుండి
నల్లదొరలకు అధికారంమారింది తప్ప
నీకు ఒరిగిందేమిటి మిత్రమా !

నాటికి నేటికి
నీజాతి రొడ్డునపడిఉందికదా మిత్రమా!

స్వతంత్ర భారతావనిలో
సెంటుభూమైనా
నీకు దక్కలేదుకదా మిత్రమా !

కులాల పేర్లతో
మనుషులపై
మనుషుల దాడులు
పరువు హత్యలు
మానభంగాలు
స్వేచ్ఛగా జరుగుతుతూనేఉ న్నాయికదా!

నీకు దక్కాల్సినదేదీ
నేటికీ దక్కలేదుకదా మిత్రమా!

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో
అభాగ్యులు అనాదల శాతమే
అధికంకదా మిత్రమా !.........

మంగళగిరి ప్రసాదరావు

మంగళగిరి ప్రసాదరావు

తమిళనాడు రాజకీయం....

డి.ఉదయ్ భాస్కర్

జయలలిత మరణం తరువాత అన్నాడీఎంకే పార్టీ పరిస్థితి పూర్తిగా అగమ్యగోచరంగా మారింది. జయలలిత తరువాత ఎవరు అనేదానిపై నెలకొన్న సందిగ్ధత వాతావరణం ఆ పార్టీలో అస్థిరతకు దారి తీసింది. ముఖ్యమంత్రి అవుతానన్న తరుణంలో శశికళ జైలుకెళ్లింది. ఆ తరువాత ఆ పార్టీలో అధికార పీఠం కోసం ఒకరితో ఒకరు పోట్లాడుకోవడం మొదలుపెట్టారు. ముఖ్యమంత్రి పళనీ స్వామి, మాజీ ముఖ్యమంత్రి (డిప్యూటీ సి.ఎం) పన్నీర్ సెల్వం ల మధ్య పోరు తీవ్రతరమైన నేపథ్యంలో టీటీవి దినకరన్ పార్టీని చీల్చి తన సొంతగా అమ్మడీఎంకే పార్టీని ఏర్పాటు చేసాడు.

ఇలా పార్టీలోని అంతర్గత కుమ్ములాటల వల్ల అన్నా డీఎంకే ప్రభుత్వం ఒక పది రోజులైనా మనగలుగుతుందా అని అంతా అనుకున్నారు. కాకపోతే ఆశ్చర్యం కలిగిస్తూ, ఇప్పటివరకు ప్రభుత్వం నిరాటంకంగా నడుస్తుంది. కానీ భవిష్యత్తు ఎలా ఉండబోతుందనేది మాత్రం చెప్పడం కష్టం. మరోవైపు కరుణానిధి తన మరణానికి ముందే తన వారసుడిని ప్రకటించడంతో, స్టాలిన్ అన్నీ తానై పార్టీని నడిపిస్తున్నాడు. ఇప్పటికే డీఎంకే పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా తమిళనాట సుపరిచితుడయ్యాడు. పార్టీలో బలమైన నేతగా, పార్టీనంతా ఒక్కతాటిపైకి తీసుకొచ్చి నడిపిస్తున్నాడు.

అన్నాడీఎంకే పార్టీలోని అంతర్గత విభేదాలను ఉపయోగించుకొని, పాలనా పరంగా ఏర్పడ్డ అనిశ్చితి వల్ల లాభపడి అధికారంలోకి రావాలని డీఎంకే అధినేత స్టాలిన్ భావిస్తున్నాడు. మరోపక్క అమ్మడీఎంకే అధినేత టీటీవి దినకరన్ ఏమో సాధ్యమైనంత మంది అన్నా డీఎంకే నేతలను తన పార్టీలోకి లాగడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. రెండు ఆకులు ఒకటే... రెండు రెళ్లు ఆరు ఇది రాజకీయ గణితం.కానీ తమిళనాట రెండు ఆకులు ఒకటే అని నిరూపించాయి.

తమిళనాడులో ఎన్నికల ఫీవర్ ముందే మొదలైంది. పార్టీలన్నీ ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతుండగా.. అన్నా డీఎంకే దూకుడు పెంచింది.. కొద్దిరోజులుగా పార్టీలో ఏర్పడిన సంక్షోభాన్ని ముగించింది.. అన్నా డీఎంకే సీఎం అభ్యర్థిగా పళనిస్వామి పేరును ప్రకటించింది. పళని పేరును ఉప ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం స్వయంగా ప్రకటించారు.. అలాగే 11మందితో అన్నా డీఎంకే పార్టీ స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కో ఆర్డినేటర్‌గా పన్నీర్ సెల్వం ఉంటారు.. అలాగే పార్టీ చీఫ్‌ను కూడా నిర్ణయించనున్నారు.

పళని స్వామి, పన్నీర్ సెల్వం కొద్దిరోజులుగా పళని స్వామి-పన్నీర్ సెల్వంలలో ఎవరు సీఎం అభ్యర్థి అనే అంశంపై వివాదం రేగింది. సీఎం అభ్యర్థి ఎంపిక విషయమై అన్నాడీఎంకే కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో పన్నీర్‌సెల్వం, పళని స్వామి వాగ్వాదానికి దిగడంతో పార్టీలో చర్చనీయాంశమైంది. ఇద్దరు నేతలు సీఎం అభ్యర్థిత్వంపై పోటీపడటంతో పార్టీలో కలకలంరేగింది. పన్నీర్ సెల్వం ను బుజ్జగించేందుకు సీనియర్ మంత్రులు ఆయన నివాసంలో చర్చలు జరిపారు. ఆ తర్వాత పన్నీర్‌సెల్వం మెట్టు దిగలేదు. చెన్నై తిరిగొచ్చిన పన్నీర్‌సెల్వం పార్టీ శ్రేణుల అభిప్రాయాలకు అనుగుణంగా తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు సమావేశమై ఈ విభేదాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు.అభ్యర్థిగా ప్రస్తుత సీఎం పళనిస్వామి పేరును పన్నీర్ సెల్వం ప్రకటించారు. 2021 ఎన్నికల కోసం 11 మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేశారు.

2016 డిసెంబరులో అప్పటి సీఎం జయలలిత అనారోగ్యంతో కన్నుమూశారు. జయలలిత మరణంతో అన్నాడీఎంకే రెండుగా చీలింది. పన్నీర్ సెల్వం, పళని స్వామి వర్గాలుగా విడిపోయింది. అనంతరం కొన్ని నెలల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు పన్నీర్ సెల్వం. ఆ తర్వాత నెలకొన్న రాజకీయ పరిణామాలతో పన్నీర్ సెల్వం సీఎం బాధ్యతల నుంచి తప్పుకున్నారు. సీఎంగా పళని స్వామి పగ్గాలు చేపట్టారు. కొన్నాళ్ల పాటు ఇరువురి మధ్య విభేదాలు కొనసాగాయి. ఆ తర్వాత రెండు వర్గాలు కలవడంతో శుభం కార్డు పడింది. సీఎంగా పళని, డిప్యూటీ సీఎంగా పన్నీర్ కొనసాగుతూ వచ్చారు.

ఐతే వచ్చే సంవత్సరం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మళ్లీ ఇరువురి మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో తాను సీఎంగా ఉంటానని పన్నీర్ చెప్పడంతో.. అందుకు పళని స్వామి అంగీకరించలేదు. కొన్ని రోజులుగా ఈ విషయమై పార్టీలో రచ్చ జరిగింది. ఎట్టకేలకు ఇవాళ జరిగిన చర్చల్లో ఓపియస్, ఇపియస్

మధ్య సయోధ్య కుదరడంతో సీఎం అభ్యర్థిపై క్లారిటీ వచ్చింది. పళని స్వామిని సీఎం అభ్యర్థిగా స్వయంగా పన్నీర్ సెల్వం ప్రకటించారు. ఐతే పార్టీ అధ్యక్షుడిగా ఎవరుంటారన్న దానిపై కమిటీని ఏర్పాటు చేశారు. పళని సీఎం అభ్యర్థిగా ఉన్న నేపథ్యంలో.. పన్నీర్‌ను పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకునే అవకాశముంది.

తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలున్నాయి. 2016లో జరిగిన ఎన్నికల్లో అన్నాడీఎంకే నుంచి 125 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. డీఎంకే నుంచి 97 మంది విజయం సాధించారు. కాంగ్రెస్ 7, ఐయూఎంఎల్ 1, ఎఎంఎంకే 1 సీటు సాధించాయి. ఐతే జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకేలో పెరిగిన వర్గ విభేదాలు, ప్రభుత్వ వ్యతిరేకతను తనకు అనుకూలంగా మార్చుకోవాలని డీఎంకే భావిస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న వ్యూహంతో ముందుకెళ్తోంది.



చిన్నమ్మ రీఎంట్రీ ?

తమిళనాడు రాజకీయాలు మరోసారి హీటెక్కబోతున్నాయి. దివంగత ముఖ్యమంత్రి జయలలితకు అత్యంత సన్నిహితురాలు శశికళ నటరాజన్ త్వరలో (చిన్నమ్మ) జైలు నుంచి విడుదల కాబోతున్నారు. దీనిపై తమిళనాడుకు చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఆశీర్వాదం ఆచారి చేసిన ఓ ట్వీట్ రాజకీయాల్లో కలకలం రేపుతోంది. తమిళనాడులో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అదే సమయంలో శశికళ విడుదల కాబోతున్నారనే వార్తలు తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశమౌతున్నాయి.

అది కూడా ఆమె విడుదలవుతున్నారనే సమాచారాన్ని బీజేపీ నాయకుడు వెల్లడించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వచ్చే ఏడాది ఎన్నికల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గడువు కంటే ముందే ఆమెను విడుదల చేస్తున్నారని ఆయన చెబుతున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నాలుగేళ్ల జైలుశిక్ష అనుభవిస్తున్న శశికళకు ముందుగానే జైలు జీవితం నుంచి మోక్షం లభించే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే అది ఎంతవరకూ నిజం అనేది మాత్రం తెలియాల్సి ఉంది. ఎందుకంటే జైలు అధికారులు దానికి సంబంధించి తమకు సమాచారం లేదని చెబుతున్నారు. ఎవరైనా రిలీజ్ అయ్యే నెల ముందే తమకు సమాచారం వస్తుందని, తమకు అలాంటి సమాచారం ఏదీ అందలేదని చెబుతున్నారు. తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ హీట్ గానే ఉంటాయి. అరవ ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపినా ఏకపక్షంగానే ఉంటుందంటారు. ఇక్కడ సెంటిమెంట్లు, అభిమానం కూడా ఎక్కువే. దీంతో తమిళనాడు ఎన్నికల్లో రజనీకాంత్ పార్టీ కోసం అనేక పార్టీలు ఎదురు చూస్తున్నాయి. రజనీకాంత్ రాజకీయ పార్టీ ప్రకటిస్తే ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాలని దాదాపు అన్ని పార్టీలూ ఎదురు చూస్తున్నాయి. చిన్నా చితకా పార్టీలూ. ప్రస్తుతం అధికార అన్నాడీఎంకే, విపక్ష డీఎంకే కూటమిలో ఉన్న అన్ని చిన్నా చితకా పార్టీలన్నీ రజనీకాంత్ పార్టీ కోసం వేచి చూస్తున్నాయి. తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తానని రజనీకాంత్ ఇప్పటికే ప్రకటించారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉండబోనని, ప్రజలకు సేవ చేసే వారిని తమ పార్టీ తరుపున ముఖ్యమంత్రి అవుతారని రజనీకాంత్ ప్రకటించడంతో చిన్నా చితకా పార్టీలు దానివైపు ఆశగా ఎదురు చూస్తున్నాయి.

కాంగ్రెస్ తో సహా..

రజనీకాంత్ ఇప్పటి వరకూ పార్టీని ప్రకటించలేదు. అన్ని పార్టీలూ ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. ప్రధానంగా డీఎంకేలో కాంగ్రెస్ తో పాటు మరికొన్ని పార్టీలున్నాయి. అయితే ఈసారి ఎక్కువ సీట్లు ఇచ్చేందుకు డీఎంకే సుముఖంగా లేదు. దీంతో కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని పార్టీలో రజనీకాంత్ తో జతకట్టాలని భావిస్తున్నాయి. ఈ మేరకు ఆయనకు ఫోన్లు చేస్తున్నారు. పార్టీ ఎప్పుడు పెడతారని ప్రశ్నిస్తున్నారు.

దీనికి రజనీకాంత్ నుంచి సరైన సమాధానం రావడం లేదు.

జంప్ అవుదామని కొందరు..

ఇక అన్నాడీఎంకేలో ఉన్న పార్టీలు కూడా రజనీకాంత్ వైపు చూస్తున్నాయి. చిన్న పార్టీలు అనడం కంటే అన్నాడీఎంకేలో కీలక నేతలు కూడా రజనీకాంత్ పార్టీ పెడితే జంప్ అవుదామని కాచుక్కూర్చున్నారు. ఇక బీజేపీ సయితం రజనీకాంత్ పార్టీ పెడితే పొత్తుతో తమిళనాడు ఎన్నికలకు వెళ్లాలన్న ప్లాన్‌లో ఉంది. కానీ రజనీకాంత్ నుంచి ప్రకటన రావడం లేదు. ఆయన ప్రకటన కోసం తమిళనాడులో అన్ని రాజకీయ పార్టీలూ ఎదురు చూస్తున్నాయి. మరి రజనీ నుంచి ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి. కమల్ హాసన్ ఇప్పటికే తన పార్టీ మక్కల్ నీధి మయ్యంను ప్రారంభించాడు. గత పార్లమెంటు ఎన్నికల్లో, ఆ ఎన్నికలతోపాటు జరిగిన ఉప ఎన్నికల్లో తన పార్టీకి చెందిన అభ్యర్థులు బరిలోకి దిగారు.

ఎన్నికల ఫలితాలను చూసేసరికి మాత్రం కమల్ ఖచ్చితంగా షాక్ కు గురయ్యే ఉంటాడు. ఒక్కటంటే ఒక్క సీటును కూడా గెలవలేకపోయాడు. అంతే కాకుండా కమల్ టిక్కెట్లిచ్చినా అభ్యర్థుల్లో ఒక ముగ్గురు బీజేపీలో చేరారు కూడా. ఈ పరిణామాలన్నిటిని అర్థం చేసుకున్న కమల్ హాసన్ తన ఒక్కడి బలం మాత్రమే సరిపోదనుకున్నాడేమో రజనీకాంత్ ని కూడా కలుపుకుపోవాలని అనుకుంటున్నాడు. కమల్ హాసన్, రజని కాంత్ లకు తమిళ రాజకీయాలను శాసించడం అంత తేలికైన పని మాత్రం కాదు. తమిళనాట సినిమాకి, రాజకీయానికి చాలా దగ్గరి సంబంధముంది. ఆ నాయకులంతా తమ మాస్ ఇమేజ్ ను ఓట్ల రూపంలోకి మార్చుకోగలిగారు. రాష్ట్ర రాజకీయాలను శాసించారు. గతంలో ప్రజల్లో అటువంటి అభిమానం ఉండేది, వారికి ఎక్కువ ఆప్షన్స్ కూడా ఉండేవి కావు.

కానీ ప్రస్తుతం ఉన్నదీ కొత్త తరం, ఉడుకు రక్తం ఉరకలేస్తుంది. సినిమా స్టార్లకు బయట, సోషల్ మీడియాలో ఉన్న ఇమేజ్ ఓట్లను రాల్చలేదు అని కమల్ హాసన్, పవన్ కళ్యాణ్ ప్రయోగాలు మనకు ఋజువు చేసాయి. కమల్ హాసన్ మీటింగులకు కూడా పవన్ మీటింగులకు వచ్చినట్టే భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చేవారు. కానీ ఎన్నికలవేళ మాత్రం వారు తమ ఓట్లను వేరే వారికి వేశారనే విషయాన్నీ ఎన్నికల ఫలితాలు బల్ల గుద్ది చెబుతున్నాయి. కాబట్టి కమల్, రజనీలు తమ ఇమేజ్ ను ఎంతమేర ఓట్ల రూపంలోకి మార్చుకోగలుగుతారో వేచి చూడాలి.

అంతే కాకుండా తమిళనాడు రాజకీయాలు ప్రాంతాలవారీగా డిఫరెంట్‌గా ఉంటాయి. ఉదాహరణకు మదురై ప్రాంతాన్ని గనుక తీసుకుంటే, అక్కడున్న మాస్ ఓటర్ బేస్ ను కమల్, రజనీలు ఖచ్చితంగా కొల్లగొట్టాల్సి ఉంటుంది. అందరికి గనుక గుర్తుంది ఉంటే, కమల్ హాసన్ తన పార్టీని మధురైలోనే ప్రారంభించాడు. అతనికి సైతం ఇక్కడి ఓటర్ల ప్రాముఖ్యత తెలిసినట్టే మనం అర్థం చేసుకోవాలిసి ఉంటుంది.

మదురైని తన కంచుకోటగా చేసుకొని డీఎంకే బహిష్కృత నేత అళగిరి అక్కడ చక్రం తిప్పుతున్నారు. గతంలో కమల్ హాసన్ చేసిన కామెంట్‌కి మద్దతు పలికిన అళగిరి, ఇప్పుడు రజనీకాంత్ చేసిన "రాష్ట్రంలో నాయకత్వ లేమి కనపడుతుంది" అనే కామెంటుకు సైతం వత్తాసు పలికాడు. ఈ స్పీడు చూడబోతుంటే అళగిరి వీరిరువురి మద్దతిచ్చేలానే ఉన్నాడు. కమల్, రజనీ ఎంత చాకచక్యంగా ఇటువంటి చిన్నా, చితకా పార్టీలను కలుపుకుపోతారో, వారి విజయావకాశాలు దాని మీద ఆధారపడి ఉంటాయి.

రాష్ట్రంలోని అన్నడీఎంకే సర్కారు పటిష్టంగా లేదనే విషయం ఎంత వాస్తవమో, ప్రజలకు మాత్రం వాస్తవికంగా అందాల్సిన సంక్షేమ పథకాలు అందుతున్నాయనేది అంతే నిజం. ప్రభుత్వం పటిష్టంగా లేకపోవచ్చు కానీ, వారి పాలన మాత్రం మరీ కొట్టిపారేసేంత చందంగా మాత్రం లేదు. కాకపోతే తమిళనాడు రాజకీయ చరిత్రకు భిన్నంగా జయలలిత వరుసగా రెండుసార్లు అధికార పీఠాన్ని దక్కించుకుంది. పది సంవత్సరాలు అవ్వడం వల్ల ఏమన్నా, ప్రజా వ్యతిరేకత మొదలైతే దాన్ని వీరిరువురు ఎంత మేర అందిపుచ్చుకోగలరనేది వేచి చూడాల్సిన మరో అంశం.

ఇక ప్రత్యామ్నాయం విషయానికి వస్తే తమిళనాడు ఓటర్ల ముందు చాలానే ఆప్షన్స్ ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెసులు ఉన్నా, అక్కడ వారి ప్రభావం అత్యల్పం. ఇరు జాతీయపార్టీలు కూడా ఏదో ఒక ప్రాంతీయ పార్టీతోనే పొత్తు పెట్టుకోవాలిసిందే.

రాష్ట్రంలో గనుక తీసుకుంటే, స్టాలిన్ ఆధ్వర్యంలోని డీఎంకే పార్టీ ఉండగా, అన్నడీఎంకే పార్టీ కూడా మరో ఛాయిస్‌గా ప్రజలముందు ఉంది. అన్నాడీఎంకే నుండి చీలిపోయి టీటీవి దినకరన్ ఏర్పాటు చేసిన అమ్మడీఎంకే కూడా ఎన్నికల్లో ప్రజలకు మరో ఆప్షన్. వీరితోపాటు, ఇప్పుడు కొత్తగా కమల్, రజనీల కూటమి.

అంతే కాకుండా తమిళనాడు రాజకీయాల్లో కులం అత్యధిక ప్రభావాన్ని చూపెడుతుంది. కొన్ని తరాలుగా అయితే డీఎంకే పార్టీకో లేదా అన్నాడీఎంకే పార్టీకో వారు తమ అమూల్యమైన ఓటును వేస్తున్నారు. ఇలాంటి కుల రాజకీయాలకు పెద్ద పీటవేసే తమిళనాడు రాజకీయాల్లో, తాను ఏ కులానికి చెందిన వాడను కాను అని ప్రకటించుకునే కమల్ హాసన్, తమిళుడే కానటువంటి రజనీకాంత్ లు ఎంతమేర సఫలీకృతులవుతారో కూడా వేచి చూడాల్సిన మరో అంశం.

ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలే ప్రమాదం కూడా లేకపోలేదు. రాజకీయంగా డీఎంకే ఇప్పుడు ముందంజలో ఉంది. కాబట్టి కమల్, రజనీల ప్రయత్నాలను వారు అధికార దాహం కోసం అంటూ, తీవ్ర స్థాయిలో విరుచుకుపడే ప్రమాదం కూడా లేకపోలేదు. ఇప్పటికే వారిపైన ఈ దాడి ప్రారంభమయ్యింది కూడా. ఈ నేపథ్యంలో వారు ఈ దాడిని తట్టుకొని ఎలా నిలబడతారో చూడాలి.

కాకపోతే, తమిళనాడులో నూతన తరం శకం ఆరంభమయ్యింది. నూతన ఓటర్లు ఇప్పుడు రాజకీయ ముఖచిత్రాన్ని మార్చడానికి తమ ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించడానికి సిద్ధమయ్యారు. కొత్త నాయకత్వం కోసం మాత్రం అక్కడ ఖచ్చితంగా ఆస్కారం ఉంది.మొత్తం మీద తమిళ రాజకీయం రొంబ అదిరింది.

ఆడ "మనీష" క్షమించు ...

రాము, ఎం.ఎస్‌సి., బి.ఇడి

అమ్మా.. తల్లీ.. ఆడ'మనీష'వై పుట్టావా? అదీ దళిత కులంలో. నీకంటూ సొంత ఆశ, సొంత కల ఉండకూడదు కదమ్మా.. సొంత బతుకు లేనప్పుడు అవెలా సాధ్యం? ఆడపిల్లకు ఈడొచ్చినకొద్దీ మిఠాయికోసం కుక్కలు చొంగ కారుస్తున్నాయి. మాంసం కోసం మృగాలు వేటాడుతున్నాయి.

చుట్టూతా రాక్షసమూకలు ముసుగులతో సంచరిస్తున్నప్పుడు నిన్ను నీవు ఎలా కాపాడుకోగలవమ్మా? ప్రతిక్షణమూ నీకు ప్రమాదమే కదా..

ఇప్పుడు నీ ఎదుగుదలే కాదు, నీ ఉనికే నీకు శాపంగా మారిందిగా తల్లీ.. రాముడు అక్కడే పుట్టాడని గుడి కడుతున్నారు. పవిత్ర గంగానదీ అక్కడే ప్రవహిస్తున్నది. ఆ భక్తులు నీకు రక్షణ ఇవ్వలేక కురుసభ పేక్షకపాత్ర వహిస్తున్నారు తల్లీ.. ఇది ఈనాటిది కాదు. యుగాల ఘోష. తరాల వధ. వేదాలు చదివాడని మన ముత్తాత రాముని చేతిలో అంత మయ్యాడు. అంతకు ముందే ప్రశ్న కారణంగా రేణుకాంబతల్లి పరశు రాముని చేతిలో ఇప్పటికీ ఎంతోమంది నాటి నుంచి నేటివరకూ ఈ భారత వ్యధశిల నెక్కుతున్నారు. వర్ణాశ్రమధర్మం రాజ్యమేలుతూనే ఉన్నది. ఇప్పుడు నిర్భయ చెల్లిగా నీవంతు వచ్చింది. అంతే.. ఉద్యమాలు వస్తున్నాయి. చట్టాలు పుడుతున్నాయి. వస్తున్న వందల వేల కేసుల్లో శిక్షలు పడుతున్నది ఒకటో.. అరా అంతేగా..

దుశ్శాసనులందరూ రారాజు తమ్ముళ్ళేమరి. ఏం చేద్దాం. శౌర్యం, ప్రతాపం, ఛాతి పొడవు అన్నీ చేతగాని తప్పుడు మాటలు తల్లీ. కరుణామయుడు క్రీస్తురక్తం భువిని తాకరాదని తల్లులూ చెలెళ్లూ

ధవళ వస్త్రాలు పరిచారు. దోసిళ్ళు పట్టారు. నీ రక్తం ఈ భూమిని తాకరాదని చేప్పేందుకు మా చట్టాలు, మా పాలనకు చేతులు చాలడం లేదు తల్లి. నీకు ఆలనగా మా మగజాతి హృదయం ఉంటేఆ స్థాయి ఎదిగేందుకు ఇంకెతకాలం పడుతుందో తెలియదు తల్లీ.. మమ్మల్ని క్షమించు.

ఎవరు ఎవరితో జత కట్టాలన్నది ఆయా వ్యక్తుల అభీష్టం. వారి ఇష్టాల్ని తల్లిదండ్రులు, కులాలు, వ్యవస్థలు శాసించడం అమానుషం. తమకు ఇష్టం లేదని పెళ్ళాడిన వ్యక్తులని హతమార్చడం పాశవికం. సహజీవనం కూడా ఆమోదయోగ్యమని సర్వోన్నత న్యాయస్థానమే తీర్పు చెప్పాక వ్యక్తులు అభ్యంతరం చెప్పడం అనంగీకారం. తమకు ఇష్టం లేని పెళ్ళి అంటూ అపుడు ప్రణయ్ నీ, ఇపుడు హేమంత్‌నీ హత్య చేయించడం అత్యంత దుర్మార్గం. ఇది ఏదో ఒక కులానికి సంబంధించిన వ్యవహారం కాదు, మొత్తం సమాజాన్ని పీడిస్తున్న హేయమైన ఘట్టం. ప్రణయ్, హేమంత్‌లే కాదు, ఈమధ్య కాలంలో కేవలం మరో కులం అయినందున చాలామంది మీద దాడులు చేశారు, చంపేశారు. ఈ ఉదంతాలు వింటున్నాం, చూస్తున్నాం, కొన్నాళ్ళకు విస్మరిస్తున్నాం.

స్త్రీ పురుషుల వివాహానికి సంబంధించి చట్టాలు, సామాజిక సూత్రాలు, రాజ్యాంగం చెప్పిన అంశాల్ని పెడచెవిన పెట్టే ధోరణి అంతటా కనిపిస్తున్నది. కులాంతర, మతాంతర, దేశాంతర వివాహాలు అతి సాధారణమైన ధోరణి ఒకవైపున చూస్తున్నాం. మరోవైపున ఈవిధమైన అప్రజాస్వామిక, అమానవీయ ఉదంతాలు తరచుగా వినిపిస్తున్నాయి. 'పరువు హత్య' అనే పేరుతో వీటిని చెబుతూ వచ్చారు, గానీ ఇవి కుల దురంహకార హత్యలన్నది స్పష్టం. నిచ్చెనమెట్ల సమాజపు పెత్తందారీ ధోరణికి బలయ్యేవారు ఏవో కొన్ని కులాలకు పరిమితమై ఉండరని ఈ ఘటనలు చెబుతున్నాయి. బడుగు బలహీన వర్గాలే కాదు, ఇతరులు కూడా ఇలాంటి దుర్మార్గపు దాడులకీ, హత్యలకీ గురవుతున్న సన్నివేశాల్ని చూస్తున్నాం. వీటికి మూలాలు నిచ్చెనమెట్ల సమాజంలో ఉన్నాయి. కనుక నిచ్చెనలు కూల్చకుండా వ్యక్తుల దుర్మార్గం గురించి ఎంత మాట్లాడినా ఏం ఫాయిదా?

స్త్రీ, పురుష సంబంధాల అంశంలోనూ మనవాళ్ళకు స్పష్టత లేదు. ప్రజాస్వామిక దృక్పథంతో వ్యవహరించే సంస్కారం అబ్బలేదు. అమ్మాయిలు చదువుకోడం, ఉద్యోగాలు చేయడం ఇవాళ అందరికీ ఆమోదయోగ్యమైన అంశాలే. కానీ వివాహం దగ్గరికి వచ్చేసరికి ఆమె ఎంపిక ప్రశ్నార్థకమవుతుంది. ఆమె ఎవరిని పెళ్ళాడాలో తల్లిదండ్రులు నిర్ణయిస్తున్నారు. అమ్మాయిల అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరించే పితృస్వామిక భావజాలం కుటుంబంలో బలంగా వుంది. తమ కులం కాని వ్యక్తిని పెళ్ళాడటాన్ని సహించలేకపోతున్నారు. ఈ పురుషాహంకారం, కుల దురంహకారం కలగలసినందున పాశవిక హత్యలకు పాల్పడుతున్నారు.

కుటుంబాల్లో ప్రజాస్వామిక సంబంధాలు నెలకొనాలంటే కులమతాల పట్టింపులు అంతరించాలి. కులరహిత సమాజం కోసం పోరాడే క్రమాన మాత్రమే కులాలు అంతరిస్తాయి. అందుకు అవసరమైన చైతన్యం ప్రోది చేయడం ప్రజాస్వామిక ఉద్యమాల్లో పనిచేసే వారి కర్తవ్యం. అంతేగాక రాజ్యాంగంలోని స్వేచ్ఛ, సమానత్వం అనే భావనల్లోని విశాలత్వాన్ని బోధపరచడానికి సిలబస్‌లో వాటిని పొందుపరచాలి. కులరహిత, మతరహిత మానవ సంబంధాల పరికల్పనకు అనువైన కార్యక్రమాలు చేపట్టాలి. కానీ అధికారాన్ని చెలాయించే పెత్తందారీ కులాల్నించి ఇందుకు సానుకూలత వ్యక్తం కాదు. అందుకని స్త్రీ పురుషుల స్వేచ్ఛ, సమానత్వాన్ని కోరే వ్యక్తులు, సంస్థలు నిరంతరం క్రియాశీలకంగా ఉండాలి. కుల, మత దురంహకారాలని నిరసించే సాహిత్యం, సంస్కృతి, కళలు నిత్యమూ, నిరంతరమూ జనబాహుళ్యంలోకి పరివ్యాప్తం కావాలి

"మతములన్నియు మాసిపోవును, మంచి ఒక్కటి నిల్చి వెలుగును" అని వందేళ్ళ కిందటనే గురజాడ అన్నప్పటికీ మతాలు, కులాలు మరింత స్థిరీకరణ పొందుతూ మనుగడలో ఉండటం గమనార్హం. కులనిర్మూలనా పోరాటాలు బలోపేతం కావాల్సిన అవసరాన్ని గుర్తించాలి. అణచివేతకీ, వివక్షకీ వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలు కులాల స్థిరీకరణకు గాక, వాటి నిర్మూలనకు దారి తీయాలి. సకల పీడనలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తుల, సంస్థల క్రియాశీలత కులనిర్మూలన చైతన్యం బలపడటానికి దోహదం చేయాలి. మన సమాజంలో కులం ఒక వాస్తవం. దాని నిర్మూలన అంత సులభం కాదు. కానీ అసాధ్యం మాత్రం కాదు.

పని ప్రదేశాల్లో, స్నేహసంబంధాల్లో, చివరకు పార్కుల్లో నడిచేవారిలోనూ ఒకే కులానికి చెందినవారు ఓ చోట పోగుపడి వుండటం గమనార్హం. ఆలోచనాపరులనుకున్న ఆంతరంగిక బృందాల్లోనూ ఒకే కులానికి చెందినవారు దగ్గరగా ఉండటం గమనార్హం. వీటిని సన్నిహితంగా గమనించాలి, విశ్లేషించాలి. ఆధిపత్య కులాల పెత్తనాల్ని నిరసించే పోరాటాల గమనాన్ని నిర్ధారించుకోవాలి. పీడనకీ, అణచివేతకీ జరిగే ఉద్యమాలు పీడితుల కులాల మధ్య వైరుధ్యాలకు తావివ్వకూడదు. ఆ వైరుధ్యాల్ని పరిష్కరించుకుంటూ అంతిమంగా కులనిర్మూలనకు దోహదపడే చైతన్యం బలోపేతం కావాలి. కుల నిర్మూలనకు సంబంధించి అంబేద్కర్ ఆలోచనల సారం ఆచరణలో ప్రతిఫలించాలంటే ఏం చేయాలో యోచించాలి. అంతేగాక గురజాడ, జాషువా, సి.వి. వంటి వారి రచనల్ని అధ్యయనం చేస్తూ కుల నిర్మూలన పోరాటాల గమ్యం, గమనం ఆకళింపు చేసుకోవాలి. చలం చెప్పినట్టు స్త్రీల స్వేచ్ఛని గౌరవించే హృదయ సంస్కారం సకల జనుల్లో పాదుకోవాలి. తమ ఆత్మసఖుని ఎంచుకునే స్వేచ్ఛ మహిళకు ఉంటుందనే వాస్తవాన్ని తల్లిదండ్రులు, కుటుంబాలు గుర్తించాలి. ఇందుకు అనువైన చైతన్యం పాదుకోవడం ద్వారానే కుల దురహంకార హత్యల్ని ఆపడం సాధ్యం.

విదేశీ నిధులతో రాష్ట్రంలో కుల, మత ఘర్షణలు ప్రేరేపించేందుకు మా ప్రత్యర్థులు కుట్ర పన్నారు. అందుకే వారం రోజులుగా ప్రతిపక్షాలు అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి" అంటున్నారు యూపీ సీఎం యోగి ఆధిత్యనాథ్. హథ్రస్‌లో జరిగిన హత్యాచార ఘటనను అడ్డుపెట్టుకుని ఉత్తరప్రదేశ్‌లో విద్వేషాలను రెచ్చగొట్టేందుకు, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు "అంతర్జాతీయ కుట్ర" జరుగుతోందట! ఈ మేరకు యూపీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు

చేశారు. "కుట్ర" ఏదైనా, ఎవరు చేసినా ఖండించాల్సిందే. అదీ పనిగట్టుకుని ఓ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే కుట్రలను ముమ్మాటికీ ఖండించాల్సిందే. కానీ దేశమంతటా హత్రస్ ఘటనపై నిరసనలు పెల్లుబుకుతున్న వేళ.. వాటిని దారి మళ్లించేందుకు ప్రభుత్వమే ఇలాంటి 'కుట్ర' పన్నాగం పన్నితే మాత్రం అది క్షమార్హం కాదు. మనీషాపై అమానుషం జరిగిన ఐదు రోజుల వరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి చేతులు రాని ఘనత వహించిన యూపీ పోలీసులు.. ముఖ్యమంత్రి నోట ఈ "కుట్ర" ప్రకటన వెలువడటమే ఆలస్యం, దేశద్రోహం సహా మరో 19 అభియోగాలతో పలు స్టేషన్‌లలో క్షణాల మీద కేసులు నమోదు చేశారు.

జరిగిన దారుణంపై కనీస మానవత్వం ప్రదర్శించని ప్రభుత్వ పెద్దలు, ఇప్పుడు ఈ "కుట్ర" ఆరోపణలు చేయడం నిజమేనా? లేక ఈ అమానవీయ ఘటనపై వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహాన్ని దారిమళ్లించేందుకు ఇదొక ఎత్తుగడా..?! బాధితురాలి మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు లేకుండా దహనం చేసిన జిల్లా మెజిస్ట్రేట్, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్, పోలీసు అధికారులపై ఇంతవరకూ ఏ కేసులూ లేవు! కానీ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నాయని చెపుతున్న ఈ "అంతర్జాతీయ కుట్ర" ఆరోపణలపై మాత్రం క్షణాలమీద హత్రస్ మొదలు అయోధ్య వరకు యూపీలోని అనేక స్టేషన్‌లలో కేసులు నమోదయ్యాయి! ఇవి ఎవరిని ఏమార్చడానికి? దేనిని నివారించడానికి? నిజానికి ప్రభుత్వానికి ఏది అప్రతిష్ట? జరిగిన దారుణం అప్రతిష్ట కాదా? ఘటనపట్ల పోలీసుల అలసత్వం, అన్యాయంగా అక్రమంగా వ్యవహరించిన తీరు అప్రతిష్టకాదా? స్వయంగా న్యాయాధికారులే నిందితుల తరుపున వకాల్తా పుచ్చుకుని బాధితులను బెదిరించడం అప్రతిష్ట కాదా? కన్నవారిని, తోబుట్టువులను నిర్బంధించి, అర్థరాత్రి ఆ ఆడపిల్లను అమానుషంగా కాల్చి బూడిదచేయడం అప్రతిష్టకాదా..? ఎందుకిలా చేయాల్సి వచ్చింది? ఆమె దేహాన్ని అయినవాళ్ళకి అప్పగిస్తే జరిగిన దారుణానికి ఆధారాలు దొరికిపోతాయను కున్నారా? లేక అసలు అత్యాచారమే జరుగలేదనే అసత్యాన్ని వల్లించడానికి అవకాశం లేకుండా పోతుందని భావించారా? కాదంటే వీటన్నిటికీ అర్థమేమిటి? ఇవన్నీ ఏ కుట్రలు? ఎవరి ప్రతిష్టకు భంగం కలిగించే కుట్రలు? ఎవరు పన్నిన కుట్రలు? ఇవికూడా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు పన్నిన "అంతర్జాతీయ కుట్ర"లో భాగమేనా?!

బాధితులను పరామర్శించడానికి ప్రభుత్వ పెద్దలకు ఎలాగు మనసు రావటం లేదు. కనీసం ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలను, చివరికి మీడియాను కూడా అందుకు అనుమతించకపోవడంలోని ఆంతర్యమేమిటి? మొన్న రాహుల్, ప్రియాంకలను అడ్డుకోవడం, నిన్న ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్‌పై సిరా చల్లడం దేనికి సంకేతాలు? హత్రస్ గ్రామాన్ని చీమ కూడా దూరకుండా పోలీసు పహారాలో దిగ్బంధించాల్సిన అవసరమేమిటి? "హత్రస్ గ్రామానికి పోయేందుకు వీసా ఎక్కడ లభిస్తుందో ఎవరైనా చెప్పగలరా?" అంటూ ప్రముఖ రచయిత్రి నటాషా బధ్వార్ చేసిన వ్యాఖ్యలు అక్కడి పరిస్థితికి అద్దం పడుతున్నాయి. పైగా బాధితుల నోరు నొక్కడమేగాక వారు అబద్ధాలు మాట్లాడుతున్నారని పోలీసులూ, ఇతర పెద్దలూ నిందితులకు వత్తాసు పలికే స్థితికి దిగజారడంలోని పరమార్థమేమిటి? ఈ చర్యలన్నీ ఎవరి కోసం? దోషుల్ని కాపాడుకోవడానికేనా? ఈ క్రమంలో సాక్ష్యాధారాలను సైతం మాయం చేసిన తీరు తెన్నులను కప్పిపుచ్చుకోవడానికేనా? చివరికి హిందూ సాంప్రదాయాలకు తామే రక్షకులమని గొప్పలు చెప్పుకునేవారు.. ఆ సాంప్రదాయాల్నీ బాధితురాలితో పాటే మంటగలిపారు కదా..! కన్న కూతురుకి పసుపు రాస్తామని కాళ్ళావేళ్ళా పడ్డా కనికరించని ఈ కసాయిలు రక్షించేది ఏ సాంప్రదాయాలను? ఎవరి ప్రయోజనాలను?

నెత్తురూ కన్నీరూ ఏకమై, బాధితత్వానికి నిలువెత్తు రూపమై న్యాయం కోసం వేడుకున్న ఓ ఆడపిల్లను బూడిదచేయడం ప్రతిష్టా? మనిషిగా ఆమెను గౌరవించలేదు సరికదా కనీసం ఆమె మరణాన్నైనా గౌరవించని అమానుషత్వం ప్రతిష్టా? జరిగిన దారుణాన్ని, ప్రభుత్వ వైఫల్యాన్ని లోకం వెలెత్తి చూపితే మాత్రం అది అప్రతిష్టా?! కండ్లముందు నిజం అడుగడుగునా నెత్తురోడుతూ కనిపిస్తున్నా.. అత్యాచారమే జరగలేదని బుకాయించడం మొదలు, ఆమెతో పాటే ఆధారాలనూ దగ్ధం చేసిన ఏలుబడిని పౌరసమాజం ప్రశ్నిస్తోంది.. ఏం సమాధానమిస్తారు? జేఎన్‌యూ వైద్యకళాశాల మెడికో లీగల్ నివేదిక పోలీసుల వాదనలకు భిన్నంగా అత్యాచారం జరిగిందని స్పష్టం చేస్తోంది. దీనికి ఏం సమాధానమిస్తారు? ఈ పరిస్థితుల్లో.. "వెల్లువెత్తుతున్న ప్రజాగ్రహానికి సమాధానం చెప్పలేక జపిస్తున్న పలాయన మంత్రమే ఈ 'అంతర్జాతీయ కుట్ర' ఆరోపణలా?" అని జనమనుకుంటే ఆ తప్పెవరిది? ఉత్తరప్రదేశ్‌లోనూ మరో ఈశాన్య ఢిల్లీని, భీమా కోరేగావ్‌నూ సిద్ధం చేస్తున్నారా..?!

ఒకే కుటుంబంలో ఓ ముఖ్యమంత్రి, ఓ క్యాబినెట్ మంత్రి, ఓ ఎంపీ ఉండవచ్చు కానీ ఒకే కుటుంబంలో ఇద్దరు వృద్ధాప్య పింఛనుదారుల మాత్రం ఉండకూడదు.

జయప్రకాష్ నారాయణ,

మాజీ ఐ.ఏ.ఎస్

కనువిప్పు

- శారద

అమ్మా! నేనే. పదహారో తారీఖున నా స్నేహితురాలు సుమ హైదరాబాదు వస్తోంది. దానితో రెండు మూడు రకాల పొడులు, నేను మొన్న వచ్చినప్పుడు వదిలేసి వెళ్లిన పట్టుచీరలు, పుల్లారెడ్డి స్వీట్స్ పంపించు. వాళ్లు సైదాబాదులో ఉంటారు. నాన్నను వెళ్లి ఇచ్చి రమ్మను. నేను వచ్చేటప్పుడు వాళ్ళకు బోలెడు వస్తువులు తెచ్చాను...."

మొదలయ్యింది పొద్దునే కృష్ణవేణికి కూతురు స్రవంతి నుండి ఈ "ఇండియా–అమెరికా"ల మధ్య సరఫరా చర్చలు. ఒకసారి కాదు, రెండు సార్లు కాదు, ప్రతి ఏడాది, రెండు మూడు సార్లు జరిగే తంతు ఇది.

"కృష్ణ వేణీ! ఆలోచించు! తల్లీకి పిల్లల పట్ల ప్రేమ ఉంటుంది. కానీ, అది ఇలా ఉండకూడదే. ఏ వస్తువులు అవసరమో, అనవసరమో, ఎక్కడ ఉన్నా అక్కడి సమాజంలో ఎలా కలిసిపోవాలో నేర్పాలి. మనం ఏం చేస్తున్నాం? వాళ్లకు మన జీవితాన్ని అందించాలన్న తపనలో తప్పటడుగులు వేస్తున్నాము"...అన్నాడు భర్త వేంకటేశ్వరరావు.

"చాల్లే ఊరుకోండీ! పిల్ల అంత దూరంలో ఉంది. ఒక అచ్చటా–ముచ్చటా లేదు. పాపం ఎంత కష్టపడుతోందో అక్కడ. ఇంత మాత్రం మనం భరించలేమా? కన్న తల్లిదండ్రులుగా..."

"వేణీ! ఖర్చులు నువ్వు లెక్క రాయవు. కానీ, నువ్వు చేసే సరఫరాతో మనం ఇంకో సంసారాన్ని పోషించవచ్చు"..

"మీరు మీ పిచ్చి మాటలు...ఆపండి".

రెండు వారాలకు తల్లికి స్రవంతి ఫోన్. "అమ్మా! నాకు రెండో నెల. నవంబర్ నెలాఖరులో డెలివరీ. నువ్వు నవంబర్ మధ్యకు వచ్చి మే మధ్య వరకు ఉండాలి. నేను చేసుకోలేను. మా అయన టికెట్ బుక్ చేస్తాడు. నాన్నను ఇన్స్యూరెన్స్ తీసుకోమను. నువ్వు డాక్టర్ దగ్గర అన్ని పరీక్షలు చేయించుకొని, ఆరునెలలకు సరిపడా మందులు, నాకు, పుట్టబోయే బిడ్డకు హోమియో మందులు తీసుకు రావాలి. నాన్నకు టికెట్ పెట్టలేను. ఒక ఆరునెలలు ఆయనను చెల్లాయి దగ్గర ఉండమని చెప్పు". ...

ఒక పక్క కూతురు గర్భవతి అన్న సంతోషం, మరో పక్క కూతురు తమ ఇద్దరినీ కాకుండా తనను ఒక్కదానినే రమ్మని చెప్పటం, మాట్లాడిన పద్ధతి కృష్ణవేణి కాసేపు నలిగిపోయింది. తేరుకొని, "ఏవండీ, విన్నారుగా. డాక్టర్ అపాయింట్మెంట్ తీసుకోండి నాకోసం"...

బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు కృష్ణవేణికి ఉన్న వ్యాధులు. మందులతో, ఎక్సర్సైజుతో కొంత అదుపులోనే ఉన్నాయి. పని ఎక్కువైతే మోకాళ్లు నొప్పులు వస్తాయి. పెద్ద కూతురు స్రవంతి అమెరికాలో. చిన్న కూతురు శ్రావణి హైదరబాదులో ఇటీవలే వివాహం అయ్యింది. ఆంధ్రాబ్యాంకులో పని చేసి స్రవంతి పెళ్లి కాగానే ఐదేళ్లముందే వాలటరీ రిటైర్మెంట్ తీసుకుంది కృష్ణవేణి. భర్త వేంకటేశ్వరరావు ఎస్బీఐలో సర్వీసు చేసి రిటైర్ అవ్వబోతున్నాడు. ఇద్దరి సర్వీసులో దాచుకున్న సొమ్ము, కృష్ణవేణి రిటైర్మెంట్ డబ్బుతో ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేశారు. నిజం చెప్పాలంటే ఇంక పెద్దగా బ్యాంకులో డబ్బులు లేవు, నెల నెలా వచ్చే పింఛను తప్ప. ఇంటి అద్దె లాంటి ఖర్చులు లెవు కాబట్టి సంసారం పెద్ద ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. దంపతులిద్దరూ జాగ్రత్తపరులే.

"శ్రావణీ! అక్క అమెరికాకు నన్నొక్కదాన్నే రమ్మంటోంది. నాన్న ఒక్కరూ ఉండటం కష్టం, మంచిది కాదు. మరి నీ దగ్గర....".

"అమ్మా! నాకు అత్తగారితోనే సరిపోతోంది. ఆఫీసు, ఇల్లు, అత్త

గారు...ఇంక నాన్న కూడానా...అందులో నాన్న అది కరెక్టు కాదు ఇది కరెక్టు కాదు అని కామెంట్స్ చేస్తుంటారు. ఈయనకు అవి ఇష్టం ఉండదు. సర్దిచెప్పే ఓపిక, సమయం నాకు లేదు. మీరే ఏదో ఒకటి చేసి నాన్నను కూడా అమెరికాకు తీసుకువెళ్ళండి...".

అవాక్కయ్యింది కృష్ణవేణి. "ఎంత కష్టపడి పెంచాము పిల్లల్ని? ఆడపిల్లలని లెక్క చేయకుండా వారికి కావలసినంత స్వేచ్ఛనిచ్చి, మంచి చదువులు చదివించి పెళ్లిళ్లు చేస్తే ఒక్క నిమిషంలో ఇద్దరూ ఇలా తమ సౌకర్యాన్ని, స్వార్థాన్ని వాళ్లు ఎలా చూసుకుంటున్నారు" అని నిర్ఘాంతపోయింది. భర్తకు విషయాలు తెలిస్తే నొచ్చుకుంటాడని అబద్ధమాడింది.

"ఏవండీ! మీరు రాకుండా నేను ఆరు నెలలు ఉండలేను. స్రవంతికి ఎన్ని డబ్బు ఇబ్బందులున్నాయో అల్లుడు ఏమంటున్నాడో! కాబట్టి నా గ్రాట్యూటీ డబ్బులు పెట్టి మీకు టికెట్ కొంటాను. ఇద్దరం కలిసే వెళదాము..."

"వేణీ! ఇలా ప్రతి దానికి మన రిటైర్మెంట్ డబ్బులు వాడితే ఇక మన వృద్ధాప్యానికి ఏమి మిగులుతాయి? నేను ఒక్కడినే ఉంటాను. శ్రావణిని కూడా ఇబ్బంది పెట్టదలుచుకోలేదు. నాకు వంట వచ్చు, పనిమనిషి ఉంటుంది..."

"ఏవండీ! మీరు లేకుండా నేను ఒక్క వారం రోజులు కూడా ఇంతవరకు ఒంటరిగా ఎక్కడికీ వెళ్లలేదు. మీరు రావలసిందే. ఇది నా నిర్ణయం". లక్ష రూపాయలు గ్రాట్యూటీ నుండి ఈ టికెట్ కోసం స్వాహా...వేంకటేశ్వరరావు అయిష్టంగానే ఒప్పుకున్నాడు.

ప్రయాణానికి రెండు నెలల ముందు నుండి స్రవంతి ఫోన్లలో ఆర్డర్లు. అమ్మా ఆ ఘాగ్రా చోళీ, ఫలానా పట్టు చీరా, శ్రీవారికి ఫలానా కుర్తా పైజామా, రకరకాల పిండి వంటలు, ఖరీదైన ఇతర వస్తువులు..డబ్బు మాత్రం కృష్ణ వేణి-వేంకటేశ్వరరావు దంపతుల జేబులోవే. దాదాపుగా ఈ దుబారా ఖర్చులు యాభైవేలకు పైగానే.

"సార్! అమెరికా ప్రయాణం అంటున్నారు కాబట్టి ఇద్దరూ ఎక్జిక్యూటివ్ మాస్టర్ హెల్త్ చెకప్ చేయించుకోండి. ఇవి కాకుండా గుండెకు, కిడ్నీలకు సంబంధించిన కొన్ని పరీక్షలు చేయాలి" ఈ దంపతుల ఫిజీషియన్ డాక్టర్ శ్రీధర్ సలహా. తప్పదు కదా అని బిల్లు కౌంటర్ దగ్గరకు వెళ్లి ఎంత అని అడిగారు. రెండు నిమిషాలలో టక టక కంప్యూటర్లో అన్నిటికీ లెక్కవేసి "మొత్తం పరీక్షలాకు 40 వేలు అవుతుందండీ! " అని బిల్లు చేసే వ్యక్తి చెప్పాడు. వేంకటేశ్వరరావుకు గుండె ఆగినంత పని అయ్యింది. ఎక్కడినుండి తేవాలి ఇంత డబ్బులు, ఎందుకింత ఖర్చు ఇప్పుడు....వెను దిరిగి ఇంటికి వెళ్లారు దంపతులు.

"అమ్మా స్రవంతీ! మా హెల్త్ చెకప్‌కు 40 వేలు అవుతుందిట. మేము ఏమీ చేయించుకోము. రోజూ వేసుకునే మందులే ఆర్నెలలకు తెచ్చుకుంటాము..చాలదా".

"నాన్నా! మీకు అర్థం కాదేంటి? ఇక్కడ ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే, ఇన్సూరెన్స్ కవరేజ్ లేకపోతే నా ఆస్తిపాస్తులు అమ్మి కట్టాలి. మీకున్న క్రానిక్ డిసీజెస్ వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల ఖర్చులు విజిటర్ ఇన్సూరెన్స్‌లో కవర్ అవ్వవు...మీరు పరీక్షలు చేయించుకుని మీ ముఖ్యమైన భాగాలు ఆరోగ్యంగా ఉన్నాయని తెల్చుకోవాల్సిందే..."

కూతురి కర్కశత్వం విని వేంకటేశ్వరరావు దిగులు పడ్డాడు. తన సేవింగ్స్ అకౌంట్లో ఉన్న డబ్బులతో ఇద్దరికీ పరీక్షలు చేయించారు. భగవంతుని దయ వలన ఏమీ పెద్ద ఇబ్బందులు లేవు. ఆరునెలలకు సరిపడా జలుబు, దగ్గు, జ్వరం, మోకాళ్ల నొప్పులు, విరేచనాలు, వాంతులు, తలనొప్పి వగైరా వగైరా సమస్త రోగాలకు అల్లోపతీ మందుల ఖర్చు పదిహేను వేలు. ఇవి కాక కూతురికి, పుట్టబోయే బిడ్డకు హోమియోపతీ మందుల ఖర్చు మరో ఐదువేలు...తడిసి మోపెడు. భార్యా భర్తలు ఈ అపరిమితమైన, అలవికాని ఖర్చులతో నీరసపడ్డారు.

ప్రయాణం వారం రెండురోజుల్లోకి వచ్చింది. విమానంలో ఎకానమీ క్లాసు టికెట్టుతో ఒక్కరికి నలభై ఆరు కేజీల బరువు మాత్రమే తీసుకు వెళ్లవచ్చు. దంపతుల బట్టలు, అప్పటికి కొన్న సామాను బరువు కలిపితే ఒక్కొక్కరికీ యాభై కేజీలు దాటాయి. తమకు కావలసిన వస్తువులను తీసేసి కూతురి ఆనందం కోసం,తమ ఆరోగ్యం కోసం అతి ముఖ్యమైనవి పెట్టుకుని అతి కష్టం మీద సూట్కేసుల బరువు సరి చేశారు. వెళ్లేముందు రోజు రాత్రి స్రవంతి అత్తగారినుండి ఫోన్. "వదినగారూ! నేను మర్చిపోయాను. మా వాడికి జీడిపప్పు పాకం చాలా ఇష్టం. రెండు కేజీలు అవి, వాడికి, అమ్మాయికి బట్టలు, అలాగే మా అమ్మాయి వస్తువులు కొన్ని ఇస్తాను..పట్టుకెళ్లండి". వియ్యపరాలు కావటంతో మొహమాటపడి అలాగే అంది వేణి.

"వేణీ! మన చెకిన్ లగేజీ నిండింది. ఎక్కడ పెడతావు ఇవి? ఏవండీ! హ్యాండ్ లగేజీలో పెట్టుకుందాం. బాగుండదు అల్లుడు, వియ్యాలవారు ఏమైనా అనుకుంటారు..." ఏడు కేజీల హ్యాండ్ లగేజీలో వియ్యాలవారి వస్తువులు పట్టించే సరికి అవి కూడా నిండాయి.

అన్నీ సర్దుకొని, ఇల్లు తాళం పెట్టి బయలుదేరారు దంపతులు. వాషింగ్టన్ విమానాశ్రయంలో స్రవంతి, అల్లుడు రిసీవ్ చేసుకున్నారు. బయటకు రాగానే కారు ఎక్కేలోపు ఒళ్లు గడ్డ కట్టుకుపోయేంత చలి. బ్రతుకు జీవుడా అని ప్రయాణపు అలసటతో ఇంటికి చేరారు. ఇక మొదలైంది వారికి నరకం.

స్రవంతి నిండు చూలాలు కావటంతో ఇంటిల్లిపాది వంట భారం వేణిపైనే పడింది. ఇవికాక రెండు పూటలా సింక్ నిండా అంట్లు, వారానికొకసారి ఇల్లు వాక్యూం క్లీనింగ్, బండెడు బట్టలు ఉతకటం...రోజంతా ఊపిరి పీల్చుకునే సమయం లేకుండా వేణి పగలు రాత్రి పని చేస్తోంది. మొదట్లో వేంకటేశ్వరరావు భార్యను పట్టించుకోలేదు. మెల్లమెల్లగా వేణిపై ఉన్న పనిభారం అర్థమయ్యింది. సహాయం చేయటం మొదలు పెట్టాడు. అంట్లు తోమటం, బట్టలు వాషర్ డ్రైయర్ లో వేయటం.....భారంగా రోజులు గడుస్తున్నాయి.

పిల్ల కానుపు అయ్యింది. బారసాల చేశారు. మొత్తం వంటా వేణి. దాదాపు యాభై మంది. ఆరోజు మొదలయ్యాయి ఆమెకు ఆరోగ్య సమస్యలు. విపరీతమైన మోకాళ్లనొప్పులు, మెడ, చేతుల నొప్పులు...గ్లాసు ఎత్త లేదు, అడుగు వేయలేదు. చంటి బిడ్డకు స్నానం చేయించాలి..కూతురికి సాయం చేయాలి..బండెడు పని ఇంట్లో. అతి కష్టం మీద ఎవ్వరికీ చెప్పకుండ ఒక నెల గడిపింది వేణి. తరువాత మెల్లగా స్రవంతికి చెప్పింది.

"స్రవంతీ! నాకు విపరీతమైన మెడనొప్పి, మోకాళ్లనొప్పులు వస్తున్నాయి. పెయిన్ కిల్లర్స్ పని చేయటం లేదు. ఇక్కడ ఎవరైన డాక్టర్..."

స్రవంతి "అమ్మా! నేను ముందే చెప్పాను. ఇండియాలో ఆరోగ్య సమస్యలకు ఇక్కడ డాక్టర్లు అక్కడిలా అందుబాట్లో ఉండరు. ఇక్కడ ఒక ఇండియన్ డాక్టర్ ఉన్నాడు. అపాయింట్మెంట్ కోసం ప్రయత్నిస్తాను. కానీ, నువ్వు హైదరబాద్ డాక్టరుకు ఫోన్ చేసి కనుక్కో ఏమైనా మందులు చెబితే తెప్పిస్తాను"....

"స్రవంతీ! అవన్నీ అయిపోయాయి. డాక్టర్ ఫోన్లో చెప్పలేను అని అంటున్నారు. నువ్వు ఇక్కడ అపాయింట్మెంట్ తీసుకో..."

అతి కష్టం మీద మరో వారం తరువాత డాక్టర్ అపాయింట్మెంట్ దొరికింది. ఫీజు 100 డాలర్లు. ఇన్సూరెన్సులో కవర్ అవ్వదు. తెచ్చుకున్న డాలర్లలో 100 ఇచ్చింది వేణి. "స్రవంతీ! యువర్ మదర్ మే నీడ్ కంప్లీట్ రెస్ట్ ఫర్ అ వీక్. ఇఫ్ ఈవెన్ ఆఫ్టర్ దట్ ద పెయిన్స్ డోంట్ రెడ్యూస్, వి నీడ్ టు డు ఎ స్కాన్ ఆఫ్ హర్ నెక్ అండ్ నీస్. దే విల్ కాస్ట్ టు థౌసండ్ డాలర్స్. ఇన్సూరెన్స్ డస్నాట్ కవర్ దీస్. ." స్రవంతికి గుండెలో రాయి పడింది. రెండు వేల డాలర్లా అని మారు మాట్లాడకుండా తల్లిని ఇంటికి తీసుకు వచ్చింది. ఒక వారం పాటు పని తనే చేసుకుంది. వేణి నొప్పులు తగ్గలేదు.

"నాన్నా! ఏం చేయను? రెండు వేల డాలరు పెట్టి పరీక్షలు చేయించే స్థోమత నాకు లేదు. మా ఆయన ఏవిటీ గోల అని విసుక్కుంటున్నారు. అమ్మ ఓర్చుకోవాల్సిందే. ఇంకా నాలుగు నెలలు ఉంది మీ ఆరు నెలలు పూర్తి అవ్వటానికి. నాకు బిడ్డ, మీ సాయం కావాలి..ఎలా"..

ఇంకో వారం చూద్దామని వేణి సర్ది చెప్పింది. నొప్పులు తగ్గక పోగా మానసిక వత్తిడితో, చలి విపరీతం కావటంతో, అసలు వ్యాయామం లేకుండా, బయటకు వెళ్లలేని మంచు కురిసే సమయంలో రోగం మరింతగ తీవ్రమయ్యింది. వేణి పూర్తిగా మంచాన పడింది.

వేంకటేశ్వరరావు వెంటనే ఒక నిర్ణయానికి వచ్చాడు. "అమ్మా స్రవంతీ! మీ అమ్మ ఇలానే ఉంటే చాలా కష్టం. మేము వెంటనే ఇండియా వెళ్లిపోతున్నాము. టికెట్ మార్పించుకున్నాము. రేపు ఆదివారం మా ప్రయాణం." అని తెగేసి చెప్పేశాడు. షాక్ తిన్నది స్రవంతి. అమ్మ పరిస్థితి చూసి ఏమీ అనలేకపోయింది.

మొహాలు నల్లగా పెట్టుకొని స్రవంతి, ఆమె భర్త వేణి దంపతులను ఇండియా విమానం ఎక్కించారు. రెండు రోజుల ముందునుండే ఇండియా అనగానే వేణిలో ఉత్సాహం మొదలయ్యింది. హైదరాబాదులో దిగారు. డాక్టరుకు చూపించుకున్నారు. స్పాండిలైటిస్, ఆర్థరైటిస్ చలికి, శారీరిక ఒత్తిడికి తీవ్రతరమయ్యాయని డాక్టర్ చెప్పాడు. తగిన వ్యాయామాలు, మందులు వాడి కుదుట పడటానికి ఒక రెండు నెలలు పట్టింది. పిల్లల సహాయం లేకుండానే మొత్తం భారాన్ని వేంకటేశ్వరరావు మోశాడు. భార్యను కంటికిరెప్పలా కాపాడుకున్నాడు.

ఆ రెండు నెలలూ వారిద్దరి మధ్య అమెరికాలో ఇంటికి బందీ అయ్యే జీవితం, ఆ చలి, పిల్లల స్వార్థంతో కూడిన నిస్సహాయత చర్చాంశాలు. భారతదేశం స్వర్గం అన్న భావన కలిగింది.

స్రవంతి నుండి తల్లికి ఫోన్ – "అమ్మా! మీరు ముందు వచ్చేశారని మా అత్తగారు బయలుదేరుతున్నారు అమెరికాకు. నాకు చాలా వస్తువులు కావాలి. మీరు కొని ఇవ్వండి..."

వేణి మనసు ఉగ్రమైంది. "స్రవంతీ! మా దగ్గర ఇంక వనరులు లేవు. మా సేవింగ్స్ అంతా ఖర్చైపోయాయి. మా జీవితం మొత్తం మీకోసం అన్నట్లుగానే బతికాం. ఇప్పటివరకు కూడా మీకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఖర్చులు మేమే పెట్టుకున్నాము. కానీ, ఇక మా వల్ల కాదు. నీ ఆడంబరాలకు, నీకు నిరంతరం సప్లై చేయటానికి మా దగ్గర డబ్బులు లేవు. మీ ఆయనో నువ్వో మీ అత్తగారికి డబ్బులు పంపించి మీకు కావలసిన వస్తువులు తెప్పించుకోండి. మేము చిల్లి గవ్వ కూడా ఖర్చు పెట్టము. అంతే కాదు, ఇక ముందు నీకు ఏది కావాలన్నా మీరు ఇండియా వచ్చినప్పుడు మీ డబ్బుతో కొనుక్కోండి. మీరు మా ఇంటికి ఎప్పుడైనా రావచ్చు నాకు చేతనైంది వండి పెడతాను. కానీ మీ గొంతెమ్మ కోర్కెలు తీర్చలేను. సారీ అమ్మా! ఈ విషయం మీ ఆయనకు కూడా చెప్పు".

స్రవంతి నోట మాట రాలేదు. ఫోన్ పెట్టేసింది. వేంకటేశ్వరరావు ఆశ్చర్యపోయాడు. "వేణీ! ఈ పనే రెండేళ్ల నాడు చేస్తే ఎంత బాగుండేది? మన చరమాంకానికి డబ్బులు మరింత మిగిలేవి. ఇప్పటికైన మించిపోయింది లేదు. నేను ప్రైవేట్ బ్యాంకులో కన్సల్టెంట్‌గా చేరతాను. నాకు ఓపిక ఉన్నన్నాళ్లూ చేస్తాను. మన ఇద్దరి వరకూ హాయిగా జరిగిపోతుంది. పిల్లల పెళ్లిళ్లు చేశాము చాలు. మన బాధ్యత అంతటితో ముగిసింది. ఇకనైనా వారికోసమే బతుకకుండా మన ఆనందం, మన స్వీయోద్ధరణకు సమయాన్ని వెచ్చిద్దాం. ఏమంటావ్?"

"అవునండీ! నాకు కూతుళ్లిద్దరూ కనివిప్పు కలిగించారు. పూర్తిగా తమ స్వార్థం కోసం నా వైపు నుండి మానవతా దృక్పథం కూడా చూపించలేదు. మీ మాటే నా మాట. మన ప్రతిక్షణం ఇక పూర్తిగా మన కోసమే సద్వినియోగం కావాలి. అలాగే చేసుకుందాం"

మరునాడు స్రవంతి ఫోన్ చేసింది. వేంకటేశ్వరరావు ఇలా చెప్పాడు – "చూడమ్మా! మా జీవితమంతా ఎంతో కష్టపడి మిమ్మల్ని పెంచాము. ఉద్యోగాలు, పెళ్లిళ్ల వరకే మా బాధ్యత. మీ పిల్లలు, మీ అమెరికా అవసరాల కోసం మా వైపు నుండి ఒక్క నిమిషం కూడా ఆలోచించ కుండా అక్కడి పరిస్థితులకు భయపడి, అక్కడ అడ్జెస్ట్ అవ్వకుండా, ఇక్కడి మా ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోకుండా మీరు వ్యవరిస్తున్నారు. మీ పిల్లలు మీ బాధ్యత. మాది కాదు. మేము ఇప్పుడు సంపాదించే వయసు దాటి పోయాము. మీరు 25 ఏళ్లు దాటినా కూడా స్వావలంబన లేకపోవటం ఒకరకంగా మా పెంపకంలో లోపమే. మేము దీనిని సరిదిద్దాలని నిర్ణయించుకున్నాం. మీకు కష్టమైనా ఇదే సరైన నిర్ణయం. ఇకనైనా మా పరిస్థితులను అర్థం చేసుకొని మీ పనులు, మీ అవసరాలను మీరే పరిష్కరించుకోండి."

నెల తరువాత దంపతులిద్దరూ ఉత్తర భారత దేశ యాత్రకు ఒక ఇరవైమంది స్నేహితులతో కలిసి రైలు టికెట్లు బుక్ చేసుకున్నారు.

వాడు మృత్యులేఖిని!!

ఎజ్రాశాస్త్రి

బ్రతికుండగనే రాబందులు
అవయవాలను ఒక్కొక్కటిగా
 ఎగరేసుకు పోతున్నాయి

గరుత్మంతుడో, గద్దో, రాబందో
ఏదైతేనేం అన్నీ పీక్కుతినేవే
పాలుపోస్తున్నాము మనం
కాటెయ్యదా మరి కాలనాగు కదా ...!
అయినా ఓటేస్తూన్నాము మనం ..!

పచ్చని గడ్డిలా మొలవడం కూడా
నేరమవుతుంది ! వాడు గాడిదలా
రూపాంతరం చెందుతున్నాడు

బాల్యాన్ని యవ్వనాన్ని
మూటగట్టుకు తిరగాలేమో
వాళ్ళందుకే భ్రూణహత్యలు చేసి
మన పంచకు నిప్పెడుతున్నారు
ప్రాణాలను తోడేసి తాగేస్తున్నారు

మన ప్రేమలు పరువు మంటల్లో
దగ్ధమైపోతున్నాయి ,మృత్యులేఖిని
పట్టుకు తిరుగుతున్నారు వాళ్ళు

బతుకులచుట్టు వృత్తంగీస్తున్నాడు
కాలు బయటపెడితే కాటేస్తున్నారు
వాడి ఆయుధం అంగమై ఆడజన్మను
అంతం చేస్తుంది !?

యుద్ధమైతే ఓడినా గెలిచినా సరే
దేహం సెకలాలు సెకలాలుగా
 తెగిపడినా సరే ! దానికి ఎవరై సిద్ధమే

ఇది చొరబాటు నిత్యం కామ ఉల్లంగన
దేహంలోకి శత్రువు చొరబాటులా దేహసరిహద్దులు
దాటి మానాన్ని ఆక్రమించి
మంటగలిపి మాటను
ముక్కలు ముక్కలుగా తుంచేస్తున్నారు

గంపకింద ముయ్యడానికి కోడిపిల్లలు కాదు
ఆడపిల్లలు వాళ్ళకు స్వేచ్ఛకావాలి!!

నిరర్ధక వాక్యం

సునీత గంగవరపు

అదే...అర్థంకావడంలేదు
నానా విధాలుగా సణుగుతున్న
జనం మధ్య నుంచి
ఎలా బయటపడాలో
అంతుపట్టడంలేదు

విశ్లేషణకు అందని విశేషాలు
కొత్త బూట్లు తొడుక్కున్న
కాన్వెంట్ కుర్రాడిలా మురిసిపోతున్నాయి
గుబురు కొమ్మలమధ్య దాగిన
రంగు రంగుల పిట్టలు
వాస్తవాలకతీతంగా
ఊహలల్లుకుంటున్నాయి
ఆకలి లేని బిడ్డ
తల్లి గుండెలనెక్కి
ఆడుకుంటున్న ఆనందం..
వాటి కళ్ళనిండా

ఆకాశవేదికపై పండని సన్నివేశం లా
అలసిపోయిన సూర్యుని అస్తమయం

ఇప్పుడు
సమాధానాలన్నీ ఏకమై
ప్రశ్నించే నోళ్ళకోసం
ప్రశ్నార్థకంగా చూస్తున్నాయి
ఈ రాత్రి వేళ..
కాగతంపై అలిగిన ఓ వాక్యం
అంతర్గత శూన్యం లో
నిరర్థకంగా మిగిలిపోయింది

ప్రశ్నించడం

పి. లక్ష్మణ్ రావ్
అసిస్టెంట్ రిజిస్ట్రార్ (సహకార శాఖ)
విజయనగరం , 9441215989

ప్రశ్నించ డమంటే
నల్లేరుపై నడక కాదు
పందిట్లో పన్నీటిజల్లూ కాదు !

ప్రశ్నించదానికి
కొండల్ని పిండిచేయ గలిగినంత
శక్తి కావాలి .
కండరాలు పగిలినంత
ధైర్యం కావాలి !

అసలు ప్రశ్నించాలంటే
అంతులేని ఆవేదన
సముద్రమంత అలజడి
ఎదలో ఘనీభవించి ఉండాలి .!

ఎవర్నైనా , దేన్నైనా
ఎందుకోసం ప్రశ్నిస్తాం
ఏం కావాలని ప్రశ్నిస్తాం ?

వ్యక్తి ఎగిసెగిసి పడితే ప్రశ్నిస్తాం
వ్యవస్థ చతికిల పడితే ప్రశ్నిస్తాం !

ప్రశ్నకు ప్రశ్నే సమాధానమైతే ?
ప్రశ్న దౌర్జన్యానికి గురైతే ?
ప్రశ్నకు అణచివేత ఎదురైతే ?

పిడికిలి మరింత పదునెక్కాలి
గొంతు ఎలుగెత్తి నినదించాలి
ఎదురొడ్డి నిలబడే ధైర్యం కావాలి !

ప్రశ్నించ డమంటే
నల్లేరుపై నడక కాదు
పందిట్లో పన్నీటిజల్లూ కాదు!

ఈ చిరుగు చిన్నదేం కాదు

ఎజ్రాశాస్త్రి

ఏనాటిదో
మాసికేసేవారే లేరు! వచ్చేవారు
వెళ్ళే వారు ఆ చిరుగులో వేలు
పెట్టి కెలికి మరీ వెళ్ళుతుంటారు

తడికా " ,పరదానో అనుకుంటే పొరపాటు
ఆకాశమో, నేలనో" ,అనుకుంటే కూడా
పొరపాటే
పైగా కట్టుబాట్లు ,వొట్టి మాటలు నడుస్తూనే
ఉంటాయి !

ఎన్నాళ్ళు ,ఎన్నేళ్ళు ,నశించాలి అంటు
రాని రాగాలు ,కూనిరాగాలు తీస్తూనే ఉంటారు
అబ్బే! అదేం లేదు ,పూర్వం ఏమోగాని ఇప్పుడు
అసలా లేదు.ఎండ, పొడలు ,పొడలుగా
పడుతూనే ఉంది !! మనస్సులు
దగ్ధమవుతుంటాయి
అనుభవించేవాడికి తెలుస్తుంది!

నిన్ను కోస్తే రక్తం ,నన్ను కోస్తే పాలు
ఇంకొకర్ని కోస్తే నీళ్ళా ? ఎవరిని కోసినా
రక్తమే మనిషొక్కడే! తేడాలు బేదాలు
వట్టి మాటలు! అబ్బే మాకసలా
అలాంటివి లేవండి.... పడకగదిలోకి
కూడావస్తున్నారు పనివాళ్ళు!

శవాలు లేస్తుంటాయి ,నెత్తుటి వాగులు
సెలయేళ్ళై ప్రవహిస్తుంటాయి
చివరి మరణవాంగ్మలం మోహన
కాంక్షించి ఉమ్మేసి చివరిశ్వాస
విడిచెళ్ళిపోతుంటారు ప్రేమికులు
'చిరునామా సమాజమే'చివరి దోషి ఈ
పూడ్చలేని చిరుగే !

అర్థంతరంగా పిడుగులా పిడుగుద్దులు
మర్మాంగాలమీద మంటబెడుతుంటారు
దేశదిమ్మరులంతా దేవతామూర్తులై
పగటి వేశాలు నటిస్తుంటారు

చదువుకోవడం నేరమే, భూమిమీద
బ్రతకడం కూడా మహా అపరాదమే ,తెల్లని
దేహం
నాలుగు నక్షత్రాలు ,ఓ నెలవంకై మెరవడం
మహా దోషమే !?

చిరుగు అలాగే ఉంది ,మూసిపెడుతున్నారు
లేదని దబాయిస్తున్నారు ఆ చిరుగుల్లోనుండి
సమాజం 'మానం "కనబడుతుంది!
దాచుకుంటు
మూసుకుంటు కట్టుబాట్లకు
బానిసలవుతున్నారు

రాజ్యం ఇచ్చే రాయతీలకు పొగపెట్టేందుకే
ఏమీ లేదని బుకాయిస్తున్నారు ,తమదాకా
వచ్చే సరికి చావుకైనా తెగబడుతున్నారు
వియ్యము కయ్యమై కడతేరుతున్నారు

గొడ్డైనా ,బిడ్డైనా ,ఇంటికే పరిమితమవ్వాలిని
పరాయి కన్నబిడ్డలతో కామవాఛలు తీర్చుకొని
కనబడని అంగాలను కాటేసిపోవాలి
ఎన్ని మాసికలేసినా మర్మాన్ని దాచలేము
సుమా!

దేశమంత చిల్లు! దెహమంత చిరుగు!
వేల యేండ్ల కుట్ర మసిబూసి
మారేడు చేస్తే దాగేది కాదు!!!

నాలుకలేని భారతమాత

వనపట్ల సుబ్బయ్య,
9492765358

భారతమాత నాలుకను తెగ్గోసిన
రేపిస్ట్ గాళ్లను
దేశభక్తులుగా ఊరేగిద్దామా
మనీషా బొందకాడనే
వాళ్ల తలకాయల్ని ఉత్తరిద్దామా ?
పలుకవెందుకో న్యాయాలూ..

కనిపించిన ప్రతి పువ్వును తుంచెయ్యడం
మనిషితనమెట్లైతది
పువ్వు పరిమళం
పువ్వు అక్కచెల్లే
భూమి బతుకమ్మ గదరా !

తోవల రాయేదురైతేతే
వొంగి వొంగి దండాలు
చెట్టెదురైతే
సన్నీళ్ళల్ల మునిగి ప్రదక్షిణలు
అమ్మాయెదురైతే
అమాంతం మింగేయ్యడాలు
మనిషితనాలెట్లైతవి !

అర్ధరాత్రి అంత్యక్రియలు
మరణాలు
అగౌరవాలు అవమానాలు,అమానుషాలు
రామరామ!
శవాలను గౌరవించని సంస్కృతి
కడచూపులకు నోచుకోని కాఠిన్యం

మనుషులన్న తర్వాత
కొంతనెత్తురుండాలి,
కసింత కరుణుండాలి
అంతా సీమే నిండుకుంటే
నారుకు నీరుకు బంధాలుండవు
అంగాలు కత్తులు గొడ్డళ్ళైతున్న అటవికాలు !
దగ్ధమైపోతున్న నాగరికతలు

కామోన్మాదులారా!
భూమినెంత చెరిచి గాయపరిచినా
దుఃఖిస్తదిగానీ
తలొంచదు తలదించదు
భూమి తేరుకుంటది తలెత్తుకుంటది
భూమి అమ్మరా

పొయ్యిమీద బువ్వుడికేటప్పుడు
మెతుకు మెతుకు పట్టిపట్టి చూసినట్లు
అమ్మిప్పుడు
ఉమ్మనీటిలో గుడ్డును వొత్తొత్తి చూస్తున్నది
సృష్టికి పురుడు పోసేముందు
అమ్మ ఆలోచిస్తున్నది
పెరిగి పెంటకంపుచేసేకన్న
చెడ్డపేగును పెరట్లనే తుంచెయ్యాలని
అమ్మ శపథం చేస్తున్నది
అమ్మ మట్టిమీద బాస చేస్తున్నది !

(ఉత్తరప్రదేశ్ లో హత్రాస్ జిల్లాలో
కులోన్మాదానికి బలైన మనీషా వాల్మీకి స్మృతిలో...)

"మహా" భారత్..

ఎన్. హేమంత్

"మహా" భారత్ ... శత్రు దేశాలకు కునుకు లేకుండా చేసే అత్యాధునిక ఆయుధ వ్యవస్థల తయారీలో భారత్ దూసుకుపోతున్నది. దేశీయ క్షిపణి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. రాబోయే నాలుగైదేండ్లలో భారత్‌కు సమగ్ర క్షిపణి వ్యవస్థను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్టు రక్షణరంగ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీ.ఆర్.డీ.ఓ) పేర్కొంది. ఇందులో భాగంగా సమగ్ర హైపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థ (హెచ్‌సీఎంఎస్)ను అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడించింది. ప్రపంచంలో అత్యంత వేగంగా ప్రయాణించే బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణితో పోలిస్తే రెండు రెట్ల కంటే ఎక్కువ వేగంతో ఈ క్షిపణి వ్యవస్థ లక్ష్యాలను ఛేదించగలదు. వచ్చే నాలుగైదేండ్లలో సీహెచ్‌సీఎంఎస్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయబోతున్నట్టు డీ.ఆర్.డీ.ఓ చైర్మన్ జి.సతీష్ రెడ్డి తెలిపారు. గత నెల 7న ప్రయోగించిన హైపర్ సోనిక్ టెక్నాలజీ డిమోన్‌స్ట్రేటర్ వెహికిల్ (హెచ్ఎస్‌టీడీవీ) ప్రయోగం విజయవంతమవ్వడంతో హెచ్‌సీఎంఎస్ అభివృద్ధికి మార్గం సుగమమైందని ఆయన తెలిపారు.

ఏమిటీ ఈ హెచ్‌సీఎంఎస్?

శత్రు దేశాల క్షిపణులను, జలాంతర్గాములను ధ్వంసం చేయడానికి నావికా దళం క్రూయిజ్ క్షిపణులను ఉపయోగిస్తుంది. అయితే, లక్ష్యాల పరిధి, సామర్థ్యాన్ని బట్టి వీటిని సబ్ సోనిక్, సూపర్ సోనిక్, హైపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులుగా విభజించారు. సామర్థ్యం, వేగం, లక్ష్యాల పరిధి వంటి అంశాలను బట్టి మిగతావాటి కంటే హైపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు అత్యుత్తమమైనవి. ఈ క్షిపణులు ధ్వని వేగం కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణించగలవు.

గతంలో హైపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి వ్యవస్థకు సంబంధించిన సాంకేతికత అమెరికా, రష్యా, చైనా వద్ద మాత్రమే ఉండేది. అయితే, హెచ్ఎస్‌టీడీవీ ప్రయోగం సక్సెస్‌తో హెచ్‌సీఎంఎస్ అభివృద్ధికి కావాల్సిన సాంకేతికత భారత్‌కు కూడా సమకూరినట్లయింది.

అవసరాన్ని బట్టి క్షిపణులు:

అవసరాన్ని బట్టి ఎలాంటి క్షిపణులైనా మోహరించే సామర్థ్యాన్ని భారత్ సంతరించుకుంటున్నదని డీ.ఆర్.డీ.ఓ చైర్మన్ జి.సతీష్ రెడ్డి తెలిపారు. బలగాల అవసరాలకు అనుగుణంగా వివిధ లక్షిత దూరాలను ఛేదించే క్షిపణుల అభివృద్ధిపై దృష్టిపెట్టామన్నారు. చైనాతో వివాదం నేపథ్యంలోనే క్షిపణి పరీక్షలు నిర్వహిస్తున్నారన్న వాదనలను కొట్టిపారేశారు.

వరుసగా మిసైల్ పరీక్షలు

గత ఐదు వారాల కాలంలో భారత్ దాదాపు పది క్షిపణులను విజయవంతంగా పరీక్షించింది. ఇందులో సూపర్ సోనిక్ మిసైల్ అసిస్టెడ్ రిలీజ్ టార్పెడో వెపన్ సిస్టమ్ (స్మార్ట్), శౌర్య, బ్రహ్మోస్, పృథ్వీ, హెచ్ఎస్‌టీడీవీ, రుద్రం-1 వంటి కీలకమైన క్షిపణులు ఉన్నాయి. హైపర్‌సోనిక్, బాలిస్టిక్, యాంటీ రేడియేషన్ తదితర వైవిధ్యతలు కలిగిన ఈ క్షిపణులతో భారత రక్షణ వ్యవస్థ మరింత బలోపేతమయ్యిందని రక్షణ రంగ నిపుణులు పేర్కొన్నారు. ముఖ్యంగా సుదూరాల్లోని శత్రు దేశాల జలాంతర్గాములను ధ్వంసం చేయగల సామర్థ్యం 'స్మార్ట్' సొంతమని సతీశ్‌రెడ్డి తెలిపారు.



23 కూరల నాగన్న హోటల్

డి. యాదగిరి

మనం ఏదైన హోటల్‌కు వెళ్లి భోజనం చేస్తే ఎన్ని కూరలు వడ్డిస్తారు? ఒక కూర, పప్పు, చారు, సాంబారు, చట్నీ, ఒక పెరుగు ఇంతే కదా! మహా అయితే ఇంకో కూర. అంతకంటే ఎక్కువ వడ్డించే అవకాశమే లేదు. కూర సరిపోక మళ్లీ అడిగితే అదనపు చార్జీ వేసే హోటల్స్ కూడా ఉంటాయి. కానీ ఖమ్మం జిల్లా కూసుమంచి లోని నాగన్న హోటల్‌కు వెళ్తే మాత్రం మనం నోరు వెళ్లబెట్టాల్సిందే. ఎందుకంటే ఆ హోటల్‌లో ఒకటి రెండు కాదు, పది పన్నెండు అంతకన్నా కాదు ఏకంగా 23 రకాల కూరలు వడ్డిస్తారు. నమ్మకం కుదరడం లేదా? ఒకసారి కూసుమంచి వెళ్లిరండి మరి! మన ఇంట్లో భోజనం అంటే అన్నం, కూర, పప్పు, సాంబారు, పెరుగు.. ఒక పచ్చడి. అదే హోటల్‌కు వెళ్తే మరో రెండు కూరలు ఎక్కువ వడ్డిస్తారు. కానీ, ఖమ్మం జిల్లా కూసుమంచిలోని రామకృష్ణ (నాగన్న హోటల్) ఇందుకు భిన్నం. ఎప్పుడూ 23 కూరలు విస్తరి నిండుగా వడ్డిస్తారక్కడ.

అన్ని రకాల కూరలూ..

దోసకాయ పప్పు, తోటకూర, చిక్కుడుకాయ, బచ్చలికూర, పులుసు, పాలకూర, గోంగూర పచ్చడి, గోంగూర కూర, దోసకాయ పచ్చడి, మామిడికాయ పచ్చడి, ఆలుగడ్డ, అనపకాయ, కాలీఫ్లవర్, బీట్‌రూట్, క్యారెట్, దొండకాయ, బెండకాయ, బీరకాయ, కాకరకాయ, కాకర వేపుడు, గోరుచిక్కుడు, వంకాయ కూరలతోపాటూ పలు రకాల చట్నీలు, పచ్చళ్లు, సాంబారు, పెరుగు, అప్పడం ఉంటాయి. ఇక్కడ పెరుగు కూడా ప్రత్యేకమే. ఎందుకంటే, వారు స్వయంగా పెంచిన గేదెల పాలతో తోడు పెడతారు.

మౌఖిక ప్రచారమే..

నాణ్యతే నమ్మకాన్ని నిలబెడుతుంది, వ్యాపారాన్ని వృద్ధి చేస్తుంది అన్న ప్రాథమిక సూత్రాన్నే నమ్మారు నాగన్న. దానికి తగ్గట్లుగానే పెద్ద బోర్డులు కానీ, ఆకర్షణ కోసం చేసే ఆడంబరపు అలంకరణలు కానీ ఏవీ అక్కడ కనపడవు. సాధారణ కుర్చీలు, టేబుల్స్ మాత్రమే ఉంటాయి. ఇక్కడ తిని వెళ్ళిన వారి మౌఖిక ప్రచారం ఆధారంగానే ఒకరినుంచి ఒకరికి విషయం తెలుస్తూ ఇప్పటికి అనేక మంది కస్టమర్లను సంపాదించుకున్నారు. రాష్ట్ర రహదారి కావడం వల్ల, వెయ్యేళ్ళ ప్రాచీన చరిత్ర కల కూసుమంచి గణపేశ్వరాలయం ఉండడం వల్ల ఈ ప్రాంతాన్ని సందర్శించే వారు ఈ హోటల్ భోజనం చేసి ఆ తర్వాత తమకు తెలిసినవారు, మిత్రులూ బంధువులకు కూడా చెపుతుంటారు. ఈ హోటల్ ఖమ్మం- హైదరాబాద్ రహదార్లో కూసుమంచి కూడలి ప్రాంతానికి సమీపంలో ఉంటుంది. కార్లల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి హైదరాబాద్ వెళ్లే వారిలో చాలామంది ఈ హోటల్లో భోజనం చేస్తుంటారు.

1994లో కూసుమంచిలో రేకులషెడ్‌లో హోటల్ పెట్టాను. అప్పటి నుండి 23 రకాల కూరలు వండి వడ్డించటం అలవాటుగా మారింది. కూరగాయలు ఎంత రేట్లు ఉన్నా నిత్యం వండుతాను. మార్కెట్‌లో దొరికేవి తీసుకుంటాం లేక పోతే ఖమ్మం నుండి తెప్పిస్తాము. నలుగురి కడుపు నింపాననే సంతృప్తి తప్ప సంపాదించుకోవాలన్న ఆలోచన నాకు లేదు. ఆత్మసంతృప్తి మిగులుతుంది. దీనికోసం ప్రచార ఆర్భాటాలు చేయలేదు. ఒక్కసారి ఇక్కడ తిన్నవాళ్లు.. మళ్లీ ఇక్కడికే వస్తారు. లేదంటే తెలిసిన వాళ్లను పంపిస్తారు. క్వాలిటీలో ఎలాంటి రాజీ పడకుండా హోటల్ నిర్వహిస్తున్న. ఒక్క భోజనానికి ఐదు రూపాయిలు వచ్చినా చాలు.

-బెల్లంకొండ నాగన్న,
హోటల్ యాజమాని

ఎవరీ నాగన్న..

బెల్లంకొండ నాగన్న ఈ హోటల్ వ్యవస్థాపకులు. 1995 ఫిబ్రవరి 12న ఈ హోటల్‌ను రహదారికి పక్కన చిన్న గుడిసెలో ప్రారంభించారు. హోటల్ యజమాని అయినప్పటికీ మొదట నాగన్నే స్వయంగా భోజనం వడ్డించేవారు. హోటల్‌కి వచ్చే కస్టమర్ల సంఖ్య పెరుగుతున్న కొద్దీ నిర్వహణకు సిబ్బందిని కూడా నియమించారు. నాగన్నకు భార్య మణెమ్మ, కూతర్లు మంజుల, గాయత్రి, కుమారుడు వెంకట రామకృష్ణ ఉన్నారు.

ప్రారంభంలో తప్పని కష్టాలు

ఇరవైకి పైగా నాణ్యమైన కూరలుంటాయి అనే మౌఖిక ప్రచారం చాలామందిని ఈ హోటల్‌ను ఆకర్షించేలా చేసింది. కానీ, కూరగాయల రేట్లలో అనేకసార్లు హెచ్చుతగ్గులు రావడం, ఇన్ని రకాల కూరలూ వండుతున్నప్పటికీ కొన్ని ఎక్కువగా కొన్ని తక్కువగా ఖర్చుకావడం వల్ల మిగిలిపోవడం, చిన్న ఊరు కాబట్టి కొన్ని రోజులు అస్సలు కస్టమర్లు సరిగా రాకపోవడం, లేదా ఏదైనా ప్రయాణంలో వున్న వారు ఒక్కసారిగా మధ్యాహ్నం భోజనానికి వచ్చేయడం, అంతమందికీ హడావిడిగా ఇన్నిరకాల కూరలను తయారు చేయించడం ప్రారంభించిన కొత్తలో కష్టంగా ఉండేదట. కానీ, రాను రానూ ప్రణాళికా బద్ధంగా చేయటం అలవాటు పడిన తర్వాత ఈ సమస్యను అధిగమించినట్లు నాగన్న చెబుతారు.

గగనంలో తొలి "ఉష"స్సు

డా॥ గంగాధర్

గాలిలో ప్రయాణం! పక్షితో కూడా జాగ్రత్తగా ఉండాలి. దుష్ట నేత్రాలు ఉంటాయి. హైజాకర్‌లు.. బాంబర్‌లు..ఇంకా.. ఊహించని ఉపద్రవాలు. వాటి నుంచి భద్రతకే బి.సి.ఎ.ఎస్. ఆ బిసిఎఎస్‌కు కొత్త బాస్.. ఉషాపథి, ఐఎఎస్. తొలి మహిళా డైరెక్టర్ జనరల్. ఒడిశా క్యాడర్ ఐఎఎస్ అధికారి ఉషాపథి. 1995 బ్యాచ్, కర్ణాటక అమ్మాయి. బి.టెక్. సివిల్ ఇంజనీరింగ్‌లో ఫస్ట్ డివిజన్. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్నారు. ఢిల్లీలో ఉద్యోగం. 1969లో జన్మించారు ఉష. సర్వీసు లెక్కలు, వయసు లెక్కలు కాదు. గత రెండున్నర దశాబ్దాలలో దేశమంతటా వివిధ హోదాల్లో ఆమె చేపట్టిన బాధ్యతల జాబితా ఓ గవర్నమెంట్ ఫైల్ అంత ఉంటుంది. అయితే అందులో ఒక అవార్డు పత్రం కూడా ఉండదు. ఆమె పనితీరే ఆమెకు గుర్తింపు. ఫొటోలలో ఆమె అబ్దుల్ కలామ్‌తో, ప్రణబ్‌ముఖర్జీతో కనిపించవచ్చు. విధుల నిర్వహణలో భాగంగా మాత్రమే తన ప్రమేయం లేకుండా వాళ్లతో కలిసి ఉన్నప్పుడి ఫొటోలే అవన్నీ, సర్వీసులో ఉండగానే ఎంబిఎ ఫారిన్ డిగ్రీ చేశారు. న్యూఢిల్లీ, బెంగళూరు, ముస్సోరి, కోయంబత్తూరు, పంచాగ్ని (మహారాష్ట్ర)లో పాలనాపరమైన శిక్షణ పొందారు. అంటే క్షణం కూడా ఎక్కడా ఆగలేదని! ఐఎఎస్ ఆఫీసర్‌ల మిడ్ కెరీర్ ప్రోగ్రామ్‌లో కూడా శిక్షణ తీసుకున్నారు. ఉషకి కొత్తగా ఎక్కడికి పోస్టింగ్ వచ్చినా.. ఆమె కన్నాముందుగా ఆమె కెరీర్ వెళ్లి ఆ సీట్లో కూర్చుంటుంది! లైఫ్ సైజును కూడా దాటిపోయిన కెరీర్ ఆమెది. ఢిల్లీలోని 'బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బిసిఎఎస్) డైరెక్టర్ జనరల్ ఆమె ఇప్పుడు.

ఆ పదవిని చేపట్టిన తొలి మహిళ! నలభై రెండేళ్ల నుంచీ ఉంది బిసిఎఎస్, 'డైరెక్టొరేట్ జనరల్ ఆఫ్ సివిల్ యావియేషన్‌లో ఒక విభాగంగా 1979 లో బిసిఎఎస్ ఏర్పాటైంది. అంతకు రెండేళ్ల క్రితం ఇండియన్ ఎయిర్ లైన్ విమానం హైజాక్ అయిన అనుభవంతో ఏర్పాటు చేశారు. ఆ తర్వాత బిసిఎఎస్ స్వతంత్ర విభాగం అయింది.

ఆ విభాగానికే ఉష ఇప్పుడు డైరెక్టర్ జనరల్ భారతదేశ విమానాల, విమాన ప్రయాణికుల భద్రత బాధ్యత ఉషదే! ఆమే కేర్ తీసుకోవాలి. గగనతలానికి కనురెప్ప ఉషాపథీ. ఈ పోస్టులకి రాకముందు ఆమె పౌర విమానయాన మంత్రిత్వశాఖలో జాయింట్ సెక్రటరీ, కొత్త కుర్చీలోకి వచ్చి కూర్చోగానే.. 'ఎట్‌లాస్ట్ ఎ శ్రీమతి.. ఈ పొజిషన్‌లోకి అని ఉష ట్వీట్ చేశారు. తొలి మహిళే కాదు, బిసిఎఎస్ డైరెక్టర్ జనరల్ అయిన మూడో ఐఎఎస్ ఆఫీసర్‌గా కూడా ఆమెకు ఇదొక గుర్తింపు. సాధారణంగా ఈ విభాగానికి చీఫ్‌లుగా ఐపీఎస్ ఆఫీసర్‌లు ఉంటారు. ఇరవై నాలుగేళ్ల కెరీర్‌లో నలభై ఎనిమిదేళ్ల సర్వీసు అనిపిస్తుంది ఉష గురించి వింటే తొంభై ఆరులో సివిల్స్ పాస్ అయితే.. తొంబై ఎనిమిది వరకు ట్రైనింగ్, తర్వాత నుంచి లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ అండ్ ఛాలెంజింగ్, సబ్ కలెక్టర్, ప్రాజెక్ట్ డైరెక్టర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్, కలెక్టర్, కలెక్టర్ అండ్ డిఎం. అలా 2004 వరకు వివిధ జిల్లాలు,ప్రాంతాలు!

2005 నుంచి డైరెక్టర్. సాంఘిక సంక్షేమం, పంచాయితీరాజ్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్, స్కూల్ అండ్ మాస్ ఎడ్యుకేషన్, టెక్స్‌టైల్ అండ్ హ్యాండ్లూమ్ శాఖలు.

2015 వరకు, ఆ తర్వాతి నుంచీ సివిల్ ఏవియేషన్. ఒక ఐఎఎస్. ఆఫీసర్‌కు ఇదంతా మామూలే అనిపించవచ్చు. అయితే ఉష చేపట్టిన బాధ్యతలేవీ మామూలు శాఖలు కాదని ఈ లిస్ట్ చూస్తే అర్థమౌతుంది. సంక్షేమం, విద్య.. ఉద్యోగం.. కీలకమైనవి. వాటిని ఉష సమర్థంగా నడిపించారు. ఉద్యోగంలోనే ఒక భాగం అయిన మరొక ప్రపంచం ఆమెకు.. భర్త అరవింద్, కొడుకు తేజ్. ఉషాపథీ భర్త అరవింద్ కూడా ఐఎఎస్ ఆఫీసర్, ఇద్దరిదీ లవ్ మ్యారేజ్. ముస్సోరీ ఐఎఎస్ శిక్షణలో ఉన్నప్పుడు ప్రేమలో పడ్డారు. సివిల్స్ రాయకముందు ఉష లవ్ ఇంట్రెస్ట్ మాత్రం మెడిసిన్. తన తల్లిలా తనూ డాక్టర్ అవాలని అనుకున్నారు కానీ మెడిసిన్‌లో సీటు రాలేదు. ఇంజినీరింగ్ చదివి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ని ఎంచుకున్నారు. మంచిదైంది. అందించవలసిన సేవలు, చక్కబెట్టాల్సిన అనారోగ్య పరిస్థితులు వైద్య రంగంలో మాత్రమే ఉండవు కదా.

ఆడదంటే అలుసా?

శారద



అబ్బాయిలతో పాటు అమ్మాయిలు కూడా సమాజ గమనంలో అంతర్భాగం. బాలలు, బాలికలు వేర్వేరు కాదు. చదువులో, ఆటపాటల్లో, ప్రతిభా సంపత్తుల్లో తేడాలకు తావు లేదు. ప్రకృతి సహజంగా శారీరక నిర్మాణంలో అంతరాలే తప్ప మనుషులుగా మగపిల్లలు, ఆడపిల్లలు ఒకటే. వయసుతో పాటు వారి వికాసం కోసం తగిన అవకాశాలు కల్పిస్తే బాలికలే ఎక్కువగా రాణిస్తున్న ఉదంతాలు ఎన్నో. అయినప్పటికీ ఆడపిల్లల పట్ల ఎప్పుడూ వివక్ష వాస్తవం. ఆకాశంలో సగాన్ని మిగతా సగమే తక్కువగా చూడటం అవమానకరం. ప్రకృతిలో ఏ జంతువు కూడా జెండర్ కారణంగా సాటి జంతువును తక్కువగా చూడదు. తన కన్నా బలహీనమైందని భావించదు. కానీ మనుషులే ఆడవారిని చిన్నచూపు చూస్తారు. అది వారి బాల్యావస్థలోంచే మొదలు కావడం అత్యంత విషాదం.

ఒకే ఇంట్లో ఉండే అమ్మాయి, అబ్బాయి పెంపకాన్ని గమనిస్తే వివక్ష కుటుంబంలోనే ఎంత బలంగా ఉన్నదో అర్థమవుతుంది. 'మగపిల్లల్లా ఆ ఆటలేంటి? ఆ నవ్వులేంటి' అనే మాటల ప్రభావం జీవితకాలం వెంటాడుతుంది. ఈరకమైన జెండర్ స్పృహతో పిల్లల పెంపకం వారిని బాల్యంలోనే చిన్నబుచ్చుతుంది. ఇది వారి మొత్తం బతుకునే తలకిందులు చేస్తుంది. వారి ప్రాధాన్యాలు మారిపోతాయి. 'డాడీ నేను సినిమాకు వెళుతున్నా' అని ఒక మాట అనేసి బయటికెళ్ళగలడు అబ్బాయి. అదే అమ్మాయి అలా ఒకమాట చెప్పి బయటకు వెళ్ళలేదు. 'ఏ సినిమాకు, ఎక్కడ, ఎవరితో, ఎన్ని గంటలకు' అనే ప్రశ్నల పరంపర మొదలవుతుంది. ఇక్కడ వివక్ష మాత్రమే కాదు భద్రతకు సంబంధించిన భయసందేహాలు అనేకం.

అమ్మాయిలు చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం, స్వేచ్ఛగా వాహనాల మీద దూసుకుపోవడం చూస్తున్నాం. కానీ ఆమె స్వేచ్ఛకు, విహారానికి పరిమితులున్నాయి. రాత్రి పదయినా అబ్బాయి ఇంటికి రాకపోతే నెమ్మదిగా వస్తాడులే అనుకుంటారు. అదే అమ్మాయి విషయంలో మనసంతా కల్లోలమవుతుంది. మొబైల్ కలవకపోతే గుండె వేగంగా కొట్టుకుంటుంది.

మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లలు ఇతరుల కన్నా కొంచెం మెరుగ్గా, హాయిగా ఉన్నారనుకుంటారు. కానీ ఆ పిల్లల తల్లిదండ్రుల్లో భద్రతకు సంబంధించిన బెంగ అధికం. ఇంట్లోంచి బయటకు వెళ్ళిన అమ్మాయి క్షేమంగా ఇంటికి తిరిగి వస్తుందన్న గ్యారంటీ లేని దుర్మార్గపు సమాజం మనది. హత్రస్ సంఘటనలో బాధితురాలి మీదనే నిందలు వేయడం, ఆమె ప్రవర్తన మీద తీర్పులు చెప్పడం వ్యవస్థీకృత క్రౌర్యానికి తార్కాణం.

ఆడపిల్లలు ఇంటికి వెలుగు అంటూ సూక్తులు చెబుతారు. కానీ వాళ్ళ మీద క్షణక్షణం పోలీసింగ్ చేదునిజం. అమ్మాయిలు ఎలా ఉండాలో, ఎవరితో స్నేహాలు చేయాలో, ఎలాంటి డ్రస్సులు వేసుకోవాలో శాసిస్తారు. అమ్మాయిలు మొబైల్ వాడకూడదంటారు. అబ్బాయిలతో స్నేహం చేసేప్పుడు జాగ్రత్తగా ఉండాలంటారు. నమ్మి మోసపోయిన అమ్మాయి వివేచననే ప్రశ్నిస్తారు. అమ్మాయిలతో బుద్ధిగా ఉండాలని, మర్యాదగా మాట్లాడాలని మగపిల్లలకు మాత్రం చెప్పరు.

మగపిల్లలు ఎలా వున్నా పరవాలేదు, ఆడపిల్లలు మాత్రం ఒద్దికగా, బుద్ధిగా, తమను తాము కుదించుకొని ఉండాలంటారు. ఎప్పుడు ఏ మూల నుంచి మాటల దాడో, చూపుల బాణాలో తగులుతాయని కుంచించుకుపోయి బతకాలని మగసమాజం చెబుతున్నది. సినిమాల్లోని వల్గారిటీ ఈ ధోరణికి వత్తాసునిస్తున్నది. ఆడపిల్లల్ని వెంటపడి వేధించడం మగవాడి సహజధోరణి అనే సినిమాలే అత్యధికం. మగవాళ్ళ లైంగిక ప్రవర్తన ఎక్కడా ప్రశ్న కాదు, కానీ సమాజంలో బడికెళ్ళే ఆడపిల్లల దగ్గర్నుంచి పండు వృద్ధులయిన స్త్రీలవరకు వారి లైంగికత మీద ఎన్నోరకాల వ్యాఖ్యానాలు, ప్రశ్నలు, విసుర్లు, ద్వంద్వార్థాల వెకిలి కూతలు వినిపిస్తుంటాయి. ఈ నీచత్వాన్ని బరితెగించి ప్రదర్శించే కామెడీ షోలనీ, సినిమాలనీ ఇంటిల్లిపాదీ కలిసి చూడటం క్రూర పరిహాసం.

తిట్టాలన్నా, జోకులు వేయాలన్నా, ఏడిపించాలన్నా అందరికీ ఆడపిల్లలే చౌకగా దొరుకుతారు. కూతుళ్ళని ప్రేమించే కొందరు నాన్నల ప్రేమకీ పరిమితులున్నాయి. తమ కులం కాని వానితో జతకడితే చంపేస్తారు. ఇంకొందరు తండ్రులు తమదాకా వస్తే తప్ప చలించరు. తమ కూతురు బాధపడితే తప్ప సమాజంలో మిగతా ఆడపిల్లలపై చెలరేగే హింస పట్ల స్పందించరు. నాగరిక సమాజం అన్నది పేరే గాని దేశదేశాలన్నిటా ఆడపిల్లలు సుఖమిచ్చే సరుకులన్నదే భావన. కనుకనే ఆడపిల్లల్ని ఎత్తుకెళ్ళడం, అమ్మడం, లైంగిక వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నది. మరీ ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాల ఆడపిల్లలపైన ఈ దౌష్ట్యం చెప్పనలవి కానిది. వీటిని అరికట్టాల్సిన ప్రభుత్వాలు పట్టనట్టే ఉంటాయి.

మరో వైపున ఆడ శిశువుల్ని పెంచలేక అమ్ముకుంటున్న వైనాల మీద రకరకాల కథనాలు చూస్తుంటాం. కన్న తల్లిదండ్రులే కూతుళ్ళని అమ్ముకోవాల్సిన దుస్థితికి నెట్టివేసిన సమాజానిదే అసలు నేరం. ఆడపిల్లలని కనడం, పెంచడం, పోషించడం భారమనుకునే పరిస్థితులు ఆయా ప్రభుత్వాల నిర్వాక ఫలితం. పుట్టుక నుంచే వివక్ష మొదలయితే ఏ ఆడపిల్లయినా సజావుగా, హాయిగా, నవ్వుతూ, తుళ్ళుతూ పెరగడం సాధ్యమా? లైంగిక వివక్షకు తావు లేని రీతి నెలకొంటుందా? బడికి వెళ్ళే అమ్మాయి క్షేమంపై దిగులు పడనక్కర్లేని స్థితి ఏర్పడుతుందా? ఈ ప్రశ్నలకు సరైన సమాధానం ఇస్తేనే అంతర్జాతీయ బాలికా దినోత్సవానికి అసలుసిసలు సార్థకత.

ముఖేశ్ ఆదాయం గంటకు 90కోట్లు!!

కె.వి.రమణ, ఎం.ఎ. బి.ఇడి

కరోనా దెబ్బకు కోట్లాది సాధారణ ప్రజల ఆదాయం సన్నగిల్లిపోగా... పెట్టుబడిదారుల సంపదకు మాత్రం రెక్కలు వచ్చాయని ఓ తాజా రిపోర్ట్‌లో స్పష్టమయ్యింది. ముకేశ్ అంబానీ అయితే లాక్‌డౌన్ కాలంలోనూ రికార్డ్ స్థాయిలో ఏకంగా గంటకు రూ.90 కోట్లు సంపాదించారు. ఐఐఎఫ్ఎల్ వెల్త్‌తో కలిసి హురున్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ భారతదేశంతో అపర కుబేరులకు సంబంధించిన జాబితాను మంగళవారం విడుదల చేసింది.

ఇరు సంస్థలు సంయుక్తంగా రూపొందించిన ఐఐఎఫ్ఎల్ వెల్త్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్-2020లో భారత్‌లోని కుబేరులతో పాటుగా తెలుగు రాష్ట్రాల్లోని అత్యంత సంపన్నుల వివరాలను ప్రకటించింది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అత్యధిక విలువ కలిగిన 62 కుటుంబాల సంపద రూ.2,45,800 కోట్లుగా ఉంది. ఏడాదికేడాదితో పోల్చితే వీరి సంపద 34 శాతం పెరిగింది. 2020 ఆగస్టు 31 నాటికి వీరి సంపదను డాలర్ మారకపు విలువతో లెక్కించారు. వీరి మొత్తం సంపదలో 32 శాతం కూడా ఔషద ఉత్పత్తుల రంగాల వారిదే కావడం విశేషం. టాప్10లో రూ.49,200 కోట్ల అత్యధిక సంపదతో దివి లేబొరేటరీస్‌కు చెందిన మురళీ దివిస్, ఆయన కుటుంబ సభ్యులు అగ్రస్థానంలో ఉన్నారు. ఏడాదికేడాదితో పోల్చితే వీరి సంపద 89 శాతం పెరిగింది. హెటెరో డ్రగ్స్ యాజమాని బి పార్థసారథి రెడ్డి రూ.13,900 కోట్ల సంపదతో రెండో స్థానంలో నిలిచారు. మూడో స్థానంలో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌కు చెందిన సతీష్ రెడ్డి ఉన్నారు. పి.పిచ్చి రెడ్డి (4), పీవీ క్రిష్ణా రెడ్డి (5), జీవీ ప్రసాద్ అండ్ అనురాధ (6), జూపల్లి రామేశ్వర్‌రావు (7), ఎం సత్యనారాయణ రెడ్డి (8), విసి నన్నపనేని (9), సి విశ్వేశ్వర రావు అండ్ ఫ్యామిలీ (10) వరుస స్థానాల్లో నిలిచారు.

రూ.2.80 లక్షల కోట్లు పెరిగిన ముకేశ్ సంపద

ఐఐఎఫ్ఎల్ వెల్త్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్-2020లో ముఖేష్ అంబానీ రూ.658 లక్షల కోట్లతో అగ్రస్థానంలో నిలిచారు. లాక్‌డౌన్ కాలంలోనూ ఆయన సంపద గంటకు రూ.90 కోట్లు పెరిగింది. 63 ఏళ్ల ఈ వ్యాపార కుబేరుడి సంపద వరుసగా తొమ్మిదో ఏడాదిలోనూ రూ.2.77 లక్షల కోట్లు పెరిగి రూ.6,58,000 కోట్లకు చేరింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌ను రుణ రహిత కంపెనీగా మార్చడానికి జియో ప్లాట్‌ఫామ్, రిటైల్‌లో వాటాల విక్రయం ద్వారా అంతర్జాతీయ కంపెనీల నుంచి ముఖేష్ భారీగా నిధులు సమీకరిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రపంచ అత్యధిక ధనవంతుల్లో ముకేశ్ ఐదో స్థానంలో ఉన్నారు. రూ.1.43 లక్షల కోట్లతో హిందూజా బ్రదర్స్ రెండో స్థానంలో, హెచ్‌సీఎల్‌కు చెందిన శివనాడర్ ఫ్యామిలీ రూ.1.41 లక్షల కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు. గౌతం అదాని సంపద ఒక్క ఏడాదిలోనే 48 శాతం పెరిగి రూ.1.40 లక్షల కోట్లకు చేరడంతో నాలుగో అత్యధిక ధనవంతుడిగా నిలిచారు. విప్రో వ్యవస్థాపకుడు అజీం ప్రేమ్‌జీ రూ.1.14 లక్షల కోట్లతో ఐదో స్థానంలో ఉన్నారు. డిమార్ట్ రాధాకిషన్ దమానీ సంపద



56 శాతం పెరిగి రూ.87,200 కోట్లకు చేరడంతో టాప్ 10 ధనవంతుల్లో ఒక్కరిగా నిలిచారు.

ఐదేండ్లలో మూడు రెట్లు పెరిగారు..

హురున్ లిస్ట్‌లో రూ.1000 కోట్ల పైబడిన సంపద కలిగిన 828 మంది కుబేరులను గుర్తించింది. గడిచిన ఐదేళ్లలో దేశంలో ఈ స్థాయి కుబేరుల్లో మూడు రెట్ల పెరుగుదల చోటు చేసుకుంది. ఈ 828 మందిలో 627 మంది సంపదలో పెరుగుదల నమోదు కాగా.. 229 మంది సంపదలో తగ్గుదల చోటు చేసుకుంది. ఇది వరకు జాబితాలో చోటు సంపాదించుకున్న వారిలో ఆరుగురు మృతి చెందారు. ఈ ఏడాది జాబితాలో కొత్తగా 162 మంది చేరారు. మొత్తం జాబితాలో 40 ఏళ్ల లోపు వారు 21 మంది ఉన్నారు. దేశ వ్యాప్త జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి గతేడాది 5 మంది బిలియనీర్లు ఉంటే.. ఈ ఏడాది ఆ సంఖ్య 9కి చేరింది.

ఉల్లి ధరలకు రెక్కలు

జి.రాజేష్

- రైతుబజార్లలో అందని సబ్సిడీ ఉల్లిపాయలు
- అధికారుల నిర్లక్ష్యంతో రెచ్చిపోతున్న దళారులు
- ఆకాశన్నంటుతున్న ఉల్లి ధరలు

ఉల్లి లొల్లి మళ్లీ మొదలైంది. కోయకుండానే కన్నీరు పెట్టిస్తోంది. ఉల్లిపాయ లేనిదే గృహిణులు వంటింటి నుంచి బయటకు రాలేరు. అలాంటిది ఉల్లి ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. రైతు బజార్లలో కూడా సబ్సిడీ ఉల్లిపాయలు అందుబాటులో లేవు. అధికారుల అలసత్వంతో దళారులు యథేచ్ఛగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

అందుబాటులో లేని ధరలు

తెలుగు రాష్ట్రాల్లో ఉల్లి ధరలు రోజురోజుకు మండిపోతున్నాయి. సామాన్యులకు ఉల్లి కోయకుండానే కన్నీరు తెప్పిస్తోంది. రిటైల్ మార్కెట్లో కిలో వంద రూపాయలు అమ్మిన వ్యాపారులు ధరలను అమాంతం పెంచేశారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఉల్లి పేరు వింటేనే భయపడుతున్నారు. గత నెలలో కిలో ఉల్లిపాయలు 20 నుంచి 25 రూపాయలు ఉండేది. గతంలో 2000 పలికిన క్వింటా ఉల్లి ఇప్పుడు ఏకంగా 6 వేలకు పెరిగింది. దీంతో మార్కెట్లో ఉల్లి కిలో 80 రూపాయలకు చేరింది. తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కూరగాయల పంటలు నీట మునిగాయి. ఉల్లికి తీవ్ర కొరత ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు.

అధికారుల అలసత్వం

అధికారుల ఉదాసీన వైఖరి కూడా సామాన్యుల పాలిట శాపంగా పరిణమించింది. ప్రభుత్వ ఆధీనంలో నడిచే రైతు బజార్లలోనూ ఉల్లి ధర సామాన్యుడికి అందుబాటులో లేదని వాపోతున్నారు. ముందుగానే పరిస్థితిని అంచనా వేసిన వ్యాపారులు.. భారీ వర్షాలకు కొత్త స్టాక్ మార్కెట్‌కు వచ్చే అవకాశం లేదంటున్నారు. రైతుబజార్లలో సబ్సిడీపై విక్రయించాల్సిన ఉల్లిపాయలను నల్లబజారుకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉల్లి చోరీలకు పాల్పడుతున్న ఆగంతకులు

దేశంలోని పలు ప్రాంతాల్లో కిలో ఉల్లి 80 రూపాయలు చేరుకుంది. దీంతో ప్రతినిత్యం ఉల్లిని తప్పనిసరిగా వినియోగించే వారంతా.. ఉల్లిని తరగకుండానే కన్నీరు పెట్టుకుంటున్నారు. ధరలు అమాంతం పెరిగిన నేపథ్యంలో ఉల్లి బస్తాల దొంగతనాలు పెరిగిపోతున్నాయి. పూణెలోని ఓ గోదాములో నిల్వ ఉంచిన 550 కిలోల ఉల్లి చోరీ చేసేందుకు యత్నించారు. బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు గోదాములోని 38 బస్తాల ఉల్లిని చోరీ చేసేందుకు ప్రయత్నం చేశారన్నారు. దీనిని గమనించిన స్థానికులు అక్కడికి చేరుకుని ఒక దొంగను పట్టుకోగా, మరొక దొంగ బైక్ పై పరారయ్యాడు.

వినియోగం పెరిగితే పరిస్థితి ఏంటి.?

కరోనాకు ముందు సాధారణ పరిస్థితుల్లో ఉన్న వినియోగం కన్నా ప్రస్తుతం హోటళ్లు, హాస్టళ్లలో వినియోగం గణనీయంగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో గృహ అవసరాలకే కొనుగోలు జరుగుతోంది. అయినా ఉల్లి కొరత ఏర్పడటంతో అక్రమంగా నిల్వచేసిన దళారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మనకు నోబెల్ సాహిత్య పురస్కారం రాదా?

కొరివి సుందరరావు, లెక్చరర్

సాహిత్య రంగంలో ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారం ప్రకటించారు. 2019సంవత్సరానికి సంబంధించిన పురస్కారం అమెరికాకు చెందిన కవయిత్రి లూయిస్ గ్లక్ ను వరించింది. ఆమె కనెక్టికట్‌లోని యాలే యూనివర్సిటీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 1968 నుండి కవితా లోకంలో గౌరవ, మర్యాదలు పొందుతూ వున్నారు. సాహిత్య రంగంలో ఈమె చేసిన అపారమైన కృషి ఈ అత్యంత విలువైన పురస్కారాన్ని తెచ్చి పెట్టింది. నోబెల్ ప్రైజ్ స్థాపించినప్పటి నుండీ ఇప్పటి వరకూ ఎంపికైనవారిలో 16 మంది స్త్రీమూర్తులే కావడం విశేషం. లూయిస్ ఇంగ్లీష్ భాషలో సాహిత్య సృజన చేశారు. 2018, 2019 రెండు సంవత్సరాల పురస్కార గ్రహీతలను ఒకేసారి ఇప్పుడు ప్రకటించారు. 2018 సంవత్సరం పురస్కారం పోలాండ్ కవయిత్రి ఓల్గాకు దక్కింది. ఇద్దరూ మహిళామణులు కావడం విశేషం. భారతదేశం నుండి ఎప్పుడో 1913లో రవీంద్రనాథ్ ఠాగూర్‌కు దక్కింది. ఆ తర్వాత, ఈ 107 సంవత్సరాల్లో ఒక్క భారతీయునికీ సాహిత్యంలో నోబెల్ రాకపోవడం చాలా బాధాకరం.

ఆలోచనాత్మకం. ఒక్క సాహిత్యం తప్ప మిగిలిన విభాగాల్లో మనకు అనేకసార్లు వచ్చాయి. వారందరూ భారతదేశ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయిలో నిలిపారు. ఇది మనకు గర్వకారణం. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మెడిసిన్, ఎకనామిక్స్ మరియు శాంతి, సాహిత్యం మొదలైన 6 విభాగాల్లో కృషి చేసిన వారికి నోబెల్ ప్రైజ్‌ను నిర్ణయించారు.1901లో నోబెల్ పురస్కారం స్థాపించారు.భారతదేశం నుండే కాక, ఆసియా ఖండం నుండే మొట్టమొదటి నోబెల్ ప్రైజ్ అందుకున్న ఘనత కేవలం రవీంద్రనాథ్ ఠాగూర్ దే. శాంతి విభాగంలో మదర్ థెరీసా మొట్టమొదటి స్త్రీమూర్తి కావడం విశేషం.భారతీయులు, భారత మూలాలు కలిగినవారు, భారతదేశంలో పుట్టినవారందరూ కలిసి ఇప్పటి వరకూ 13 మంది ఈ ఘన గౌరవాన్ని పొందారు.మహితాత్ముడు అరవిందయోగి 1943 మరియు 1950లో సాహిత్యం, శాంతి విభాగాల్లో నోబెల్ కు ఎంపిక కావాల్సివుంది.కానీ రెండు సార్లు తప్పిపోయింది. 1937 నుండి 1947 మధ్య కాలంలో శాంతి విభాగంలో మహాత్మాగాంధీకి దక్కాల్సింది.ఐదు సార్లు ఈ ప్రక్రియ జరిగింది, కానీ తృటిలో తప్పిపోయిందని చెప్పాలి.నోబెల్ కమిటీ కార్యదర్శి 2006లో ఒక మాట అన్నాడు.” ఈ 106ఏళ్ళ నోబెల్ చరిత్రలో దీన్ని ప్రత్యేక మినహాయింపుగా చూడాలి”, అని వ్యాఖ్య చేశాడు.సాహిత్యం తప్ప మిగిలిన విభాగాల్లో, సి.వి.రామన్, అమర్త్యసేన్, కైలాష్ సత్యార్థి, హర్ గోవింద్ ఖురానా, సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్, వెంకి రామకృష్ణన్, అభిజిత్ బెనర్జీ మొదలైన వారు భారతదేశం నుండి నోబెల్ పురస్కారం పొంది, దేశ ప్రతిష్ఠను పెంచిన మహనీయులు. వీరి ప్రతిభ, సృజన, సేవ నిరుపమానమైనవి.వీరందరూ భారత జాతి రత్నాలుగా మన తలపుల్లో ఎప్పుడూ ఉంటారు. ప్రతిభకు, సృజనకు, కృషికి, సేవకు భారతదేశం ఏ మాత్రం తక్కువ కాదని వీరందరూ నిరూపించారు. కేవలం శాస్త్రాలు, శాంతి సేవ తప్ప సాహిత్యంలో భారతదేశం వెనకపడిందా? అనే ప్రశ్న మనలో ఎందరినో వెంటాడుతూనే ఉంది.భారతదేశం జ్ఞాన భూమి. వేద భూమి.సకల శాస్త్రాలు, సాహిత్యం పరమోన్నతంగా సృష్టించిన మహనీయులు తాండవమాడిన గురుపీఠం, ఋషి పీఠం. వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు, ఆదిశంకరాచార్యులు వంటి మహర్షులైన మహాకవులు చేసిన సారస్వత సృష్టి సామాన్యమైంది కాదు. అది గత చారిత్రక వైభవం. నన్నయ తిక్కనాదులు, పోతన, శ్రీనాథుడు వెలయించిన కవిత్వాన్ని కొలిచే తూకపురాళ్లు లేవు. వీరందరూ పూర్వులు. నోబెల్ పురస్కారం పుట్టక ముందు పుట్టిన మహాత్ములు. సుబ్రహ్మణ్యభారతి, కెఎంమున్షీ వంటి తమిళ, హిందీ కవులు, విశ్వనాథ, శ్రీశ్రీ వంటి ఆధునిక తెలుగు కవులు తక్కువవారు కారు. గుంటూరు శేషేంద్ర శర్మ పేరు ఒకసారి నోబెల్ నామినేషన్ పరిశీలనకు వచ్చినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.ఆయన చేసిన సృష్టి,బహుభాషా ప్రతిభ, ముఖ్యంగా ఆధునిక మహాభారతం కావ్య సృజన శేషేంద్రశర్మకు ఆ ఖ్యాతి, ఆ అవకాశం దక్కించి ఉంటాయి.నామినేషన్ కార్యరూపం దాల్చలేదు.ఏది ఏమైనా? మన శేషేంద్రశర్మ అక్కడ కాస్త సందడి చేయడం మనకు ఆనందదాయకం. ప్రతి భాషలోనూ మహాకవులు అవతరించారు.వారు సృష్టించిన సాహిత్యం అపురూపం.నోబెల్ పురస్కారం స్థాపించిన 1901 నాటి నుండి, భారతీయ భాషల్లో సాహిత్య సృజన జరుగలేదా, అంటే, ఎందుకు జరుగలేదు, జరిగింది.ఇప్పటి వరకూ నోబెల్ పురస్కారం గ్రహించిన సాహిత్యవేత్తల కంటే భారతీయులు ప్రతిభలోనూ, రసావిష్కరంలోనూ, కావ్యసృష్టి ప్రయోజనంలోనూ ఏమాత్రం తక్కువవారు కాదు.ఉన్న సమస్యల్లా... భాష.ఇప్పటి వరకూ 117



పురస్కారాలు సాహిత్యానికి దక్కాయి.అందులో ఇంగ్లీష్ -30, ఫ్రెంచ్, జర్మన్ భాషలు చెరి 14 ఉన్నాయి. సాహిత్యంలో మొట్టమొదటి పురస్కారం ఫ్రెంచ్ భాష కైవసం చేసుకుంది. రెండవ పురస్కారాన్ని జర్మన్ వశపరచుకుంది. నార్వే, ఇటాలియన్, స్పానిష్, డానిష్, రష్యన్,హంగేరియన్, టర్కిష్.. స్వీడిష్ ఇలా అనేక భాషల వారు గెలుచుకున్నారు. భారతదేశానికి చెందిన, రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన గీతాంజలి ఒక్కటే ఇప్పటి వరకూ నోబెల్ దక్కించుకుంది.అది కూడా ఇంగ్లీష్ లోనే వుంది.బెంగాలీని కూడా చేర్చారు.దీని తర్వాత భారతీయ భాషల్లో అంతటి సాహిత్య సృష్టి జరగలేదన్నది అవాస్తవం.గీతాంజలి తర్వాత మనకు ఎందుకు రాలేదో, విశ్లేషిస్తే? నోబెల్ కమిటీ నిర్ణయించిన, నిర్దేశించిన పారామీటర్లకు తగ్గట్టుగా మన సాహిత్య సృష్టి జరుగడం లేదన్నది ప్రధానమైన వాదన.ఇందులో ప్రధానమైనది భాష.రెండవది దృక్పథం.మూడవది స్థాయి అని చెప్పవచ్చు.నోబెల్ పురస్కారాన్ని నెలకొల్పిన వారు స్వీడిష్ జాతీయుడైన ఆల్ఫ్రెడ్ నోబెల్.ఈ మహనీయుని పేరునే ఈ పురస్కారాలు ప్రదానం చేస్తున్నారు.స్వీడిష్ భాషీయులకు పలుమార్లు ఈ అవార్డు దక్కినప్పటికీ, ఇంగ్లీష్ భాష అగ్రస్థానంలో నిలిచింది. భారతదేశం విభిన్న భాషల సమ్మేళనం. ఈ భాషలన్నీ మిగిలినవారికి చేరవు.నోబెల్ పురస్కారం ఎంపిక ప్రక్రియకు ఇదొక ప్రధాన అవరోధంగా చెప్పాలి.మనకు అనుకూలమైన భాష ఇంగ్లీష్ మాత్రమే.భారతీయులు నోబెల్ సాహిత్య పురస్కారం పొందాలంటే ఇంగ్లీష్ లోనే రాయాలి.లేదా రాసిన తర్వాత అందులోకి తర్జుమా జరగాలి. అమెరికన్, బ్రిటిష్ ప్రమాణాలలో ఆ ఇంగ్లీష్ ఉండాలి. ప్రపంచ మానవాళిని, జీవరాశిని దృష్టిలో పెట్టుకొని వస్తు నిర్దేశం చేసుకోవాలి.శాంతి స్థాపన ప్రధాన ఆలంబనగా సాగాలి. భాషలో, వస్తువులో, వ్యక్తీకరణలో, భావంలో అంత సృష్టి జరగాలి. ఇవన్నీ కుదిరితే కానీ మనకు నోబెల్ దక్కదు. ఈ 107 సంవత్సరాల్లో ఆ స్థాయిలో సృష్టి జరగలేదన్నది విశ్లేషకుల అభిప్రాయం.1913లో ఈ పురస్కారం గెలుచుకున్న రవీంద్రనాథ్ ఠాగూర్ తీరు వేరు. అతన్ని సగం ఆంగ్లేయుడుగా అభివర్ణిస్తారు.ఇంగ్లీష్ వారిలో ఆయనకున్న ప్రతిష్ఠ, అప్పటి పరిస్థితులు వేరు.అనేక కారణాల వల్ల రవీంద్రునికి నోబెల్ దక్కిందని సాహిత్య విమర్శకుల అభిప్రాయం.నోబెల్ అందుకోవడంలో శాస్త్రపరమైన అంశాల్లో ఆ స్థాయిని అందుకో గలిగాము కానీ, ఇంగ్లీష్ సాహిత్య సృష్టిలో అందుకోలేక పోయామన్న విషయం మనం ఒప్పుకొని తీరాలి. కాళిదాస్ సమ్మాన్, జ్ఞానపీఠ్, కేంద్ర సాహిత్య అకాడెమీ మొదలైన పురస్కారాలు పొందిన సాహిత్య వేత్తల ప్రతిభను తక్కువగా అంచనా వెయ్యలేము. కానీ, నోబెల్ స్థాయికి చేరలేక పొయ్యమనేది అగ్రశ్రేణి పరిశీలకుల అభిప్రాయం. దీనిపై సాహిత్య వేత్తలు, భాషావేత్తలు ఇప్పటికైనా దృష్టి సారించాలి. ఆ స్థాయిని చేరుకునేట్టుగా ప్రభుత్వాలు నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టాలి. బ్రిటిష్, వాషింగ్టన్, ఆక్సఫర్డ్, యాలే యూనివర్సిటీ, వాటికన్, వెనిస్, బోస్టన్, ఒట్టావా, న్యూయార్క్ లైబ్రరీలు ప్రపంచంలో చాలా గొప్పవి. ఈ స్థాయి లైబ్రరీలను ఏర్పాటుచేసుకోవడం కూడా చాలా ముఖ్యమైన అంశం.మన సాహిత్యాన్ని అనువాదం జరిపి, ప్రపంచంలోని ప్రధానమైన గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలి. ఇంగ్లీష్‌లో మన స్థాయి ఇంకా ఎన్నో రెట్లు పెరగాలి. ఆలోచన, సృజన స్థాయిలు విశ్వమానవుని స్థాయికి, నోబెల్ పారామీటర్ల స్థాయికి ఎదగాలి. అప్పుడు భారతీయులకూ సాహిత్యంలో నోబెల్ దక్కుతుంది. నోబెల్ పురస్కారం గెలుచుకోవడం మనకు కొత్తకాదు.సాహిత్య రంగంలో మాత్రమే ఉన్న ఆ ఒక్క వెలితిని తీర్చుకోవాలి.భాషా సాహిత్యాల కృషి, సృజనకు ప్రభుత్వాల నుండి ప్రోత్సాహం, మద్దతు, వనరుల సహకారం పెద్ద ఎత్తున లభించాలి. ఇవన్నీ జరిగిననాడు మనం మళ్ళీ సాహిత్యానికి నోబెల్ దక్కించుకుంటాం. దక్కించుకుంటూనే ఉంటాం. ఈ దిశగా ఆత్మవిశ్వాసంతో పాటు ఆత్మావలోకనం, సాధన కూడా పెంచుకుందాం.

రిజర్వేషన్లు ప్రతిభ లేని సోమరిపోతుల కోసం కల్పించిన పథకాలు కాదు..

ప్రతిభ ఉండే అవకాశాలు దక్కకుండా కట్టడి చేయబడిన పీడితులకు అన్యాయం జరగకుండా చేయబడిన రక్షణాలు...

జోద్ పూర్ రైల్వేస్టేషన్ లో కూర్చొని రైలు కోసం చూస్తున్న ఈ మహిళ పేరు అల్కా లాంబా. ఢిల్లీలోని చాందినీ చౌక్ నియోజకవర్గ ప్రస్తుత ఎమ్మెల్యే. విఐపి కల్చర్ కనిపించడం లేదు. సెక్యూరిటీ మచ్చుకు లేదు. కనీసం చుట్టూ చమ్చాగిరీ కూడా లేదు. ఆమ్ ఆద్మీ (సామాన్య) రాజకీయ నాయకురాలు. దేశం మొత్తం మీద ఇలా సెక్యూరిటీ అవసరం లేని రాజకీయ నాయకులు, సామాన్య ప్రజల కోసం పనిచేసే నాయకులు రావాల్సిన అవసరముప్పది.

ఆయన పాటలు రసగుళికలు...

- కొడుకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్

పాటలో భావానికి తగిన సంగీతాన్ని ఆయన జోడిస్తే, ఆయన సమకూర్చిన సంగీతం వల్ల ఆ భావం మరింత ప్రస్ఫుటమయ్యేది. ఆయనే సాలూరు రాజేశ్వరరావు. ఆయన పాటల్లోని మాధుర్యం వల్ల ఆయనను అభిమానులు 'రాసాలూరు' రాజేశ్వరరావు అని ప్రేమగా పిలుచుకునేవారు. అందరి సంగీత దర్శకుల వ్యవహార శైలి ఒకటిగా వుంటే రాజేశ్వరరావు శైలి తద్భిన్నంగా, వినూత్నంగా వుండి, అందరి దృష్టిని ఆకర్షించేది. ఆత్మాభిమానానికి రాజేశ్వరరావు ఇచ్చిన విలువ ధనార్జనకు ఇవ్వలేదంటే ఆశ్చర్యం వేస్తుంది. తను నమ్మిన సిద్ధాంతాన్ని ఏనాడూ సడలించని మనస్తత్వం రాజేశ్వరరావుకు సొంతం. పాటను బట్టి వాయిద్యాల నిర్ణయం జరగాలే తప్ప వున్నాయి కదా వాయిద్యాలు వాడుకుందాం అనే భావన ఎప్పుడూ ఆయన దరిచేరనీయ లేదు. జానపద, సాంఘీక చిత్రాల పాటలకు ఎన్ని వాయిద్యాలు వుండాలి, పాశ్చాత్య ధోరణి పాటకైతే ఎన్ని వాయిద్యాలు వుండాలి అనే ఖచ్చితమైన లెక్కలు రాజేశ్వరరావు దగ్గర వుండేవి. జానపద పాటలకు ఫ్లూటు, డప్పులు, జముకు, డోలక్, క్లారినెట్, పంజా, షెహనాయి వంటి వాయిద్య పరికరాలను రాజేశ్వరరావు వాడేవారు. వెస్టర్న్ పాటలకు యాభైకి పైగా వయొలిన్లు వాడిన సందర్భాలు రాజేశ్వరరావుకు కోకొల్లలు. 'చంద్రలేఖ' సినిమాలో సెల్లోలు, హెమాండ్ ఆర్గాన్, ఎలక్ట్రిక్ గిటార్, ట్రంపెట్లు, ట్రంబోన్, సింతసైజర్, జిప్సీలు వాడే వాయిద్య పరికరాలు ఉపయోగించి ఒక నూతన ఒరవడి సృష్టించిన ఘనత ఆయనది. ఈరోజు 'సాలూరు' (అక్టోబర్ 11 జయంతి. అక్టోబర్ 23 వర్ధంతి. ఈ సందర్భంగా ఆయనను స్మరించుకుందాం. ఒక క్లాసిక్‌గా నిలిచిపోయిన 'మల్లీశ్వరి' చిత్రంలో 'మనసున మల్లెల మాలలూగెనే' పాట రికార్డింగుకు ముందు రిహార్సల్స్ జరుగుతున్నాయి. భానుమతి ఆ పాటను ప్రాక్టీస్ చేస్తూ రాజేశ్వరరావు చెప్పిన పద్ధతిలో కాకుండా తనదైన శైలిలో పాడుతోంది. రాజేశ్వరరావుకు ఆమె పద్ధతి నచ్చలేదు. 'అలలు కొలనులో గలగలమనినా' చరణాన్ని ఇలా పాడాలి అని రాజేశ్వరరావు మరోసారి బాణీని పాడి వినిపించారు. భానుమతికి ఉక్రోషం వచ్చింది. 'నేనూ సంగీతంలో మాస్టర్నే' అని పెడసరంగా బదులిచ్చింది. రాజేశ్వరరావు ఏమీ మాట్లాడలేదు. బాత్ రూముకు వెళ్ళినట్లే వెళ్లి ఇంటికి వెళ్లిపోయారు. ఇది జరిగినప్పుడు దర్శకుడు బి.ఎన్.రెడ్డి అక్కడ లేరు. గంటన్నర తరువాత వచ్చి చూస్తే ఆర్కెస్ట్రా వాళ్లు మాత్రమే వున్నారు. రాజేశ్వరరావు కనపడలేదు. తబలా వాద్యకారుడు లక్ష్మణరావు జరిగిన విషయాన్ని బి.ఎన్.రెడ్డికు వివరించి చెప్పాడు. బి.ఎన్.రెడ్డి హుటాహుటిన రాజేశ్వరరావు ఇంటికి వెళ్ళారు. 'ఈ సినిమా చేయడానికి నాకు ఏమీ అభ్యంతరం లేదు. భానుమతికి ఉందేమో కనుక్కోండి' అంటూ రాజేశ్వరరావు తనదైన శైలిలో చెప్పారు. బి.ఎన్. భానుమతికి కబురంపి గట్టిగానే మందలించారు. భానుమతి రికార్డింగుకు వచ్చి రాజేశ్వరరావు చెప్పిన పద్ధతిలోనే పాడింది. పాట రికార్డు చేశారు. రికార్డింగ్ అయ్యాక అందరూ ఆ పాట ఎలా వచ్చిందోనని వింటున్నారు. 'అలను కొలనులో' చరణం వచ్చింది. భానుమతి లేచివచ్చి రాజేశ్వరరావుకు ప్రణామం చేసింది. 'మాస్టారూ, హాట్స్ ఆఫ్. ఇప్పుడు వింటుంటే నాకు తెలుస్తోంది మీరు నన్ను ఎందుకు హెచ్చరించారోనని. నేనే కాదు మున్ముందు మీరు చెప్పినదానికి ఎవరు అడ్డు చెప్పినా వారికి పాడే అర్హత వుండదు' అంటూ నమస్కారం మీద నమస్కారం చేస్తూ చెప్పింది. రాజేశ్వరరావు, బి.ఎన్.రెడ్డిలు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. విజయా వారి ప్రతిష్ఠాత్మక చిత్రం 'మాయాబజార్' (1957) సినిమాకు మొదట సంగీత దర్శకుడిగా నియమించింది రాజేశ్వరరావునే. అందులో 'చూపులు కలసిన శుభవేళా', 'లాహిరి లాహిరి లాహిరిలో', 'నీవేనా నను తలచినది నీవేనా నను పిలచినది', 'నీ కోసమే నే జీవించునదీ' పాటలకు స్వరాలల్లి, మ్యూజిక్ బిట్లు కూడా సమకూర్చినది రాజేశ్వరరావే. అయితే మ్యూజిక్ సిట్టింగులలో చక్రపాణి జోక్యాన్ని రాజేశ్వరరావు జీర్ణించుకోలేక పోయారు. దాంతో ఆ సినిమాకు పనిచేయనని తప్పుకున్నారు. 'బాణీలు కట్టేటప్పుడు సంగీత దర్శకునికి స్వేచ్ఛ వుండాలి. సంగీత జ్ఞానం లేనివాళ్లు ఎంతపెద్ద నిర్మాతలైనా జోక్యం చేసుకుంటే మంచి సంగీత సృష్టి జరగదు' అని గట్టిగా నమ్మిన వ్యక్తి రాజేశ్వరరావు. అంతేకాదు ఆత్మాభిమానానికి అత్యంత విలువనిచ్చే సంగీత స్రష్ట కూడా! అన్నపూర్ణా సంస్థ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావుకు సాలూరు రాజేశ్వరరావు అన్నా, అతని సంగీతమన్నా విపరీతమైన అభిమానం. అన్నపూర్ణా పిక్చర్స్ సినిమాలకు సంగీత సారథి రాజేశ్వరరావే. వారు తొలి సినిమా 'దొంగరాముడు' నిర్మించదలచినప్పుడు రాజేశ్వరరావునే సంగీత దర్శకుడిగా

తీసుకోవాలనుకున్నారు. అయితే రాజేశ్వరరావును భరించడం కష్టమని కొందరు సలహా ఇవ్వడంతో ఆ ప్రతిపాదన విరమించుకున్నారు. తరువాత 'వెలుగు నీడలు' సినిమాకు రాజేశ్వరరావును సంగీత దర్శకుడిగా అనుకున్నా, కబురంపితే రాజేశ్వరరావు రాలేదు. ఆ అవకాశాలు పెండ్యాలకు దక్కాయి. తరవాత ఒకానొక సందర్భంలో ఇద్దరూ కలవడం జరిగింది. అన్నపూర్ణా చిత్రాలకు పనిచెయ్యరా అని దుక్కిపాటి అడిగిన ప్రశ్నకు రాజేశ్వరరావు తనదైన శైలిలో బదులిచ్చారు. 'మీరు చాలా నిబద్ధతతో ఉంటారని. సమయానికి రాకపోతే కోప్పడతారని మా ఆర్కెస్ట్రా వాళ్లు చెప్పారు. భయపడి రాలేదు' అనేది ఆ జవాబు. దాంతో రాజేశ్వరరావు 'ఇద్దరు మిత్రులు' చిత్రంతో అన్నపూర్ణలో అడుగుపెట్టి అజరామరమైన సంగీతాన్ని అందించారు. రాజేశ్వరరావు ఇంటికి దుక్కిపాటి కారు పంపేవారు. 'రాజేశ్వరరావు ఎప్పుడు వచ్చి కారెక్కితే అప్పుడే తీసుకురా. అంతేగాని, కారొచ్చింది ఎక్కండి అని మాత్రం అనవద్దు' అని డ్రైవర్‌ను హెచ్చరించి మరీ పంపేవారు. రాజేశ్వరరావు మనసెరిగి, ఆయన వీలున్నప్పుడు వచ్చి పాటలకు బాణీలు కట్టే విధంగా వాతావరణాన్ని సృష్టించడం చేతనే అన్నపూర్ణ వారి సినిమాలకు అత్యద్భుతమైన పాటలు పురుడు పోసుకొని నేటికీ శ్రోతలకు వీనుల విందు చేస్తున్నాయి. వృత్తి ధర్మాన్ని నమ్ముకున్న రాజేశ్వరరావు డబ్బు కోసం ఆత్మాభిమానాన్ని అమ్ముకోలేదు సరికదా సంగీత సరస్వతికి అపచారం జరిగితే సహించలేదు కూడా. నిర్మాతల సరళి నచ్చక 'కృష్ణవేణి' సినిమాను వదలుకున్నారు. ఎన్.టి.రామారావు సినిమాలు కూడా వదలుకున్న సందర్భాలు లేకపోలేదు. రామారావు సంస్థలో సంగీత చర్చలు జరుగుతున్నాయి. త్రివిక్రమరామారావు పదేపదే సలహాలు ఇస్తుండడం రాజేశ్వరరావుకు నచ్చలేదు. వెంటనే ఆయన లేచి ఎన్టీఆర్ వద్దకు వెళ్లి 'సార్....మీ ఇంటిలో మంచి సంగీత దర్శకుడు వున్నారు. ఆయన ఎవరో కాదు మీ తమ్ములుంగారే. వారితో చేయించుకోండి' అంటూ వెళ్లిపోయారు. ఈ సంఘటన ఎన్టీఆర్ ప్రతిష్టాత్మక చిత్రం 'సీతారామ కల్యాణం' విషయంలోనే జరిగింది. ఆ సినిమాకు తొలుత సంగీత దర్శకుడు రాజేశ్వరరావే. 'కానరార కైలాస నివాసా' పాటకు స్వరకర్తగ రాజేశ్వరరావే. ఈమని శంకర శాస్త్రి చేత రావణాసుర దండకానికి, ఆ పాటకు కూడా బిట్లు స్వరపరచిన మేధావి రాజేశ్వరరావు. కానీ త్రివిక్రమరామారావు జోక్యం సహించలేక బయటకు వచ్చేశారు. తరువాత గాలి పెంచల నరసింహారావు ఆ చిత్రానికి సంగీతం సమకూర్చారు. రాజేశ్వరరావు సరదా మనిషి. హాస్యప్రియత్వం ఎక్కువ. ఒకసారి ఒక నిర్మాత రాజేశ్వరరావుకు ఫోను చేసి 'కారు రిపేరులో వుంది. మీరు ఆటోలో రండి' అని చెప్పారు. రాజేశ్వరరావుకు కోపం వచ్చింది. రెండు గంటలు ఆలస్యంగా స్టూడియోకి చేరుకున్నారు. నిర్మాత 'సార్... బాగా ఆలస్యమైనట్లుందే' అని అడిగారు. 'అవున్ సార్.. తమరు ఆటోలో రమ్మన్నారు కదా. ఎక్కడా ఆటో దొరకలేదు. ఒక టాక్సీ దొరికింది. దాన్నెక్కి ఆటో కోసం తిరిగి తిరిగి, ఆ ఆటోని పట్టుకునేసరికి ఇంత టైమయింది. ఇవిగో టాక్సీ, ఆటో బిల్లులు' అంటూ చేతికందించారు. నిర్మాత బిక్కమొగం వేశాడు.

విశాఖలో మెట్రో ఆఫీస్

విశాఖపట్నం హైదరాబాద్‌తో సరిసాటి నగరం. ఆ మాటకు వస్తే బెంగళూర్, చెన్నై, ముంబైలకు ఎక్కడా తీసిపోదు. ఇక సీ, ఎయిర్, రోడ్, రైల్ కనెక్టివిటీ ఉన్న సిటీగా విశాఖ మరో ప్రత్యేకం.

ఎటూ విశాఖ పాలనా రాజధాని అంటున్నారు. కాబట్టి రావాల్సిన హంగులన్నీ రావాలి కదా. ఆ మాటకు వస్తే వైఎస్సార్ ఉమ్మడి ఏపీకి సీఎం గా ఉన్న టైంలోనే విశాఖకు మెట్రో రైలు మంజూరు చేశారు. ఆ తరువాత అది పడకేసింది. మళ్ళీ ఇన్నాళ్ళకు ఆ ఫైళ్ళ బూజు దులిపి సీఎం జగన్ విశాఖలో మెట్రో కూత వినిపించేలా చర్యలు తీసుకుంటున్నారు.

విశాఖలో లైట్ మెట్రో రైలుతో పాటు మోడర్న్ ట్రామ్ కారిడర్ ప్రాజెక్టులను చేపట్టాలని జగన్ సర్కార్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. వీటి కోసం మొత్తం మీద 22 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు వేశారు. వీటికి సంబంధించిన డీపీఆర్ నివేదికలు నవంబర్ నాటికి ప్రభుత్వం చేతికి వస్తాయి.

ఆ తరువాత పనులు కూడా మొదలవుతాయి.

ఇవన్నీ ఇలా ఉంటే విశాఖ పాలనా రాజధానిగా ప్రకటించాక తొలి ప్రభుత్వ ఆఫీస్ ఒకటి నగరానికి రాబోతోంది. అదేంటి అంటే ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాంతీయ కార్యాలయం విశాఖకు తరలించనున్నారు. నెలాఖరులో ఈ ఆఫీస్ ప్రారంభం తరువాత విశాఖలో మెట్రో కూతకు అవసరమైన ఏర్పాట్లు మొదలవుతాయని అంటున్నారు. మొత్తానికి ఇది విశాఖవాసులకు శుభవార్తే.

నగదు స్వాధీనం, ఉద్రిక్తంగా దుబ్బాక

బీజేపీ అభ్యర్థి రఘునందనరావు బంధువుల నివాసంలో నగదు స్వాధీనం

రఘునందన్ రావు లక్ష్యంగా పోలీసు దాడులు :

వాల్మీకి, సీనియర్ జర్నలిస్ట్

దుబ్బాక ఉపఎన్నిక నేపథ్యంలో సిద్దిపేటలో పోలీసుల తనిఖీలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు, ఆయన బంధువుల ఇళ్లలో రెవెన్యూ, పోలీసు అధికారులు సోదాలు నిర్వహించడం ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ క్రమంలో పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య జరిగిన వాగ్వాదం, నినాదాలతో సిద్దిపేట రణరంగంగా మారింది. సోదాల్లో పోలీసులు రూ. 18.65 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో రఘునందన్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ నేతల ఆరోపణలు

పోలీసుల సోదాలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రచారంలో ఉన్న రఘునందన్‌రావు, బీజేపీ శ్రేణులు హుటా హుటీన సిద్దిపేటలోని బంధువుల ఇంటికి చేరుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సెర్చ్ వారంట్ లేకుండా పోలీసులు సోదాలు చేయడాన్ని ఆయన నిరసించారు. పోలీసులే నగదును పెట్టి బీజేపీపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీని ఓడించేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపన్నుతోందని రఘునందన్‌రావు విమర్శించారు. పోలీసులు, బీజేపీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదులో 12 లక్షలు గల బ్యాగ్ ని కార్యకర్తలు లాక్కెళ్లారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

బండి సంజయ్ అరెస్టు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, చింతల రామకృష్ణా రెడ్డి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎంపీ వివేక్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డిలు సిద్ధిపేట చేరుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా బండి సంజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కరీంనగర్ లోని ఆయన నివాసంలో దించారు. పోలీసులు తనపట్ల దౌర్జన్యంగా వ్యవహరించారని సిద్దిపేట కమిషనర్ ను బదిలీ చేయాలని సంజయ్ డిమాండ్ చేశారు. సీఎం ఆదేశాల మేరకే పోలీసులు నడుచుకుంటున్నారని ఆరోపించారు. సీఎం ఫాంహౌస్ నుంచే టీఆర్ ఎస్ డబ్బులు పంచుతోందని ఆరోపిస్తూ, ఆ ఫాంహౌస్‌లో సోదాలు

నిర్వహించే సత్తా పోలీసులకు ఉందా అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి ఖండించారు.

ఓడిపోతామనే నైరాశ్యంలో బీజేపీ

బీజేపీ తీరును ఆర్థిక మంత్రి హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. మూడో సారి కూడా ఓడిపోతామనే భయంతో బీజేపీ డబ్బును వెదజల్లేందుకు సిద్ధపడిందన్నారు. ఓటమి భయంతో బీజేపీ తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతోందని ఈ ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్ కూడా దక్కదని హరీష్‌రావు అన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగానే పోలీసులు సోదాలు నిర్వహించారని ఇందులో ప్రభుత్వ ప్రమేయం లేదని అన్నారు, టీఆర్ఎస్ నేతల ఇళ్లలోనూ పోలీసులు తనిఖీలు చేశారని హరీష్‌రావు అన్నారు. టీఆర్ఎస్ నేతలు పోలీసులు తనిఖీలు చేస్తే సహకరించారని... బీజేపీ నేతలు మాత్రం గోబెల్స్ ప్రచారం చేస్తూ ఉప ఎన్నికల్లో సానుభూతి కోసం వెంపర్లాడుతున్నారని హరీష్ రావు విమర్శించారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు ఉంచిన నగదుతో అడ్డంగా దొరికినా బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. ఈ నేపథ్యంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్థానిక నేతలతో మాట్లాడి ఘటన గురించి తెలుసుకున్నారు. ఘటనపై బీజేపీ ఎన్నికల సంఘానికి టీఆర్ఎస్ పై ఫిర్యాదు చేశారు.

బీజేపీ కార్యకర్తలు టీఆర్ఎస్ లో చేరిక

మరోవైపు దుబ్బాకలో పలువురు కాంగ్రెస్ బీజేపీ కార్యకర్తలు హరీష్‌రావు ఆధ్వర్యంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకూ నెరవేర్చలేదని మండిపడ్డారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు మంజూరు చేయడంలేదని విమర్శించారు. బీజేపీ మునిగే పడవ కనుకనే ఆ పార్టీ కార్యకర్తలు విజయపథంలో దూసుకుపోతున్న టీఆర్ఎస్ లో చేరుతున్నారని అన్నారు.

ఉద్రిక్త పరిస్థితులకు కారణం ?

దుబ్బాక ఉప ఎన్నికలపై టీఆర్ఎస్ బీజేపీలు పరస్పర విమర్శలు దిగుతున్నారు. తొలుత విజయంపై బీజేపీ ధీమా గా ఉన్నప్పటికీ హరీష్‌రావు దుబ్బాక ప్రచారంలోకి దిగడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయినట్లు సమాచారం. షామీర్ పేటలో రఘునందన్ అనుచరుడి కారు నుంచి పోలీసులు రూ. 40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కొద్ది రోజుల క్రితం బీజేపీ నాయకుడి కారునుంచి రూ. 7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటిపై రఘునందన్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అయితే బీజేపీ టీఆర్ఎస్ కంటే హరీష్ రావు పైనే విమర్శలకు దిగడంతో పరిస్థితి మరింత దిగజారింది. దుబ్బాకలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మూడో సారి ఎన్నికల బరిలో నిలిచారు.

రెండో స్థానం కోసం పోటీ?

నియోజకవర్గంలో సానుభూతి అధికార పార్టీకే ఉందని తెలుసున్న ప్రతిపక్షాలు రెండవ స్థానం కోసం పోటీ పడుతున్నాయని టీఆర్ఎస్ నాయకులు అంటున్నారు. చెరుకు శ్రీనివాస్‌రెడ్డి టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరేవరకు ఆ పార్టీకి బలమైన అభ్యర్థి లేడు. ధరావతు దక్కించుకునే స్తోమత కూడా లేదు.అయితే బీజేపీ మాత్రం మూడోసారి రఘునందన్‌నే బరిలోకి దించింది. ప్రారంభంలో బీజేపీ అభ్యర్థి ముందున్నప్పటికీ ప్రచారంలో హరీష్‌రావు అమలు చేస్తున్న వ్యూహాలతో పరిస్థితులు తారుమారయినట్లు స్పష్టంగా తెలుస్తోంది. తనపై నమ్మక ముంచి పార్టీ అభ్యర్థి సుజాతను గెలిపించాలని నియోజక వర్గ అభివృద్ధిని తాను చూసుకుంటానని హరీష్‌రావు ఇచ్చిన హామీకి విస్తృత ప్రచారం జరగడంతో ఓటర్లు టీఆర్ఎస్ వైపు మొగ్గినట్లు సమాచారం.

వాస్తవంగా ఏం జరిగింది?

పోలీసులు సిద్ధిపేట లెక్చరర్స్ కాలనీలోని రఘునందన్‌రావు బంధువు అర్జున్‌రావు నివాసంలో తనిఖీలు చేపట్టారు. సోదాల్లో భాగంగా రూ. 18.67 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు ఇంటి నుంచి వెళ్ళిపోయే సమయంలో రఘునందన్‌రావుతో పాటు బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. పోలీసులకు బీజేపీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. దాదాపు రూ. 12 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ను పోలీసుల నుంచి కార్యకర్తలు లాక్కుని పారిపోయారు. బీజేపీ నేతలు మాత్రం పోలీసులే నగదు ఉంచి తమ పార్టీని బదనాం చేయడానికి కుట్రపన్నారని ఆరోపించారు.

పోలీసులు ఏ మంటున్నారు?

సోదాలు, వాగ్వాదం అనంతరం సిద్దిపేట కమిషనర్ జోయల్ డేవిస్ వివరణ ఇచ్చారు. తమకు వచ్చిన సమాచారంతో మూడు చోట్ల తనిఖీలు చేశామన్నారు. రఘునందన్ మామ, సిద్ధిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు నివాసం, ఎస్. రామగోపాలరావు, ఎస్.అర్జున్‌రావు నివాసాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. సెర్చ్ వారంట్‌ను కుటుంబ సభ్యులకు అందజేశామని కమిషనర్ అన్నారు. అర్జునరావు నివాసంలో నగదును దుబ్బాక ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు తెచ్చినట్లు కమిషనర్ తెలిపారు. పోలీసుల వద్ద నుంచి నగదు లాక్కెళ్లిన వారిని త్వరలో అరెస్టు చేస్తామని అన్నారు. అయితే అర్జున్ రావు వాదన మరోలా ఉంది. సివిల్ డ్రస్‌లో వచ్చిన 40 మంది పోలీసులు ఇంట్లోకి ప్రవేశించి మొబైల్ ఫోన్లు లాక్కుని దౌర్జన్యానికి పాల్పడ్డారని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నిరసనలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్ కు నిరసనగా బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు మంగళవారం నాడు భారీ ఎత్తున నిరసనలకు దిగారు. సికింద్రాబాద్ పారడైజ్ వద్ద బీజేపీ కార్యకర్తలు రాస్తా రోకో చేపట్టారు. దీంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అవడంతో బీజేపీ నేతలను పోలీసులు అరెస్టు చేసి, నాంపల్లి పోలీస్ స్టేషన్ తరలించారు. ఇసీఐఎల్ చౌరస్తా, మౌలాలి హౌసింగ్ బోర్డ్ వద్ద సీఎం కేసీఆర్ బొమ్మను దగ్ధం చేశారు. నిరసన చేస్తున్న బీజేపీ కార్యకర్తలను కుషాయిగూడ పోలీసులు అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి నివాసం 'ప్రగతి భవన్' ముట్టడికి ప్రయత్నిస్తున్న బీజేపీ కార్యకర్తలను అదుపు చేయడానికి పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

❍○০○❍

రెవెన్యూ సేవల్లో విప్లవాత్మక మార్పులు: కేసీఆర్

సదబైనమాను మరో వారం పొగిస్తున్నాం..సద్వినియోగం చేసుకోవాలని సీఎం కేసీఆర్ పిలుపు

కె.బి.రమేష్ సీనియర్ జర్నలిస్ట్

తెలంగాణ రాష్ట్రంలో ఇవాళ్టి నుంచి ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ... ధరణిపోర్టల్ భారతదేశానికి ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందన్నారు. "ఒకప్పుడు భూమి ఉత్పత్తి సాధనం మాత్రమే. సాగువిధానంలో అధునాతన మార్పులు వచ్చి ఆస్తిగా మారింది. రైతుల భూములకు సంపూర్ణ రక్షణ ఉండాలని ధరణి పోర్టల్ రూపకల్పన చేశాం. కోటి 45 లక్షల 58 వేల ఎకరాల భూముల వివరాలు ధరణి పోర్టల్‌లో ఉన్నాయి. విదేశాల్లో ఉన్న వాళ్లు కూడా వారి భూముల వివరాలు ఈ పోర్టల్ ద్వారా చూసుకోవచ్చు. ధరణి పోర్టల్‌తో అక్రమ రిజిస్ట్రేషన్లకు తావు ఉండదు. ఒక తప్పు జరిగితే భవిష్యత్ తరాలు ఇబ్బందులు పడతాయి. తప్పటడుగులు లేకుండా కఠినంగా నిర్ణయాలు తీసుకున్నాం. మీ-సేవ, ధరణి పోర్టల్, వ్యక్తిగతంగా కార్యాలయానికి వెళ్లి భూముల రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ధరణి పోర్టల్ నమూనా పత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. నమూనా పత్రాల ఆధారంగా ఎవరికి వారే రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవచ్చు" అని సీఎం వివరించారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచలేదు

తెలంగాణలో ఇవాళ్టి నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ రిజిస్ట్రేషన్లు జరగవని సీఎం స్పష్టం చేశారు. ధరణి పోర్టల్ రూపకల్పన కోసం దాదాపు 200 సమావేశాలు నిర్వహించామని గుర్తు చేశారు. "కొత్తగా జరిగే క్రయ,విక్రయాల నమోదు 15 నిమిషాల్లో పూర్తి అవుతుంది. కార్యాలయాల చుట్టూ తిరిగే కర్మ ఇకపై ఉండదు. రిజిస్ట్రేషన్ల కోసం పైరవీలు చేసే అవసరం ఉండదు. రిజిస్ట్రేషన్ ఛార్జీల్లో ఒక్క పైసా కూడా పెంచలేదు. పాత రిజిస్ట్రేషన్ ఛార్జీలే వర్తిస్తాయి. ధరణి పోర్టల్‌లో 99శాతం సాంకేతిక సమస్యలు రాకుండా రూపకల్పన చేశాం. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించే బృందాలు అందుబాటులో ఉంటాయి. ఒక వేళ డాక్యుమెంట్ రైటర్ల సహాయం కావాలంటే వాళ్లు కూడా అందుబాటులో ఉంటారు. డాక్యుమెంట్ రైటర్లు గతంలో లాగా ఎలాపడితే అలా రుసుం వసూలు చేసేందుకు వీల్లేదు" అని కేసీఆర్ స్పష్టం చేశారు. మూడుచింతలపల్లికి ప్రత్యేకమైన గౌరవం దక్కిందని సీఎం కేసీఆర్ అన్నారు. తెలంగాణ ముద్దుబిడ్డ వీరారెడ్డి 1969లో రాష్ట్రం కోసం పోరాటం చేసిన వారిలో అగ్రగణ్యులని గుర్తు చేశారు. ఆ మహనీయుడు పుట్టిన గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని భావించి ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ రాష్ట్రం కావాలని పోరాడి జైలుపాలైన వ్యక్తుల్లో వీరారెడ్డి ఒకరు అని కేసీఆర్ వివరించారు. కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. భూ రికార్డుల ప్రక్షాళన చేపడతామని మూడేళ్ల క్రితం మూడుచింతలపల్లిలోనే సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో ధరణి పోర్టల్ ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రోడ్ టెర్రర్

కె.చంద్రశేఖర్

దేశంలో ప్రతి రోజూ సగటున రోడ్డు ప్రమాదాలలో 400 మంది ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. వీరిలో అత్యధికులు రేపటి పౌరులే ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్న వారిలో 54 శాతం యువతేనని ప్రమాదాల వల్ల 60వేల కోట్ల రూపాయల నష్టం కలుగుతుందని ప్రభుత్వమే చెబుతుంది.

ఎయిడ్స్, కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులవల్ల చనిపోయే వారికంటే రహదారి ప్రమాదాలే యువతను బలిగొంటున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. స్వీడన్ రోడ్డు భద్రత విషయంలో ప్రపంచానికే ఆదర్శంగా ఉంది. అక్కడ రహదారులు అత్యంత సురక్షితంగా ఉన్నాయి. భద్రత ప్రమాణాల విషయంలో సర్కార్ ఏమాత్రం రాజీపడటం లేదు. స్వీడన్‌లో కార్లసంఖ్య బాగా పెరిగినప్పటికీ ప్రమాదాల సంఖ్య భారీగా తగ్గింది. రహదారుల మీద వేగం కన్నా భద్రతకే పెద్దపీట వేయడమే దీనికి కారణంగా కనిపిస్తుంది.

రహదారులు ప్రగతి ప్రతీకలని, నాగరికతకు ప్రతిబింబించాలని అనడం సర్వసాధారణం. ఆచరణలో చూస్తే మృత్యువుకి మార్గాలని, నరకానికి దగ్గర దారులని అర్ధమవుతుంది. ఆఫ్ఘనిస్థాన్, చైనాలను మించిన ప్రమాదకర ప్రాంతాలు దేశంలోనే ఉన్నాయంటే అతిశయోక్తికాదు. ప్రపంచం మొత్తం మీద భారతదేశంలోనే రెండో అతిపెద్ద రహదారి వ్యవస్థ ఉంది. 47.2 లక్షల కిలోమీటర్లకుపైగా రోడ్లు విస్తరించి ఉన్నాయి. వాటిలో జాతీయ రహదారుల వాటా 2.1 శాతం. వీటిపై సంభవిస్తున్న ప్రమాదాలు మాత్రం 28 శాతం దాటింది. ప్రపంచంలో ఎక్కడా లేనన్ని రోడ్డు ప్రమాదాలు మృతుల సంఖ్య భారత్‌లో ఎక్కువగా ఉన్నాయి.



విశ్వవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో బలి అవుతున్న వారు 12.6 లక్షలకు మించి ఉన్నారు. భారత్‌లో వీరి సంఖ్య లక్షా యాభైవేలు దాటడంఆందోళన కలిగించే అంశం. క్షతగాత్రుల సంఖ్య దానికి నాలుగింతలు ఉంటుంది.

దేశంలో ప్రతి రోజూ సగటున రోడ్డు ప్రమాదాలలో 400 మంది

ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. వీరిలో అత్యధికులు రేపటి పౌరులే ఉంటున్నారు.

ప్రతి లక్ష జనాభాకు రహదారి మరణాల రేటును 3 నుంచి 4కు పరిమి తం చేయడంలో స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మాల్దీవులు, డెన్మార్క్ సింగపూర్, ఇజ్రాయేల్ పోటీపడుతున్నాయి. చిన్న పిల్లలకు రహ దారి భద్రత పరికల్పనలో దక్షిణ కొరియా విశ్వానికే విశిష్ట నమూనాగా ఉంది.

1992 నుండి అక్కడ పద్నాలుగు సంవత్సరాలలోపు బాలల మరణాలను 97 శాతం నివారించారంటే అక్కడ ప్రభుత్వ చిత్తశుద్ధికి దర్పణంగా నిలుస్తుంది. మత్తు పదార్థాల వినియోగంపై ఆంక్షల అమలు, సీటు బెల్టు ధరించి కారు నడపడం, మొదలైన విషయాలలో అంటి అంటనట్టు ఉండకుండా చైనా చాలా కఠినంగా ఉంటుంది.

అధికాదాయ దేశాలతో పోలిస్తే దిగువ మధ్యాదాయ దేశాలలోనే రహదారి ప్రమాదాలలో అసువులు బాసిన వారు ఎక్కువగా ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అంతేకాదు 80శాతం దేశాలలో విక్రయిస్తున్న వాహనాలు మౌలిక భద్రతా ప్రమాణాలకు తగినట్టుగా లేవని 120 కోట్ల జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్న కేవలం 44 దేశాలలోనే హెల్మెట్‌ధారణ చట్టాలున్నాయని తెలియచేసింది. భారతదేశంలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో 87 శాతం 13 రాష్ట్రాల్లోనే చోటు చేసుకున్నాయి. దీనిలో ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానం, తెలంగాణ 9వ స్థానం పొందాయి. వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఢిల్లీ, ముంబయి, కలకత్తా నగరాలలో ప్రాణనష్టాలు తగ్గుముఖంపట్టగా, చెన్నై, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్ నగరాలలో ప్రాణనష్టాలు అధికంగా ఉన్నాయి.

84 శాతం రోడ్డు ప్రమాదాలకు 80 శాతాని కిపైగా అర్థాంతర చావులకు, సుమారు 84శాతం మేర గాయాలకు వాహన చోదకులు చేస్తున్న పొరపాట్లే కారణంగా కనిపిస్తున్నాయి.

చరవాణితోనే ముప్పు వస్తుందనేది అనుభవంలో చూస్తున్నాం.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ లేదా సందేశం పంపుతూ వాహనాలు నడపడమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమనడంలో సందేహం లేదు.రోడ్డు భద్రత విషయంలో రాజీపడితే వచ్చే విపత్తును ప్రభుత్వం గుర్తించడం లేదు. చట్టాల అమలులోని లొసుగులు, అధికారుల అవినీతితో అధికశాతం కేసులు బుట్ట దాఖలు అవుతున్నాయనేది వాస్తవం. రెవెన్యూ, ఎక్సైజ్, శాఖలతోపాటు రవాణా వ్యవస్థ కూడా అవినీతికి కేంద్రబిందువుగా ఉందనేది జగమెరిగిన సత్యం. ప్రజలలోరోడ్డు భద్రతపై అవగాహన లేమి, మితిమీరిన వేగం, ప్రభుత్వ ఉదాసీనత, చట్టాల అమలులో చిత్తశుద్ధి లోపించడం, డ్రైవింగ్ రాకపోవడం, సరిగ్గా చేయకపోవడం. మద్యపానం చేసి వాహనాలను నడపడం, రహదారి డిజైనింగ్ లోపాలు, రోడ్డు నిర్వహణ లోపాలు, ట్రాఫిక్ సిబ్బందికి ఆధునిక శిక్షణ లేకపోవడం,కార్లలో ఎయిర్‌బ్యాగ్ వాడకపోవడం, ఆధునిక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించకపోవడం .

మద్యపాన నిషేధాన్ని అమలు చేయకపోవడం మొదలైనవన్నీ కారణాలుగా చెప్పవచ్చు. సేఫ్ డ్రైవ్- సేవ్ లైఫ్ నినాదం ప్రచారంలో బాగుంది. కాని ఆచరణలో సత్ఫలితాలను ఇవ్వడం లేదు.

2016లో ఆమోదించిన మోటార్ వాహనాల చట్టం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయన్నది నిజమైనా అది అమలు జరిగే తీరు మీద ఆధారపడి ఉంది.

చరవాణి వినియోగం, శిరస్త్రాణంను ధరించకపోవడం, కారు బెల్ట్ పెట్టుకోకపోవడం మద్యం తాగడం, అక్రమ లైసెన్సును కలిగి ఉండటంపై అధికారులు ప్రధానంగా దృష్టిపెడితే మంచి ఫలితాలు ఉంటాయి.

ఏడాదికోసారి భద్రతా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతున్నా రోడ్డు మరణాల సంఖ్య తగ్గకపోవడం ఆందోళనను కలిగించే విషయం.

మొక్కుబడిగా జరిపే వారోత్సవాలవల్ల ఒరిగేది శూన్యం. రహదారి భద్రతను గాలికి వదిలేస్తే ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలవకుండా ఎలా ఉంటాయి. ప్రభుత్వం ప్రజలు ఆలోచించవలసిన విషయం. అశ్రద్ధ చేయకూడని అంశం.

కనీసం ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరవాలి. రోడ్డు ప్రమాదాలను అదుపులోకి తేవాలి. దీర్ఘ కాలిక ప్రణాళికలురచిస్తున్న స్వీడన్, నెదర్లాండ్, ఆస్ట్రేలియా వంటి ఐరోపా దేశాల స్ఫూర్తిని తీసుకొని ముందుకు పోవాలి.

OooooO

చరిత్ర పుస్తకాలలో చోటు దక్కని..
భారతీయ న్యూక్లియర్ ఫిజిక్స్ పితామహుడు..

న్యూక్లియర్ ఫిజిక్స్ స్వామి జ్ఞానానంద.. (5.12.1896 - 21.09.1969)

ఐ.వెంకటరావు, సీనియర్ జర్నలిస్ట్

సైన్స్‌కు మతానికి పొత్తు కుదరదని చాలా మంది భావన. కాని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, జగదీశ్ చంద్రబోస్, స్వామి జ్ఞానానంద వంటి వారు ఆ రెంటికి ఉన్న అవినాభావ సంబంధాన్ని చక్కగా వివరిస్తూ రెండు ఒక దానికొకటి అవసరమని, అప్పుడే మానవ జాతి పురోగతి అని విస్పష్టంగా చెప్పి, ఆచరించి మార్గ దర్శనం చేశారు...!

న్యూక్లియర్ ఫిజిక్స్‌లో స్పెక్ట్రోస్కోపి మీద విశేష పరిశోధన చేసి దేశవిదేశాల్లో, దాన్ని బోధించి హిమాలయాలలో తపస్సు చేసి యోగాభ్యాసం చేసి వేద ప్రాశస్త్యాన్ని నేల నాలుగు చెరగులా ఉపన్యాసాలతో వ్యాప్తి చేసిన మహానుభావుడే మన స్వామీ జ్ఞానానంద...!

స్వామి జ్ఞానానంద పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం దగ్గర గౌరగనమూడిలో 1896 డిసెంబర్ 5న జన్మించారు. వీరి అసలు పేరు భూపతిరాజు లక్ష్మీనరసింహరాజు తండ్రి గారు రామరాజు గారు మహా వేద విజ్ఞాన ఖని. వేదాలకు ఉపనిషత్తులకు శాస్త్రాలకు సంబంధించిన వందలాది అపూర్వ గ్రంధాలును, ఆయన చదివి గొప్ప గ్రంధాలయాన్ని నిర్మించుకొన్నారు...!

సంపన్నమైన భూస్వామ్య కుటుంబం వీరిది. ఆ పేద భాండాగారాన్ని కుమారుడు లక్ష్మీ నరసింహ రాజు అద్భుతంగా సద్వినియోగ పరచుకొని వేద వేదాంగాలలో ఉత్తమాభినివేశాన్ని సంపాదించుకొన్నారు. ఆ గ్రంధాలకు సార్ధకత చేకూర్చారు...!

నర్సాపురంలోని టేలర్ హై స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. ఇరవైవ ఏట వివాహం జరిగింది... బుద్ధుని ప్రభావం వారి పైన ఉన్నది అందుకని నేపాల్‌లోని లుంబినికి వెళ్లి కొంతకాలం గడి పారు...!

తర్వాత పదేళ్లు దేశ సంచారంలో, పెద్దల దర్శనాలతో జీవితాన్ని చదువుకున్నారు. హిమాలయాలు చేరి అక్కడ యోగాభ్యాసం చేస్తూ మరో పదేళ్లు సార్థక జీవనం సాగించారు. వేదాధ్యయనం వారిని విడువలేదు. దానిపై ఉన్న మక్కువతో అన్ని వేదోపనిషత్తుల సారాన్ని జీర్ణించుకొన్నారు. మానసిక వికాసం కలిగింది. ఒక అపూర్వ తెజస్సేదో వారిలో విరాజిల్లింది...!

క్రమంగా వీరి దృష్టి భౌతిక శాస్త్రం వైపుకు మళ్ళింది. దేని మీద దృష్టి పడినా దాన్ని ఆసాంతం కరతలా మలకం చేసుకోకుండా ఉండలేదు అందుకని జర్మని చేరుకొన్నారు. అక్కడి డ్రెస్ డ్రెయిన్లో గణితం, ఫిజిక్సు చదివారు.ఫిజిక్స్ అంటే వీరాభిమానం కలిగింది. అంతే అప్పుడే విస్తరిస్తున్న 'హై టెన్షన్ ఎక్స్ రే ఫిజిక్స్'లో రిసెర్చి ప్రారంభించారు...!

ప్రేగ్‌లోని చార్లెస్ యూనివర్సిటిలో వీరు రిసెర్చ్ కొన సాగించారు. వీరి ఆధ్యాత్మిక గురువు వీరిలోని వేద విజ్ఞానికి అబ్బుర పడి, శిష్యుని వల్ల వేద విజ్ఞానం ప్రపంచమంతా విస్తరిల్లాలని ఆ కాంక్షించి రాజు గారికి 'స్వామి జ్ఞానానంద' అనే ఆశ్రమ నామాన్ని ఒసంగి ఆశీర్వదించారు. అప్పటి నుండి స్వామి కాషాయామ్బర దారిగా జీవించారు...!

1927లో మళ్ళీ జర్మనీ దేశం వెళ్లారు స్వామి జ్ఞానానంద. అక్కడ హిందూ మతం మీద వేద విజ్ఞానం మీద పుంఖాను పుంఖాన్లుగా ఉపన్యాసాలిచ్చి చైతన్య వంతుల్ని చేశారు. ఆ ఉపన్యాసం ఒక గంగా ప్రవాహమే. ఎన్నో తెలియరాని విషయాలను విజ్ఞానంతో ముడి వేసి అలవోకగా అందిస్తూ శ్రోతల మనసులను రంజింప జేసే వారు. అదొక తపస్సుగా, యోగంగా, వారు భావించి ఉత్తేజితులను చేశారు..!

ఆ ఉపన్యాస పరంపర ఒక అత్యద్భుత మైన గ్రంధంగా వెలువడింది. డ్రిస్డేయిన్ వర్సిటి ప్రొఫెసర్ స్వామి ఉపన్యాసాలకు పులకించి పోయాడు.అవి మానవాళికి కర దీపికలన్నాడాయన...!

జ్ఞానానందకు ఐన్‌స్టీన్ గారి సాపేక్ష సిద్ధాంతం పైన ద్రుష్టిపడింది. పడింది అంటే దాన్ని ఆపోసన పట్టినట్లే 1929లో దానిమీద రెండేళ్లు అధ్యయనం చేస్తూ అండర్ గ్రాడ్యుయేషన్ పూర్తీ చేశారు.

ఆయన సాధించిన యోగా విధానం మీద 150కి పైగా ప్రసంగాలు చేసి యువతను యోగా మార్గం వైపుకు ఆకర్షితులయేట్లు చేశారు. యోగ, విజ్ఞాన శాస్త్రాలు సన్నిహిత సంబంధం కలవని ఆయన చెప్పే వారు.యోగాలో బేసిక్స్ నేర్చుకొంటే మనసు, మెదడు, శరీరాలపై పూర్తీ స్వాధీనం కలుగు తుందని సోదాహరణంగా ఉపన్య సహించే వారు స్వామీజీ ఉపన్యాస సారాన్నంతా 'పూర్ణ సూత్రాలు 'అనే ఉద్గ్రంధంగా వెలువడి యోగా మార్గానికి కర దీపికగా నిలిచింది...!

ఇది వారి మహోత్క్రుష్ట రచనగా ప్రశంశలు అందుకొన్నది. తర్వాత ఆయన ప్రొఫెసర్ డోల్చేక్ గారితో కలిసి జర్మని, ఫ్రాన్స్, జెకోస్లోవేయాలలో పర్యటించారు...!

స్వామి జ్ఞానానంద అభిమాన విషయమైన x ray spectography లో రిచెర్చ్ చేసి 1936లో D.Sc సాధించారు. ఇంగ్లాండ్, లివర్ పూల్ వర్సిటీలలో జాన్ చాడ్విక్ అనే మహా శాస్త్రవేత్త వద్ద రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పని చేశారు. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో spectography of beeta rays radiation లో అద్భుత పరిశోధన చేసి Ph.D పొందారు..!

అమెరికా వెళ్లి అక్కడి మిచిగాన్ యూనివర్సిటిలో "రేడియో యాక్టివ్ ఐసోటోపులు 'మీద రిచెర్చ్ చేశారు. ఆయన రాసిన "హై వాక్యూం "అనే శాస్త్ర గ్రంధం మేధావులైన ఎంతో మంది శాస్త్ర వేత్తలను ఆకర్షించింది...!

దాదాపు పాతికేళ్ళు విదేశాలలోనే చదువు ,వేదాంత ప్రవచనాలు ,యోగా ఉపన్యాసాలుల్లు, తీవ్ర పరిశోధనలతో గడిపిన స్వామి జ్ఞానానంద 1947 మాతృదేశమైన భారత దేశం వచ్చేశారు..!

డిల్లీలోని నేషనల్ ఫిజిక్స్ లాబరేటరీలో సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా తమ అమూల్యమైన సేవలందించారు. ఏడేళ్ళ తర్వాత స్వామీజీకి భీమవరం వద్ద ఒక ఆక్సిడెంట్ జరిగింది. విశాఖ కింగ్ జార్జి హాస్పిటల్‌లో చేరారు. ప్రమాదం తప్పి, ఆరోగ్యం కుదురుకొన్నది...!

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో న్యూక్లియర్ ఫిజిక్స్‌లో సౌకర్యాలు, పరిశోధనా విభాగం ఆ శాఖాను తీర్చి దిద్దే బాధ్యతను ఆనాటి వైస్ చాన్సలర్ స్వామి జ్ఞానానందకు పూర్తి బాధ్యలతో అప్పగించారు. వారు తమ శక్తి యుక్తులను ధారపోసి 1954లో చేరి తీర్చిదిద్దారు. న్యూక్లియర్ ఫిజిక్స్‌కు గొప్ప భవిష్యత్తు స్వామీజీ వల్లనే మన రాష్ట్రం లో కలిగింది. 1-7-1956లో విశ్వవిద్యాలయంలో న్యూక్లియర్ ఫిజిక్స్ శాఖను స్వామి ఆధ్వర్యంలో ఏర్పడింది. ఎంతో మందిని ప్రోత్సహించి, ప్రేరణ కల్గించి న్యూక్లియర్ ఫిజిక్స్ భవిష్యత్తును చాటి చెప్పి, అందులో విద్య నేర్పటానికి విద్యార్థులను సంసిద్ధులను చేశారు...!

ఆంధ్ర దేశంలో న్యూక్లియర్ ఫిజిక్స్‌కు పునాదులు వేసి, వ్యాప్తి చేసింది స్వామి జ్ఞానానంద ప్రొఫెసర్‌గా.., న్యూక్లియర్ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో చేరి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా 1965న పదవీ విరమణ చేశారు. రాష్ట్ర మంతటా పర్యటించి, వారు వేద వేదాంగ, యోగా శాస్త్ర రహస్యాలను శ్రోతలకు అందించి యోగశాస్త్ర వేద విజ్ఞాన శాస్త్రాల మధ్య ఉన్న సమన్వయాన్ని విశదీకరించే వారు. ఇవి ఒక దానికొకటి వైరుధ్యం ఉన్నవి కావని, పరస్పర సంబంధం కలవని రుజువుచేశారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో వారి సేవలను గుర్తించి స్వామి జ్ఞానానంద లేబరేటరీస్ ఆఫ్ న్యూక్లియర్ రిసెర్చ్"ను ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు...! స్వామి జ్ఞానానంద మతాన్ని, సైన్స్‌ను 'సింతెసిస్' చేయాలని భావించారు. ఆయన మహా మానవతావాదిగా నిరూపించుకొన్నారు...!!

కశ్మీర్‌లో ఎవరైనా భూములు కొనొచ్చు

- ఉత్తర్వులిచ్చిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ • వ్యవసాయ భూములపై మాత్రం ఆంక్షలు
- విద్యా, వైద్య సంస్థలకు మినహాయింపులు • కశ్మీర్‌ని అమ్మకానికి పెట్టారు: ఒమర్ అబ్దుల్లా, మహబూబా ముఫ్తి

జమ్ము కశ్మీర్, లద్దాక్ లలో దేశంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు భూములను కొనుగోలు చేయడం, ఇల్లు నిర్మించుకుని శాశ్వతంగా నివసించ వచ్చని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ రెండు కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన భూ చట్టాల నిబంధనల్లో కేంద్రం కీలక మార్పులు చేసింది. ఈ మేరకు జమ్ము-కశ్మీర్ అభివృద్ధి చట్టం 17 వ సెక్షన్ లో స్థానికేతరులు భూములు కొనుగోలు చేయకుడదనే కీలక నిబంధనను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సవరించింది. ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. జమ్ము-కశ్మీర్‌లో శాశ్వత నివాసం ఉన్న వారే అక్కడ భూమి కొనుగోలు చేయాలని గతంలో ఉన్న నిబంధనను హో మంత్రిత్వ శాఖ తొలగించింది. వ్యవసాయ భూమిని సాగు చేసే వారు మాత్రం కొనుగోలు చేయాలని జమ్ము-కశ్మీర్ లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ సిన్హా వెల్లడించారు. విద్య వైద్య సంస్థల ఏర్పాటుకు సంబంధించి వ్యవసాయ భూములను సాగు చేయని వారు సైతం కొనుగోలుకు మినహాయింపులు ఇచ్చారు. జమ్ము-కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఆగస్టు 5 న రద్దు చేసింది. అనంతరం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించి అక్కడి చట్టాల్లో కీలక మార్పులు చేస్తోంది.

మండిపడుతున్న నేతలు

మరోవైపు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం పై ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలు మండిపడ్డారు. కేంద్రంలోని ఎన్డీయే సర్కార్ కశ్మీర్‌ను అమ్మకానికి పెట్టారని దీనివల్ల పేదలు నష్ట పోతారని ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. కశ్మీర్‌ను దోచుకోవడానికి రాజ్యాంగ విరుద్ధంగా ఆర్టికల్ 370 ని రద్దు చేసిన కేంద్రం ఇపుడు కశ్మీర్ ను అమ్మకానికి పెట్టిందని పీడీపీ నేత మెహబూబా ముఫ్తీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై అందరూ ఒకటై పోరాటం చేయాలని ముఫ్తీ పిలుపునిచ్చారు.

రామ్ శ్రీవాస్తవ్

పుష్ప రెగులర్ షూటింగ్ నవంబర్ నుండి

స్టైలిష్ స్టార్ అల్లుఅర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పుష్ప' చిత్రం నవంబరు 6 నుంచి వైజాగ్ లో రెగ్యులర్ షూటింగ్ జరిపేందుకు మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్ణయించింది. కరోనా కల్లోలం, లాక్‌డౌన్ కారణంగా సినిమా షూటింగ్ ఏడు నెలల విరామం తరువాత స్పీడ్ అందుకోనుంది. అల్లుఅర్జున్, సుకుమార్ హ్యాట్రిక్ కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమా పై అటు సినీ పరిశ్రమలో ఇటు అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో విలన్ గా విజయ్ సేతుపతి నటించవలసిఉండగా .. పలు కారణాలరీత్యా ప్రకాష్ రాజ్ , జగపతి బాబులను తీసుకున్నారు. భారీ యాక్షన్ సన్ని వేశాల్ని వైజాగ్ లో షూట్ చేయడానికి చిత్ర యూనిట్ ప్లాన్ చేసింది. ఇది ఈ చిత్రానికి హైలెట్ గా చెప్పవచ్చు. తిరుమల కొండలకు దగ్గర్లో ఉన్న శేషాచలం అడవుల్లో గంధపు చెక్కల స్మగ్లింగ్ కథాంశంతో

రూపొందుతున్న ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, రవిశంకర్ నిర్మిస్తున్నారు. అల్లుఅర్జున్, లారీ డ్రైవర్ పుష్పరాజ్ రోల్‌లో అలరించనుండగా.. పల్లెటూరు పిల్లలా రష్మిక అలరించనుంది. చిత్ర యూనిట్ విడుదల చేసిన మోషన్ పోస్టర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచుతున్నాయి. ఈ చిత్రం షూటింగ్ నవంబరు 3 నుంచి తూర్పు గోదావరి జిల్లాలోని రంప చోడవరం, మారేడిమిల్లి ప్రాంతాల్లో చిత్రీకరించవలసి ఉండగా.. సడన్‌గా షెడ్యూల్ ని వైజాగ్‌కి మార్చబడింది. అయితే దీనికి గల కారణాలను మాత్రం చిత్ర యూనిట్ వెల్లడించలేదు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు సమకూరుస్తున్నారు. మిగిలిన తారాగణాన్ని చిత్ర యూనిట్ త్వరలో వెల్లడించనుంది. తెలుగుతో పాటు మరో నాలుగు భాషల్లో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం అల్లుఅర్జున్ కెరీర్‌లో మొట్ట మొదటి పాన్ ఇండియా మూవీ.

ప్రపంచంలోనే అతి పెద్ద సొరంగ మార్గం



పి.దేవి ప్రసాద్

హిమాలయాల్లోని రోహ్‌తాంగ్‌లో నిర్మించిన.. ప్రపంచంలోనే అతి పెద్ద సొరంగం మార్గం అటల్ టన్నెల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు.

లద్దాఖ్‌ను చేరుకోవడానికి ఉన్న రెండు మార్గాల్లో లేహ్-మనాలి హై వే - రోహ్‌తాంగ్ పాస్ ఒకటి. అయితే, ప్రతి సంవత్సరం ఐదారు నెలల పాటు హిమాచల్‌ప్రదేశ్‌లోని రోహ్‌తాంగ్ పాస్ వద్ద విపరీతమైన మంచు కురుస్తుంది. ఆ సమయంలో రోహ్‌తాంగ్ పాస్‌ను మూసివేస్తారు.

ఈ సమస్యను అధిగమించడానికి మనాలి, లేహ్‌లను అనుసంధానిస్తూ భారీ సొరంగం ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దీనిని మొదట్లో రోహ్‌తాంగ్ సొరంగం అని పిలిచేవారు. 2019లో వాజ్‌పేయి పేరు మీదుగా ఈ సొరంగానికి “అటల్ టన్నెల్” అని ప్రధాని మోదీ నామకరణం చేశారు.

‘అటల్ టన్నెల్’ విశేషాలు..

మనాలీ, లాహౌల్, స్పీతీ లోయలను కలుపుకుంటూ పోయే ఈ సొరంగ మార్గం 9.02 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఈ సొరంగ మార్గంలో ఏడాది పొడవునా ప్రయాణించవచ్చు. ఇది మనాలి, లేహ్‌ల మధ్య దూరాన్ని 46 కిలోమీటర్లు తగ్గిస్తుంది.

హిమాలయాల్లోని పీర్ పంజల్ పర్వత శ్రేణులవద్ద, సముద్ర మట్టానికి 3,000 మీటర్ల (10,000 అడుగుల) ఎత్తులో, అత్యాధునిక సదుపాయాలతో అటల్ సొరంగాన్ని నిర్మించారు. ఇది గుర్రపు నాడా ఆకారంలో ఉంటుంది. ఇందులో వచ్చే దారి, పోయే దారులతో రెండు మార్గాలు ఉంటాయి. దీని వెడల్పు 8 మీటర్లు. ఎత్తు 5.525 మీటర్లు. ఇది ఒక సింగిల్ ట్యూబ్ (ఒకటే గొట్టం) టన్నెల్ .

ఈ సొరంగం నిర్మాణానికి అయిన మొత్తం ఖర్చు సుమారు 3,300 కోట్ల రూపాయలు. దేశ రక్షణ, భద్రతల దృష్ట్యా ఈ అటల్ టన్నెల్ చాలా ముఖ్యమైనది.

అటల్ టన్నెల్ మార్గంలో 587 మీటర్ల విస్తీర్ణంలో ఉన్న సెరి నలా ఫాల్ట్ జోన్‌లో సొరంగం తవ్వడానికి బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్‌ఓ) చాలా కష్టపడాల్సి వచ్చింది. ఇక్కడి భౌగోళిక, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ భాగంలో సొరంగం నిర్మించడం కష్టతరమైంది.

ఎట్టకేలకు 2017 అక్టోబర్ 15న ఈ ప్రాంతంలో రెండూ వైపుల నుంచీ సొరంగాన్ని తవ్వగలిగారు.

ఈ సొరంగ మార్గంలో ప్రతీ 150 మీటర్లకు టెలిఫోన్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతీ 60 మీటర్లకు అగ్నిమాపక వ్యవస్థ (ఫైర్ హైడ్రాంట్), ప్రతీ 500 మీటర్లకు అత్యవసర నిష్క్రమణ ద్వారాలు (ఎమెర్జన్సీ ఎగ్జిట్స్) ఉన్నాయి.

ఈ సొరంగంలో ప్రతీ 2.2 కిలోమీటర్లకు ఒక మలుపు వస్తుంది. ప్రతీ కిలోమీటరుకు గాలి నాణ్యతను కొలిచే మానిటర్లను అమర్చారు. అంతే కాకుండా, ప్రతీ 250 మీటర్లకు బ్రాడ్‌కాస్టింగ్ వ్యవస్థ, ఏదైనా సంఘటన లేదా ప్రమాదం జరిగిన వెనువెంటనే గుర్తించేందుకు వీలుగా సీసీటీవీ కెమెరాలతో కూడిన వ్యవస్థలను ఏర్పాటు చేశారు.

ఇటీవల భారత్-చైనాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో, యుద్ధ భయంతో జీవిస్తున్న లేహ్ ప్రజలు అటల్ టన్నెల్ సొరంగం ప్రారంభమయినందుకు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సొరంగం తెరవడంతో లద్దాఖ్ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. రెండూ వైపులా కలిపితే దాదాపు 96 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీనివల్ల రవాణా ఖర్చు కూడా తగ్గుతుంది .

హై "దర్" బాద్ నరకం...

శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్

శతాబ్దాల చరిత కల నగరం.. అలనాటి వైభవాలకు సుందర సాక్ష్యం.. అభివృద్ధి అనే మాటకు ముందే నాలుగు వందేళ్ల కిందట రూపుదిద్దుకున్న పట్టణం.. కాలువలు చెరువులు కుంట్లతో ఎంతో దూరదృష్టితో నిర్మితం.. కట్టించిన నిజాం ప్రభువులు చచ్చిపోయారు.. "నేనే" కట్టాను అన్న బాబులు బిక్కచచ్చిపోయి పారిపోయారు.. ప్రకృతి పరీక్షలో ఫెయిల్ అయిన మహా స్మార్ట్ సిటీ ప్రత్యక్ష నరకానికి నిదర్శనంగా తడిసింది. హైదరబాద్‌లో వర్షం మహాప్రళయాన్ని సృష్టించింది. జనజీవనాన్ని స్థంభింపజేసింది. గత 20ఏండ్లల్లో ఎప్పుడూలేని విధంగా వానలు పడ్డాయి. వాగులు, వంకలతోపాటు ఈసారి కొత్తగా ఊర్లు, కాలనీలు, రహదారులు పొంగిపోర్లాయి. ప్రాజెక్టుల గేట్లు ఎత్తేశారు. ఎటొచ్చి సామాన్యులే మళ్లీ ఇబ్బంది పడ్డారు. మళ్లీ ప్రభుత్వ వైఫల్యమే బయటపడింది. సర్కారు సన్నద్ధత సరిగ్గా లేకపోవడంతో వరదల్లో జనం బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వచ్చింది. ప్రాణ, ఆస్థి, పంట నష్టాలూ చోటుచేసు కున్నాయి. దాదాపు 25 మంది వరకూ మరణించారనేది తాత్కాలిక సమాచారం. ఇంకా ఎక్కువే ఉండే అవకాశం లేకపోలేదు. గత మూడు రోజులుగా వర్షం పడుతున్నా ప్రభుత్వం ఆశించిన స్థాయిలో స్పందించలేదని చెప్పడానికి జరిగిన ప్రాణ, ఆస్థి నష్టం, మునిగిన కాలనీలే సాక్ష్యం. హఠాత్తుగా ప్రమాదం ముంచుకొస్తే సర్కారు ఏం చేయడానికి అవకాశం లేకుండా పోయిందని అనుకోవచ్చు. కానీ, ఇటు 48 గంటలుగా కాస్త హెచ్చుతగ్గులు ఉన్నా వర్షం పడుతూనే ఉంది. అటు వాతావరణ శాఖ భారీ నుంచి అతి భారీ వానలు

కురుస్తాయని పదే పదే హెచ్చరికలు పంపుతున్నది. ప్రగతిభవన్ మాత్రం ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఆదేశాలిచ్చి చేతులు దులుపేసుకుంది. అసెంబ్లీ బిజినెస్‌ను పూర్తిచేసుకోవడానికి ఆఘమేఘాల మీద ఒకరోజు అసెంబ్లీ సమావేశాలు పెట్టిన గులాబీ సర్కారు, వరదలపై ఒక ప్రకటన చేసి ఊరుకుంది. అసలు సమస్య ఎందుకు ఉత్పన్నమైంది, వాటికి పరిష్కారాలను సభ సాక్షిగా వెతకకుండా నాన్చుడు ధోరణిని అవలంభిస్తున్నది. అద్భుతంగా పనిచేస్తున్నాయంటూ హైదరాబాద్ ఎన్డీఆర్ఎఫ్ బృందాలకు గతంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన కితాబు గాలి కబురేనని తేలిపోయింది. చాంద్రాయణగుట్టలో రెస్క్యూ చేయలేమంటూ వెనుతిరిగిన వైనమే ఇందుకు నిదర్శనం. ముందస్తుగా తగిన ప్రణాళికతో నష్ట నివారణా చర్యలు తీసుకోవచ్చు. ప్రాణ, ఆస్థి నష్టాలను సాధ్యమైనంత మేర తగ్గించుకోవచ్చు. ఆ ప్రయత్నం సర్కారు నుంచి చిత్తశుద్ధితో జరగలేదు. వానల నేపథ్యంలో విశ్వనగరం హైదరాబాద్ బండారం బట్టబయలైంది. గడిచిన రెండు రోజుల్లో వానలకు రాష్ట్ర వ్యాప్తంగా అపార ఆస్థి, ప్రాణనష్టంతోపాటు లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ వరదల్లో ఇప్పటిదాకా సుమారు 3లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు అంటున్నాయి. ఆగస్టు నుంచి మరో 4లక్షల ఎకరాల్లె నష్టం జరిగింది. వందలాది ఇండ్లు వరదలకు నేలకూలాయి. వర్షం వరదలో కొట్టుకుపోయినవారి సంఖ్య ఇప్పటికీ లెక్కతేలలేదు. లక్షలాది మంది సామాన్యులు నిరాశ్రయులయ్యారు. క్యాంపులు పెట్టి భోజనం పెట్టడమేగాక వారి జీవితాలను సుస్థిరం చేయాల్సిన బాధ్యత సర్కారుదే. ఇటీవల కాలంలో ప్రజలపై దెబ్బమీద దెబ్బ పడుతున్నది. కరోనా లాక్‌డౌన్ నుంచి మొదలెడితే వరదల దాకా అష్టకష్టాలు తప్పడం లేదు. వారికి ఊపిరి మెసలడం లేదు. మధ్యలో ఎల్ఆర్ఎస్, ధరణి అంటూ పరిపాలనా పరమైన ఇబ్బందులకు గురయ్యారు. అసలు ఉపాధి పనులు కోల్పోయి అల్లాడుతున్న పేదలకు వరదలు కన్నీటి కడగండ్లనే మిగిల్చాయి. మరిన్నీ కష్టాల్లోకి నెట్టాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళిక లేమీతో ప్రజలు భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వచ్చింది. కరెంటు లేక దాదాపు 24గంటలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రజలకు అంధకారమే మిగిలింది. వర్షం గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో 21 సెంటీమీటర్ల నుంచి 31.90 సెంటీమీటర్ల దాకా పడింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేతులెత్తేయడంతో ఆర్మీ రంగంలోకి దిగాల్సి వచ్చింది. ముసురుగా ప్రారంభమై సాయంత్రానికి జోరువానగా రూపాంతరం చెందింది. రాత్రి ఏడు గంటల తర్వాత కుండపోతగా పడింది. అర్ధరాత్రి దాటేవరకూ వర్షం భీభత్సం కొనసాగింది. పల్లెలు, పట్టణాలు, నగరాలు జల విలయాన్ని ఎదుర్కొన్నాయి. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలివాన రాగా, పట్టపగలే రాజధాని చీకటిని చూసింది. రోడ్లపై జనం కష్టాలు అన్నీ ఇన్నీ కావు.వానల ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో పలు విశ్వవిద్యాలయాలూ పరీక్షలను వాయిదా వేశాయి. 400ఏండ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ అభివృద్ధి కోసం రూ.67 వేల కోట్లు ఖర్చు చేశామని జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మంత్రి కేటీఆర్ పదే పదే చెబుతున్నారు. త్వరలో ప్రగతి నివేదికను విడుదలచేస్తామన్నారు కూడా. 2050 సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామంటున్నారు. వరదలు వారి మాటల్లోని డొల్లతనాన్ని బయటపెట్టాయి. ప్రజల సాధరణ జీవనానికి ఇబ్బంది కాకుండా మహానగర ప్రణాళికను కూర్చాల్సి ఉంది. ప్రకృతి విపత్తుల నిర్వహణ మరింత సమర్థవంతంగా చేసేలా ప్రత్యేక అధ్యయనం, ఆచరణా అవసరం. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థను గాడీలో పెట్టాల్సిన పరిస్థితిని తాజా భారీ వర్షాలూ స్పష్టం చేస్తున్నాయి. అభివృద్ధి ప్రణాళికలను ఎన్నికలు, ఓట్లను దృష్టిలో పెట్టుకుని కాకుండా సాధారణ ప్రజల జీవన గమనంతో ముడిపెట్టి చేస్తేనే సత్ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

వరదలను ఎదుర్కొనే కార్యాచరణ ఏది?

నగరంలో కురిసిన భారీ వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలమైంది. 20మంది ప్రాణాలు కోల్పోగా 20వేలకు పైగా ఇండ్లు వరద ముంపునకు గురయ్యాయి. చెరువుల ఆనకట్టలు తెగిపోయాయి, కొన్ని హైవేలు దెబ్బతినడంతో తాత్కాలికంగా రాకపోకలు ఆగిపోయాయి. కొన్ని కాలనీలు, బస్తీలు అంధకారంలో ఉండిపోయాయి, అపార్ట్‌మెంట్స్ సెల్లార్లన్నీ మురుగు నీటితో నిండిపోయాయి. వరదల్లో బైకులు, కార్లు అనేకం కొట్టుకుపోయాయి. కొన్ని కాలనీల్లో బోట్ల సహాయంతో ప్రాణాలు రక్షించుకోవాల్సి వచ్చింది. భారీ వర్షాలు కురుస్తాయని ప్రభుత్వం హెచ్చరించినప్పటికీ దీనిని ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో మాత్రం అది విఫలమైంది.

నగరచరిత్రలో నాలుగు అతి భారీ వర్షాలలో ఇదొకటిగా పేర్కొనవచ్చు. 1908 సెప్టెంబర్ 27న 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవగా, 1954 ఆగస్టు 1న 19 సెంటీమీటర్లు, ఆగస్టు 23, 24, 2000 సంవత్సరంలో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవగా ప్రస్తుతం నగరంలో వివిధ ప్రాంతాల్లో తేడాలున్నప్పటికీ సగటున 19 సెంటీమీటర్లుగా అధికారులు తెలియ జేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో దక్షిణ- తూర్పు ప్రాంతంలో 25-32 సెంటి మీటర్ల మధ్య వర్షపాతం నమోదైంది, ఈ ప్రాంతంలోనే భారీగా వరదలు, తీవ్రమైన ముంపు ఏర్పడింది.

పర్యావరణంలో వచ్చిన మార్పుల కారణంగా గతానికి భిన్నంగా అతికొద్ది సమయంలోనే అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గ్రేటర్ పరిధిలోని చెరువులనేకం ఆక్రమణకు గురై వర్షపునీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కోల్పోయాయి. నాలాలు కూడా పెద్దఎత్తున ఆక్రమణ గురయ్యాయి. మూసీనదితో పాటు నగరంలో అతి పెద్ద చెరువులైన హుసేన్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ లన్నీ ఆక్రమణలతో కుచించుకు పోయాయి.

భారీ వర్షాలతో చెరువు కట్టలు తెగిపోయాయి, నాలాలు పొంగిపొర్లాయి. రోడ్లన్నీ కాలువలుగా మారి బస్తీలు, కాలనీలను ముంచెత్తాయి. అర్ధరాత్రి హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తివేయడంతో మూసీకి భారీగా వరదచేరి పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి, హుస్సేన్‌సాగర్ నాలా పరిసరాలు కూడా ముంపునకు గురయ్యాయి. నగర డ్రైనేజ్ వ్యవస్థకు గంటకు 12మి.మీ. వర్షపాతాన్ని తట్టుకునే సామర్థ్యం మాత్రమే ఉందని కిర్లోస్కర్ కమిటీ నివేదిక చెప్పింది. ప్రస్తుత వర్షపాతం అనేక రెట్లు అధికంగా కురుస్తుండటంతో ఈ వర్షాలను తట్టుకునే పరిస్థితి మన డ్రైనేజీ వ్యవస్థకులేదు. గత 20ఏండ్లలో డ్రైనేజీల సామర్థ్యాన్ని పెంచుకోవడంలో పాలకుల నిర్లక్ష్యమే ప్రస్తుత విషాదకర పరిస్థితికి అతి ముఖ్యమైన కారణం. నగరంలో 9వేల కిలోమీటర్ల పొడవైన రోడ్లు ఉండగా 1221 కిలోమీటర్ల పొడవైన డ్రైనేజ్ పైప్‌లైన్ మాత్రమే ఉంది. గత ఐదేండ్లలో కొత్తగా నిర్మాణమైన డ్రైనేజ్ పైప్‌లైన్ 28కిలోమీటర్లు మాత్రమే. ప్రతి రోడ్డులో సరిపడా డ్రైనేజ్ పైప్‌లైన్ లేకపోవడంతో రోడ్లపై పడిన వర్షం రోడ్లపైనే ప్రవహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

2016, 2017లో భారీ వర్షాలు, వరదలు వచ్చిన సందర్భంగా

నగరంలో అనేక ప్రాంతాలు మునిగిపోయాయి. ఆ సందర్భంగా పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ నగర డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణకి 10 వేల కోట్లు అవసరమవు తాయనీ, ఆ నిధులు పూర్తిగా కేటాయిస్తామనీ ప్రకటించారు. ఆక్రమణలను తొలగిస్తామనీ చెప్పారు. కాని గత ఐదేండ్లలో ఎలాంటి పురోగతి లేదు. నిధుల కేటాయింపు కూడా సరిగ్గా లేదు. నాలాలపై 28వేల ఆక్రమణలు ఉన్నాయనీ, వాటిని తొలగించి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి 12వేల కోట్లు అవసరమనీ నగర మేయర్ ప్రకటించారు. నాలా ఆక్రమణదారులైన పేదలకు డబల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఎక్కడా ఇండ్లు కేటాయించిన పరిస్థితి లేదు. బడాబాబులైన ఆక్రమణదారులను కదిలించే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదు. చెరువులను ఆక్రమించి భారీ భవంతులు నిర్మిస్తున్న బడా బిల్డర్లపై ప్రభుత్వం ఎలాంటి చర్య చేపట్టలేదు.

గ్రేటర్ పరిధిలోని 145చెరువులను వివిధ దశల్లో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ మంత్రి చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. మిషన్ కాకతీయలో రాష్ట్రంలో చెరువుల అభివృద్ధి చేపట్టినా నగరంలో చెరువులను పట్టించుకోలేదు. మిషన్ కాకతీయలో భాగంగా నాలుగు చెరువులను అభివృద్ధి చేస్తామని ప్రకటించినా వాటిని సగంలోనే వదిలేశారు. మూసీ నదిని అతి సుందరంగా తీర్చిదిద్దుతామని పదేపదే చేసిన ప్రకటనలు ఆచరణకు నోచుకోలేదు. ముస్లింల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించినా కనీస అభివృద్ధి జరగలేదు. మూసీ అభివృద్ధి కోసం 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాలలో రాష్ట్ర బడ్జెట్ నుంచి 754 కోట్లు కేటాయించగా ఖర్చు పెట్టింది మూడు కోట్లు మాత్రమే. మూసీ నదిలో భారీగా ఆక్రమణలు జరుగుతున్నా, అనేక ఫిర్యాదులు చేసినా కనీస స్పందన లేకుండా మూసీ అభివృద్ధి గురించి కాకమ్మ కబుర్లు చెబుతూ ప్రభుత్వం కాలం గడుపుతూ వచ్చింది. ఇటీవల శాసనసభ సమావేశాల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో మౌలికవసతుల కల్పనపై జరిగిన స్వల్పకాల చర్చకు పురపాలకశాఖ మంత్రి 14 పేజీల నోట్ ఇవ్వగా, అందులో నగర డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి గురించి ఒక్కమాట కూడా పేర్కొనక పోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. స్కై వేలు, ఫ్లై ఓవర్ల గురించి మాట్లాడుతున్న ప్రభుత్వం అత్యంత అధమ స్థాయిలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ పట్ల శ్రద్ధ చూపకపోవడం విచారకరం. ఇది 'కనిపించని అభివృద్ధి' కావడమే ఇందుకు కారణమేమో! నగర డ్రైనేజీ అభివృద్ధి కోసం ఇప్పటికే అనేక అధ్యయనాలు జరిగాయి. 2007లో కిర్లోస్కర్ కమిటీ నివేదిక, తదనంతర కాలంలో వయనెంట్ కన్సల్టెంట్ నివేదిక, ఇటీవల జేఎన్‌టీయూ అధ్యయనాలు జరిగాయి. అనేక సూచనలు చేశాయి. జరగాల్సిన కార్యాచరణ మాత్రం జాడలేదు! ఇప్పటికైనా ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించి తక్షణ కార్యాచరణ ప్రారంభించాలి.

నాలుకతెగిన దేశం

చరచబడ్డ భూమిని
చెరిసగం నాలుకకోయబడ్డ దేశాన్ని
శవాన్నై అడుగుతున్న సమాధానం చెప్పండి!

ఆడతోలు కప్పుకునిపుట్టడమే
తప్పంటారా?
ఆకల్ని నెమరేసే పశువులకు
గంపెడు కసువుకోసం చేనుకాడకి పోవడమే
పెద్ద నేరమంటారా??
కొడవలితో కరకరా గడ్డికోసినట్టు
మీతల'కాయల్ని'కోయకపోవడం
పొరపాటేనంటారా?

చూసిందే తడువుగా
ఉచ్చగుంటకాడా కందిరీగలు వాలినట్టు
ప్రాణం మీదపడి కొరక్కతిన్నారు సరే
నా నడుమెందుకు విరిచినారు?
న్యాయమై నిలబడుతాననా?
మీ అన్యాయపు అగత్యాలపై ఎగిసి
తంతాననా!

అట్టా నులిమి నులిమి జుర్రుకున్నారే
పుండ్లుతేలిన నా ఒళ్ళు ఏ కులంవాసన
రాలేదా?

చరబడ్డతల్లుల వారసురాల్ని
నెత్తురోడుతున్న నాలుక దేశపటమై
మాట్లాడుతున్నా
నా మానంపై మూగి పొడుచుకుతింటే
తిన్నారు
మందోమాకో పూసి మాన్పుకునేదాన్ని..
నాలుకేమి చేసిందిరా
నా సొడు తాగిన ముట్టుపాతలారా!

దేవుళ్ళ పాలనలో
దేవతలమానభంగాలే
ఏడుపుగంటలై మోగుతుండాయి
దేశమంతటా
కులంకత్తులు రొమ్మువిరుచుకు తిరుగుతూ
అనచబడ్డబతుకులే అగ్గవగా
బొగ్గులవుతున్నాయి

ఏమిటి యాగ రహస్యం!?

ఒంటిమీద దూకి
మదంగోళ్ళతో రక్కి
పిచ్చికుక్కల్లా పీక్కుతిన్నారు సరే
నా నాలుకంటే భయమెందుకు?
నోరుతెరిచి నిజం చెబుతాననా
మీ నోట్లో కారి కారి ఉమ్ముతాననా!

ఒరే అహంకారానికి ఆంబోగానికి పుట్టిన
బట్టలాలా
నిజాలను నోళ్లు మాత్రమే చెప్పవు
గాయపడ్డ దేహాలు కూడా న్యాయపీఠమెక్కి
దుర్మార్గాన్ని సంకనాకిచ్చే సాక్ష్యం చెబుతాయి

(యుపిలో కులోన్మాదానికి బలైన చెల్లెలు
మనీసావాల్మీకి కోసం...)

- పల్లిపట్టు

వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 2019 ఎన్నికల వై.ఎస్.ఆర్.సి.పి. మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా బలహీన వర్గాల, (ఉప కులాలు)కు కార్పొరేషన్లు మరియు డైరెక్టర్లను నియమించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. గతంలో ఎప్పుడూ జరగనివిధముగా అట్టడుకు కులాలకు ముఖ్యంగా అత్రిరాస, భట్రాజు, పెరిక, ఈడిగ, బొందిలి, సూర్యబలిజ, పాల-ఎకరి ఇంకా కొన్ని సంచార జాతుల కులాలకి కూడా ఒక స్వర్ణయుగాన్ని ఈ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టడం జరిగింది. ఈ కార్పొరేషన్‌లలో మహిళామూర్తులకు 50% రిజర్వేషన్లు ఇవ్వడం జరిగింది.

ముందుగా 52 కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కాని తరువాత క్రొత్తగా అగ్నికుల క్షత్రియ, గౌడ, బెస్త, నాగవంశీయుల జనాభా ఎక్కువగా ఉన్నందున పై నాలుగు కులాలనుండి డిమాండ్ రావడంతో అధనంగా చేర్చిడం జరిగింది.

56 కార్పొరేషన్లు... వాటి ఛైర్మన్లు

కార్పొరేషన్‌ఛైర్మన్	పేరు	జిల్లా	కార్పొరేషన్‌ఛైర్మన్	పేరు	జిల్లా
అగ్నికుల క్షత్రియ	**బందన హరి**	తూర్పుగోదావరి	గౌడ	**మాదు శివరామకృష్ణ**	కృష్ణా
అయ్యాక	**ఆవల రాజేశ్వరి**	తూర్పుగోదావరి	భట్రాజ	**కూరపాటి గీతాంజలి**	కృష్ణా
అత్రిరాస	**ఎల్లా భాస్కరరావు**	పశ్చిమగోదావరి	వాల్మీకి బోయ	**డాక్టర్ మధుసూదన్**	కర్నూలు
దాసరి	**రంగుముద్రి రమాదేవి**	విజయనగర	కుర్ని/కరికాలభక్తులు	**బుట్టా శారదమ్మ**	కర్నూలు
దేవాంగ	**బీరక సురేంద్రబాబు**	ప్రకాశం	వీరశైవ లింగాయత్	**వై.రుద్రగౌడ్**	కర్నూలు
వడ్డెలు	**సైదు గాయత్రి సంతోష్**	కృష్ణా	బెస్త	**తెలుగు సుధారాణి**	కర్నూలు
సగర/ఉప్పర	**గానుగ పెంట రమణమ్మ**	కడప	ముదిరాజ్/ముత్రాసి	**కె.వెంకటనారాయణ**	నెల్లూరు
కృష్ణబలిజ/పూసల	**కె.భవాని**	గుంటూరు	జంగం	**వలివేటి ప్రసన్న**	నెల్లూరు
పాల-ఎకరి	**తరిగొండ మురళీధర్**	చిత్తూరు	బొందిలి	**ఎస్. కిశోర్ సింగ్**	నెల్లూరు
తొగట/తొగటవీరక్షత్రియ	**గడ్డం సునీత**	అనంతపురం	ముస్లిం సంచార జాతులు	**సయ్యద్ ఆసిఫా**	నెల్లూరు
కూరాకుల/పొందర	**రాజపు హైమావతి**	శ్రీకాకుళం	చాత్తాద్రశ్రీవైష్ణవ	**టి.మనోజ్ కుమార్**	ప్రకాశం
నాగవంశం	**బొడ్డు అప్పలకొండమ్మ**	విశాఖపట్నం	ఆరెకటిక/కటిక	**దాదా కుమారలక్ష్మి**	ప్రకాశం
రజక	**సుగుమంచిపల్లి రంగన్న**	అనంతపురం	మేదర	**కేత లలితా నాంచారమ్మ**	ప్రకాశం
కురుబ/కురుమ	**కోటి సూర్యప్రకాష్ బాబు**	అనంతపురం	కళింగ	**పేరాడ తిలక్**	శ్రీకాకుళం
కుంచిటి వక్కలిగ	**డాక్టర్ బి.నళిని**	అనంతపురం	కళింగకోమటి/కళింగ వైశ్య	**అందవరపు సూరిబాబు**	శ్రీకాకుళం
వణ్యకుల క్షత్రియ	**కె.వనిత**	చిత్తూరు	రెడ్డిక	**దుక్కా లోకేశ్వరరావు**	శ్రీకాకుళం
ముదలియార్	**టి. గోవిందరాజన్ సురేష్**	చిత్తూరు	పోలినాటి వెలమ	**పి.కృష్ణవేణి**	శ్రీకాకుళం
ఈడిగ	**కె.శాంతి**	చిత్తూరు	శ్రీశయన	**చీపురు రాణి**	శ్రీకాకుళం
గాండ్ల/తెలికుల	**ఎస్.భవానీప్రియ**	తూర్పుగోదావరి	మత్స్యకార	**కోళా గురువులు**	విశాఖపట్నం
పెరిక	**పురుషోత్తం గంగాభవాని**	తూర్పుగోదావరి	గవర	**బొడ్డేడ ప్రసాద్**	విశాఖపట్నం
షేక్	**షేక్ యాసిన్**	గుంటూరు	నగరాలు	**పి.సుజాత**	విశాఖపట్నం
వడ్డెరా	**దేవళ రేవతి**	గుంటూరు	యాత	**పిల్లి సుజాత**	విశాఖపట్నం
కుమ్మరి శాలివాహన	**మండేపూడి పురుషోత్తం**	గుంటూరు	తూర్పుకాపు/ గాజులకాపు	**మామిడి శ్రీకాంత్**	విజయనగర
యాదవ	**ఎన్.హరీష్ కుమార్**	కడప	కొప్పుల వెలమ	**నెక్కల నాయుడుబాబు**	విజయనగర
నాయీబ్రాహ్మణ	**సిద్ధవటం యానాదయ్య**	కడప	శిష్టకరణం	**కె.అనుషాపట్నాయక్**	విజయనగర
పద్మశాలి	**జింకా విజయలక్ష్మి**	కడప	సూర్యబలిజ	**శెట్టి అనంతలక్ష్మి**	పశ్చిమగోదావ
నూర్ బాషా/దూదేకుల	**ఆస్పరి ఫకురూబీ**	కడప	శెట్టి బలిజ	**గుబ్బల తమ్మయ్య**	పశ్చిమగోదావ
విశ్వబ్రాహ్మణ	**తోలేటి శ్రీకాంత్**	కృష్ణా	అత్యంత వెనకబడిన కులాలు	**పేంద్ర వీరన్న**	పశ్చిమగోదావ

దేవీపురం - ఓ అద్భుతమైన అభినవ మణిద్వీపం

- ప్రజామీడియా నెట్‌వర్క్ సౌజన్యంతో

విశాఖపట్నానికి దగ్గరలో ఉన్న సబ్బవరం గ్రామానికి 5 కి.మీ దూరంలో, నారపాడు గ్రామశివార్లలో తొమ్మిది కొండల నడుమ,పచ్చని తోటల మధ్య, దేవీపురంలోని శ్రీచక్రాలయంలో "సహస్రాక్షి"గా శ్రీరాజరాజేశ్వరీ దేవి భక్తులకు దర్శనమిస్తోంది. ఇక్కడి ఆలయం అంతా ఒక శ్రీ చక్రమే. ఇంత పెద్ద శ్రీచక్రాలయం ప్రపంచం మొత్తంలో ఇంకెక్కడా లేదు.

"నాకు ఇల్లు కట్టించు" :

న్యూక్లియర్ ఫిజిక్స్ లో డాక్టరేట్ చేసి, ముంబాయిలోని టాటా ఇన్ స్టిట్యూట్ లో శాస్త్రవేత్తగా పనిచేస్తున్న నిష్ఠల ప్రహ్లాద శాస్త్రిని ఈ ఆలయ నిర్మాణానికి అమ్మవారు ఎన్నుకుంది.

ఒకసారి ప్రహ్లాదశాస్త్రిగారు హైదరాబాద్ లో బిర్లామందిర్‌కు వెళ్ళి, బాలాజీని దర్శించి, ఒకచోట ధ్యానం చేసుకుంటుండగా, వారికి బాలాజీ స్త్రీ రూపంలో త్రిపురసుందరిగా దర్శనమిచ్చి "నాకు ఇల్లు కట్టించు" అని పలికి అంతర్థానమైనట్లు అనిపించిందిట.

అప్పుడే కాకుండా మరొకమారు వారికి ధ్యానసమయంలో దర్శనమిచ్చి "ఈ కార్యం నీ వల్లే నెరవేరాలి. జాగ్రత్తగా, దోషరహితంగా, ప్రజలందరికీ మేలు కలిగేలా శ్రీదేవి నిలయం నిర్మించు" అని ఆదేశించింది.

ప్రహ్లాద శాస్త్రి తమ ఉద్యోగానికి రాజీనామా చేసి స్వస్థలమైన విశాఖపట్నం వచ్చారు.

ఆలయం ఎక్కడ కట్టాలి

ఆలయం నిర్మించాలనే సంకల్పంతో 1982 లో 108 రుత్విక్కులతో 16 రోజులు దేవీయాగం చేశారు. ఆ యజ్ఞంలో ఆలయం నిమిత్తం మూడు ఎకరాల భూమి యజ్ఞప్రసాదంగా లభించింది. ఈ విధంగా శ్రీ చక్రాలయ నిర్మాణ స్థలాన్ని త్రిపురసుందరీ దేవి స్వయంగా ఎంచుకుంది.

తొమ్మిది కొండల మధ్య, రమణీయంగా, ప్రశాంతంగా ఉన్న ఆ స్థలంలో ప్రహ్లాదశాస్త్రి తిరుగుతూ ఉండగా, ఒకరోజు ఒక అగ్ని గుండంలో మెరుపులతో మెరిసే శరీరంతో 16 ఏళ్ళ అమ్మాయిలా దేవి కనిపించింది. పూజలు అందుకుంది. తనకు అక్కడే ఇల్లు కట్టాల్సిందిగా ఆదేశించింది.

ఆ ప్రదేశంలో తవ్వితే, అగ్నిలో కాల్చిన గుర్తులున్న పంచలోహ శ్రీచక్ర మేరువు లభించింది. దాని గురించి విచారించగా సుమారు 250 ఏళ్ళ క్రితం అక్కడ గొప్ప యజ్ఞం జరిగినట్లు తెలిసింది.

ఆ శ్రీచక్రమేరువును మళ్ళీ భూమిలో నిక్షిప్తం చేసి దానిపై కామాఖ్యపీఠం ప్రతిష్ఠించారు. ప్రక్కనే వున్న ఎత్తైన కొండమీద శివాలయం కట్టించారు.

ఆలయ సొగసులు :

ఈ దేవీపురం ప్రాంతంలోని శ్రీచక్రమేరునిలయం 108 అడుగుల పొడవు, 108 అడుగుల వెడల్పు, 54 అడుగుల ఎత్తు కొలతలతో నిర్మితమైంది. ప్రహ్లాదశాస్త్రి ఏకాగ్రతతో, సౌందర్యలహరిలో ఆదిశంకరులు సూచించిన విధంగా, లలితా సహస్రనామ స్తోత్రంలో వాగ్దేవతలు వర్ణించిన విధంగా ఉండేటట్లు, ఆలయ నిర్మాణం పూర్తి చేయించారు. 1990 లో జూన్ 4 వతేదీన మూలవిరాట్ 'సహస్రాక్షి' విగ్రహ ప్రతిష్ట జరిగింది.

శ్రీ చక్రాలయంలో బిందు స్థానంలో (మూడో అంతస్తు) పవళించిన సదాశివుని మీద కూర్చున్న, నిలువెత్తు ఆ విగ్రహం కళ్ళలోకి చూస్తుంటే, జీవకళ ఉట్టిపడుతూ, జీవితం ధన్యమవుతుంది. ఆమె చుట్టూ, క్రింది అంతస్తులలో, నక్షత్రాలను పోలిన ఆవరణలు, వాటిలో ఆమె పరివార దేవతలు ఉన్నారు. నిష్ఠల ప్రహ్లాద శాస్త్రికి ధ్యానంలో గోచరించిన విధంగా ఖడ్గమాల దేవతలకు రూపకల్పన చేసి గంధర్వ మాతృమూర్తులుగా 68 విగ్రహాలను భూమి మీద, 10 విగ్రహాలను మొదటి అంతస్తులోను, రెండో అంతస్తులో 10 విగ్రహాలను సిమెంటు చేసి పెట్టారు. మిగిలిన విగ్రహాలను పంచలోహాలతో చేయించి మూడో అంతస్తులో అష్ట దళ పద్మంలో ఉంచారు. ఇవికాక భూమిమీదే బ్రాహ్మీ, మాహేశ్వరీ, కౌమారీ, వైష్ణవీ, వారాహీ, మాహేంద్రీ, చాముండీ, మహాలక్ష్మీ, బాలాజీ, కాళియమర్దన చేస్తున్న శ్రీకృష్ణుడు బిఈ పది విగ్రహాలనూ రాతితో చెక్కించి ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాలకు భక్తులు అభిషేకాలు చేస్తారు. ఈ దేవీ పురాన్ని శ్రీదేవీ భాగవతంలో వర్ణించిన 'మణిద్వీపం'గా రూపొందించాలని గురూజీ (ప్రహ్లాద శాస్త్రి) ఆకాంక్ష .

మునగాకుతో ఎన్నో ప్రయోజనాలు

ఎన్.రామకృష్ణ

మునక్కాయలు నిత్యం మనం తినే ఆహారమే. అయితే మునక్కాయలే కాకుండా ఆకులోనూ అద్భుతమైన ఆరోగ్య యోజనాలున్నాయని పరిశోధనల్లో వెల్లడైంది. మునగాకులో ఎ, సి విటమిన్లు పుష్కలంగా వున్నాయి. మనం డబ్బులిచ్చి కొనే ఏ ఆకుకూరల్లోనూ మునగాకు స్థాయిలో ఈ విటమిన్లు వుండవు. అలాగే కాల్షియం, పాస్ఫరస్, ఐరన్ కూడా మునగాకులో పుష్కలంగా వుంటాయి. అసలు 4,5వేల ఏళ్ల నుంచే మన పూర్వీకులు మునగాకును మెడిసిన్ తయారీలో వినియోగిస్తున్నారంటే ఆ ఆకు గొప్పతనం ఇట్టే అర్థమవుతుంది. ఆయుర్వేదంలో 300లకు పైగా వ్యాధులను నయం చేయడానికి ఈ మునగాకును ఉపయోగిస్తారు.

- మునగాకుల్లో విటమిన్స్, ఎమినో యాసిడ్స్, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. క్యారెట్లు తింటే మాత్రమే వచ్చే విటమిన్ 'ఎ'ని పది రెట్లు అధికంగా మునగాకు ద్వారా పొందొచ్చు. కళ్ల వ్యాధులకు సంబంధించిన మెడిసిన్‌లో మునగాకును వాడతారు.
- పాల నుంచి లభించే క్యాల్షియం 17 రెట్లు అధికంగా మునగాకు నుంచి వస్తుంది.
- పెరుగు నుంచి పొందే ప్రోటీన్లను 8 రెట్లు అధికంగా మునగాకు నుంచి పొందవచ్చు.
- అరటిపండ్ల నుంచి పొందే పొటాషియం 15 రెట్లు అధికంగా ఎండిన మునగాకు నుంచి పొందవచ్చు.
- మహిళలు రోజుకి 7 గ్రాముల మునగాకు పొడిని 3 నెలల పాటు రెగ్యులర్‌గా తీసుకుంటే 13.5 శాతం బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గాయని పరిశోధనల్లో తేలింది.
- థైరాయిడ్‌ను రెగ్యులేట్ చేసే న్యాచురల్ మెడిసిన్ మునగాకు.
- మునగాకులో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్ ద్వారా బ్లడ్‌లో షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేస్తుందట.
- మునగాకుల రసాన్ని పాలలో కలిపి పిల్లలకు అందిస్తే వారి ఎముకలు బలంగా తయారవుతాయి.
- గర్భిణులు, బాలింతలకు ఇస్తే వారికి అవసరం అయిన కాల్షియం, ఐరన్, విటమిన్లు పుష్కలంగా లభిస్తాయి. తల్లులతోపాటు, పాలు తాగే పిల్లలు కూడా ఆరోగ్యంగా వుంటారు.
- పాలిచ్చే తల్లులకు మునగాకును కూరగా వండి పెడితే పాలు పెరుగుతాయి.
- గుప్పెడు మునగాకులను వంద మిల్లీలీటర్ల నీటిలో వేసి ఐదు నిమిషాలు ఆ నీటిని కాచి చల్లారనివ్వాలి. ఆ నీటిలో కొంచెం ఉప్పు, మిరియాలపొడి, నిమ్మరసం కలిపి తాగితే ఆస్థమా, టీబీ, దగ్గు తగ్గుతాయి.
- మునగాకు రసం ఒక చెమ్చా తీసుకుని దాన్నిగ్లాసు కొబ్బరినీళ్ళలో కలిపి, కాస్తంత తేనె కలిపి ఇస్తే విరోచనాలు తగ్గిపోతాయి.
- మునగాకు రసానికి నిమ్మరసాన్ని కలిపి ముఖానికి రాస్తే మొటిమలు, బ్లాక్ హెడ్స్ పోతాయి.
- ముఖ్యంగా కాల్షియం లోపాన్ని ఎదుర్కొనే మహిళలకు మునగాకు వరప్రదాయిని. అలాంటి వారు విరివిగా మునగాకును ఏదో ఒక రూపంగా ఉపయోగిస్తూ ఉంటే వారిలోని కాల్షియం పెరుగుతుంది.
- వందగ్రాముల మునగాకులో వుండే పోషక పదార్థాలు.. నీరు 75.9 శాతం, పిండి పదార్థాలు 13.4 గ్రా, ఫ్యాట్స్ 17 గ్రాములు, మాంసకృత్తులు 6.7 గ్రా, కాల్షియం 440 మిల్లీ గ్రా, పాస్పరస్ 70 మిల్లీ గ్రా, ఐరన్ 7 మిల్లీ గ్రా, 'సి' విటమిన్ 200 మి .గ్రా, ఖనిజ లవణాలు 2.3 శాతం,పీచు పదార్థం 0.9 మి గ్రా,ఎనర్జీ 97 కేలరీలు ఉంటాయి.

మైక్రో చీటింగ్....

ఎన్ భాను

కొత్తగా పెళ్లైన యువ దంపతులు...పాత ఫ్రెండ్‌తో అదేపనిగా చాట్ చేస్తోంది తను...అది నన్ను చీట్ చేయడమే అన్నాడు కుర్రాడు... వివాదం ముదిరి విడాకుల దాకా వెళ్లింది.ఇలాంటి చిరు మోసాలే ప్రేమికుల మధ్య పెను ప్రకంపనలు సృష్టిస్తాయి... చిన్నచిన్న అపోహలే తీయని బంధాన్ని తలకిందులు చేస్తున్నాయి...ఇది 'మైక్రో చీటింగ్ '. దీన్నుంచి బయట పడకపోతే పచ్చని బంధాల్లో చిచ్చు రగిలినట్టే.మైక్రో చీటింగ్ .. ఈమధ్య కాలంలో బాగా వినిపిస్తున్న పదం. అనుబంధాలను కబళిస్తున్న జాడ్యం. శారీరకంగా, భౌతికంగా, ఆర్థికంగా వ్యక్తులు చేసే మోసాలు బయటికి కనిపిస్తాయి. చేసిన వాళ్లని ఎవరైనా పసిగట్టేస్తారు. తప్పు చేసినవాళ్లను నిలదీస్తారు. మైక్రో చీటింగ్ దీనికి భిన్నం. ఇది కంటికి కనిపించదు. వ్యక్తుల మధ్య మానసికంగా చిచ్చు పెడుతుంది. భావోద్వేగాలతో చెడుగుడు ఆడుతుంది. ముఖ్యంగా ఇది ప్రేమికులు, దంపతులు, స్నేహితుల అనుబంధాలకు ఎసరుపెట్టే మహమ్మారి. మోసపోయేవాళ్లు మాత్రమే దీన్ని గుర్తిస్తారు. చీటింగ్ చేసేవాళ్లకైతే ఇదొక విషయంలాగే అనిపించదు. కానీ ఇద్దరి ఆలోచనల్లో వైరుధ్యాలుంటాయి. వెరసి చినికిచినికి గాలివానలా మారి వారు విడిపోవడానికి కారణమవుతుంది.ప్రేమికులు, ఆలుమగలు, ఆడామగా ఇద్దరి మధ్య ప్రేమ, ప్రణయం సజావుగా ఉన్నప్పుడు అంతా సానుకూలంగానే ఉంటుంది. అమ్మాయి కోరిందల్లా అబ్బాయి తీరుస్తాడు. సరదాగా ఉన్నప్పుడు వాళ్ల టైటానిక్ హీరోహీరోయిన్లలా పోజులు పెట్టి సెల్ఫీలు తీసుకుంటారు. తను గోముగా అతడి భుజంపై వాలిపోతుంటుంది. టన్నులకొద్దీ అభిమానం కురిపిస్తుంది. అమ్మలా లాలిస్తుంది. గోరుముద్దలు కలిపి పెడుతుంది. ఇంతవరకు ఓకే. కుర్రాడు పక్కచూపులు చూసినప్పుడు, ఆమె వ్యక్తిగత విషయాలు వేరొకరితో పంచుకున్నప్పుడే తను మోసం చేస్తున్నాడనే భావం అమ్మాయిలో మొదలవుతుంది. ఆమె తీరూ ఇలాగే ఉన్నా ఇద్దరి మధ్య మనస్పర్థలు మొదలవుతాయి. చిరు మోసాలే పెను శాపాలు అవుతాయి. ఇద్దరు విడిపోవడానికి వారి ప్రవర్తనలే కాదు.. సామాజిక మాధ్యమాలదీ ఇప్పుడు పెద్ద పాత్రే అంటారు రిలేషన్ షిప్ నిపుణురాలు స్మితా. చాటుమాటుగా వేరొకరితో ఫోన్లు, చాటింగ్‌లు.. అనుమానాలకు దారి తీస్తాయి. సామాజిక మాధ్యమాల్లో ఒకరు పెట్టిన ప్రతి ఫొటోకి లైక్ కొట్టడం, కామెంట్ చేయడం చేస్తుంటే తనపై ఏదో ప్రత్యేకమైన ఆసక్తి ఉందని భాగస్వామికి అనుమానం కలుగుతుంది. ఫోన్లకు పాస్‌వర్డ్‌లు పెట్టుకోవడం, భాగస్వామి చూడకుండా చాట్‌ని తొలగించడం, దగ్గరికి రాగానే గాబరా పడటం, సెల్‌ఫోన్ దాయడం అన్నీ వారి మధ్య దూరం పెంచే చేష్టలే.ఈ చిరు మోసాలు భౌతికంగా, శారీరకంగా ఎవరినీ ఇబ్బంది పెట్టవు. కానీ మనసుని గాయ పరుస్తాయి. ముఖ్యంగా సున్నిత మనస్కులు ఇలాంటి విషయాల్లో అతిగా స్పందిస్తుంటారు. భాగస్వామి నన్ను మోసం చేస్తున్నారు అనే భావనలో పడిపోతారు. నమ్మకద్రోహం చేస్తున్నారు అని కుమిలిపోతారు. బయటి నుంచి చూసేవాళ్లకి ఇది పెద్ద సమస్యలా కనిపించకపోవచ్చు. అమ్మాయిలు, అబ్బాయిలు, ఆలుమగలు, ప్రేమికుల మధ్యనే కాదు..స్నేహితుల మధ్య సైతం ఈ మైక్రో చీటింగ్ కలతలు సృష్టించవచ్చు. ఫ్రెండ్ రహస్యాలు వేరొకరితో పంచుకోవడం, చాటుమాటుగా కామెంట్ చేయడంలాంటివి స్నేహితుడి దృష్టికి వచ్చినప్పుడు ఆ అనుబంధం కటీఫ్ అయ్యేదాకా వెళ్తుంది.? పాత బంధాలు వద్దు: కారణాలు ఏవైనా కొన్ని బంధాలు బ్రేకప్ అవుతాయి. వాళ్లు మరో వ్యక్తితో జట్టు కడితే, పెళ్లితో కొత్త జీవితం ప్రారంభిస్తే పాత అనుబంధాలవైపు అస్సలు చూడొద్దు. మాజీ ప్రియుడు/ ప్రేమికురాలిని సామాజిక అనుసంధాన వేదికల్లో అనుసరించడం, చాటింగ్‌లు, ఫోన్‌లో మాట్లాడటం లాంటివి చేయకుండా ఉంటేనే మంచిది. లేదంటే లేనిపోని తలనొప్పులు మొదలవుతాయి.? వాటికి దూరం: ఈ ఆధునిక కాలంలో సామాజిక మాధ్యమాలు, ఫోన్లు, గ్యాడ్జెట్లే వ్యక్తుల మధ్య చిచ్చు పెడుతున్నాయని అనేక సర్వేలు చెబుతున్నాయి. లవర్, భాగస్వామి, ఇష్టపడేవాళ్లు చెంతనే ఉన్నప్పుడు వీటిని పక్కన పెట్టేయండి. కాసేపైనా మనసు విప్పి మాట్లాడుకోండి. బెడ్రూం, బాత్రూం.. ఎక్కడికెళ్లినా ఫోన్‌ని అట్టిపెట్టుకోవడం, దాయడం, ఏం లేదని బుకాయించడం అస్సలు వద్దు.? తోడూనీడగా: బంధం బలపడాలంటే ఎక్కడికెళ్లినా మనసుపడ్డ నేస్తం పక్కన ఉండాల్సిందే. సినిమాలు, పార్కులు, షాపింగ్, ప్రయాణాలు.. భాగస్వామి తోడుగా ఉంటే అభిమానం, ఆప్యాయతలు బలపడతాయి. ఇది నిత్యం కొనసాగితే చీటింగ్ అనే మాటే వినపడదు.మనకు సరదాగా అనిపించింది వేరొకరికి ఏమాత్రం నచ్చక పోవచ్చు. ఇద్దరి మధ్య అనుబంధం బలపడాలంటే ఒకరికొకరు మనసెరిగి ప్రవర్తించాలి. అమ్మాయితో దిగిన ఫొటోలు వేరొకరికి పంపడం అబ్బాయికి గొప్ప అయితే, అది ఆమె గోప్యతకు భంగం అనే విషయం మరవొద్దు. ఇష్టపడుతున్నారు కదాని హద్దులు దాటి సెక్స్టింగ్ చేయడం.. అసభ్యంగా ఉండే ఫొటోలు పంపడం చేయొద్దు. ఒకరితో ప్రేమలో ఉన్నప్పుడు మనస్ఫూర్తిగా వాళ్లనే ఇష్టపడాలి. జెలసీ, అతి ప్రేమ, అతి నమ్మకం ఉన్నవాళ్లు తమ భాగస్వామి వేరొకరితో సన్నిహితంగా ఉంటే తట్టుకోలేరు. దాన్ని మోసంలాగే భావిస్తారు. మన మనసులో ఏ దురుద్దేశం లేనప్పుడు వేరొకరితో మాట్లాడటం, చనువుగా ఉండటం.. పెద్ద అభ్యంతరకరమైన విషయమేం కాదు. కానీ నా ప్రవర్తనలో తప్పు లేదు అని ఇష్టపడ్డ అమ్మాయి/అబ్బాయికి అర్థమయ్యేలా చెప్పగలగాలి. ఇవన్నీ పాటిస్తే ప్రేమికులు, భాగస్వాముల మధ్య చీటింగ్ అనే పదం ప్రస్తావనే ఉండదు.

వేటూరిసుందరయ్య జననం

వాసుశ్రీ, సీనియర్ జర్నలిస్ట్

అన్నమయ్య గురించి అందంగా చెప్పిన మన సుదర రాముని జననం కూడా విశేషమైనదే. ఆ లక్కమాంబకు లేకలేక పుట్టిన పిల్లాడు అన్నమయ్య అవునో కాదో మనకి తెలియదు కానీ ఈ సుందరరాముని కన్న కమలమ్మకి మాత్రం పెళ్లి అయిన పాతికేళ్ళ వరకు పిల్లలు పుట్టలేదు. సంతానం కోసం ఆమె నోచని నోము లేదు.. చేయని వ్రతం లేదు. మొక్కనీ మొక్కులు లేవంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా శ్రీబాలత్రిపురసుందరీ దేవీ ఉపపాశకురాలు అమే. ఒకటి కాదు రెండు కాదు మూడు దశాబ్దాలు తరువాత ఆమె గర్భాలయంలో శ్రీ అన్నమయ్య ప్రవేశించాడు, అందుకే తన తాతగారి పేరు రామ్మూర్తి ముందర బాలా త్రిపుర వర ప్రసాదం కాబట్టి సుందర చేర్చారు. ఆ అన్న మయ్య ఈ పద కీర్తనలతో ఆ శ్రీపతి వెంకన్న ఆరాధిస్తే ఈ సుందరయ్య తన నవరస సినీ గీతాలతో కళామతల్లిని అభిషేకించి అశేష తెలుగు వారిని అలరించారు నచ్చినవాళ్ళ జయంతులకి, వర్ధంతులకి ఏదో ఒకటి రాయాలనిపిస్తూనే ఉంటుంది. వారివి కొన్ని జయంతులు, వర్ధంతులు గడచిపోయాక.. రాయాల్సింది. చెప్పాల్సింది ఇంకేమన్నా మిగిలిందా? అంటూ వెతుకులాట మొదలవుతుంది, అలాంటి వెతుకులాటలు అవసరం లేకుండా, వేల పాటలు రాసిపోసేసి, వాటిలో మరెన్నో వేల ప్రయోగాలు చేసి పారేసి "వీటిలో నీకు నచ్చింది తీసుకో- నచ్చినంత రాసుకో" అంటూ ఆ పసిడిపాటల కుప్ప మనకు తనతో చూపిస్తూ, ముసిముసిగా నవ్వుకుంటూ, దర్జాగా నడుచుకుంటూ వెళ్లిపోతున్నట్లు. అనిపిస్తుంటుందా సుందరమైన మూర్తి. "ఏది...ఆయన రాసిన మంచి హిట్ సాంగ్స్ గబగబా ఓ పది చెప్పు" అని ఎవరైనా అడిగితే, ఏ మాత్రం తడుముకోకుండా సిరిసిరిమువ్వ, అడవిరాముడు, శంకరాభరణం, వేటగాడు, సాగరసంగమం, జగదేకవీరుడు- అతిలోకసుందరి. మాతృదేవోభవ, సప్తపది, నాలుగు స్తంభాలాట, యముడికి మొగుడు, సితార, అన్వేషణ, సీతారామయ్యగారి మనవరాలు, గీతాంజలి, మయూరి, శ్రీవారికి ప్రేమలేఖ, ఇలా అన్ని సాంగ్స్ సూపర్ హిట్ అయిన ఆయన సింగిల్ కార్డ్ సినిమాలు కనీసం ఓ పదిహేనో పదహారో తపీమని చెప్పెయ్యచ్చు. వీటిల్లో ఉన్న సాంగ్స్ లెక్కేస్తేనే ఎనభయ్యో తొంభయ్యో ఉంటాయి. ఇక తాపీగా కూర్చుని ఆలోచిస్తూ రాయడం మొదలు పెడితే.. సహస్రం దాటినా పెన్ను ఆగే అవకాశం లేదు."నీవే ముద్దుకు మూలధనం పడుచు గుండెలో గుప్తధనం ఇద్దరి వలపుల చందనం ఎంత కురిసినా కాదనం ఏమి తడిసినా వద్దనం - ఈ దినం" అంటూ రాధ వానకి, వయసుకి వందనాలు చెప్పకుంటూ చిరూతో స్టెప్పులేస్తుంటే..."ఆశయమన్నది నీ వరం తలవంచును అంబరం నీ కృషి నీకొక ఇంధనం అది సాగర బంధనం" అని అశ్వనీ నాచప్ప బ్యాక్ గ్రౌండ్ సాంగ్ పెట్టుకుని పరిగెడుతుంటుంది"కొబ్బరి నీళ్ళ జలకాలాడి కోనసీమ కోక గట్టి పొద్దుటెండ తిలకాలెట్టి ముద్ద పసుపు సందెల కొస్తావా" అని "అమ్మతో చెప్పి అప్పాలు తెచ్చుకునే" శుభలేక సుధాకర్ తన స్థాయిలో హీరోయిన్ ని రమ్మని అడిగితే..."నల్లని కాటుక పెట్టి గాజులు పెట్టి గజ్జ కట్టి గుట్టుగా సెంటు కొట్టి వడ్డాణాలే ఒంటికి పెట్టి తెల్లని చీర కట్టి మల్లెలు చుట్టి కొప్పున పెట్టి పచ్చని పాదాలకి ఎర్రని బొట్టు పారాణెట్టి చీకటింట దీపమెట్టి చీకుచింత పక్కనెట్టి నిన్ను నాలో దాచిపెట్టి నన్ను నీకు దోచిపెట్టి". అంటూ తను ఎలా వస్తుందో, వచ్చాక ఏం చేస్తుందో తన లెవెల్లో చెప్పుకొస్తుంటుంది ఆ అతిలోక సుందరి "ఫోజుల్లో యముడంటి, మోజుల్లో మొగుడంటి" తన జగదేకవీరునితో."ఆ త్యాగరాజ కీర్తనల్లో ఉన్నదీ బొమ్మ - రాగమేదో తీసినట్టు ఉందమ్మా" అని చంద్రమోహన్ ప్రేమపరవశంతో పాడితే.. ఆ వాగ్గేయకారుణ్ణి తలుచుకుంటూ "త్యాగరాజ కృతిలో సీతాకృతి గల ఇటువంటి సొగసు చూడ తరమా" అని రాజేంద్రప్రసాద్ చిలిపిగా పాడుకుంటాడు. "అలా మండి పడకే జాబిలి" అని సుహాసిని విరహగీతాలాలపిస్తుంటే.. "జాబిలితో చెప్పనా" అని మొదలు పెట్టిన ఎన్టీయార్ "తుమ్మెదలంటని తేనియకై తుంటరి పెదవుల దాహాలూ" అంటూ శ్రీదేవితో సరసంగా పాడే స్తుంటాడు."ఏ దేశమైనా ఆకాశమొకటే ఏ జంటకైనా అనురాగమొకటే అపురూపమీ ప్రణయం" అని తూర్పుదేశం అమ్మాయి, పశ్చిమదేశం అబ్బాయి పాడుకుంటుంటే.. పావురానికి పంజరానికి ఈ పాడులోకం పెళ్ళిచేసేసిందని ఇక్కడ 'చంటి' ఏడుస్తుంటాడు "కంగారు పడ్డ కన్నె శృంగారమా - వణుకుల్లో కూడ ఇంత వయ్యారమా" అని రాధను భయపెడుతున్న ఆ 'దొంగ' హీరో పాడుతూ ఆశ్చర్యపోతుంటే.. "నిన్ను రోడ్డు మీద చూసినది లగాయితు" నేను రోమియోగా మారిపోయా నంటూ 'అల్లరి అల్లుడు' రమ్యకృష్ణతో అల్లరి చేస్తుంటాడు.

పిపీలికాదిబ్రహ్మలో పిపాస రేపు ప్రేమలు!" అని ప్రేమ రేంజ్ ఎంతో.. సింపుల్గా చెప్పేసుకుంటుంటారు స్టువర్టుపురం పోలీస్ స్టేషన్ దగ్గర హీరో హీరోయిన్లు. "కాలమంత కత్తిరిస్తే కాస్త యవ్వనం - రెండు కళ్ల కత్తిరిస్తే రేయి ఈ దినం" అన్న రొమాంటిక్ ఫిలాసఫీ కూడా వాళ్ళక్కడే చెప్పకుంటూరు!"ఎన్నో రాత్రులొస్తాయి గానీ రాదీ వెన్నెలమ్మ" అని బాలయ్య.. దివ్యభారతికోసం తెగ వెయిట్ చేస్తుంటే.. "జాణవులే మృదుపాణివిలే మధు సంతకాలలో" అంటూ సిల్క్ స్మిత ఎంట్రీ ఇస్తుంది."ప్రేమలేఖ రాశా నీకంది ఉంటదీ - పూల బాణమేశా ఎద కంది ఉంటదీ" అని హీరో "హంసలేఖ పంపా నీకంది ఉంటదీ - పూలపక్క వేశా అది వేచి ఉంటదీ" అని హీరోయిన్ 'ముత్యమంత ముద్దులు' పెట్టుకుంటుంటుంటే..."ఒంటికేమో ఈడొచ్చెరా ఇంటికొస్తే తోడేదిరా" అని సూరీడ్ని వాటేసుకున్న జాబిల్లిని మత్తుగా చూస్తూ మెగాస్టార్

తూలిపోతుంటాడు."మగువ శిరసున మణులు పొదిగెను హిమగిరి – కలికి పదములు కదలి కడిగిన కళ ఇది" అని భారతదేశం కోసం అమెరికాలో పాడుకుంటుంటే..."మతి కృతి పల్లవించే చోటు– కల ఇల కౌగిలించే చోటు – కృషి ఖుషి సంగమించే చోటు" ఇదే అంటూ అమెరికా కోసం అమెరికాలో పాడుకుంటూ ఉంటారు."వలపులన్నీ వడ్డిస్తా. వలపు వడ్డీ చెల్లిస్తా!" అంటూ జయసుధ ఓ రకంగా నందమూరి అందగాడితో అంటే..

"వలపులన్ని కలిపి వంట చేసుంచాను – ఇంటి కొస్తే సామి వడ్డించుకుంటాను" అని ఆ అందగాడితోనే జయమాలిని ఇంకోరకంగా అంటుంది.వీళ్ళ వడ్డీల సంగతి ఇలా ఉంటే...సంసారమనే చదరంగం ఆడే ఆటగాడు గొల్లపూడి "బాకీ బ్రతుకుల్లో బిడ్డలు వడ్డీలోయ్" అంటూ నిర్వేదంగా పాడుకుంటాడు. "ముద్దు బేరమాడకుండ ముద్దలింక మింగవా" అంటూ గోపెమ్మ తన చేతిలో గోరుముద్ద పెట్టుకుని 'ప్రేమించు–పెళ్ళాడు' అని గోముగా అడుగుతుంటే... "ఓ సీతా నా కవితా – నేనేలే నీ మాతకు జామాత" అంటూ 'రెండు జెళ్ళ సీత' కోసం హీరో పరిగెత్తుకు వెళ్లిపోతాడు.



"ఆకులు రాలే వేసవి గాలి నా ప్రేమ నిట్టూర్పులే" అని హీరో "తొలకరి కోసం తొడిమను నేనై అల్లాడుతున్న నువ్వే" అని హీరోయిన్ చినుకుగా, నదులుగా, వరదగా పొంగే ప్రేమలో పరవశించిపోతుంటే.."రాలుపూల తేనియకై రాతిపూల తుమ్మెదనై – ఈ నిశీధి నీడలలో నివురులాగ మిగిలానని" తన ప్రేయసికి చెప్పమని ఆకాశదేశంలో ఉన్న ఆషాఢ మేఘానికి చెప్పుకుంటూ దుఃఖిస్తుంటాడే పెద్దాయన."కులికే మువ్వల అలికిడి వింటే.. కళలే నిద్దురలేచే మనసే మురళీ ఆలాపనలో.. మధురానగరిగ తోచే యమునా నదిలా పొంగినదీ.. స్వరమే వరమై సంగమమై" అంటూ వలచిన మువ్వ పిలిచిన మురళితో ఆనందభైరవి" రాగంలో అంటుంటే.."చిరునవ్వులు అభినవ మల్లికలు సిరిమువ్వలు అభినయ గీతికలు నీలాల కన్నుల్లో తారకలు తారాడె చూపుల్లో చంద్రికలు" అంటూ నెమలికి నేర్పిన నడకలు మురళికి అందని పలుకులతో నర్తిస్తుంటాయి.

"వీణ వేణువైన సరిగమ విన్నావా..." అని హీరోయిన్ అడిగితే, ఆ హీరో వేరే సినిమాలోంచి వచ్చి "మానసవీణ మధుగీతం మన సంసారం సంగీతం" అంటూ పాడేస్తుంటాడు."మర్మస్థానం కాదది మీ జన్మస్థానం – మానవతకి మోక్షమిచ్చు పుణ్యక్షేత్రం" అని విజయశాంతిలోని జానకి గారు ఆవేదనతో ఆక్రోసిస్తుంటే..."కన్న తల్లి కన్నీటికి ఏ ఖరీదు కట్టిందీ కసాయిలోకం" అంటూ సూపర్ స్టార్ కృష్ణలోని బాలు రగులుతున్న 'అగ్ని పర్వతం'లా బ్రద్దలవు తుంటాడు.'ఖైదీ'లోని చిరు విశ్వామిత్రుడు "వేదం నాదం మోదం మోక్షం అన్నీ నీలో చూశానే" అంటూ మేనకతో పాడుకుంటూ "ఋషి కథ మారే రసికత మీరే" అని అసలు విషయం బయటపెడితే..."అసుర సంధ్యవేళ ఉసురు తగుల నీకు స్వామీ ఆడ ఉసురు తగలనీకు స్వామీ" అని జయప్రద దేవదేవిగా అన్న మాటకు... "నశ్వరమిది నాటకమిది నాలుగు గడియల వెలుగిది. కడలిని కలిసే వరకే కావేరికి రూపు ఉన్నది" అంటూ అక్కినేని విప్రనారాయణ సమాధానమిస్తాడు." కౌగిలింతలోన గాలి ఆడకూడదు.. చుక్కలైన నిన్ను నన్ను చూడకూడదు" అని ఒకరు "వెన్నెలైనా చీకటైనా నీతోనే జీవితము నీ ప్రేమే శాశ్వతము" అని ఇంకొకరు అంటూ ఒకరినొకరు పట్టుకొని పచ్చగా కాపురం చేసుకుంటుంటారు ఒక జంట.ఇంకొకచోట "మనసున్న మంచోళ్ళ మారాజులు మమతంటూ లేనోళ్ళ నిరుపేదలు" అని బాధలో ఉన్న భర్తను ఊరడిస్తూ నువ్వు "రాజువయ్యా మహరాజువయ్యా" అని భార్య అన్నం తినిపిస్తుంటుంది." మా రేడు నీవని ఏరేరి తేనా మారేడు దళములు నీ పూజకు" అని కల్మషం లేని కన్నప్ప ఆనాడు పాడుకుంటే.. "మాలధారణం నియమాల తోరణం జన్మకారణం దుష్కర్మవారణం శరణం శరణం" అంటూ స్వామి అయ్యప్పను ఇప్పటి భక్తులు కొలుచుకుంటున్నారు. "జానకి కన్నుల జలధితరంగం రాముని మదిలో విరహ సముద్రం చేతులు కలిపిన సేతు బంధనం ఆ సేతు హిమాచల ప్రణయ కీర్తనం సాగర సంగమమే ప్రణవ సాగర సంగమమే" అని ప్రణయ సాగరసంగమాలు ఒకవైపు.. పట్టుచీరలు కట్టిన పుత్తడి బొమ్మలు... ఇలా ఒకటేమిటి సర్వభావాలని, సకల ప్రకృతిని, తన పాటల్లో పెట్టి, వాటిని మన చెవుల నుండి గుండెల్లోకి పరుగులు తీయించిన అద్వితీయ కవితాఘనచక్రవర్తి.మన వేటూరి సుందరరామమూర్తి, ఆరువేల తన పాటలలో అంతకు పదింతల అందమైన భావాలను వెదజల్లిన వేటూరి గారి పదములకు నమస్కరిస్తూ... వారి మీద వచ్చిన కొన్ని విమర్శలకు ఆయన చెప్పిన "చందమామలో మచ్చని మెచ్చని సచ్చినోళ్ళదా సరసం – వేపపువ్వులో తీపిని వెదికే తేనెటీగదే రసికత." అనే సమాధానాన్ని గుర్తు చేసుకుంటూ స్వస్తి!.

ఎనిమిది సూర్యుళ్ల శక్తి ఒక్క క్షణంలో విరుచుకుపడటాన్ని ఓ సారి ఊహించుకోండి.

రెండు భారీ కృష్ణబిలాలు కలిసినప్పుడు ఇంత మొత్తంలో శక్తి ఓ గురుత్వాకర్షణ తరంగం(షాక్ వేవ్)లా వెలువడింది. ఇప్పటివరకూ ఇదే అత్యంత భారీ శక్తి విస్ఫోటం. ఈ విస్ఫోటం నుంచి వచ్చిన తరంగం ఏడు బిలియన్ సంవత్సరాలు పయనించి భూమిని చేరుకుంది. గతేడాది మే లో ఇటలీ, అమెరికాలోని లేజర్ డిటెక్టర్లు దీన్ని గుర్తించాయి. రెండు కృష్ణ బిలాలు కలిసి సూర్యుడి కంటే 142 రెట్ల ఎక్కువ ద్రవ్యరాశిగల ఖగోళాన్ని సృష్టించినట్లు పరిశోధకులు తెలిపారు. ఇది చాలా ముఖ్యమైన పరిణామం. ఇప్పటివరకు చిన్నవి లేదా భారీ కృష్ణబిలాల జాడలను శాస్త్రవేత్తలు గుర్తించారు. కానీ ఇది కొత్త మధ్యతరగతి కృష్ణబిలం. వీటి పరిమాణం వంద నుంచి వెయ్యి సూర్యుల ద్రవ్యరాశికి సమానం.

అమెరికా, యూరప్‌లలో ఏర్పాటుచేసిన మూడు సూపర్ సెన్సిటివ్ గురుత్వాకర్షణ సంకేతాల గుర్తింపు వ్యవస్థల్లో(లీగో-విర్గో కొలాబరేషన్) బయటపడిన అన్వేషణల్లో తాజా సంకేతాలు కూడా ఒక భాగం.

కృష్ణ బిలం అంటే?

కృష్ణబిలం అనేది అంతరిక్షంలో ఒక ప్రాంతం. ఇక్కడ ద్రవ్యరాశి మొత్తం లోపలకు కూరుకుపోతుంది. ఇక్కడ గురుత్వాకర్షణ శక్తి ఎంత ఎక్కువగా ఉంటుందంటే..కాంతి కూడా దీన్నుంచి తప్పించుకోలేదు. పెద్దపెద్ద నక్షత్రాలు విస్ఫోటం చెందేటప్పుడు ఈ కృష్ణ బిలాలు జనిస్తాయి. కొన్ని కృష్ణబిలాలు సూర్యుడి ద్రవ్యరాశి కంటే కొన్ని వందల కోట్ల రెట్లు పెద్దవిగా ఉంటాయి. నక్షత్ర మండలం కేంద్రాల్లో ఇవి ఎలా ఆవిర్భవించాయో ఇప్పటివరకూ తెలియలేదు. పరిసరాల్లోని ఖగోళ వస్తువుల కదలికల ద్వారా కృష్ణబిలాలను గుర్తించొచ్చు.

ఇవి గుర్తించగలిగే స్థాయిలో గురుత్వాకర్షణ తరంగాలను ఉత్పత్తి చేస్తాయి. రెండు మూడు కృష్ణబిలాలు సుడులు తిరిగేటప్పుడు ఈ తరంగాలు జనిస్తాయి. లిగో, విర్గో పరికరాలు ఈ తరంగాలను మే 21, 2019నాడు గుర్తించాయి. సెకనులో పదో వంతు సమయం మాత్రమే వీటి సంకేతం అందింది. సూర్యుడి కంటే ఒకటి 66 రెట్లు, మరొకటి 85 రెట్లు ద్రవ్యరాశిగల భారీ కృష్ణబిలాలు సుడులూ తిరుగుతూ కలుస్తున్న చోట నుంచి ఈ సంకేతం వచ్చినట్లు కంప్యూటర్ అల్గారిథమ్‌లు తేల్చాయి. ఈ కృష్ణబిలాలు 150 బిలియన్ ట్రిలియన్ల కిలో మీటర్ల దూరంలో ఉన్నట్లు అల్గారిథమ్‌లు గణించాయి. ''ఇది నిజంగా అద్భుతం''అని ఫ్రాన్స్‌లోని కోట్ డీ అజూర్ అబ్జర్వేటరీకి చెందిన ప్రొఫెసర్ క్రిస్టెన్సన్ చెప్పారు. ''ఈ సంకేతం ఏడు బిలియన్ ఏళ్ల క్రితం జనించింది. అంటే మన విశ్వానికి ప్రస్తుతంలో సగం వయసున్నప్పుడు అది పుట్టింది. ఇప్పుడు దాన్ని భూమిపైనున్న పరికరాలు గుర్తించాయి'' అని ఆయన వివరించారు.గురుత్వాకర్షణ తరంగాలు అంటే? గురుత్వాకర్షణ తరంగాలనేవి ఉంటాయని సాధారణ సాపేక్ష సిద్ధాంతం అంచనా వేసింది. అయితే, వాటిని గుర్తించే సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు దశాబ్దాలు పట్టింది. విధ్వంసకర పరిణామాలు జరిగేటప్పుడు జనించే తరంగాలే ఇవి.

వేగంగా తిరిగే ద్రవ్యరాశిగల ఖగోళాలు కాంతి వేగంతో పయనించే వీటిని ఉత్పత్తి చేస్తాయి. కృష్ణబిలాలు కలిసేచోట, న్యూట్రాన్ నక్షత్రాల వద్ద వీటిని గుర్తించొచ్చు. వీటిని గుర్తించడంతో విశ్వంపై కొత్తతరహా పరిశోధనలకు మార్గం సుగమమైంది. నక్షత్రాలు తమలో ఇంధనం నిండుకున్నాక విస్ఫోటం చెందుతాయి. నక్షత్రాలు పెద్దవైతే అప్పుడు కృష్ణబిలం ఏర్పడే అవకాశముందా!

శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం 65 నుంచి 120 రెట్ల ద్రవ్యరాశిగల కృష్ణబిలాలు ఏర్పడటం అసాధ్యం. ఇలాంటి పరిమాణంలో కృష్ణబిలాలను ఏర్పాటుచేయగలిగే నక్షత్రాలు విస్ఫోటం చెందేటప్పుడు అసలు ఏమీ మిగలదు. ఇదే నిజమైతే.. సూర్యుడి కంటే 85 రెట్ల ద్రవ్యరాశిగల కృష్ణబిలం ఏర్పడటానికి రెండు కృష్ణబిలాల కలయికే కారణం కావొచ్చు.

విశ్వం ఎలా పరిణామం చెందిందో దీని నుంచి తెలుసుకోవచ్చని బ్రిటన్‌లోని గ్లాస్‌గౌ యూనివర్సిటీ చెందిన ప్రొఫెసర్ మార్టిన్ హెన్రీ భావిస్తున్నారు. "వరుసగా కొన్ని కృష్ణబిలాల కలయికలు ఒకటి తర్వాత ఒకటి జరిగి పెద్దపెద్ద కృష్ణ బిలాలు ఏర్పడుతుండొచ్చు. ఎవరికి తెలుసు? సూర్యుడి కంటే 142 రెట్ల ద్రవ్యరాశి గల ఈ కృష్ణబిలం.. అదే పరిమాణంలోని వేరే కృష్ణబిలాలతో కలిసి ఇంకా పెద్ద కృష్ణబిలాలను ఏర్పాటుచేసుకుంటూ వెళ్తూ... గెలాక్సీ మధ్యలో ఉండే భారీ కృష్ణబిలాలు ఏర్పడి ఉండొచ్చు" గతేడాది మే 21న గుర్తించిన తాజా తరంగంపై రెండు పరిశోధన పత్రాలను శాస్త్రవేత్తలు ప్రచురించారు. వీటిలో ఒకటి జర్నల్ ఫిజికల్ రివ్యూ లెటర్స్‌లో ప్రచురితమైంది. మరొకటటి ద ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్‌లో వచ్చింది. దీనిలో తరంగ స్థిగతుల గురించి చర్చించారు.

జీడబ్ల్యూ190521గా పిలుస్తున్న ఈ తరంగం.. భారీ పరిశోధనలకు దారితీసిన 50 తరంగాల్లో ఒకటి. నోబెల్ బహుమతి ఒడిసిపట్టిన 2015నాటి గురుత్వాకర్షణ తరంగాల గుర్తింపు ఆవిష్కరణతో.. ఈ పరిశోధనలు వేగం పుంజుకున్నాయి. "మేం డిటెక్టర్ల సెన్సిటివిటీని పెంచుతున్నాం. అవును రోజుకు ఒకటి కంటే ఎక్కువే తరంగాలను గుర్తించే స్థాయికి వెళ్లగలం. వరుస కృష్ణబిలాలను గుర్తించగలం. ఇది చాలా అద్భుతం. ఎంతకంటే దీన్నుంచి ఎంతో నేర్చుకోవచ్చు"అని పోట్స్‌డమ్‌లోని ద మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్రావిటేషనల్ ఫిజిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ అలెసాండ్రా బ్యూనానో చెప్పారు.

రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబు.. ఇప్పుడు ఇలా పేలింది?

రెండో ప్రపంచయుద్ధంలో వేసిన ఓ బాంబు ఇప్పుడు పేలింది. పోలాండ్‌లో దాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. చివరి నిమిషంలో పేలిపోయింది. పరిసర ప్రాంతాల్లో భూమి, ఇళ్లు కంపించాయి.

రెండో ప్రపంచం యుద్ధం నాటి ఓ బాంబు తాజాగా పోలాండ్‌లో పేలింది. ఆ బాంబును ఏడాది కిందటే గుర్తించడం విశేషం. అయితే.. దాన్ని సురక్షిత పద్ధతుల్లో నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తుండగా చివరి నిమిషంలో పేలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని పోలాండ్ అధికారులు తెలిపారు. అయితే.. పరిసర ప్రాంతాల్లో కొన్ని కిలోమీటర్ల వరకు భూమి, ఇళ్లు కంపించినట్లు స్థానికులు తెలిపారు. ముందస్తు చర్యగా 2.5 కి.మీ. పరిధిలోని ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

1945లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటన్‌కు చెందిన రాయల్ ఎయిర్‌ఫోర్స్.. నాజీ యుద్ధనౌకపై ఈ బాంబును జారవిసిరిందట. కానీ, అది పేలకుండా కింద పడిపోయింది. స్వినోవిస్యా ప్రాంతంలోని ఓడరేవు వద్ద భూమిలో 12 మీటర్ల లోతులో పాతుకుపోయిన ఈ బాంబును అధికారులు గతేడాది గుర్తించారు. ఓడరేవులో పూడికతీత పనులు కొనసాగుతుండగా ఈ బాంబు బయటపడింది. ఐదు టన్నుల బరువు, 2.4 టన్నుల పేలుడు పదార్థాలు ఉన్న ఈ బాంబుకు 'టాల్ బాయ్' అని పేరు పెట్టారు.

ఈ బాంబును 'బాల్టిక్ సీ' సముద్రంలో ముంచి పేలుడు సంభవించకుండా నిర్వీర్యం చేసేందుకు పోలాండ్ నేవీ అధికారులు ప్రయత్నించారు. కానీ, ఆకస్మాత్తుగా పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ చేపట్టడానికి ముందే స్థానిక ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి బాంబు నిర్వీర్యం చేసే ప్రాంతానికి 2.5 కి.మీ దూరంలో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బాంబు పేలుడు ధాటికి కాలువలోని నీరు పెద్ద ఎత్తున ఎగసిపడింది. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాంబు నిర్వీర్యం చేసే ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో బ్రిడ్జి ఉండటంతో దానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా పోలాండ్ దేశ నౌకాదళం తగిన జాగ్రత్తలు తీసుకుంది. డీఫ్లాగరేషన్ పద్ధతితో రిమోట్ కంట్రోల్ ద్వారా బాంబును నిర్వీర్యం చేయాలని భావించారు. అయితే.. ఈ ప్రక్రియ చివరి దశలో ఆ బాంబు ఒక్కసారిగా పేలినట్లు అధికారులు తెలిపారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని వెల్లడించారు.